
ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
epaper.vaartha.com WWW.VAARTHA.COM
విజయవాడ
fb.com/vaartha Digital

సంబరాల జీవితం సౌభాగ్యాల సౌరభం
KAPIL GROUP
కపిల్ చిట్స్
Visit Us: www.kapilchits.com
కపిల్ చిట్స్ మీ కలలకు సాకారం

Published from Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
31-12-2025 బుధవారం సంపుటి: 31 సంచిక: 330 పేజీలు: 12 వెల: 6.50

# నేటి నుంచి కొత్త జిల్లాలు



మార్కాపురం, పోలవరం జిల్లాల మ్యాప్‌లు

## తుది నోటిఫికేషన్ జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం
## కొత్తగా పోలవరం, మార్కాపురం
## అన్నమయ్య జిల్లా కేంద్రంగా మదనపల్లె
## కొన్ని మండలాల సరిహద్దుల్లో మార్పులు
## 28 జిల్లాలు, 5 కొత్త రెవెన్యూ డివిజన్లతో మారిన రాష్ట్ర రూపు రేఖలు

**విజయవాడ,డిసెంబరు 30,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రాష్ట్రంలో కొత్తజిల్లాల ఏర్పాటుపై తుది నోటిఫికేషన్‌ను మంగళవారం విడుదలచేసింది. ఏపీలో కొత్తగా మార్కాపురం, పోలవరం జిల్లాలనుఏర్పాటు చేస్తూ అధికారిక ఉత్తర్వులు జారీ అయ్యాయి. రంపచోడవరం కేంద్రంగా పోలవరం జిల్లా ఏర్పాటు చేసినట్లు, మార్కాపురం కేంద్రంగా మార్కాపురం జిల్లా ఏర్పాటు చేసినట్లు నోటిఫికేషన్‌లో పేర్కొంది. 2కొత్త జిల్లాల ఏర్పాటుతో రాష్ట్రంలో మొత్తం జిల్లాల సంఖ్య 26నుంచి 28కి పెరిగింది. మదనపల్లి కేంద్రంగా జిల్లా ఏర్పాటు చేస్తామని సీఎం హామీ ఇచ్చిన నేపథ్యంలో అన్నమయ్య జిల్లా హెడ్ క్వార్టర్‌ను రాయచోటి నుంచి మదనపల్లికి మార్చారు. ప్రజలకు వేగంగా పాలన అందించడం, సుపరిపాలనే లక్ష్యంగా రాష్ట్రంలో కొత్త జిల్లాలు ఏర్పాటు చేసిన ప్రభుత్వం కొత్తగా 5 రెవెన్యూ డివిజన్లనూ ఏర్పాటుచేసింది. పలు మండలాల సరిహద్దులనూ మార్చింది. ప్రజల కోరిక మేరకు సమీప జిల్లాల్లో కలిపింది. కొత్తగా రెవెన్యూ డివిజన్లుగా అనకాపల్లి జిల్లాలో అడ్డరోడ్డు జంక్షన్, ప్రకాశం జిల్లాలో అద్దంకి, అన్నమయ్య జిల్లాలో పీలేరు, శ్రీ సత్యసాయి జిల్లాలో మడకశిర, నంద్యాల జిల్లాలో బనగానపల్లి రెవెన్యూ డివిజన్లు కొత్తగా ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం తుది నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ మార్పులు బుధవారం నుంచి అమల్లోకి రానున్నాయి. మార్పుల్లో నందిగామ మండలాన్ని పలాస రెవెన్యూ డివిజన్ నుంచి టెక్కలి డివిజన్‌కు మార్చింది. సామర్లకోట మండలాన్ని కాకినాడ డివిజన్ నుంచి పెద్దపురం డివిజన్‌కు మారుస్తూ ఏపీ సర్కార్ కీలకమార్పులు చేసింది. అలాగే, పాడేరు కేంద్రంగా అల్లూరి సీతారామరాజు జిల్లా రీస్ట్రక్చర్ చేయడం,పెనుగొం >>2



### కొత్త రెవెన్యూ డివిజన్లు
- అనకాపల్లి జిల్లా: అడ్డరోడ్డుజంక్షన్
- ప్రకాశం జిల్లా: అద్దంకి
- అన్నమయ్య జిల్లా: పీలేరు
- శ్రీసత్యసాయి జిల్లా: మడకశిర
- నంద్యాల జిల్లా: బనగానపల్లి
- గూడూరు నియోజకవర్గంలోని మూడు మండలాలు నెల్లూరుకు
- రైల్వేకోడూరు నియోజకవర్గం తిరుపతి జిల్లాలోకి
- రాజంపేట నియోజకవర్గం వైఎస్ఆర్ కడపలోకి
- ఎటువంటి మార్పులు లేని తొమ్మిది జిల్లాలు



## బంగ్లా తొలి మహిళా ప్రధాని ఖలీదా జియా కన్నుమూత
కొన్ని వారాలుగా తీవ్ర అనారోగ్యంతో మాజీ ప్రధాని
9లో

## 2 నుంచి 21.80 లక్షల పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణి

**విజయవాడ,డిసెంబరు 30,ప్రభాతవార్త ప్రతినిధి:** జనవరి నెల 2 నుంచి 9 లోపు రాష్ట్ర వ్యాప్తంగా 21.80 లక్షల పట్టాదారు పాస్ పుస్తకాలు పంపిణీ చేస్తామని రెవిన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు. ప్రభుత్వ రాజ ముద్రతో కొత్తగా ముద్రించిన వీటి పంపిణీకి ఏర్పాట్లు చేస్తామని సోమవారం ఆయన సచివాలయంలో విలేకరులతో మాట్లాడుతూ తెలిపారు. 'గత పాలకుడు తన ఫొటోను రైతుల పట్టాదారు పాస్ పుస్తకాలపై ముద్రించారు. సర్వే రాళ్ళను సైతం వదల్లేదు. పెద్ద ఎత్తున ప్రజాధనం దుర్వినియోగం చేశారు. ప్రస్తుతం పంపిణీ చేయనున్న పాస్ పుస్తకాల్లో తప్పులేమైనా దొర్లితే వెంటనే సరి చేయాలని అధికారులను >>2

# 'ఫుట్‌పాత్'వాసులను 'హోమ్'లకు పంపండి




## రాత్రివేళ రోడ్లపక్క నిద్రిస్తున్న అభాగ్యుల దీనస్థితిపై హైకోర్టు స్పందన
## మహిళలకు ఆశ్రయం లేకపోవడంపై విస్మయం
### వివిధ జిల్లాల్లో ఏచర్యలు తీసుకొంటున్నారో చెప్పాలని ఆదేశం

**విజయవాడ,డిసెంబరు 30, ప్రభాతవార్తప్రతినిధి:** రాత్రి వేళల్లో దయనీయ స్థితిలో ఫుట్‌పాత్‌లపై నిద్రిస్తున్న ఎంతో మంది అభాగ్యుల దీనస్థితి చూసి హైకోర్టు స్పందించింది. ఈ క్రమంలోనే నిరాశ్రయులు, అనాథలు రాత్రివేళల్లో ఫుట్‌పాత్‌ల మీద నిద్రించడంపై హైకోర్టు ఆందోళన వ్యక్తం చేసింది. రాష్ట్ర ప్రభుత్వాన్ని ఈ వ్యవహారంపై దృష్టి పెట్టాలని స్పష్టం చేసింది. అనుభవం ఉన్న స్వచ్ఛంద సంస్థల సహకారం తీసుకుని షెల్టర్ హోంల నిర్వహణ ఏర్పాటు తప్పనిసరి అని సూచించింది. ఈ నేపథ్యంలో విజయవాడతోపాటు రాష్ట్రంలోని అన్ని జిల్లా కేంద్రాలలో ఆశ్రయ/వసతి గృహాలు (షెల్టర్ హోం) ఏర్పాటు విషయంలో తీసుకుంటున్న చర్యలపై రెండు వారాల్లో అఫిడవిట్ వేయాలని పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శిని ఆదేశించింది.విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్‌కు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి ఫుట్‌పాత్‌లపై నిద్రిస్తున్నవారిని తక్షణమే ఆశ్రయ కేంద్రాలకు తరలించాలని స్పష్టం చేసింది. ఈనెల 31కి తదుపరి విచారణను వాయిదా వేసింది. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకుర్, జస్టిస్ చీమలపాటి రవిలతో కూడిన ధర్మాసనం ఈ మేరకు ఉత్తర్వులిచ్చింది. విజయవాడ కృష్ణా బ్యారేజ్ ఫుట్‌పాత్‌లపై నిరాశ్రయులు రాత్రి వేళల్లో దయనీయ స్థితిలో నిద్రపోతున్నారని వారికి ఆశ్రయం కల్పించే విషయంలో అధికారులు చర్యలు తీసుకోవడం లేదని పేర్కొంటూ న్యాయవాది ఆది రామకృష్ణుడు పిల్ వేశారు. ఆయన నేరుగా వాదనలు వినిపిస్తూ పట్టణ నిరాశ్రయుల పథకం (షెల్టర్ ఫర్ అర్బన్ హోంలెస్‌ఎస్‌యూహెచ్) కింద నిరాశ్రయులకు ఆశ్రయం కల్పించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. విజయవాడ నగరపాలక సంస్థ కొన్ని ప్రాంతాల్లో షెల్టర్ హోంలు ఏర్పాటు చేసినప్పటికీ ఇంకా ఎంతోమంది ఫుట్‌పాత్‌లపై నిద్రిస్తున్నారన్నారు. ధర్మాసనం స్పందిస్తూ ఫుట్‌పాత్‌లపై నిద్రించడం ప్రమాదకరమని, చలికాలంలో పరిస్థితి మరింత దారుణంగా ఉంటుందని వ్యాఖ్యానించింది. విచారణ సందర్భంగా, మహిళలకు ఆశ్రయ హోంలు లేవని తెలుసుకొని >>2

# సంక్షేమగృహాలపై గట్టి నిఘా

**విజయవాడ,డిసెంబరు 30,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో సంక్షేమ వసతి గృహాల్లో ఆరోగ్యపరిస్థితులపై నిరంతరం నిఘా ఉండాలని ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ హాస్టళ్లల్లో తనిఖీలను విస్తృతంగా నిర్వహించాలన్నారు.మంచినీరు కలుషితం కాకుండా చర్యలు తీసుకోవాల న్నారు. వసతి గృహాల్లో పరిశుభ్రత ఉండాలన్నారు. విద్యార్థులకు తరచు ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలన్నారు.ఆయా హస్టళ్ళ నిర్దేశిత అధికారులు బాధ్యతగా వ్యవహరించకుంటే తీవ్ర చర్యలు తప్పవన్నారు.మంత్రులు, ఆయా శాఖల ఉన్నతాధికారులు మొదలుకుని క్షేత్రస్థాయి సిబ్బంది వరకు తమ విధి నిర్వహణలో భాగంగా చేసుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయు డు స్పష్టం చేశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ హాస్టళ్లు, రెసిడెన్షియల్ స్కూళ్లల్లోని నీటి సరఫరా, పారిశుద్ధం, ఇతర సదుపాయాలపై ముఖ్యమంత్రి సంబంధిత శాఖాధికారులను ఆరా తీసారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి వారికి మార్గదర్శనం చేస్తూ సంక్షేమ శాఖ హాస్టళ్లు, రెసిడెన్షియల్ స్కూళ్లల్లో పారిశుద్ధం నూటికి నూరు శాతం నిర్వహించాలి. ఎక్కడా ఏ చిన్న పొరపాటు జరిగినా సహించేది లేదు. ఇటీవల కాలంలో హాస్టళ్లల్లో జరిగిన తప్పిదాలు మళ్లీ రిపీట్ కాకూడదు. అలాంటివి పునరావృతమైతే ఏం జరిగిందని తెలుసుకునేది ఉండదు.నేరుగా బాధ్యులపై చర్యలు తీసుకుంటాం. 20 శాతం హాస్టళ్లల్లో టాయిలెట్ల నిర్మాణం ఇంకా జరపాల్సి ఉంది. ఈ టాయిలెట్ల నిర్మాణం కోసం అవసరమైన రూ.40కోట్లు విడుదల చేస్తామన్నారు. టాయిలెట్ల నిర్మాణం యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలి. ఆర్వో ప్లాంట్లు, టాయిలెట్లు లేకుండా హాస్టళ్లు ఉండడం సరి కాదు. గత ప్రభుత్వం చేసిన నిరక్ష్యం వల్ల ఇవన్నీ జరిగాయి. ఆర్వో ప్లాంట్లు లేని ప్రతి హాస్టల్లోనూ... ప్రతి రెసిడెన్షియల్ పాఠశాలల్లోనూ ఆర్వో ప్లాంట్లను ఏర్పాటు చేయాలి. డాక్టర్లతో విద్యార్థులకు రెగ్యులర్ హెల్త్ చెకప్స్ చేయించాలి. హాస్టళ్లలోని 4.17 లక్షల మంది విద్యార్థుల రక్త నమూనాలు సేకరించి సమస్యలు ఉన్నవారిని ముందుగానే గుర్తించి చికిత్సలు అందించాలి అన్నారు.,బడుగు విద్యార్థులకు చేసే సాయాన్ని బాధ్యతగా తీసుకోవాలి. సమాజంలో ప్రతి ఒక్కరికీ సమాన అవకాశాలు కల్పించాలనే ఉద్దేశ్యంతో హాస్టళ్లు పెట్టారు. దీనికి విఘాతం కల్గించేలా అలక్ష్యం చేస్తే ఊరుకునేదే లేదు.హాస్టళ్లల్లో పరిస్థితి >>2

## విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పించాలి
## ఆర్వోప్లాంట్లు, టాయిలెట్లు తప్పనిసరి
## స్టూడెంట్ల రక్త నమూనాలు సేకరించి పరీక్షించాలి: సిఎం చంద్రబాబు ఆదేశం





## సంక్రాంతికి మరో 11 ప్రత్యేక రైళ్లు

**విజయవాడ,డిసెంబరు 30,ప్రభాతవార్త ప్రతినిధి:** సంక్రాంతి పండుగ సందర్భంగా ప్రయాణీకుల రద్దీ ఎక్కువగా ఉండటంతో దక్షిణ మధ్య రైల్వే 11 ప్రత్యేక రైళ్ళను ప్రకటించింది.ఈ ప్రత్యేక రైళ్ళు కాకినాడ టౌన్, వికారాబాద్, పార్వతీపురం, సికింద్రాబాద్ మధ్య జనవరి 7 నుంచి 12,2026 మధ్య వివిధ తేదీల్లో నడుస్తాయి. కొన్ని రైళ్ళు సాయంత్రం లేదా రాత్రి బయలుదేరి మరుసటి రోజు గమ్యస్థానానికి చేరుకుంటాయి.ఈ రైళ్ళలో ఏసీ,స్లీపర్, జనరల్ బోగీలు ఉంటాయి. >>2

# శంకరగుప్తం డ్రెయిన్ ఆధునీకరణ


శంకరగుప్తం మేజర్ డ్రెయిన్ ఆధునీకరణ పనులకు వర్చువల్‌గా శంకుస్థాపన చేస్తున్న డిసిఎం పవన్

## కోనసీమ కొబ్బరి రైతు కన్నీరు కదిలించింది
## సినిమా అడ్వాన్స్ డబ్బు రూ.5కోట్లు కౌలురైతులకు ఇచ్చేశా: డిసిఎం పవన్

**విజయవాడ,డిసెంబరు 30,ప్రభాతవార్తప్రతినిధి:** అన్నం పెట్టే రైతుకు కూటమి ప్రభుత్వం అండగా నిలబడుతుంది అని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కల్యాణ్ అన్నారు. మన రాష్ట్రం రైతు కన్నీరు పెట్టని రాష్ట్రంగా ఉండాలన్నది కూటమి ఆకాంక్ష అని తెలిపారు.ఆ దిశగా అడుగులు వేస్తున్నామన్నారు. గత నెలలో రాజోలు పర్యటనకు వెళ్లినప్పుడు సముద్రం పోటుతో శంకరగుప్తం మేజర్ డ్రెయిన్ ఏ విధంగా సమస్యగా మారి కొబ్బరి తోటలు నాశనం అవుతున్నాయో చూశామన్నారు. మరో కొబ్బరి చెట్టు దెబ్బ తినక ముందే ఈ సమస్యను పరిష్కరించాలని నిర్ణయించుకున్నా. ముక్కోటి ఏకాదశి రోజున శంకరగుప్తం డ్రెయిన్ ఆధునీకీకరణ పనులకు శంకుస్థాపన చేయడం ఆనందంగా ఉందని రాష్ట్ర ఉపముఖ్యమంత్రివర్యులు పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు. కోనసీమ కొబ్బరి రైతుల సమస్య తెలియ జేసిన వెంటనే మనసుతో విని తక్షణం స్పందించి నిధులు మంజూరు >>2

# మినీ అంగన్వాడీల స్థాయి పెంపు



## మంత్రి సంధ్యారాణి

**విజయవాడ,డిసెంబరు 30,ప్రభాతవార్తప్రతినిధి:** ఈ ఏడాది మహిళా,శిశు సంక్షేమ శాఖల్లో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చామని రాష్ట్ర మంత్రి గుమ్మిడి సంధ్యారాణి అన్నారు. అందులో భాగంగా మినీ అంగన్వాడీలను ప్రధాన అంగన్వాడీలుగా మార్చాం అని పేర్కొన్నారు. రాష్ట్రంలో 5 వేల మినీ అంగన్వాడీలను ప్రధాన అంగన్వాడీలుగా మార్చాం అని పేర్కొన్నారు. రాష్ట్రంలో 5 వేల మినీ అంగన్వాడీలను అప్‌గ్రేడ్ చేశామన్నారు. అంతేకాకుండా అంగన్వాడీలకు సెల్‌ఫోన్ సౌకర్యం అందుబాటులోకి తెచ్చామన్నారు. అంగన్వాడీ కార్యకర్తలు మెరుగైన సేవలు అందించడానికి పాత 4జీ ఫన్ల స్థానంలో 5జీ స్మార్ట్ ఫోన్లను కూటమి ప్రభుత్వం అందిస్తోందన్నారు. తద్వారా క్షేత్రస్థాయి నివేదికలు వేగవంతమవుతాయని,గర్భిణీలు,తల్లులు,పిల్లలకు సేవలు సమర్థవంతంగా అందుతాయని వివరించారు. రాష్ట్రం లోని గిరిజన ప్రాంతాల్లో డోలీ మోతలు లేకుండా రహదారుల సౌకర్యం కల్పిస్తున్నామన్నారు. తద్వారా గర్భిణులు,అనారోగ్యంతో బాధపడే వారు ఆస్పత్రికి తీసుకెళ్ళేందుకు ఇబ్బందులను తొలగిస్తున్నామని స్పష్టం చేశారు. >>2

## స్వర్ణ గ్రామం, స్వర్ణ వార్డు గ్రామ, వార్డు సచివాలయాల పేరు మార్పు

**విజయవాడ,డిసెంబరు 30,ప్రభాతవార్తప్రతినిధి:** గ్రామ, వార్డు సచివాలయాల పేర్లు స్వర్ణ గ్రామం, స్వర్ణ వార్డుగా మార్చేందుకు ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది.ఈ మేరకు ఉద్దేశించిన చట్ట సవరణ ఆర్డినెన్స్ ప్రతిపాదనను తాజా మంత్రిమండలి ఆమోదించింది. స్వర్ణాంధ్ర లక్ష్య సాధనలో గ్రామ, వార్డు సచివాలయాలు కీలకపాత్ర పోషించనున్నాయని ఇందుకుగాను కార్య నిర్వాహకుల పాత్రలు, బాధ్యతలు సవరించాల్సిన అవసరముందని అభిప్రాయపడింది. అందుకే సచివాలయాల పేరు మారుస్తున్నట్లు తెలిపింది. ఈ మేరకు ఏపీ ప్రభుత్వం అదికారికంగా ఉత్తర్వులు జారీ చేయనున్నది. ఇక రాజధాని అమరావతిలో మౌలిక సదుపాయాల కల్పనకు వివిధ ప్రాజెక్టుల అమలుకు నాబార్డు, నాబార్డు ఇన్‌ఫ్రా అసిస్టెన్స్ పథకాల కింద రూ. 7,387కోట్ల రుణం తీసుకునే ప్రతిపాదనకూ కేబినెట్ ఆమోదముద్ర >>2

# ప్రశాంతంగా 'ఉత్తరద్వార' దర్శనాలు


వైకుంఠద్వార దర్శనాలతో ఆలయం వెలుపల భక్తులు

## తిరుమలలో టోకెన్ భక్తులకు పూర్తి సౌకర్యాలు
## నేడు పుష్కరిణిలో చక్రత్తాళ్వార్‌కు చక్రస్నానం
## భక్తుల రద్దీ అత్యధికంగా ఉన్నట్లు అధికారుల వెల్లడి

**తిరుమల,డిసెంబరు 30ప్రభాతవార్తప్రతినిధి:** ఏడుకొండల వేంకటేశ్వరస్వామి నిలయమైన ఆనందనిలయానికి ఆనుకునే ఉన్న వైకుంఠద్వార దర్శనాలను సినీప్రముఖులతో బాటు సామాన్యభక్తులు వైకుంఠ ఏకాదశి ఘడియల్లో ప్రశాంతంగా చేసుకుంటున్నారు.మంగళవారం వేకువజామున వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని వైకుంఠద్వార దర్శనాలు మొదలయ్యాయి. వేకువజామున 1.30గంటలకు మొదలైన ప్రోటోకాల్ ప్రముఖుల దర్శనాలు ఏకధాటిగా ఉదయం 6గంటల వరకు సాగాయి. ఆ తరువాత ముందుగా నిర్దేశించిన సమయం ప్రకారం టోకెన్లుపొందిన భక్తులను స్లాట్‌ల వారీగా సమయం ప్రకారం ఆలయంలోనికి అనుమతించారు. సర్వదర్శనం ప్రారంభించడంతో సామాన్యభక్తులు ఏడుకొండల స్వామితోబాటు >>2

## గ్రూప్-2 అభ్యర్థులకు హైకోర్టులో ఊరట

**విజయవాడ,డిసెంబరు 30,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ గ్రూప్2 అభ్యర్థులకు భారీ ఊరట దక్కింది. గ్రూప్2 రిజర్వేషన్లపై దాఖలైన పిటిషన్లను ఏపీ హైకోర్టు కొట్టివేసింది. కాగా, 2023లో విడుదలైన గ్రూప్2 నోటిఫికేషన్‌పై రిజర్వేషన్ల విధానాన్ని సవాల్ చేస్తూ పలువురు అభ్యర్థులు హైకోర్టును ఆశ్రయించిన సంగతి తెలిసిందే. సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు అనుగుణంగా రిజర్వేషన్ రోస్టర్‌ను పాటించాలని కోరుతూ అభ్యర్థులు పిటిషన్లు దాఖలు చేశారు. 2023లో విడుదలైన గ్రూప్2 నోటిఫికేషన్‌ను రద్దుచేసి, పాత నోటిఫికేషన్‌కు బదులు కొత్త నోటిఫికేషన్ జారీ చేయాలని అభ్యర్థులు కోరారు. >>2

31-12pg2exHMNWJQE 2_31-12pg2exHMNWJQE.qxd 30/Dec/25 11:51 PM Page 1





మంగళవారం తెలంగాణ సిఎం రేవంత్ రెడ్డి కుటుంబ సభ్యులతో తిరుమలలో ఉత్తరద్వార దర్శనం

## ప్రశాంతంగా ‘ఉత్తరద్వార’ దర్శనాలు

>> వైకుంఠద్వార దర్శనం ప్రశాంతంగా చేసుకొంటున్నారు. తమిళనాడు, కర్నాటక, కేరళ,తెలుగురాష్ట్రాలకు చెందిన భక్తులు తిరుమల ఆలయంలో వైకుంఠదర్శనాలు చేసుకున్నారు. సాయంత్రం వరకు 40వేలమంది భక్తులకు మహాలఘులో దర్శనం కల్పించారు. తిరుమలలో సామాన్యభక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ముందుగానే మూడునెలల నుండి ప్రణాళికా బద్దంగా టిటిడి,పోలీసు యంత్రాంగం చక్కటి ఏర్పాట్లు చేపట్టింది. క్యూలైన్లలో, కంపార్టుమెంట్లలో ఉన్న భక్తులకు నిరంతరాయంగా టీ,పాలు, అల్పాహారం, అన్నప్రసాదాలు పంపిణీ చేస్తున్నారు. సోమవారం రాత్రికి తిరుమల కొండ సామాన్యభక్తుల తో నిండిపోయినా టోకెన్ ఉన్నవారినే ఆలయంలోనికి అనుమతించడం జరిగింది. ఏడుకొండలు గోవిందనామాలతో మారుమోగుతున్నాయి.

**సంతృప్తికరంగా వైకుంఠద్వార దర్శనం:** వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని తిరుమల శ్రీవారి ఆలయంలో భక్తులకు సంతృప్తికరంగా వైకుంఠ ద్వార దర్శనం టిటిడి అధికారులు చేయిస్తున్నారు. ఎలాంటి ఇబ్బందులు లేకుండా చక్కటి ఏర్పాట్లు చేశారు. స్లాట్ల వారీగా సర్వదర్శనం అనుమతి నిస్తున్నారు. రోజుకు 65వేలమంది భక్తులకు దర్శనం చేయించేలా ప్రణాళికలు సిద్ధం చేసి టోకెన్లు జారీచేశారు. పదిరోజులకు 7.50లక్షలమంది భక్తులు వైకుంఠద్వారంలో వేంకటేశ్వరుని దర్శించుకునేలా ఏర్పాట్లు జరిగాయి. **నేడు చక్రస్నానం:** వైకుంఠ ద్వాదశి పర్వదినాన బుధవారం ఉదయం స్వామివారి పుష్కరిణిలో చక్రత్తాళ్వార్‌కు చక్రస్నానం జరిపిస్తారు. ఆగమోక్తంగా అర్చకులు పవిత్ర కార్యక్రమం నిర్వహించిన అనంతరం సామాన్యభక్తులు పుణ్యస్నానాలాచరిస్తారు.

## భారత్, పాక్‌లమధ్య మళ్లీ యుద్ధ మేఘాలు!

### అమెరికా థింక్‌ట్యాంక్ విశ్లేషణ

**న్యూఢిల్లీ, డిసెంబరు 30:** భారత్ పాకిస్తాన్‌లమధ్య వచ్చే ఏడాది మరోసారి యుద్ధంజరిగే అవకాశం ఉందని అమెరికన్ విదేశాంగ నిపుణులను సర్వేచేసే యుఎస్ థింక్‌ట్యాంక్ నివేదిక విడుదలచేసింది. కౌన్సిల్ ఆన్ ఫారిన్ రిలేషన్స్ సాయుధ సంఘర్షణ అవకాశాలకు ఎక్కువ ఆస్కారం ఉందని తెలిపింది. అమెరికన్‌ప్రయోజనాలపై పరిమిత ప్రభావం చూపవచ్చని ఉగ్రవాద కార్యకలాపాల పెరుగుదల కారణంగా భారత్, పాక్ మధ్య తిరిగి సాయుధ సంఘర్షణకు అవకాశం ఉన్నట్లు సిఎఫ్ఆర్ తన కాన్‌ఫ్లిక్ట్ వాచ్‌ఇన్ 2026 నివేదికలో ఉటంకించింది. భారత్‌తోనే కాకుండా పాక్ ఆఫ్ఘనిస్తాన్ మధ్యకూడా సాయుధ పోరాటం ఉంటుందని హెచ్చరించింది. పహల్గాంవ్ ఉగ్రదాడి తర్వాత భారత్ ఆపరేషన్ సిందూర్‌తో పాక్ వ్యాప్తంగా ఉన్న లష్కరే, జైషే ఉగ్రవాద స్థావరాలు కార్యాలయాలపై దాడులుచేసింది. వందలాదిమంది ఉగ్రవాదులు హతమయ్యారు. తర్వాత పాక్‌సైన్యం భారత్‌పై దాడులకు ప్రయత్నిస్తే పాక్ ఎయిర్‌ఫోర్స్‌కు చెందిన 11 ఎయిర్‌బేస్‌లను భారత్ క్షిపణులు డీకొట్టాయి. తర్వాత తాజాగా థింక్‌ట్యాంక్‌నుంచి ఈ నివేదికవచ్చింది. ప్రత్యేకించి ఆర్మీచీఫ్‌గా ఆసిమ్‌మునీర్‌కు అత్యున్నత పదవి లభించిన తర్వాత భారత్ లక్ష్యంగా కార్యకలాపాలు పెరిగాయి. రెండుదేశాలు కూడా రక్షణ వ్యవస్థను బలోపేతంచేసుకుంటున్నాయి. రెండురోజులక్రితమే రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ 79 వేల కోట్ల విలువైన రక్షణ సామగ్రి కొనుగోలుకు ఆమోదం తెలిపారు. అదేవిధంగా పాక్ కూడా అమెరికా,చైనాలపై రక్షణ సామగ్రి దిగుమతికి ఆధారపడింది. దీనికితోడు ఆసిమ్‌మునీర్ హయాంలోనే ఉగ్రవాదం ఇతర దేశాలకు కూడా పాకుతోంది. ఇటీవలే స్పానిష్ పోలీసులు 11 మంది పాకిస్తానీ దేశీయులను తాలిబన్ టెర్రరిస్టులుగా అనుమతనిస్తూ అరెస్టులుచేయడంతో జీహాదీ చర్యలు బలపడ్డాయి. ఉత్తర అమెరికాలోకూడా 20 ఏళ్ల పాకిస్తాన్ వ్యక్తిని కెనడాలో ఉండగా అరెస్టుచేసారు. కాగా భారత్‌లో తీవ్రమైన చలివాతావరణంలో భారీ ఎత్తున మంచుకురుస్తున్నప్పటికీ ఇప్పటికే 30 మంది ఉగ్రవాదులు ఉన్నట్లు నిఘా ఏజెన్సీలు గుర్తించాయి. వీటన్నింటి దృష్ట్యా వచ్చే ఏడాదిలో మళ్లీ యుద్ధమేఘాలు అలుముకునే ప్రమాదం ఉందన్న అమెరికా థింక్‌ట్యాంక్ విశ్లేషణ నిజమనిపిస్తోంది.

## అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌నకు ఇజ్రాయెల్ అత్యున్నత పురస్కారం

**ఫ్లోరిడా, డిసెంబరు 30:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు ఇజ్రాయెల్ ప్రభుత్వం అరుదైన గౌరవాన్ని ప్రకటించింది. ఆ దేశ అత్యున్నత పౌర పురస్కారమైన “ఇజ్రాయెల్ ప్రైజ్ ఫర్ పీస్”ను ట్రంప్‌నకు ప్రదానం చేయనున్నట్లు ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు వెల్లడించారు. ఫ్లోరిడాలోని మార్‌ఎలాగోలో ఇరువురు నేతల మధ్య జరిగిన ద్వైపాక్షిక భేటీ అనంతరం ఈ ప్రకటన వెలువడింది. గత 80 ఏళ్ల చరిత్రలో ఈ పురస్కారాన్ని ఓ విదేశీయుడికి (నాన్‌ఇజ్రాయెల్ సిటిజన్) ఇవ్వడం ఇదే తొలిసారి కాగా శాంతి విభాగంలో అవార్డును ప్రకటించడం కూడా ఇదే మొదటిసారి కావడం విశేషం. ఈ ఏడాది జులై లో ఇజ్రాయెల్ తమ నిబంధనలను సవరించి మరీ విదేశీయులకు ఈ అవార్డు ఇచ్చేలా మార్పులు చేసింది. ఇజ్రాయెల్ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు హాజరై ట్రంప్ ఈ అవార్డును స్వీకరించే అవకాశం ఉంది.ట్రంప్ ఎన్నో సంప్రదాయాలను తిరగరాసి అందరినీ ఆశ్చర్యపరిచారు. అందుకే మేం కూడా సంప్రదాయాన్ని పక్కనపెట్టి తొలిసారి ఓ ఇజ్రాయేలేతరుడికి ఈ అవార్డును ఇస్తున్నాం. యూదు ప్రజలకు, ఇజ్రాయెల్ భద్రతకు ట్రంప్ చేసిన సేవలకు ఇది గుర్తింపని నెతన్యాహు పేర్కొన్నారు. దీనిపై స్పందించిన ట్రంప్ ఈ గౌరవం తనను ఆశ్చర్యపరిచిందని, ఇజ్రాయెల్ గుర్తింపు పట్ల ఎంతో సంతోషంగా ఉందని తెలిపారు. భేటీలో భాగంగా గాజా శాంతి ఒప్పందం రెండో దశ, వెస్ట్ బ్యాంక్ అంశాలపై ఇరువురు నేతలు సుదీర్ఘంగా చర్చించారు. వెస్ట్ బ్యాంక్ విషయంలో తమ మధ్య కొన్ని భిన్నాభిప్రాయాలు ఉన్నప్పటికీ ఇజ్రాయెల్ ఒప్పందానికి కట్టుబడి ఉందని, ఆ దేశం బలంగా ఉందని ట్రంప్ కితాబునిచ్చారు. చర్చలు ఫలప్రదంగా జరిగాయని నెతన్యాహు వెల్లడించారు.

# నేటి నుంచి కొత్త జిల్లాలు

>> డను వాసవి పెనుగొండగా మార్చడం వంటి మార్పులు కూడా నోటిఫికేషన్‌లో చేర్చింది. అనకాపల్లి జిల్లాలో అడ్డరోడ్డు జంక్షన్‌తో రెవెన్యూ డివిజన్‌ను ఏర్పాటు చేయడం, అంబేద్కర్ కోనసీమ జిల్లాలో మండలాలను మార్చడం ద్వారా స్థానిక పరిపాలన మరింత సులభతరం అవుతుందని కూటమి ప్రభుత్వం భావించింది. ఈ మార్పుల ద్వారా జిల్లా పరిపాలన, రెవెన్యూ కార్యకలాపాలు మరింత సమర్థవంతంగా నిర్వహించడానికి అవకాశం ఉంటుందని ప్రభుత్వం అనుకుంటుంది. ఈ నిర్ణయం గ్రామీణ, పట్టణ ప్రాంతాల ప్రజలకు సమగ్ర సేవలందించడానికి తీసుకున్నదని ఏపీ ప్రభుత్వం పేర్కొంది. కొత్త జిల్లాల ఏర్పాటుతో పౌరుల సేవల వేరిక వేగవంతం అవుతుందని... రెవెన్యూ డివిజన్ల మార్పులు, చేర్పులు స్థానిక అధికారుల ప్రవర్తనను మరింత సమర్థవంతంగా చేస్తాయని భావిస్తోంది. తుది నోటిఫికేషన్ ప్రకారం, రేపటి నుంచి కొత్త జిల్లాలు, రెవెన్యూ డివిజన్లు, మండలాల సరిహద్దుల మార్పులు అధికారికంగా అమల్లోకి రానున్నాయి.అంబేద్కర్ కోనసీమ జిల్లాలో మండలాలను మార్చారు. గూడూరు నియోజకవర్గంలోని 3మండలాలు నెల్లూరుకు తీసుకువచ్చారు. రైల్వే కోడూరు నియోజకవర్గాన్ని తిరుపతిజిల్లాలోకి, రాజంపేట నియోజకవర్గాన్ని వైఎస్ఆర్ కడపలోకి మార్చాలని ప్రజల కోరిక మేరకు క్యాబినెట్ ఆమోదం తెలపగా వాటికి సంబంధించి తుది నోటిఫికేషన్ విడుదలయ్యాయి. 17జిల్లాల్లో 25 మార్పులు చేస్తూ క్యాబినెట్లో ఆమోదం తెలపగా వాటన్నింటికీ సంబంధించి తుది ప్రకటన జారీ అయ్యాయి. కొత్త జిల్లాలు, రెవెన్యూ డివిజన్లు, సహా మార్పులు చేర్పులన్నీ డిసెంబర్ 31నుంచే అమల్లోకి వస్తాయని రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది. ప్రజలు, స్థానిక సంస్థలు, అధికారులు అన్నివిధాలుగా ఈ మార్పులకు అనుగుణంగా తమ కార్యక్రమాలను సర్దుబాటు చేసుకోవాల్సి ఉంది. ఈ కొత్త ఏర్పాట్లు ఏపీలో పరిపాలనలో మరింత సమర్థత, ప్రజల చేరికలో సౌలభ్యం, స్థానిక అభివృద్ధికి దోహదపడతాయని ప్రభుత్వం అభిప్రాయపడింది.

## ‘ఫుట్‌పాత్’వాసులను ‘హోమ్’లకు పంపండి

>> విస్మయం వ్యక్తం చేసింది. ఈ విషయంలో జాప్యం చేయడానికి వీల్లేదని స్పష్టం చేసింది. విజయవాడ నగరపాలక సంస్థ తరఫు న్యాయవాది స్పందిస్తూ మహిళలకు షెల్టర్ హోంలు ఏర్పాటు ప్రతిపాదన ఉందని ధర్మాసనం దృష్టికి తెచ్చారు. విజయవాడ కృష్ణా బ్యారేజ్ ఫుట్‌పాత్‌లపై నిరాశ్రయులు రాత్రి వేళల్లో దయనీయ స్థితిలో నిద్రపోతున్నారని వారికి ఆశ్రయం కల్పించే విషయంలో అధికారులు చర్యలు తీసుకోవడం లేదని పేర్కొంటూ న్యాయవాది అది రామకృష్ణుడు పిల్ వేశారు. ఆయన నేరుగా వాదనలు వినిపిస్తూ పట్టణ నిరాశ్రయుల పథకం (షెల్టర్ ఫర్ అర్బన్ హోంలెస్‌ఎస్‌యూహెచ్) కింద నిరాశ్రయులకు ఆశ్రయం కల్పించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. విజయవాడ నగరపాలక సంస్థ కొన్ని ప్రాంతాల్లో షెల్టర్ హోంలు ఏర్పాటు చేసినప్పటికీ ఇంకా ఎంతోమంది ఫుట్‌పాత్‌లపై నిద్రిస్తున్నారన్నారు. ధర్మాసనం స్పందిస్తూ ఫుట్‌పాత్‌లపై నిద్రించడం ప్రమాదకరమని, చలికాలంలో పరిస్థితి మరింత దారుణంగా ఉంటుందని వ్యాఖ్యానించింది. విచారణ సందర్భంగా, మహిళలకు ఆశ్రయ హోంలు లేవని తెలుసుకొని విస్మయం వ్యక్తం చేసింది. ఈ విషయంలో జాప్యం చేయడానికి వీల్లేదని స్పష్టం చేసింది. విజయవాడ నగరపాలక సంస్థ తరఫు న్యాయవాది స్పందిస్తూ మహిళలకు షెల్టర్ హోంలు ఏర్పాటు ప్రతిపాదన ఉందని ధర్మాసనం దృష్టికి తెచ్చారు. కోర్టుకు సహాయకులుగా వ్యవహరించేందుకు అమికస్ క్యూరీగా నియమితులైన సీనియర్ న్యాయవాది కేవీఎస్ మూర్తి వాదనలు వినిపిస్తూ గతంలో షెల్టర్ హోంలను స్వచ్ఛంద సంస్థలు నిర్వహించేవన్నారు. గత ప్రభుత్వం సొమ్ము చెల్లించకపోవడంతో హోంల నిర్వహణ నుంచి ఎన్జీవోలు తప్పుకున్నాయని పేర్కొన్నారు. దారిలేక కొందరు దారితప్పి మరికొందరు పనికోసం ఒకరు పనిలేక మరోకరు ఇలా చాలా మంది విజయవాడ నగరానికి చేరుతున్నారు. వీరిలో ఉపాధి కోసం నగరానికి వచ్చే వారి సంఖ్యనే అధికం. రాత్రుళ్లు లాడ్జిలో ఉండాలన్నా అధిక మొత్తం చెల్లించాల్సి ఉంటుంది. దీంతోపాటు భోజనం, ఇతర అవసరాలకు మరింత ఖర్చు పెట్టాల్సి ఉంటుంది. ఇలా ఖర్చు పెట్టలేక చాలా మంది వలసొచ్చిన కార్మికులు, నిరాశ్రయులు నగరంలోని బస్టాండ్, రైల్వేస్టేషన్, బీఆర్‌టీఎస్ రోడ్డు, దుర్గగుడి ఫ్లై ఓవర్ కింద, ప్రకాశం బ్యారేజీ, ఏలూరు రోడ్డులోని ఫుట్‌పాత్‌లు, డివైడర్లలను ఆవాసాలుగా చేసుకుంటున్నారు. ఇలాంటి వారి కోసం పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ నగరంలో నాలుగు నిరాశ్రయుల వసతి గృహాలను అందుబాటులోకి తీసుకొచ్చింది. వీటి గురించి తెలియక చాలా మంది ప్రధాన కూడళ్లు, ఫుట్‌పాత్‌లపైనే రాత్రుళ్లు పడుకుంటున్నారు.

## శంకరగుప్తం డ్రెయిన్ ఆధునీకరణ

>> చేయించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కోనసీమ రైతాంగం తరఫున ధన్యవాదాలు తెలిపారు. సుబ్రహ్మణ్య షష్టి రోజు సమస్య తెలుసుకుని.. ముక్కోటి ఏకాదశి నాటికి పరిష్కరించడం ఎంతో సంతృప్తినిచ్చిందన్నారు. మంగళవారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా పరిధిలోని శంకరగుప్తం మేజర్ డ్రెయిన్ ఆధునికీకరణ పనులకు రాజధాని ప్రాంతంలోని క్యాంపు కార్యాలయం నుంచి వర్చువల్ గా శంకుస్థాపన చేశారు. రాష్ట్ర జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ఈ కార్యక్రమంలో వర్చ్యువల్ గా పాల్గొన్నారు. రాజోలు శాసన సభ్యులు దేవ వరప్రసాద్ డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ మహేష్ కుమార్‌శంకరగుప్తం నుంచి పాల్గొన్నారు. రూ. 20.62 కోట్ల అంచనా వ్యయంతో శంకరగుప్తం మేజర్ డ్రెయిన్ 8.50 కిలోమీటర్ నుంచి 16.50 కిలోమీటర్ వరకు ద్వారా పూడిక తీత పనులు, డ్రెయిన్ మొదలైన ప్రాంతం నుంచి 14.50 కిలోమీటర్ వరకు ఇరువైపులా గట్లు పటిష్టపరచడం తదితర పనులు చేపట్టనున్నారు. ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ “శంకరగుప్తం డ్రెయిన్ సమస్యను పరిశీలన చేసేందుకు రాజోలు నియోజకవర్గం కేశవదాసుపాలెం వచ్చినప్పుడు తలలు వాల్చిన కొబ్బరి తోటలు చూస్తే బాధ కలిగింది. రెండు దశాబ్దాల రైతుల ఆవేదన స్వయంగా విన్నాను. సుమారు లక్షన్నర చెట్లు మోడుబారిపోయిన విషయం తెలుసుకుని కలత చెందాను. కొబ్బరి తోటలు లేని కోనసీమను ఊహించలేం. అక్కడ పరిస్థితి చూసి తిరిగి వచ్చిన వెంటనే సమస్యను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకువెళ్లా. 45 రోజుల్లో సమస్య పరిష్కారానికి ఒక యాక్షన్ ప్లాన్ అవసరం అని వివరించా. ఆయన సకాలంలో స్పందించి ఈ రోజున 35 రోజుల్లోపే రూ. 20.77 కోట్లు కేటాయించి ముక్కోటి ఏకాదశి పర్వదినాన పనులు ప్రారంభించే అవకాశం కల్పించారు. డ్రెయిన్ ఆక్రమణలపై అధికారులు దృష్టి సారించాలి. డ్రెయిన్ ఆధునికీకరణ చేయడంతో పాటు డ్రెయిన్ ఆక్రమణలు ఉన్న విషయం మా దృష్టికి వచ్చింది.

శంకరగుప్తం డ్రెయిన్ లో 250 ఎకరాలు అన్యాక్రాంతం అయినట్టు తెలిసింది. ఈ ఆక్రమణలపై జిల్లా కలెక్టర్ దృష్టి సారించాలి. నవంబర్ 26న కేశవదాసుపాలెంలో పర్యటించినప్పుడు తక్షణ ఉపశమన చర్యల ఆవశ్యకతను గుర్తించాం. ఫైలు ముఖ్యమంత్రి గారి కార్యాలయంతో పాటు సంబంధిత ప్రభుత్వ శాఖల ముందు ఉంచాం. ఆర్థిక పరిస్థితి చూస్తే ఈ ఏడాది బడ్జెట్ కేటాయించేందుకు నిధుల సమస్య ఉంది. అలాంటి పరిస్థితుల్లో కూడా కోనసీమ కొబ్బరి రైతుల సమస్యను ప్రాధాన్యతాంశంగా స్వీకరించి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సహకారంతో నిధులు మంజూరు చేయించుకోగలిగాం. కోనసీమ కొబ్బరి రైతుల సమస్యకు ప్రాధాన్యత ఇచ్చి అండగా నిలిచినందుకు ధన్యవాదాలు తెలియజేస్తున్నాం.


**నాడు కౌలు రైతుల కుటుంబాలకు భరోసా**

పది మందికి అన్నం పెట్టే రైతుకు కష్టం వస్తే చాలా బాధ కలుగుతుంది. గతంలో ఒక ముక్కోటి ఏకాదశి రోజున మంత్రి నాదెండ్ల మనోహర్ కౌలు రైతుల ఆత్మహత్యల అంశాన్ని నా దృష్టికి తీసుకువచ్చారు. ఆ రోజున కౌలు రైతుల కుటుంబాలకు ఎంత మేరకు సహాయం చేయగలం, వారి బతుకులకు భరోసా ఇవ్వాలని ఆలోచన నుంచే కౌలు రైతు భరోసా యాత్ర అనే గొప్ప కార్యక్రమం మొదలయ్యింది. అదే రోజు ఓ సినిమా ఒప్పుకొని, అప్పుడు వచ్చిన అడ్వాన్స్ డబ్బు రూ. 5 కోట్లను కౌలు రైతుల కోసం ఇచ్చేసి కౌలు రైతు భరోసా యాత్ర ప్రారంభించాం. మరికొందరు దాతల సహకారంతో కూటమి ప్రభుత్వం రైతుల కోసం ఎన్నో చేస్తుంది. త్వరలో పోలవరం ప్రాజెక్టు పూర్తి చేయబోతున్నాం.

ఆ దిశలోనే ఇప్పుడు శంకరగుప్తం డ్రెయిన్‌కి రూ. 20.77 కోట్లతో ఊపిరిపోయబోతున్నాం. శంకరగుప్తం మేజర్ డ్రెయిన్ ఆధునికీకరణతో వందలాది మంది కొబ్బరి రైతులకు ఉపసమనం కలుగుతుంది. ఇప్పటి వరకు జరిగిన నష్టాన్ని పూడ్చలేకపోయినా.. భవిష్యత్తు నష్టాన్ని నివారించేందుకు ఆధునికీకరణ పనులు ఉపయోగపడతాయి.

ఈ కార్యక్రమానికి సహకరించిన జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ కూడా ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. ఇది ఆరంభం మాత్రమే. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో డ్రెయిన్లు, పంట కాలువల ఆధునీకరణకు సుమారు రూ. 4 వేల కోట్లు అవసరం అని గత పర్యటనలో అధికారులు చెప్పారు.

కోనసీమ ప్రాంతంలో డ్రెయిన్లపై నీటిపారుదలశాఖ నిపుణులు బి.సి. రోశయ్య గారి రిపోర్టుపై అధ్యయనం చేస్తున్నాం. నివేదిక వచ్చిన వెంటనే మంత్రివర్గంలో చర్చించి డ్రెయిన్ల ఆధునీకరణ అంశాన్ని ముందుకు తీసుకువెళ్తాం. కూటమి ప్రభుత్వం రైతుల సంక్షేమానికి, ముఖ్యంగా కోనసీమ కొబ్బరి రైతుల సమస్యల పరిష్కారానికి కట్టుబడి ఉంది. కోనసీమలో కోకోనట్ బోర్డు ఏర్పాటు అంశాన్ని కేంద్రం దృష్టికి తీసుకువెళ్తాం” అన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ కృష్ణ తేజ, ఇతర ఉన్నతాధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.



మంగళవారం కోలకతాలో మీడియాతో మాట్లాడుతున్న కేంద్రహోంమంత్రి అమిత్‌షా

## సంక్షేమగృహాలపై గట్టి నిఘా

>> పరిశీలించేందుకు క్షేత్రస్థాయి పర్యటనల చేపట్టడంతో పాటు పరిస్థితులపై నిత్యం టెలీకాన్ఫరెన్స్ నిర్వహించుకోవాలి.సంక్షేమ రంగానికి చెందిన శాఖలన్నీ కలిపి ఉమ్మడిగా ఓ కమాండ్ కంట్రోల్ రూం ఏర్పాటు చేసుకోవాలి. అన్ని హాస్టళ్లల్లోని విద్యార్థులకు డిజిటల్ హెల్త్ రికార్డ్స్ ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలి. వైద్య పరీక్షలు నిర్వహించే సందర్భంగా విద్యార్థుల్లో ఏమైనా ఆరోగ్య సమస్యలు గుర్తిస్తే,ఆ అనారోగ్య సమస్యలకు గల మూలాలను విశ్లేషించాలి. దానికి అనుగుణంగా వైద్యం అందేలా చూడాలి. ఏజెన్సీప్రాంతాల్లోని హాస్టళ్లపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి. విద్యార్థుల్లో ఆత్మస్థైర్యం పెరిగేలా ప్రత్యేక కౌన్సిలర్లతో కౌన్సిలింగ్ ఇప్పించండి. బాలుర హాస్టళ్లల్లోని వారికి మగ కౌన్సిలర్ల ద్వారా బాలికల హాస్టళ్లోని వారికి మహిళాకౌన్సిలర్లతో కౌన్సిలింగ్ ఇచ్చేలా చర్యలు తీసుకోవాలి. ఎలాంటి పరిస్థితులనైనా తట్టుకునే ఆత్మస్థైర్యంతో నిలబ డగలిగేలా విద్యార్థులను తీర్చి దిద్దాలి. హాస్టళ్లల్లో నీటి సరఫరా విషయంలో పంచాయతీరాజ్, హెల్త్, మున్సిపల్ శాఖలు, సంక్షేమ, వైద్యారోగ్య శాఖలు కలిసి పని చేయాలి. అన్ని హాస్టళ్లల్లో వాటర్ శాంపిల్స్ కూడా తీసుకోవాలి. ఎనిమియా, సికెల్ సెల్ వ్యాధులపై అవగాహన కల్పించే బాధ్యతను అధికారులపైనే ఉందని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు.

## ఆర్థికవృద్ధిలో జపాన్‌ను అధిగమించిన భారత్

### 4.1 లక్షలకోట్ల డాలర్ల ఆర్థిక వ్యవస్థకు చేరిక

### 2030 నాటికి జర్మనీని సైతం అధిగమిస్తుందని రేటింగ్స్ అంచనాలు

**న్యూఢిల్లీ, డిసెంబరు 30:** ఆర్థిక వ్యవస్థ వృద్ధితో భారత్ ప్రపంచంలోనే నాలుగో అతిపెద్ద ఆర్థికవ్యవస్థ ఉన్న దేశంగా నిలిచింది. ప్రస్తుతం నాలుగోస్థానంలో ఉన్న జపాన్‌ను అధిగమించి 4.18 లక్షలకోట్ల డాలర్లకు చేరింది. 2030 నాటికి జర్మనీని సైతం అధిగమిస్తుందని అంచనాలున్నాయి. శరవేగంగా అభివృద్ధిచెందుతున్నదేశంగా కొనసాగుతున్న భారత్ దేశీయంగా వినియోగం, నిర్మాణాత్మక సంస్కరణలతో మరింత వృద్ధి వేగవంతం అవుతోంది. భారత్ వాస్తవ జిడిపి 8.2శాతం రెండోత్రైమాసికంలో పెరిగింది. అంతకుముందు తొలిత్రైమాసికంలో 7.8శాతంకాగా గత ఏడాది నాలుగో త్రైమాసికంలో 7.4శాతం మాత్రమే వృద్ధిని నమోదుచేసింది. 2030 నాటికి భారత్ 7.3 లక్షలకోట్ల డాలర్ల జిడిపితో ఉంటుందని అంచనా. అంతర్జాతీయ సంస్థలు కూడా భారత్ వృద్ధి అవకాశాలపై సానుకూలంగా రేటింగ్ ఇచ్చాయి. ప్రపంచ బ్యాంకు 2026 లో 6.5శాతం ఉంటుందని,మూడీస్ రేటింగ్ అయితే 6.4శాతంగా ఉంటుందని 2027లో 6.5శాతం ఉంటుందని అంచనాలు వేసింది. ఇక అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ అయితే భారత్ అంచనాలు 2025లో 6.6శాతం, 2026లో 6.2శాతంగా ఉంటాయి. ఇక ఒఇసిడి అంచనాలు 2025లతో 6.7శాతం, 2026లో 6.2శాతంగా ఉంటాయని తేల్చింది. ఇక అమెరికాకు చెందిన ఎస్‌అండ్‌పి 6.5శాతం 2025-26లోను వచ్చే 2026 ఆర్థికసంవత్సరానికిగాను 6.7శాతంగాను ఉంటుందని వెల్లడించింది. ఆసియా అభివృద్ధి బానయంకు కూడా భారత్ వృద్ధి అంచనాలను 7.2శాతంగా వెల్లడించింది. ఫిట్చ్ రేటింగ్స్ కూడా భారత్ 2026 ఆర్థికవృద్ధి 7.4శాతంగా ఉంటుందని తెలిపింది. వృద్ధికి మూలకారణాలు ద్రవ్యోల్బణం అందుపులోనే ఉండటం, రిజర్వుబ్యాంకు అంచనాలకు అనుగుణంగానే కొనసాగడం, నిరుద్యోగం తగ్గడం, ఎగుమతులు పెరగడం వంటివి మూల కారణాలుగా రేటింగ్స్ సంస్థలు వర్ణిఇస్తున్నాయి. ఆర్థిక పరిస్థితులు స్థిరంగాను పటిష్టంగాను ఉన్నాయని, వాణిజ్యరంగానికి రుణసాయం కూడా సులువుగానే అందుతోంది.

## పాస్ పుస్తకాల పంపిణి

>> ఆదేశించాం. గ్రేటర్ విజయవాడ,తిరుపతి ప్రతిపాదనలు ప్రభుత్వ పరిశీలనలో ఉన్నాయి. రాబోయే రోజుల్లో వాటిని మహా నగరాలుగా అభివృద్ధి చేయనున్నాం’అని సత్యప్రసాద్ వివరించారు.

## మరో 11 ప్రత్యేక రైళ్లు

>> కొన్ని రైళ్ళకు టికెట్ బుక్కింగ్ ఈ రోజు ఉదయం 8 గంటల నుంచి ప్రారంభమైంది. సంక్రాంతికి స్వగ్రామాలకు వెళ్ళే వారికి ఈ ప్రత్యేక రైళ్ళు చాలా ఉపయోగంగా ఉంటాయని రైల్వే అధికారులు తెలిపారు. ప్రయాణానికి ముందు రైలు సమయాలు చూసుకొని టికెట్ బుక్ చేసుకోవాలని సూచించారు.

## స్థాయి పెంపు

>> గిరిజన ప్రాంతవాసులు సౌక ర్యవంతమైన రోడ్డు ప్రయాణం అందించడమే లక్ష్యంగా పని చేస్తున్నామన్నారు. కూటమి ప్రభుత్వం గిరిజన ప్రాంతాల సర్వతోముఖాభివృద్ధికి పెద్ద పీట వేస్తోందన్నారు. అందులో భాగంగా గిరిజన రైతుల జీవనోపాధిని మెరుగుపర్చేందుకు రాష్ట్ర గిరిజన సంక్షేమశాఖ ఆధ్వర్యంలో అన్ని ఐటీడీఏలకు రూ.13.70కోట్ల నిధులను విడుదల చేశామన్నారు. 9ఐటీడీఏల పరిధిలో ట్రైకార్ రుణాలను పునరుద్దరించామన్నారు. గిరిజన రైతులకు 90శాతం భారీ సబ్సిడీతో ట్రాక్టర్లు,మినీ ట్రాక్టర్లు,ట్రక్కులు,ఆయిల్ ఇంజిన్లు,టార్పాలిన్లు పంపిణీ చేయనున్నామని ప్రకటించారు. అంతే కాకుండా పశుపోషణ ద్వారా అదనపు ఆదాయం కల్పించేందుకు గోకులాలు మంజూరు చేస్తున్నా కీలక నిర్ణయం తీసుకున్న విషయాన్ని గుర్తు చేశారు. రానున్న 2026లో మరింత రెట్టింపు ఉత్సాహంతో పని చేస్తామని ప్రకటించారు.

## పేరు మార్పు

>> వేసింది. రాజధానిలో రూ.538 కోట్ల విలువైన వివిధ పనుల ప్రతిపాదనల్నీ ఆమోదించింది. రాజధానిలో రూ.137 కోట్లతో అమరావతి క్వాంటమ్ కంప్యూటింగ్ సెంటర్ నిర్మాణ పనులను టెండర్‌లో తక్కువకు కోట్ చేసిన ఎల్ అండ్ టీ కి అప్పగిస్తూ ఈ నిర్ణయం తీసుకుంది.రూ. 41.61 కోట్ల వడ్డీ మాఫీ: తద్వారా నెలకు రూ.22.5 కోట్లు, ఏడాదికి రూ. 270 కోట్లు ఆదాయం వస్తుందని అంచనా వేస్తోంది. కేంద్ర ప్రాయోజిత పథకాలైన జాతీయ ఎస్సీ ఆర్థికాభివృద్ధి సంస్థ ఎన్ఎస్ఎఫ్‌డీసీ (నేషనల్ షెడ్యూల్డ్ కాస్ట్స్ ఫైనాన్స్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్), జాతీయ సఫాయి కర్మచారీ ఆర్థికాభివృద్ధి సంస్థ కింద రాయితీ రుణాలు పొందిన 11,479 మందికి ప్రభుత్వం తీపికబురు చెప్పింది. కొన్నేళ్లుగా వాయిదాలు చెల్లించకపోవడం వల్ల పేరుకుపోయిన రూ.41.61 కోట్ల రూపాయల వడ్డీ మాఫీకి ఆమోదం తెలిపింది.

### వారం - వర్జ్యం

31-12-2025, బుధవారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
పుష్యమాసం, దక్షిణాయణం
హేమంత ఋతువు, శుక్లపక్షం
ద్వాదశి రా.1.46
కృత్తిక రా.1.28, పూర్వాషాఢ కార్తె
వర్జ్యం : మ.3.41-5.06
దు.ఉ.11.41-మ.12.33
శుభసమయం : ఉ.6.30-7.30
రాహుకాలం - మ.12.00-1.30

### వార్తాఫలం

**మేషం:** జీవిత భాగస్వామి సలహాతో కొత్త కార్యక్రమాలు చేపడతారు. వ్యాపారాలలో మంచి మార్పులు ఉంటాయి.

**వృషభం:** జీవితాశయాన్ని ఏ విధంగానయినా సరే సాధించాలని దృఢ నిర్ణయానికి వస్తారు. సోదరుల కలయిక.

**మిథునం:** చర్మసంబంధిత బాధలు కలుగకుండా జాగ్రత్తలు పాటించండి. మొండి వ్యవహారాలను కాలానికి వదిలివేస్తారు.

**కర్కాటకం :** మీ పరోక్షంలో జరుగుతున్న అన్ని పనులను కూడా గమనిస్తూ కఠినంగా ప్రవర్తిస్తారు. ప్రయాణాలు.

**సింహం:** సంతానాన్ని సక్రమమైన పంథాలో నడిపించడానికి విశేషంగా కృషి చేస్తారు. ఆరోగ్యం పట్ల జాగ్రత్త అవసరం.

**కన్య :** చికాకు కలిగించే కుటుంబ పరిస్థితులకు దూరంగా పారిపోకుండా సమర్థవంతంగా బాధ్యతలు నెరవేరుస్తారు.

**తుల :** అప్పుచేయకపోవటమే నిజమైన పొదుపు అని గుర్తిస్తారు. ప్రతికూల వాతావరణాన్ని కూడా కృషితో అనుకూలంగా మలచుకుంటారు.

**వృశ్చికం:** ఎదుటివారి సంభాషణలలోని నిజానిజాలను గుర్తెరిగి తదనుకూలంగా నడుచుకుంటారు. వాహనయోగం.

**ధనుస్సు:** ఇంటా బయటా సమస్యలు ఎదురైన అధిగమిస్తారు. కుటుంబ సభ్యుల సహాయసహకారాలు అందుకుంటారు.

**మకరం:** సంతానరీత్యా సంఘంలో గౌరవ మర్యాదలు లభిస్తాయి. సన్నిహితుల నుండి విలువైన సమాచారం అందుకుంటారు.

**కుంభం:** అమ్మకాలు కొనుగోలుకు సంబంధించిన వ్యవహారాలు స్తబ్దతగా ఉంటాయి. ఆధ్యాత్మిక కార్యక్రమాల పట్ల ఆసక్తి కనబరుస్తారు.

**మీనం :** జీవిత భాగస్వామితో సంయమనం పాటించి సానుకూల ఫలితాలు సాధిస్తారు. కోర్టుకేసుల నుండి బయటపడతారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# తెలంగాణలో పలువురు ఐఎఎస్‌ల బదలీలు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్.డిసెంబరు30:** తెలంగాణ రాష్ట్రంలో పలువురు ఐఏఎస్ అధికారుల బదిలీలు, నియామకాలకు సంబంధించి ప్రభుత్వం కీలక ఉత్తర్వులు జారీ చేసింది. పరిపాలనా వ్యవస్థను మరింత సమర్థవంతంగా తీర్చిదిద్దే లక్ష్యంతో ఈ మార్పులు చేపట్టినట్లు ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. ఈ బదిలీల్లో జీహెచ్ఎంసీ, జిల్లా కలెక్టర్ పదవులు, కీలక శాఖల కమిషనర్ పోస్టులు ఉన్నాయి. పంచాయతీరాజ్ డైరెక్టర్‌గా ఉన్న జి.శ్రీజనను గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌లో (కూకట్‌పల్లి,శేర్‌లింగంపల్లి,కుత్బుల్లాపూర్ జోన్లు) అదనపు కమిషనర్‌గా బదిలీ చేశారు.నిజామాబాద్ కలెక్టర్‌గా ఉన్న వినయ్ కృష్ణారెడ్డిని జిహెచ్ఎంసీ(మల్కాజ్‌గిరి,ఎల్‌బినగర్,ఉప్పల్‌జోన్లు)లో అదనపు కమిషనర్‌గా బదిలీ అయ్యారు. హైదరాబాద్ నగర పరిపాలన మరింత సమర్థవంతంగా ఉండేందుకు ఈ నియామకాలు దోహదపడతాయని అధికారులు భావిస్తున్నారు. నగర అభివృద్ధి, మౌలిక సదుపాయాలు, పారిశుద్ధం, పట్టణ ప్రణాళిక వంటి అంశాల్లో వీరి పాత్ర కీలకంగా ఉండనుంది.వుమెన్ చైల్డ్ వెల్‌ఫేర్ డైరెక్టర్‌గా ఉన్న శృతి ఓజాకు పంచాయతీరాజ్ శాఖ డైరెక్టర్‌గా అదనపు బాధ్యతలు ఇచ్చారు. గ్రామీణ అభివృద్ధి, పంచాయతీరాజ్ సంస్థల పర్యవేక్షణ, గ్రామస్థాయి పరిపాలన బలోపేతం దిశగా ఈ నియామకం ప్రాధాన్యత సంతరించుకుంది. గ్రామీణ మౌలిక వసతులు, సంక్షేమ పథకాల అమలుపై ప్రత్యేక దృష్టిసారించే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. నల్గొండ జిల్లా కలెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న ఇలా త్రిపాఠిని నిజామాబాద్ జిల్లా కలెక్టర్‌గా బదిలీ చేశారు. సంగారెడ్డి అదనపు కలెక్టర్ బడుగు చంద్రశేఖర్‌ను నల్గొండ జిల్లా నూతన కలెక్టర్‌గా బదిలీ చేశారు. నల్గొండ జిల్లాలో సాగునీరు, వ్యవసాయం, పరిశ్రమలు, ఉపాధి వంటి రంగాలపై ప్రత్యేక దృష్టి పెట్టే అవకాశం ఉందని అధికార వర్గాలు చెబుతున్నాయి. ఇక నారాయణపేట జిల్లాలో అదనపు కలెక్టర్‌గా ఉమాశంకర్ ప్రసాద్‌ను నియమించారు.

## హైకోర్టులో ఊరట

>> రిజర్వేషన్ల పాయింట్లను సవాల్ చేస్తూ, ప్రభుత్వ నిర్ణయాలు సుప్రీం కోర్టు మార్గదర్శకాలకు అనుగుణంగా ఉండాలని పేర్కొన్నారు. ఈ విషయంపై విచారణ జరిపిన ఆంధ్రప్రదేశ్ హైకోర్టు, రిజర్వేషన్‌ను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లను తిరస్కరించింది.

31-12Pg3exHMNWJQETKPR 3 VJA_31-12Pg3exHMNWJQETKPR.qxd 31/Dec/25 12:26 AM Page 1



# పవిత్ర 'వైకుంఠవాకిలి' దర్శనంతో పులకింత

**తిరుమల,డిసెంబర్ 30ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగవైకుంఠం తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో ఎల బ్రహ్మముహూర్తంలోపెద్దసంఖ్యలో ప్రముఖులు పవిత్రమైన వైకుంఠవాకిలి దర్శనాలను చేసుకున్నారు. ధనుర్మాసంలో వైకుంఠ ఏకాదశి ఘడియలు అర్ధరాత్రి దాటిన తరువాత ఆరంభం కావడంతో మంగళవారం వేకువజామున 1.30గంటల నుండి ఉదయం 6.30గంటల వరకు ఏకధాటిగా దేవదేవుడ్ని వైకుంఠద్వారంలో దర్శనం చేసుకున్న ప్రముఖులు పులకించారు. వైకుంఠ ఏకాదశి పర్వదినాన పవిత్రత ప్రతి ఒక్కరి జీవితంలో శాంతి ,సద్గుణాలు, ఆధ్యాత్మిక ఉత్సాహాన్ని నింపాలని ప్రముఖులంతా ఆకాంక్షించారు. ఆపదమొక్కులవాడి ఆశీస్సులతో తెలుగుప్రజలు సుభిక్షంగా ఉండాలని వేడుకున్నట్లు ప్రముఖులు తెలిపారు. వైకుంఠ ఏకాదశి ఘడియల్లో మంగళవారం వేకువజామున ఆలయంలో వైకుంఠద్వారాలు తెరచుకున్నాయి. విశేష పూజలు నిర్వహించిన అనంతరం రాజ్యాంగపరిధిలోని ప్రోటోకాల్ ప్రముఖులు సుప్రీంకోర్టు, హైకోర్టు న్యాయమూర్తులు, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కుటుంబంతో కలసి ఆలయంలోనికి ప్రవేశం కల్పించారు. ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు, డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణమరాజు, తెలంగాణ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, కేంద్రమంత్రి కింజారపు రామ్మోహన్‌నాయుడు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రమంత్రులు నిమ్మలరామానాయుడు, అచ్చెన్నాయుడు, పయ్యావుల కేశవ్, కొండపల్లి శ్రీనివాస్, అనగాని సత్యప్రసాద్, కొల్లురవీంద్ర,సవిత, ఎంఎల్‌సిలు పోచంపల్లి శ్రీనివాస్, కల్యాణి, దువ్వాడ శ్రీనివాస్ దంపతులు, ఎంపిలు మిథున్‌రెడ్డి, డికె అరుణ, ఎమ్మెల్యేలు రాజాసింగ్, మల్లారెడ్డి, మాజీ ఎంపి సంతోష్ వైకుంఠమ్ 1క్యూకాంప్లెక్స్ మార్గంలో ఆలయంలోనికి ప్రవేశించిన ప్రముఖులందరూ హారతి లేని లఘు దర్శనంలో వైకుంఠద్వార దర్శనం చేసుకున్నారు. సాక్షాత్తు వైకుంఠంలో శ్రీమహావిష్ణువే కలియుగంలో శ్రీవేంకటేశ్వరస్వామిగా కొలువై భక్తులను కటాక్షిస్తున్నారు.



కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు ,ఎపి మంత్రులు

వైకుంఠద్వారంలో వేంకటేశ్వరునిదర్శించుకుని ప్రముఖులంతా భక్తిపారవశ్యం చెందారు. తిరుమల తిరుపతి దేవస్థానం పాలకమండలి ఛైర్మన్ బిఆర్‌నాయుడు, టిటిడి ఇఒ అనిల్‌కుమార్‌సింఘాల్, అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, తిరుపతి జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు, టిటిడి సివిఎస్ఒ కెవి మురళీకృష్ణ ,పలుశాఖల అధికారులు చక్కగా దర్శనం ,వసతి సౌకర్యాలు కల్పించారని ప్రముఖులు అభినందించారు. వేకువజామున 1.30గంటలనుండి ఉదయం 6గంటల వరకు ఏకధాటిగా ఐదుగంటల పాటు రాజ్యాంగపరిధిలోని ప్రముఖులు ఏడుకొండల వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. వీరందరికీ స్వయంగా టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు, టిటిడి అదనపు ఇఒ వెంకయ్యచౌదరి ఆలయ వర్గాలు చక్కటి సంతృప్తికర దర్శనం చేయించారు. ఉదయం ఆరుగంటలకు ఆన్‌లైన్‌లో టోకెన్లు పొందిన స్లాట్ భక్తులను దర్శనాలకు అనుమతించారు. భక్తులు గోవింద నామస్మరణలు చేసుకుంటూ ఆలయంలోనికి చేరుకున్నారు. తొలిరోజు ప్రముఖులతో బాటు సామాన్యభక్తులు భక్తితో ప్రశాంతంగా వైకుంఠవాకిలి దర్శనం చేసుకోవడం విశేషం.

# తిరుమల సమాచారం

## వైకుంఠ ఏకాదశినాడు స్వర్ణరథమెక్కిన శేషాచలాధీశుడు

**తిరుమల,డిసెంబర్ 30ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగవైకుంఠంగా విరాజిల్లుతున్న శేషాచలకొండల్లో కొలువైన శ్రీవేంకటేశ్వరస్వామి వైకుంఠ ఏకాదశి పర్వదినాన మంగళవారం ఉదయం స్వర్ణమయమైన మహోన్నత రథం అధిరోహించి భక్తులను కటాక్షించాడు. శ్రీదేవిభూదేవిసమేత మలయప్పస్వామి ఉత్సవ మూర్తులను విశేషాభరణాలంకృతుడ్ని చేసిన అర్చకులు బంగారురథంపై అధిరోహింపజేశారు. ఉదయం చక్కటి వాతా వరణంలో చల్లటిగాలులు వీస్తుండగా భగవంతుడు శైల్య,సుగ్రీవ, మేఘ,పుష్ప, పలహాకా అనే నాలుగు గుర్రాలు పూన్చిన స్వర్ణరథం ఎక్కి విహరించాడు. దారుకుడు ఆయన సారధి. ఈ రథంమీద పయనిస్తూన్న శ్రీమలయప్పస్వామిని దర్శించిన భక్తులు గోవిందనామంతో పునీతులయ్యారు. ఈ వాహనసేవలో పెద్ద జీయంగారు, చిన్నజీయంగారు, టిటిడి ఛైర్మన్ బిఆర్ నాయుడు, వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, టిటిడి ఇఒ అనిల్‌కుమార్‌సింఘాల్, అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, తిరుపతి జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు, సివిఎస్ఒ మురళీకృష్ణ, బోర్డు మహిళ సభ్యులు, ఆలయ డిప్యూటీ ఇఒ లోకనాథం, అర్చకులు, మహిళా ఉద్యోగులు పాల్గొన్నారు.



## వైకుంఠాన్ని తలపిస్తున్న తిరుమలగిరులు

**- తిరుమల ఆలయం వెలుపల సినీనటుడు చిరంజీవి కుటుంబం**



**తిరుమల,డిసెంబర్ 30ప్రభాతవార్తప్రతి నిధి:** దేవలోకంలో వైకుంఠాన్ని తలపించేలా కలియుగక్షేత్రం తిరుమలను టిటిడి అధికారులు అద్భుతంగా ఫల, పుష్పఅలంకరణలు, విద్యుద్దీపకాంతులతో చక్కగా తీర్చిదిద్దారు. అన్నిటికంటే మించి తిరుమల ఆలయం సమీపంలో శ్రీరంగాన్ని తలపించేలా రంగనాథస్వామి ఆలయ సెట్టింగ్స్‌తో దర్శనం టోకెన్ లేని భక్తులు ఈ ఆలయాన్ని సందర్శించి మోక్షం పొందామని అనుభూతి కలుగుతోంది. ఆలయంలోపల, వెలుపల సువాసనల పుష్పాలతో బంగారువాకిలి, ఆనందనిలయం, వెండివాకిలి, ధ్వజస్తంభం, బలిపీఠం,మహద్వారం ,గోపురం ప్రాంతాలను ఆధ్యాత్మిక అనుభూతి కలిగించేలా తీర్చిదిద్దారు.ఆలయంపైభాగాన మహద్వారం గేట్‌పైన వైకుంఠంలో శ్రీమహావిష్ణువు కొలువైనట్లు అద్భుతంగా తీర్చిదిద్దారు. వైకుంఠ ఏకాదశి పర్వదినాన పలువురు సినీప్రముఖులు ప్రముఖ నటుడు చిరంజీవి కుటుంబసభ్యులు, సినీనటుడు రాజేంద్రప్రసాద్, సినీనటుడు బాలకృష్ణ సతీమణి నందమూరి వసుంధర, నారారోహిత్,శివాజీ, శ్రీలీల,నటి హేమ, సినీనిర్మాతలు దానయ్య, బండ్ల గణేశ్, ఇండియన్‌క్రికెటర్ తిలక్‌వర్మ, సూర్యకుమార్‌యాదవ్, చాముండేశ్వరినాథ్, సామాన్యభక్తులు వెంకన్న దర్శనంతో బాటు వైకుంఠద్వార దర్శనం ప్రశాంతంగా చేసుకున్నారు. రాత్రి వరకు 55వేలమంది భక్తులకు మహాలఘులో దర్శనం కల్పించారు. రు.



శ్రీవారి వైకుంఠద్వార దర్శనంలో సినీ ప్రముఖులు

## వైకుంఠ ఏకాదశి సందర్భంగా మాజీ సిఎం జగన్ శుభాకాంక్షలు

**విజయవాడ,డిసెంబరు 30,ప్రభాతవార్తప్రతినిధి:** వైకుంఠ ఏకాదశి సందర్భంగా .మంగళవారం వైసిపి అధినేత వైఎస్.జగన్ మోహన్‌రెడ్డి తెలుగు ప్రజలకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఆ వైకుంఠవాసుడి ఆశీస్సులు అందరిపై ఉండాలని కోరుకుంటూ.. తెలుగు ప్రజలందరికీ వైకుంఠ ఏకాదశి శుభాకాంక్షలు అంటూ తన ఎక్స్ ఖాతా ద్వారా జగన్ పోస్టు పెట్టారు.

## దేవాదాయ ధర్మాదాయ శాఖ సలహాదారుగా చుండూరి సీతారామాంజనేయ ప్రసాద్ నియామకం



**విజయవాడ,డిసెంబరు 30,ప్రభాత వార్తప్రతి నిధి:** చుండూరి సీతారామాంజనేయ ప్రసాద్‌ను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయ శాఖ సలహాదారుగా రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు ప్రభుత్వం అధికారికంగా ఉత్తర్వులు జారీ చేసింది. పదవీ బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి ఆయన రెండేళ్ల పాటు ఈ పదవిలో కొనసాగుతారు. ఒంగోలులో జన్మించి, అక్కడే విద్యాభ్యాసం పూర్తి చేసిన సీతారామాంజనేయ ప్రసాద్ చిన్నతనం నుంచే ఆధ్యాత్మిక భావాలతో పెరిగారు. యువకుడిగా ఉన్నప్పుడే అనేక ఆధ్యాత్మిక కార్యక్రమాలను నిర్వహిస్తూ గుర్తింపు పొందారు. 2014-19 మధ్య కాలంలో తెలుగుదేశం పార్టీ ప్రభుత్వ హయాంలో దేవాదాయ శాఖ పరిధిలోని హిందూ ధర్మ పరిరక్షణ ట్రస్ట్ (హెచ్‌డీపీటీ) ఛైర్మన్‌గా ఆయన సేవలందించారు. ఆ సమయంలో రాష్ట్రంలోని అనేక దేవాలయాల జీర్ణోద్ధరణ చేపట్టడంతో పాటు, పలు ప్రాంతాల్లో కోటి దీపోత్సవం, దశ సహస్ర సువాసినీ పూజ వంటి విశిష్ట కార్యక్రమాలను నిర్వహించారు.

## అజ్ఞాతంలోకి వైసిపి నేత వల్లభనేని వంశీ

**విజయవాడ,డిసెంబరు 30,ప్రభాత వార్తప్రతి నిధి:** గన్నవరం మాజీ ఎమ్మెల్యే, వైసీపీ కీలక నేత వల్లభనేని వంశీ అజ్ఞాతంలోకి వెళ్ళిపోయారు. ఈ అంశం తాజాగా రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమైంది. కొన్ని రోజులుగా ఆయన ఎవరికీ అందుబాటులోకి రాకుండా అండర్‌గ్రౌండ్‌లోకి వెళ్లినట్లు తెలుస్తోంది. విజయవాడలోని మాచవరం పోలీసులు తనను ఏ క్షణమైనా అరెస్టు చేసే అవకాశం ఉందన్న అనుమానంతోనే ఆయన అందుబాటులోకి లేకుండా పోయినట్లు భావిస్తున్నారు. ఈ నెల 17న విజయవాడ మాచవరం పోలీస్ స్టేషన్‌లో నమోదైన హత్యాయత్నం కేసులో వంశీని ప్రధాన నిందితుడిగా (ఏ1) పోలీసులు చేర్చారు.



## వైకుంఠ ఏకాదశి పర్వదినాన ఆలయాలకు పోటెత్తిన భక్తజనం

- తెల్లవారుజామునుంచే భక్తులు బారులు
- ప్రత్యేక పూజలు, గ్రామోత్సవాల నిర్వహణ

**విజయవాడ, డిసెంబరు 30 ప్రభాతవార్త ప్రతినిధి:** వైకుంఠ ఏకాదశి వేడుకలు రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా జరిగాయి. ధనుర్మాసంలో వచ్చే వైకుంఠ ఏకాదశికి ప్రత్యేక విశిష్టత వుందనీ, ఈ రోజున విష్ణుమూర్తి వైకుంఠ ద్వారాలు తెరుస్తారనీ, ఆయనను దర్శించుకుంటే మోక్షం లభిస్తుందని భక్తుల నమ్మకం, స్వర్గద్వార ఏకాదశి అని కూడా పిలిచే ఈ రోజునే మహావిష్ణువు గరుడ వాహనంపై మూడు కోట్ల దేవతలతో భూలోకానికి వచ్చి భక్తులకు దర్శనమిస్తారని పురాణాలు చెబుతున్నాయి.. తెల్లవారుజాము నుంచే వైష్ణవాలయాలకు భక్తులు భారీగా తరలివచ్చారు. వైకుంఠ ఏకాదశి సందర్భంగా కడప జిల్లాలోని ఆలయాలు తెల్లవారు జామున నుంచే భక్తులతో రద్దీగా మారాయి. కడపలోని తిరుమల తొలిగడప దేవుని కడప శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయం, ఒంటిమిట్ట శ్రీ కోదండరామయ్య స్వామి ఆలయాలకు తెల్లవారుజామున రెండు గంటల నుంచే భక్తులు పోటెత్తారు. ఉత్తర ద్వార దర్శనం ద్వారా స్వామివారిని దర్శించుకుని పునీతులయ్యారు. భక్తులకు ఇబ్బందులకు కలగకుండా నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. జమ్మలమడుగులోని శ్రీ నారాపుర వెంకటేశ్వరస్వామి దేవాలయంలో భక్తుల సందడి నెలకొంది. ఆలయ పూజారులు వైకుంఠ ఏకాదశి విశిష్టతను భక్తులకు తెలియజేశారు. కోనసీమ తిరుమలగా పేరుగాంచిన ఆత్రేయపురం మండలం వాడపల్లి వెంకటేశ్వర స్వామి ఆలయంలో వైకుంఠ ఏకాదశి వేడుకలు ఘనంగా జరిగాయి. ఆలయాన్ని వివిధ రకాల పుష్పాలతో అందంగా అలంకరించారు. భక్తులు వేల సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. అనంతపురం జిల్లా రాయదుర్గం కోటలో వెలసిన సుప్రసిద్ధ శ్రీదేవి భూదేవి సమేత శ్రీ ప్రసన్న వెంకటేశ్వరస్వామికి అర్చకులు వేదమంత్రోచ్ఛరణల నడుమ ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీవారిని దర్శించుకోవడానికి భక్తులు పెద్ద ఎత్తున బారులు తీరారు. ఉరవకొండ శ్రీవెంకటేశ్వరస్వామి,



బెలుగుప్ప మండలం శ్రీరంగాపురం రంగనాథస్వామి ఆలయాల్లో వైకుంఠ ఏకాదశి వేడుకలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. పెద్ద సంఖ్యలో భక్తులు తరలివస్తుండడంతో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు చర్యలు చేపట్టారు. ప్రకాశం జిల్లాలోని యర్రగొండపాలెం, కనిగిరి, పామూరు మండలాల్లోని ఆలయాలు గోవిందా నామస్మరణతో మార్మోగాయి. విష్ణుమూర్తి ఉత్తర ద్వారం ద్వారా ప్రత్యేక అలంకరణతో భక్తులకు దర్శనమిచ్చారు. నందిగామలోని శ్రీ రామలింగేశ్వర స్వామి దేవాలయం, తిరువూరు శ్రీ కోదండ రామాలయం, జగ్గయ్యపేటలోని దేవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. పెనుగంచిప్రోలులోని శ్రీ తిరుపతమ్మ అమ్మవారి దేవాలయంలో ఉత్తరద్వార దర్శనానికి జనం పోటెత్తారు. భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. ముక్కోటి ఏకాదశిని పురస్కరించుకుని పట్టణాలు, గ్రామాల్లోని వెంకటేశ్వరస్వామి ఆలయాలు ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి.

## శివలింగాన్ని ధ్వంసం చేసిన ఘటనపై సిఎం ఆరా.. నిందితులను కఠినంగా శిక్షించాలని ఆదేశాలు

**గుంటూరు, డిసెంబర్ 30, ప్రభాతవార్త ప్రతినిధి:** అంబేద్కర్ కోనసీమ జిల్లా ద్రాక్షారామంలో గుర్తు తెలియని వ్యక్తులు శివలింగాన్ని ధ్వంసం చేయడంపై స్పందించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు.దేవదాయ శాఖా మంత్రి ఆనం రామనారాయణ రెడ్డితో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు..శివలింగం ధ్వంసం ఘటనపై తాను జిల్లా ఎస్పీ, కలెక్టర్ తో పాటు జిల్లా మంత్రితో మాట్లాడినట్లు మంత్రి ఆనం తెలిపారు. నిందితులను గుర్తించేందుకు ప్రత్యేక పోలీసు బృందాలను ఏర్పాటు చేసినట్లు ఆనం సిఎంకు వివరించారు. ఈ ఘటనకు బాధ్యులైన వారిని గుర్తించి కఠినంగా శిక్షించాలని సీఎం ఆదేశాలు జారీ చేశారు. ఘటనపై జరుగుతున్న దర్యాప్తు వివరాలను తనకు ఎప్పటికప్పుడు తెలియజేయాలని సీఎం పేర్కొన్నారు. ధ్వంసమైన శివలింగం స్థానంలో నూతన శివలింగం పునఃప్రతిష్ఠ చేసినట్టుచవేదపండితులు, అర్చకులతో శాస్త్రోక్తంగా పునః ప్రతిష్ట చేపట్టినట్టు మంత్రి ఆనం వెల్లడించారు. దేవాదాయ శాఖ అధికారుల సమక్షంలో కార్యక్రమం నిర్వహించినట్టు మంత్రి ఆనం సిఎంకు వివరించారు.

## అంతర్ రాష్ట్ర బ్యాగ్ లిఫ్టింగ్ ముఠా అరెస్ట్

**కడప క్రైం, డిసెంబరు 30, ప్రభాతవార్త:** కడప జిల్లాలో బస్సులు, బస్సు స్టాండ్లు మరియు ఆటోలలో ప్రయాణికులను లక్ష్యంగా చేసుకొని బ్యాగ్ లిఫ్టింగ్‌కు పాల్పడుతున్న అంతర్‌రాష్ట్ర దొంగల ముఠాను ఎర్రగుంట్ల పోలీసులు అరెస్టు చేశారు. ఈ కేసులో భారీగా దొంగ సొత్తును స్వాధీనం చేసుకున్నట్లు కడప జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ మంగళవారం స్థానిక పోలీస్ కాన్ఫరెన్స్ హాలులో మీడియా సమావేశంలో తెలిపారు. ఎర్రగుంట్ల, ముద్దనూరు, ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, మైదుకూరు, బద్వేలు తదితర ప్రాంతాల్లో చోరీలకు పాల్పడిన ముఠా సభ్యుల నుంచి రూ.75లక్షలు విలువైన బంగారు, వెండి వస్తువులు స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు. ప్రస్తుతం ఈ ముఠాపై 23 కేసులు చేధించడం జరిగిందని ఎస్పీ పేర్కొన్నారు. గత 10 సంవత్సరాలుగా గుంట్లూరు, శ్రీకాకుళం, నెల్లూరు, నంద్యాల, తూగో, కాకినాడ, బీఆర్ అంబేద్కర్ తదితర జిల్లాల్లో అనేక కేసులు నమోదయ్యాయన్నారు. పోషమ్మపై 15 కేసులు, ఆమె భర్త పోతురాజుపై 42 కేసులు, రావుల లక్ష్మీ అలియాస్ అంబటి సీత అలియాస్ పిచ్చిలక్ష్మిపై సుమారు 10 కేసులు ఉన్నాయన్నారు.

## ఎక్సైజ్ హెడ్ కానిస్టేబుల్ కుటుంబానికి రూ.1 కోటి పరిహారం అందజేసిన సిఎం



**విజయవాడ డిసెంబర్ 30,ప్రభాతవార్తప్రతినిధి :** విధి నిర్వహణలో ప్రమాదవశాత్తు మృతి చెందిన ఎక్సైజ్ శాఖ హెడ్ కానిస్టేబుల్ పిచ్చేశ్వర రావు కుటుంబానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రూ.1 కోటి పరిహార చెక్కును అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వం–స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మధ్య 2025 మార్చిలో కుదిరిన అవగాహన ఒప్పందం ప్రకారం అమలులో ఉన్న ఎస్‌బీఐ బీమా పథకం కింద ఈ పరిహారం మంజూరైంది. ఒప్పందం తర్వాత ఈ పథకం ద్వారా పరిహారం అందజేయడం ఇదే తొలిసారి. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మృతుడి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కుటుంబ సభ్యుల్లో అర్హులైన వారికి కారుణ్య నియామకం కల్పిస్తామని తెలిపారు. ఎక్సైజ్ శాఖను ప్రభుత్వం ఏర్పడిన తక్కువ సమయంలోనే పునఃవ్యవస్థీకరించి, సమర్థంగా ముందుకు నడిపించినందుకు ముఖ్యమంత్రికి ఎక్సైజ్ అధికారులు, ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. శాఖ అభివృద్ధికి సహకరించిన ఎక్సైజ్ మంత్రి కొల్లు రవీంద్రకు, ముఖ్య కార్యదర్శి ముఖేష్ కుమార్ మీనాలను అభినందించారు. ఎక్సైజ్ శాఖ అధికారులను ఉద్దేశించి ముఖ్యమంత్రి మాట్లాడుతూ, అందరూ నిబద్ధతతో పనిచేసి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని కోరారు. ప్రభుత్వ ఆదాయం కన్నా ప్రజల ఆరోగ్యం ఎంతో ముఖ్యమని, ఆ దిశగా చర్యలు తీసుకోవాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సంక్షేమం కోసం ఎస్‌బీఐ ఎస్ జి ఎస్ పి సాలరీ ఖాతా ద్వారా ఇలాంటి విలువైన బీమా ప్రయోజనాలు కల్పించడం అభినందనీయమని ఉద్యోగ సంఘం నేతలు తెలిపారు. ఈ పథకం ద్వారా బాధిత కుటుంబానికి తక్షణ ఆర్థిక భద్రత కలగడం ఎంతో ఉపశమనమని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ కమిషనర్ చెరుకూరి శ్రీధర్, ఎన్ఫోర్స్ మెంట్ డైరెక్టర్ రాహుల్ దేవ్ శర్మతో పాటు ఎక్సైజ్ అధికారుల సంఘం నాయకులు బి. నరసింహులు, కె. కామేశ్వర రావు, ప్రభాకర్ రావు, వెంకట రమణ తదితరులు పాల్గొన్నారు.

## జగన్ అంటేనే ఒక ఫెయిల్యూర్ పొలిటీషియన్ :మంత్రి కొల్లు రవీంద్ర

**విజయవాడ,డిసెంబరు 30,ప్రభాతవార్తప్రతినిధి:** జగన్ అంటేనే ఒక ఫెయిల్యూర్ పొలిటీషియన్ అని మంత్రి కొల్లు రవీంద్ర కీలక వ్యాఖ్యలు చేసారు.మంగళవారం మంత్రి మీడియాతో మాట్లాడుతూ మాజీ సీఎం జగన్ మోహన్ రెడ్డిపై తీవ్రస్థాయిలో విమర్శలు చేసారు. దోచుకోవటం, దౌర్జన్యాలు చేయడం , ప్రజలను మభ్యపెట్టే కార్యక్రమాలు చేయడమే అతని విధానమన్నారు. తన విలాసవంతమైన నివాసం కోసం రిషికొండలో రూ.400 కోట్ల ప్రజల సొమ్ముతో విలాసవంతమైన భవనాన్ని కట్టుకున్నారన్నారు.రుషికొండ భవనానికి, యోగాకి లింకు పెడుతున్నాడు అంటే ఇలాంటి వ్యక్తులు ఉండటం దురదృష్టకరమన్నారు. యోగా అనేది మన సనాతనమైన ఆస్తి అని తెలిపారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ చొరవతో 2014 నుంచి ప్రతి సంవత్సరం దేశంలో ఒక్కో ప్రాంతంలో నిర్వహిస్తున్నారని అన్నారు. వైజాగ్‌లో నిర్వహించిన యోగా డే ఖర్చు రూ.18 కోట్లు అని.. దానిని కేంద్ర ప్రభుత్వమే భరిస్తుందన్నారు. యోగా వల్ల ప్రజల మానసిక శారీరక ఆరోగ్యం మెరుగుపడుతుందని అన్నారు. ఏపీ ప్రభుత్వం నెల రోజుల పాటు యోగాపై ప్రజలకు అవగాహన కల్పిస్తే, అవగాహన లేని జగన్ దానిని రాజకీయం చేయాలని చూస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. జగన్ గురించి ఏం మాట్లాడాలో అర్థం కావట్లేదన్నారు. అతనికి ప్రజలే తగిన తీర్పునిచ్చారని తెలిపారు. స్టీల్ ప్లాంట్‌ను మరలా రివైజ్ చేస్తున్నామన్నారు. లాభాలలో నడుస్తోందని అన్నారు. అభివృద్ధి చేస్తున్నా ప్రజలను తప్పుదోవ పట్టించే దుర్మార్గమైన మనస్తత్వం కలిగిన వ్యక్తిగా జగన్ ఉన్నారంటూ విరుచుకుపడ్డారు. ప్రజల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రాష్ట్రం అభివృద్ధి చెందటం జగన్మోహన్ రెడ్డికి ఇష్టం లేదన్నారు.

## వైకుంఠ ఏకాదశి సందర్భంగా సిఎం చంద్రబాబు శుభాకాంక్షలు

**విజయవాడ,డిసెంబరు 30,ప్రభాతవార్తప్రతినిధి:** వైకుంఠ ఏకాదశ పవిత్ర దినాన్ని తెలుగు వారు భక్తి ప్రపత్తులతో జరుపుకుంటారు. ఈ సందర్భంగా తెలుగు ప్రజలకు సీఎం చంద్రబాబు నాయుడు శుభాకాంక్షలు తెలిపారు. శ్రీమహావిష్ణువుకు అత్యంత ప్రీతిపాత్రమైన వైకుంఠ ఏకాదశి పర్వదినం సందర్భంగా తెలుగు ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ పర్వదినాన ఉత్తర ద్వార దర్శనం చేసుకుంటే సకల పుణ్యాలు లభిస్తాయని పురాణాలు చెబుతున్నాయన్నారు. పవిత్రమైన ఈ పండుగ సందర్భంగా అందరికీ మంచి జరగాలని ప్రార్థిస్తూ శుభాకాంక్షలు చెప్పారు. ఈ మేరకు తన ఎక్స్ ఖాతా ద్వారా సీఎం చంద్రబాబు నాయుడు శుభాకాంక్షలు తెలియజేశారు.ఏడాదిలో తొలి ఏకాదశి, వైకుంఠ ఏకాదశి అత్యంత పవిత్రమై రోజులు. ఈ రోజులను ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగు ప్రజలు పర్వదినాలుగా భావిస్తారు. ఇక తొలి ఏకాదశి ఆషాడ మాసంలో వస్తే.. వైకుంఠ ఏకాదశి పుష్యమాసంలో వస్తుంది. ఈ వైకుంఠ ఏకాదశి రోజున మహావిష్ణువు గరుడ వాహనంపై మూడు కోట్ల దేవతలతో కలిసి భూలోకానికి దిగి వచ్చి భక్తులకు దర్శనమిస్తాడని చెబుతారు.


పత్రికా ప్రకటన
భారత ప్రభుత్వం
పౌర విమానయాన మంత్రిత్వ శాఖ
రైల్వే భద్రతా కమిషన్

PUB/1674

29.12.2025న విజయవాడ (BZA) డివిజన్ యొక్క VSKP BZA సెక్షన్‌లో ఎలమంచిలి (YLM) స్టేషన్ వద్ద TR NO. 18189 (TATA-ERS) UP ఎక్స్‌ప్రెస్‌పై అగ్ని సంఘటనకు సంబంధించిన విషయమై చట్టబద్ధమైన విచారణ చేపట్టబడుతుంది.

పౌర విమానయాన మంత్రిత్వ శాఖ నుండి సికింద్రాబాద్, దక్షిణ మధ్య రైల్వే రైలు భద్రతా కమిషనర్ శ్రీమతి మాధవి, పై సంఘటనకు సంబంధించిన చట్టబద్ధమైన విచారణను 31.12.2025 మరియు 01.01.2026న "ఎలక్ట్రిక్ ట్రాక్షన్ ట్రైనింగ్ సెంటర్ (ETTC), విజయవాడ" వద్ద నిర్వర్తిస్తారు.

పై ప్రమాదానికి సంబంధించిన ఎరుకగల ప్రజానీక సభ్యులు మరియు అక్కడితో సంబంధించిన ఆ విషయాలతో తెలిసినవారు మరియు సాక్ష్యం ఇవ్వదలచిన కోర్కెగల వారు విచారణ యొక్క తేదీన పై ప్రదేశం వద్ద ఆ విధంగా చేయవచ్చును. లేదా ఈ క్రింది అధికారయుత చిరునామాకు ఆమెకు లిఖితపూర్వకంగా వ్రాయవచ్చును.

ది కమిషనర్ ఆఫ్ రైల్వే సేఫ్టీ, సౌత్ సెంట్రల్ సర్కిల్, రైల్ నిర్మాణ్ భవన్, సరోజినీ దేవీ రోడ్, సికింద్రాబాద్ 500025 లేదా వారిని ఫోన్ నంబర్ 040-27820104 పై కాంటాక్ట్ చేయవచ్చును.

చీఫ్ పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్
వారిచే జారీ చేయబడింది
దక్షిణ మధ్య రైల్వే

A2130


## స్థానిక సంస్థలకు 15వ ఆర్థిక సంఘం నిధులు ఆంక్షలు లేకుండా చూడండి

**రాష్ట్ర సర్పంచుల సంక్షేమ సంఘం ముఖ్య సలహాదారు డాక్టర్ జాస్తి వీరాంజనేయులు**

**విజయవాడ,డిసెంబరు 30,ప్రభాతవార్తప్రతినిధి:** స్థానిక సంస్థలకు 15వ ఆర్థిక సంఘం నిధులు ఆంక్షలు లేకుండా చూడాలని ఆంధ్రప్రదేశ్ సర్పంచుల సంక్షేమ సంఘం ముఖ్య సలహాదారు డాక్టర్ జాస్తి వీరాంజనేయులు విజ్ఞప్తి చేసారుజ.రాష్ట్రవ్యాప్తంగా సర్పంచ్ ల సమస్యలను శశి భూషణ్ కుమార్ కు తెలియజేస్తూ వినతి పత్రాన్ని అందజేశారు ప్రధానంగా ఇటీవల రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ ముఖ్య కార్యదర్శి కార్యాలయం నుంచి వచ్చిన ఉత్తర్వుల ప్రకారం ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ మరియు గ్రామీణ అభివృద్ధి శాఖ కమిషనర్ 15 వ ఆర్థిక సంఘం నిధుల వినియోగం పైన తదుపరి ఆదేశాలు వచ్చేవరకు కరెంటు బకాయిలు గ్రీన్ అంబాసిడర్ జీతాలు చెత్త సేకరణ వాటికి ఖర్చు పెట్టాలని ఆదేశాలు ఇచ్చిన దృష్ట్యా రాష్ట్ర వ్యాప్తంగా సర్పంచులు ఆందోళనలో ఉన్న విషయాన్ని ప్రత్యేక ప్రధాన కార్యదర్శి దృష్టికి తీసుకువెళ్లారు ఆదేశాలను సడలించాలని గతంలో మాదిరిగానే చేసిన పనులకు అంగన్వాడి భవనాలకు సీసీ రోడ్లకు, సైడ్ డ్రయిన్స్ కు విద్యుత్ పరికరాల కొనుగోలు రిపేర్లు, మోటార్ రిపేర్లకు వాడుకునే విధంగా ఆదేశాలు జారీ చేయాలని డాక్టర్ జాస్తి వీరాంజనేయులు వినతిపత్రాన్ని ఇచ్చారు. గత 25 రోజులుగా రాష్ట్రవ్యాప్తంగా గ్రామపంచాయతీలలో సాధారణ నిధులు కూడా బిల్లులు పాస్ కాకుండా ఉన్న విషయాన్ని కూడా ప్రత్యేక ప్రధాన కార్యదర్శి తో చర్చించారు ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ మరియు గ్రామీణ అభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శశిభూషణ్ కుమార్ మాట్లా డుతూ సాధారణ నిధులు బిల్లులు పాస్ అయ్యే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు వినతి పత్రాన్ని పరి శీలించి చర్యలు తీసుకుంటామన్నారు.


AMARAVATI GROWTH AND INFRASTRUCTURE CORPORATION LTD.
Project Office, Rayapudi, Amaravati, AP - 522 237

**Employment Notification No.3/2025, Dt. 30.12.2025**

Notification is hereby issued for engagement of services in AGICL, Amaravati on Deputation/contract basis. **From Sl. No. 1 to Sl. No. 10 on Deputation/contract basis. From Sl. No. 11 to Sl. No. 18 on contract basis only.** Online application is available in the APCRDA & AGICL website in careers tab and can be submitted **from dt.31.12.2025 to dt.19.01.2026.** For further details, please visit **https://crda.ap.gov.in & www.agicl.org**

| Sl. No | Name of the Post | Nos |
|---|---|---|
| 1 | Chief Eng-1 (Civil) | 1 |
| 2 | EE- (Civil) | 2 |
| 3 | DE- (Civil) | 2 |
| 4 | AE- (Civil) | 5 |
| 5 | AE- (Mechanical) | 1 |
| 6 | AE- (Electrical) | 1 |
| 7 | Environment Engineers | 2 |
| 8 | Manager Lands | 2 |
| 9 | Asst. Manager Lands | 2 |
| 10 | Peshi - MD AGIC | 2 |
| 11 | GIS & Remote sensing | 2 |
| 12 | Surveyor (Outsource), DGPS, GPS | 2 |
| 13 | IT | 1 |
| 14 | DEO | 5 |
| 15 | Receptionist | 1 |
| 16 | Attenders | 4 |
| 17 | Admin Officer | 1 |
| 18 | Executive Assistants - MD Support | 2 |

**Sd/- Managing Director, AGICL, Amaravati.**

వార్త

అంతరంగపు ఓటమి తప్పితే, మరెలాంటి ఓటమి లేదు. ఉద్దేశపరమైన అంతరంగిక బలహీనత తప్ప మనం దాటలేని అడ్డంకులంటూ ఏమీ లేవు.

-ఎమర్సన్

# పతనం అంచుకు ప్రజారోగ్యం?

జనారోగ్యమే జాతి మహాభాగ్యమనే లక్ష్యంతో దేశప్రజలను సంపూర్ణ ఆరోగ్యవంతులుగా చేసేందుకు స్వాతంత్య్రం వచ్చినప్పటి నుండి అనేక పథకాలు ప్రవేశపెట్టారు. లక్షలాది కోట్లరూపాయలు ఖర్చుచేశారు. చేస్తూనే ఉన్నారు. అటు కేంద్ర ప్రభుత్వం కానీ, ఇటు ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు కానీ ప్రజలను అనారోగ్యం భారి నుండికాపాడేందుకు శక్తిమేరకు కృషి చేస్తూనే ఉన్నట్లు చెబుతున్నారు. ఇందుకోసం దేశవ్యాప్తంగా లక్షలాది మంది వైద్యసిబ్బందిని కూడా నియమించారు. మన రాజ్యాంగ నిర్మాతలు ప్రజారోగ్యం విషయంలో పాలకులు తీసుకోవాల్సిన చర్యల గూర్చి రాజ్యాంగంలో స్పష్టంగా పేర్కొన్నారు. స్వాతంత్య్రం వచ్చి దాదాపు ఎనిమిది దశాబ్దాలు కావస్తున్నా అందరికి కనీస ఆరోగ్య వసతులు కల్పించడంలో పాలకులు విఫలమవుతున్నారనే చెప్పొచ్చు. ప్రజారోగ్యంపై రోగాల దాడులు కొనసాగుతూనే ఉన్నాయి. కొన్ని వ్యాధులను కొందరు వ్యక్తులు తమకు తాముగా తెచ్చుకొని సమాజంపై వదులుతుంటే మరికొన్ని ప్రకృతి విసురుతున్నట్లుగాచెప్పొచ్చు. ఇవన్నీ కలిసి ప్రజారోగ్యంపై దాడులు కొనసాగిస్తూనే ఉన్నాయి. ముఖ్యంగా గిరిజనప్రాంతాల్లో నేటికీస్వాతంత్య్రం పూర్వం ఉన్న పరిస్థితిని గుర్తు తెస్తున్నాయి. ఇప్పటికీ దారుల్లేక డోలీ కట్టుకొని రోగులను మోసుకుపోవాల్సిన పరిస్థితుల నుంచి బయటపడలేకపోతున్నారు. సకాలంలో వైద్యసహాయం అందక ఎందరు మరణిస్తున్నారో లెక్కలకే అందదు. ఇక వ్యాధులు కూడా రకరకాలుగా విస్తరిస్తున్నాయి. ఎంతో ఆధునిక విజ్ఞానం సముపార్జించుకున్నామని విర్రవీగే మానవజాతిపై ప్రకృతి విసురుతున్న సవాళ్లకు వారూ వీరు అని తేడా లేకుండా అందరూ బలైపోతున్నారు. ఆ శక్తి ముందు మానవుడు ఎప్పుడూ తలవంచుకోవాలనే వాస్తవాన్ని చాటుతూ వ్యాధులు ప్రబలిపోతున్నాయి. కొత్త కొత్త మందులు, చికిత్సలు, ఆధునిక పరిజ్ఞానాన్ని సంపాదించుకుంటున్నా అంతకు రెట్టింపుస్థాయిలో కొత్త కొత్త వ్యాధులు వస్తున్నాయి. కోట్లాది మంది రోగ పీడితులుగా మారుతుంటే లక్షలాది మంది ప్రాణాలు వదులుతున్నారు. నిన్నమొన్నటి వరకు ప్రపంచాన్నే గడగడలాడించిన కరోనా బారినపడినవారు వాడిన మందుల ప్రభావం నుండి ఇప్పటికీ కోలుకోలేకపోతున్నారు. ఇటీవల గుండెజబ్బులు పెరిగిపోయాయి. వయస్సుతో సంబంధం లేకుండా పదిహేనేళ్ల వయసు నుంచి అరవైయేళ్ల వరకు గుండెపోటుకు గురై క్షణాల్లో మరణిస్తున్నారు. అయితే ఇందుకు కరోనా నివారణ మందులు కారణమనే ప్రచారాన్ని తాజాగా ఢిల్లీలోని వైద్యనిపుణుల బృందం తోసిపుచ్చింది. ఈ గుండెజబ్బులకు ఆ మందులకు సంబంధం లేదని తమ పరిశోధనల్లో తేలినట్లు వారు స్పష్టంచేశారు. దీంతో ఈ జబ్బులు ఎందుకు ఎక్కువ అవుతున్నాయనేది అర్థంకాకుండా పోతున్నది. అయితే మారిన, మారుతున్న అలవాట్లు, కాలుష్యం లాంటివి ఎన్నోకారణాలు ఉండవచ్చుననే ఊహాలు వెలువడుతున్నాయి. ఇదికాక దోమల నుండి వస్తున్నవ్యాధులు అన్నీఇన్నీకావు. గతంలో వచ్చిన స్వైన్‌ఫ్లూ, ఎబోలా, డెంగ్యూ, చికెన్‌గున్యా, ఒకటేమిటి రకరకాల విషజ్వరాలు విస్తరిస్తూనే ఉన్నాయి. ఇంకొకపక్క చిన్నా, పెద్ద అనే తేడా లేకుండా ప్రాణాంతకమైన కేన్సర్ వ్యాధి చాపకింద నీరులా విస్తరిస్తున్నది. పాలకులు చేస్తున్న ప్రయత్నాలు దీన్ని నివారించలేకపోతున్నాయి. చికిత్స ఉన్నా సకాలంలో ముఖ్యంగా ప్రారంభదశలో ఈ వ్యాధిని గుర్తించగలిగితే నియంత్రించగలుగుతున్నారు. కానీరెండు, మూడు దశలు దాటిపోతే పరలోకానికి పయనం కట్టాల్సిందే. వీటన్నింటి కంటే మించి రకరకాల కారణాలతో కిడ్నీవ్యాధులు ఊహించనిరీతిలో విస్తరిస్తున్నాయి. డయాలసిస్‌కు ప్రభుత్వపరంగా ఏర్పాటు చేసినా అవి అవసరానికి తగినంతగా లేవు. కిడ్నీమార్పిడి అనేది సామాన్యులకు అందుబాటులో లేకుండా పోయిందనే చెప్పొచ్చు. ఇలా రకరకాల వ్యాధుల విస్తరణతో దేశవ్యాప్తంగా ప్రభుత్వ ఆస్పత్రులతోపాటు ప్రైవేట్ దవాఖానాలు కూడా కిటకిటలాడిపోతున్నాయి. అయితే వ్యాధివచ్చిన తర్వాత చికిత్స కంటే రాకుండా ముందుగా జాగ్రత్తలు తీసుకుంటే మంచిదనే అభిప్రాయం అందరూ డాక్టర్లు వ్యక్తం చేస్తున్నారు. వ్యాధుల నుండి రోగనిరోధక శక్తి ఉన్నవారు బయటపడే అవకాశం ఉందని వైద్యనిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఒక్క అల్లోపతి డాక్టర్లే కాదు, ఆయుర్వేదం, హోమియో, తదితర అన్ని విభాగాల డాక్టర్లు వైద్యరంగ నిపుణులు శరీరంలో ఇమ్యూనిటీని పెంచుకోవాలని సలహాలు ఇస్తున్నారు. ఇప్పుడు ఈ విషయం కొత్తగా చెప్పడం లేదు. ఏనాటినుంచో చెప్తున్నారు. అయినా రోగనిరోధక శక్తి ఎందుకు పెంచుకోలేకపోతున్నారు? అందుకు కారణాలేమిటి? కారకులు ఎవరు? తదితర అంశాలను పరిశీలించాల్సిన తరుణమిది. రోగ నిరోధకశక్తి ఒక్కరోజులోనో, వారంలోనో, నెల రోజుల్లోనో పెరిగేదికాదు. బాల్యం నుంచి సమతుల్యమైన మంచి పోషకవిలువలు కలిగిన పౌష్టికాహారం అందించాలి. ఏమేరకు అందిస్తున్నారో ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. పౌష్టికాహార లోపంతో ప్రధానంగా నిరుపేదలు అల్లాడిపోతున్నారు. పౌష్టికాహారం సంగతి దేవుడెరుగు. అర్థాకలితో అలమటిస్తున్నవారు భారత్‌లో కోట్లాది మంది ఉన్నారు. వారిలో రోగనిరోధక శక్తి ఎలావస్తుంది? ఎక్కడి నుంచి వస్తుంది? మద్యపానం లాంటి కొన్ని విధానాలు కూడా ప్రజారోగ్యానికి హాని చేస్తున్నాయి. ప్రజాసంక్షేమమే ధ్యేయమని పదేపదే చెప్పుకునే పాలకులు ప్రజారోగ్యాన్ని పణంగా పెట్టి ధనార్జనచేయడం ఎంతవరకు సమంజసమో ఆలోచించాలి. ఇప్పటికైనా పాలకులు మనసుపెట్టి ఆలోచించాలి. అలాగే ప్రజారోగ్య సంరక్షణ బాధ్యత ప్రభుత్వంపై మాత్రమే వదలకుండా ప్రజలు స్వచ్ఛంద సంస్థలు కూడా ఈ యజ్ఞంలో పాలుపంచుకోవాలి.

కోపం తెలివి తక్కువ తనంతో ప్రారంభమై, పశ్చాత్తాపంతో అంతం అవుతుంది.



తిరుక్కురళ్

జీవించడం వల్ల గొప్పగా ఏదీ గణనలోకి రాదు. కాని మన అల్పకాలపు జీవితంలో మనం ఏ చేశాం అన్నదే గణనలోకి వస్తుంది.



నెహ్రూ

# వ్యక్తిగత స్వేచ్ఛకు కట్టుబాట్లు అవసరం

*మగవారికైనా, ఆడవారికైనా విచ్చల విడితనం తప్పు. అదిసమాజాన్ని కలుషితం చేస్తుంది. కలుషితమైన సమాజంలో మన కుటుంబాలు సురక్షితంగా జీవించగలుగుతాయా? ఆలోచించండి. ఇది పాతకాలంనాటి మనస్తత్వంతో చేసే వాదన కాదు. మనిషి సమాజంలో సురక్షితంగా జీవించడానికి కొన్ని కట్టుబాట్లు అవసరం. వాటిని అందరూ తప్పక పాటించాలి. స్త్రీ అయినా, పురుషుడైనా సభ్య సమాజం హర్షించే విధంగా వస్త్రాలు ధరించాలి.'నాకు వస్త్రాలు ధరించడం ఇష్టం లేదు. అది నా స్వేచ్ఛ'అని పూర్తిగా దిగంబరులుగా తిరిగితే మనం ఊరుకోగలమా? సమాజ కట్టుబాట్లకు వ్యతిరేకంగా ఎవ్వరూ వ్యస్త్రధారణ చేయకూడదు. సందర్భానుసారంగా వస్త్రాలనుధరించడం అనేది మనసామాజిక సంస్కృతిలో భాగం. భావితరాల సురక్షిత భవిష్యత్తుకు అందించే రక్షణకవచం, వ్యక్తిత్వ వికాసం. అందుకే వస్త్రధారణ అనేది మనిషి వ్యక్తిగత స్వేద కాదు సామాజిక బాధ్యత.*



నునుబోలు రాజశేఖర్

ఇటీవల ఒక సినిమా వేడుకలో 30 ఏళ్లుగా సినీ పరిశ్రమలో అనుభవం ఉన్న ఒక వట్టి సినిమా కథానాయికల వస్త్రధారణపై చేసిన వ్యాఖ్యలు అన్ని సామాజిక మాధ్యమాల్లో ఎలక్ట్రానిక్ మీడియా న్యూస్ ఛానళ్లలో విశేషమైన చర్చకు అంశాలుగా మారాయి. సామాన్యుల నుంచి ప్రముఖ విశ్లేషకుల వరకు ముఖ్యంగా అధిక సంఖ్యలో మహిళలు వివిధ కోణాల్లో తమ అభిప్రాయాలనుసామాజిక మాధ్యమాల ద్వారా వ్యక్తపరుస్తున్నారు. అయితే, కొందరు ప్రముఖులు తమ వాదనలో ఎటువంటి ప్రామాణికత నిర్మాణాత్మకత లేకపోయినా, వస్త్రధారణపై తమ వ్యక్తిగత అభిప్రాయాలను సమాజంపై బలవంతంగా రుద్దాలని ప్రయత్నిస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో స్త్రీ,పురుషులు వస్త్రధారణ ఎలా ఉండాలి అనే అంశంపై స్పష్టత అవసరం. లేకపోతే భావితరాలకు ఒక తప్పుడు సందేశం వెళ్లే ప్రమాదం ఉంది. అందుకే వస్త్రధారణ మూలాలతోపాటు చర్చించి, వస్త్రధారణ విషయంలో నిజాన్ని నిర్భయంగా సమాజానికి చాటి చెప్పాల్సిన అవసరం ఉంది. సమాజంలో మనిషి హాయిగా, ఆనందంగా, సురక్షితంగా జీవించాలంటే కొన్ని కట్టుబాట్లు తప్పనిసరిగా ఉండాలి. మనిషి దిగంబరుడిగా, అనాగరికతతో జీవించే పాత రాతి యుగం నుండి వస్త్రాలు తయారు చేసి, తన శరీరాన్ని పూర్తిగా కప్పుకొని మంచి భాషను నేర్చుకొని నాగరికుడిగా మారిన క్షణంతోనే మానవుని అభివృద్ధి ప్రారంభమైంది. మానవ అభివృద్ధి ప్రారంభమైన కాలాన్నే నాగరిక యుగంగా పిలుస్తారు. ఆ నాగరిక యుగం నుండి మన పూర్వీకులు అవలంబించి మనకు అందించిన సంప్రదాయాలు, కళారూపాలు, భాషసంభాషణ, ఆచరణలు, విలువలు అన్నీ మన సంస్కృతిగా రూపొందాయి. మనిషి కట్టు, బొట్టు, నడవడిక, ప్రవర్తన అన్నీ మనం మన రక్షణకోసం నిర్మించుకున్న సంస్కృతిలో భాగాలే. వస్త్రధారణ కూడా మన సంస్కృతిలో భాగమే. అంతేకాదు, మనిషి వ్యక్తిత్వ వికాసంలో వస్త్రధారణ కూడా ఒక ముఖ్యమైన అంశమే. చేసే వృత్తిని బట్టి, చదివే విద్యను బట్టి, వెళ్లే ప్రదేశాన్ని బట్టి కూడా మన వస్త్రధారణలో మార్పులు చేసుకుంటూ ఉంటాం. ఎందుకంటే మనం ధరించే వస్త్రాలు మన వ్యక్తిత్వాన్ని ఆవిష్కరిస్తాయి. ఏ రకమైన వస్త్రాలు ధరించాలి అన్నది ప్రాంతాన్ని బట్టి, కుటుంబాన్ని బట్టి మారుతుంటుంది. అయితే ఇందులో ముఖ్యమైన విషయం ఏమిటంటే శరీరాన్ని, సిగ్గును కాపాడే విధంగా వస్త్రాలు ధరించడమే ప్రధానమైనది. అది ఏ రకమైన వస్త్రమైనా కావచ్చు. వస్త్రధారణ స్వేచ్ఛకు సంబంధించిన విషయం కాదు. అది సమాజ సంస్కృతిలో ఒక ముఖ్యమైన భాగం. మనిషి వ్యక్తిత్వంలోనూ, సమాజ సంస్కృతిలోనూ ఎంతో కీలకమైన స్థానమున్న వస్త్రాలను నిండుగా ధరించకుండా సమాజంలో తిరగటం స్వేచ్ఛ కాదు. అది ఒక అనాగరిక చర్య. ఇది మళ్లీ నాగరిక ప్రపంచం నుండి మనిషిని అనాగరిక ప్రపంచంవైపు తీసుకెళ్లే ప్రమాదకరమైన వాదన. స్త్రీలపై జరిగే అకృత్యాలకు వస్త్రధారణే కారణమని కచ్చితంగా చెప్పలేము ఎందుకంటే, చాలీచాలని వస్త్రాలు ధరించిన మహిళలపైనే కాదు, సరైనరీతిలో వస్త్రాలు ధరించిన మహిళలపై కూడా లైంగిక దాడులు, వేధింపులు జరుగుతున్నాయి. ఇలాంటి అకృత్యాలకు పాల్పడేవారు మానవత్వాన్ని మరిచి మృగాల్లా ప్రవర్తించే సామాజిక ద్రోహులు. అలాంటి వారిపై ప్రభుత్వాలు కఠిన శిక్షలు విధించాలి. విధిస్తున్నాయి కూడా. అయితే, వస్త్రధారణ ఎలాఉన్నా అకృత్యాలు జరుగుతున్నాయనే కారణంతో మాకు నచ్చినట్లు వస్త్రాలు ధరిస్తాం అనే వాదన చేయడం సమంజసం కాదు. ఇంటికి తాళం వేసినా కూడా దొంగతనాలు జరుగుతున్నాయని, ఇంటికి తాళం వేయడం మానేస్తామా? తాళం వేసిన ఇంటిలో



దొంగతనాల శాతం తక్కువగాఉంటుంది. తాళంవేయని ఇంటిలో దొంగతనాల శాతం ఎక్కువగా ఉంటుంది. కాబట్టి మన ఇంటికి తాళం వేసి ముందు జాగ్రత్త ఎలా తీసుకుంటామో, అదే విధంగా ప్రతి ఒక్కరికి వ్యక్తిగత జాగ్రత్త అవసరం. సమాజంలో పలుకుబడి, రక్షణ వలయాలు ఉన్న స్త్రీలు ఎటు వంటి వస్త్రధారణ చేసిన వారికి భద్రత ఉంటుంది. వారిని చూసి సామాన్యులు కూడా అలాంటి వస్త్రాలను ధరించి సమాజంలో తిరిగితే ప్రతి ఆడపిల్లకు అలాంటి రక్షణ ఉండదు. ప్రభుత్వాలు సైతం ఎంతమందికి రక్షణ కల్పించగలుగుతాయి. అందుకే ఇంటి నుంచి బయటకు వెళ్లే ప్రతి ఆడపిల్ల తన వ్యక్తిగత భద్రతకోసం సమాజానికి అనుగుణంగా, సరిగ్గా వస్త్రాలను ధరించడం ఒక ప్రాథమిక జాగ్రత్త. ఇది నింద కాదు, బాధ్యత. దుష్ట ఆలోచనతో చూసే దృష్టిని మార్చుకోవాలి అన్నది నిజమే కానీ విశ్లేషణ వేదికలపై కూర్చొని చెప్పే ఇలాంటి సందేశాలతో వెంటనే దుష్ప్రభావాలను, వారి దుర్గ ఆలోచనలను మార్చలేం. అందుకే సంస్కారవంతులైన మనమే జాగ్రత్తగా ఉండాలి. 'చూసేవారి దృష్టే తప్పు' అనే వాదంతో మాత్రమే ముందుకు వెళ్లలేం. ఎందుకంటే సమాజంలో మంచిఉన్నట్లే చేదు కూడా ఉంది అనే సత్యాన్ని మనం మర్చిపోవద్దు. సమాజంలోస్త్రీకి అత్యంత ఉత్తమమైనస్థానం ఉంది. అందుకే అలాంటి స్త్రీ వస్త్రధారణపై ఒక్కొక్కసారి ఇలాంటి చర్చలు జరుగుతూ ఉంటాయి. అది స్త్రీ మీద ఉన్న అపారమైన గౌరవంతోనే తప్పా అగౌరవంతోకాదు అని అర్థంచేసుకోవాలి. భారతీయ స్త్రీ కట్టు, బొట్లు, ప్రవర్తన, సంస్కారం ప్రపంచ దేశాలకు ఇప్పటికీ, ఎప్పటికీ ఆదర్శమే. భారతీయ మహిళలలో సుమారు95శాతం మంది గొప్ప వస్త్ర సంస్కృతిని పాటిస్తున్నారు. మిగిలిన ఐదుశాతానికి సంబంధించిన వారితోనే సమస్యలు కనిపిస్తున్నాయి. కుటుంబ వ్యవస్థలోని తల్లిదండ్రుల పెంపకం, విద్యావ్యవస్థలో అందించే విద్యలోని లోపాలుకూడాఇందుకు కారణాలు. ఒక వ్యక్తి మంచి పౌరుడిగా లేదా అసాంఘిక శక్తిగా మారడం వెనుక అతడు పెరిగిన వాతావరణం, పొందిన విద్యకీలక పాత్ర పోషిస్తాయి. చిన్ననాటి నుంచే పిల్లలకు క్రమశిక్షణ, బాధ్యత, మానవీయ విలువలు నేర్పించడంలో తల్లిదండ్రులు, విద్యావ్యవస్థ విఫలమైతే, సమాజానికి హానికరమైన వ్యక్తులు తయారవుతారు. తల్లిదండ్రులు పిల్లలను స్వేచ్ఛపేరుతో నియంత్రణ లేకుండా పెంచడం, తప్పులను సరిదిద్దకుండా కప్పిపుచ్చడం, తప్పు చేసినా సమర్థించడం, అనే పెంపకంలోని లోపాలు పిల్లల్లో చిన్నప్పుడే అసాంఘిక ఆలోచనలకు బీజంవేస్తుంది. అందుకే అసాంఘిక శక్తులను అరికట్టాలంటే శిక్షలతోపాటు బాధ్యతాయుత మైన తల్లిదండ్రుల పెంపకం అవసరం. విద్య అంటే కేవలం మార్కులు సాధించడం మాత్రమేకాదు. నైపుణ్యం, వ్యక్తిత్వ వికాసం, నైతిక విలువలు, సామాజిక బాధ్యతను అలవర్చే ప్రక్రియకూడా. వస్త్రధారణ మన సంస్కృతిలో, వ్యక్తిత్వ వికాసంలో ప్రధాన భాగమే. సమాజానికి హానిచేసే ఏపనైనా స్వేచ్ఛలోకిరాదు. చలి నుంచి, ఎండ నుంచి, దుమ్ముధూళి నుంచి మనల్ని రక్షించేది. మన సిగ్గును కాపాడేదిసరైన వస్త్రధారణే. స్త్రీ అయినా, పురుషుడైనా సభ్య సమాజం హర్షించేదుస్తులనే వేసుకోవాలి. సమాజంలో మన మందరం హాయిగా, ఆనందంగా, సురక్షితంగా జీవించాలంటే స్త్రీ పురుషులు ఇద్దరూ తమపరిధులకులోబడి కట్టుబాటుతో జీవించాలి. సాంకేతికంగా ఎంత అభివృద్ధి సాధించినా మనిషి తన వ్యక్తిత్వాన్ని కోల్పో కూడదు. సమాజ శ్రేయస్సు కోసం సరైన రీతులో వస్త్రాలుధరించండని చెప్పడం ఏ మాత్రం తప్పుకాదు. ఒక సురక్షితమైన సమాజాన్ని నిర్మించగలిగితే అందులో మనం, మన కుటుంబంహాయిగా జీవించగలుగుతుంది. మగవారికైనా, ఆడ వారికైనా విచ్చల విడితనం తప్పు. అది సమాజాన్ని కలుషితం చేస్తుంది. కలుషితమైన సమాజంలో మన కుటుంబాలు సురక్షితంగా జీవించగలుగుతాయా? ఆలోచించండి. ఇది పాతకాలంనాటి మన స్తత్వంతో చేసే వాదన కాదు. మనిషి సమాజంలో సురక్షితంగా జీవించడాని కి కొన్ని కట్టుబాట్లు అవసరం. వాటిని అందరూ తప్పక పాటించాలి. స్త్రీ అయినా, పురుషుడైనా సభ్యసమాజం హర్షించే విధంగా వస్త్రాలు ధరించాలి. 'నాకు వస్త్రాలు ధరించడం ఇష్టం లేదు. అది నా స్వేచ్ఛ' అని పూర్తిగా దిగంబరులుగా తిరిగితే మనం ఊరుకోగలమా? సమాజ కట్టు బాట్లకు వ్యతిరేకంగా ఎవ్వరూ వస్త్రధారణ చేయకూడదు. సందర్భానుసారంగా వస్త్రాలనుధరించడం అనేది మనసామాజిక సంస్కృతిలో భాగం. భావితరాల సురక్షిత భవిష్యత్తుకు అందించే రక్షణకవచం, వ్యక్తిత్వ వికాసం. అందుకే వస్త్రధారణ అనేది మనిషి వ్యక్తిగత స్వేచ్ఛకాదు సామాజిక బాధ్యత. ●

# కొంపముంచుతున్న ఆన్‌లైన్ గేమ్స్

బుగ్గన మధుసూదనరెడ్డి

ఈ మధ్య కాలంలో మీడియాలో వచ్చిన ఒక వార్త తీవ్ర ఆందోళనకు కలిగించేలా వుంది. అదేమిటంటే ఒక ఆన్‌లైన్ గేమ్‌ను డౌన్‌లోడ్ చేసుకొని మరీ ఆడిన డిగ్రీ చదువుతున్న విద్యార్థి ఏకంగా ఏదోఅవసరం నిమిత్తమై తమ తల్లిదండ్రులు తన ఖాతాలోకి బదిలీ చేసిన 95 లక్షల రూపాయలను పోగొట్టుకున్న తీరును చూస్తుంటే ఈ సమాజంలోని యువత ఎలా చెడు, వక్రమార్గంలో పయనిస్తున్నారో ఇట్టే ఊహించవచ్చు. అంతేకాదు ఈ బాధాకరమైన సంఘటనకు కేవలం ఆ విద్యార్థిని ఒక్కడినే బాధ్యున్ని చేయలేం. ఎందుకంటే ఈ సంఘటనలో తమ పిల్లల అలవాటును పసిగట్టలేక అత్యంత నిద్రాణావస్థలో కూరుకుపోయి, బాధ్యతారాహిత్యంతో వ్యవహరించిన వారి తల్లిదండ్రుల ఘోర తప్పిదం కూడా అందులో దాగి వుంది. ముఖ్యంగా చేతులు కాలిన తరువాత ఆకులు పట్టుకునే కన్నా ముందుగానే మేల్కొని ప్రతి ఒక్క విద్యార్థి తల్లిదండ్రులు తమ పిల్లల వ్యవహారశైలిపై, వారి అలవాట్లపై ఎల్లవేళలా ఒక కన్నేసి ఉంచాలి. ఎందుకంటే ఈ మధ్యకాలంలో ఊహకు కూడా అందనంత రీతిలో టెక్నాలజీ తుఫాన్ వేగంతో కొత్త పుంతలు త్రొక్కుతున్న నేపథ్యంలో ఒక వైపుఅలాంటి టెక్నాలజీ మన దేశాభివృద్ధికి ఎంతగానో ఉపయోగపడుతున్నప్పటికీ, మరోవైపు విద్యార్థుల ఉజ్వల భవితకు, ఎదుగుదలకు ఒక శనిలా, శాపంలా ఆన్‌లైన్ గేమ్‌ల రూపంలో ఈ టెక్నాలజీ మాయ పరిణమించడం అత్యంత దురదృష్టకరమైన విషయం. కాబట్టి ఇప్పటికైనా మించిపోయింది లేదు ఆలస్యం అమృతం విషంలాగా పరిస్థితి తలెత్తకుండా ప్రతి ఒక్క విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లల పట్ల, ముఖ్యంగా వారి స్నేహితుల విషయంలో అత్యంత జాగరుకతతో వ్యవహారించాలి. తమ పిల్లలు మంకు పట్టు పడుతున్నారనో, వారికి బోర్ కొడుతుందనో వారి చేతికి పొరపాటున స్మార్ట్ ఫోన్ అందించి చేతులు దులుపుకున్నారు అంటే మాత్రం ముమ్ముందు భారీ మూల్యం చెల్లించక తప్పదు అనే విషయాన్ని ప్రతి ఒక్క విద్యార్థుల తల్లిదండ్రులు ఎంతో వివేకం తో, పరిణతితో ఒక్కసారి ఆలోచించాలి. ఎలాగంటే ఈ పాటికే స్మార్ట్ ఫోన్‌ల వల్ల విద్యార్థులు ఎంతగా తమ చదువు సంధ్యలను, జ్ఞానాన్ని కోల్పోతున్నారో, ఎలా ఏ రీతిలో వారి అమూల్యమైన జీవితాలను భ్రష్టుపట్టించుకుం టున్నారో అందుకు సంబంధించి ఇటీవల మీడియాలలో వచ్చిన పలు వార్తలు మన కళ్లముందు సాక్షాత్కరిస్తూనే వున్నాయి అనేది ఎవరు కాదనలేని జగమెరిగిన సత్యం. ఏదిఏమైన ఇదివరకటి కంటేకూడా విద్యార్థుల తల్లిదండ్రు లు తమ పిల్లల నడవడికపై, వారి తీరు తెన్నులపై గట్టి నిఘాను పెట్టాల్సిన తరుణం ఆసన్నమైంది. తమ పిల్లలను నిరంతరం కనిపెట్టుకొని ఉండటం కోసంవిద్యార్థుల తల్లిదండ్రులు తమకు ఎన్ని పనులు, బాధ్యతలు ఉన్నప్పటికీ వాటిని కాస్త ప్రక్కకు పెట్టి పిల్లల ఎదుగుదల కోసం, వారి ఉజ్వల భవిష్యత్ కోసం రోజులో కనీసం కొంత సమయాన్ని వారికి కేటాయించక తప్పని పరిస్థితి. నేటి పిల్లలే రేపటి బాధ్యతగల పౌరులుగా నిలిచి ఈ యావత్తు దేశ ప్రజలు మెచ్చేలా నిలువాలంటే మాత్రం ఈ ఆన్‌లైన్ గేమ్‌ల వాసన కూడా తమ పిల్లల దరిచేరకుండా ప్రతి ఒక్క విద్యార్థుల తల్లిదండ్రులు జాగ్రత్త వ్యవహారించాలి. ఫోన్‌లను అందుబాటులో లేకుండా చూసుకోవాలి. ●



# ప్రజావాక్కు

## ఆరావళి పై ఉండాల్సిన ఆలోచనా సరళి

ఆరావళి ప్రాంతంలో ఏయే గుట్టలు, పర్వతాలు ఆరావళి శ్రేణిగా నిర్వచించబడతాయో అన్న సందిగ్ధతకు సుప్రీం కోర్టు తాత్కాలిక బ్రేక్ వేయడం ముదావహం. గతంలో ప్రభుత్వ ప్రతిపాదనకు తానుఅంగీకరించి, ఇచ్చిన ఆదేశం పైతానే నేడు స్టేఇచ్చి విజ్ఞత చూపింది. ఆరావళి శ్రేణి అతి పురాతన పర్వతాల, గుట్టల వరుస. ఢిల్లీ నుంచి గుజరాత్ వరకు, నాలుగు రాష్ట్రాల్లో, 37 జిల్లాల్లో వ్యాపించి ఉత్తర భారతానికి రక్షణ గోడగా నిలిచాయి. ఆ శ్రేణి వల్ల థార్ ఎడారి తూర్పుదిశగా వ్యాపించడంలేదు. ఇసుక తుఫాన్లకు అడ్డుగోడ. ఆయా రాష్ట్రాలకు నీటి ఎద్దడి రానీయకుండా భూగర్భాన్ని రీ ఛార్జ్ చేస్తున్నాయి. పచ్చదనం నిండుగా ఉండి ఉత్తర భారతానికి ఊపిరితిత్తులుగా పిలవబడుతున్నాయి. అలాగే ఆప్రాంతంలోవిలువైన ఖనిజాలు నిక్షిప్తమై ఉన్నాయి. గనుల తవ్వకాలకు అనుమతుల విషయ మై ఆరావళి శ్రేణి ప్రాంతం అనేక నిర్వచనాలకు గురవుతుంది. అందులో ఒకటి అధికారికమైంది.

- డా.డి.వి.జి. శంకరరావు, పార్వతీపురం

## డిజిటల్ నేరస్తులు

ఈమధ్యన సైబర్‌నేరగాళ్లు బ్యాంక్ ఖాతాల్లోకి జొరబడి కొంతసొమ్మును విడతల వారీగా స్థంభింప చేస్తున్నారు. ఆ డబ్బు ఎక్కడికీపోదు. కాకపోతే సైబర్ నేరాలకు సంబంధించిన డిపార్టుమెంటు వారు పరిశీలించి విడుదల చేస్తేనేకాని ఖాతాదారునికి చెల్లింపబడదని బ్యాంక్ వారు సమాధానం ఇస్తున్నారు. ఇలా ఎన్నినెలలు కాలాయాపన చేయాలి. ఈలోగా ఖాతాదారుల జీవనం ఎలా? దేశంలో 8000కోట్లరూపాయల పైన డిజిటల్ నేరస్తుల గుప్పిట్లో ఉన్నాయనివార్త. కేంద్రం సత్వరచర్యలు తీసుకొనక పోతే ఖాతాదారులు మరింతఇబ్బందులు పడవలసి వస్తుంది.

- డా. ఎన్. ఎస్.ఆర్. మూర్తి, సికింద్రాబాద్

## పర్యవేక్షణ తప్పనిసరి

ఇప్పటి కాలంలో చిన్న పిల్లల చేతుల్లో కూడా మొబైల్ ఫోన్లు కనిపిస్తున్నాయి. చదువుకోడానికి, ఆటల కోసం అని మొదలైన ఈ అలవాటు క్రమంగా హానికరంగా మారుతోంది. ఎక్కువసేపు మొబైల్ వాడడం వల్ల కంటి చూపు తగ్గిపోవడం, నిద్ర సరిగా లేకపోవడం, శారీరక చలనం తగ్గిపోవడం జరుగుతోంది.

- నిమ్మగడ్డ కృష్ణ, హైదరాబాద్

## మార్చాల్సింది సమాజ దృక్పథాన్ని

అమ్మాయి రక్షణ గురించి చర్చ వచ్చిన ప్రతిసారీ, బాధ్యులను బోనులో నిలబెట్టాల్సింది పోయి బాధితురాలి రంగు, శరీరం, ఆమె ధరించిన దుస్తుల గురించి ప్రస్తావించడం ఒక అనాగరిక సంప్రదాయంగామారిపోయింది. అమ్మాయి సురక్షితంగా ఉండాలంటే పద్ధతిగా ఉండాలి అని సుద్దులు చెప్పే మేధావుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. అసలు రక్షణకు, దుస్తులకు ముడిపెట్టే ఈ కుసంస్కృతి ఇంకెంత కాలం కొనసాగుతుందనేది నేడు సమాజం ముందున్న అతిపెద్ద ప్రశ్న. వ్యక్తుల ప్రవర్తనను ప్రశ్నించకుండా, బాధితుల వేషధారణను విమర్శించడం అంటే పరోక్షంగా నేరాన్ని సమర్థించడమే అవుతుంది. ప్రజల ఆలోచనలను ప్రభావితం చేసే అత్యంత శక్తివంతమైన సినీరంగం నేడు మహిళల పట్ల ప్రదర్శిస్తున్న వైఖరి అత్యంత ఆందోళనకరం. ఒకప్పుడు మహిళా పాత్రలను ఎంతో గౌరవప్రదంగా, స్ఫూర్తిదాయకంగా చిత్రించిన వినోదరంగం, రానురాను వారిని కేవలం గ్లామర్ వస్తువులుగా మార్చేసింది.

- బిడ్డి శ్రీకాంత్, జమ్మికుంట, కరీంనగర్

## గ్రామీణ వ్యవస్థలోనే భారతదేశ ఆత్మ

ఎన్ని శాస్త్ర సాంకేతిక పద్ధతులు వచ్చినా భారత దేశం ఆత్మ గ్రామీణ ఆర్థిక వ్యవస్థలలోనే ఉంది. తెలంగాణను సీడ్ హబ్‌గా తయారు చేయొచ్చు. అందుకే ఇప్పుడు గ్రామాలలో వివిధ పంటల విత్తనాలను పండించి కంపెనీలకు అమ్ముతున్నారు. ఇది ఒక రకంగా తెలంగాణ రైతులలో వచ్చిన అవగాహన ఫలితం. అయితే ఒక్క తెలంగాణకు మాత్రమే ఎందుకు పరిమితం కావాలి. కేంద్రం పూర్వోదయా ప్రణాళికను అమలుచేసినట్టు భూ పరివేష్టిత ప్రణాళికను అమలు చేయదు అనేది అసలు ప్రశ్న. భూ పరివేష్టిత రాష్ట్రాలకు ఉండే సౌలభ్యం మూలంగా కూడా ఈ ప్రణాళిక అమలు అవసరం.

- భారత అవినాష్, జనగామ

## వాక్ స్వేచ్ఛ.. అవగాహనకు దారితీసే సాధనం

మనరాజ్యాంగంలోని అనుచ్ఛేదం19(1)(ఎ) ప్రకారం ప్రతి పౌరునికి వాక్ స్వేచ్ఛ హక్కు కలదు. అయితే అనుచ్ఛేదం 19(2) ప్రకారం, ఆ స్వేచ్ఛ ప్రజా శాంతి, నీతి, మర్యాద, ఇతరుల గౌరవం దెబ్బతీయకుండా ఉండాలి. వాక్ స్వేచ్ఛ అంటే మనం ఇష్టం వచ్చినట్లు మాట్లాడే హక్కు కాదు. అది నిజాన్ని బాధ్యతతో వ్యక్తపరచే జ్ఞానం. వ్యంగ్యం అవమానంకాదు, అవగాహనకు దారి తీసే సాధనం కావాలి.

- వీరగంటి భాస్కర్ రావు, బొబ్బిలి

మనవి | ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్


(e-mail: editpage@vaartha.com)

# పాఠాలు, గుణపాఠాలతో మరో వత్సరంలోకి..



సుంకవల్లి సత్తిరాజు

కొన్ని చేదు జ్ఞాపకాలు, మరికొన్ని మధురమైన అనుభూతులను మిగిల్చి 2025 కాలగర్భంలో ఒదిగిపోతూ, కొన్ని పాఠాలను, గుణపాఠాలను నేర్పి, 2026 నూతన సంవత్సరానికి జన వాహినిలో చోటు కల్పిస్తూ, సెలవంటూ వీడ్కోలు తీసుకుంది. 2025 సంవత్సరంలో కూడా ప్రపంచంలో అనేక దేశాలు ఆర్థిక మాంద్యాన్ని ఎదుర్కొన్నాయి. ప్రపంచంలో యుద్ధ మేఘాలు గర్జించి, పెను పిడుగులు కురిపించాయి. భారత్‌లో జరిగిన పహల్గాం సంఘటన భారత్, పాక్‌ల మధ్య పెను సంఘర్షణకు దారితీసింది. భారత్ సైనిక, ఆయుధ సామర్థ్యం ముందు పాక్ నిలువలేక శరణుజొచ్చి, అమెరికా చెంత పాదాక్రాంతమై, బేలగా విలపించింది. భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌వలన కేవలం పాకిస్థాన్ మాత్రమే కాదు, అమెరికా, చైనా లాంటి దేశాలు కూడా భారత ఆయుధ, సాంకేతిక, సైనిక సామర్థ్యాన్ని చూసి ఉలిక్కిపడ్డాయి. ఎప్పటి మాదిరిగానే రష్యా భారత్‌కు వెన్నుదన్నుగా నిలిచింది. రష్యా ఆయుధాలు పాక్‌లోని ఉగ్రవాద శిబిరాలను ధ్వంసం చేయడమే కాకుండా పాక్ క్షిపణులను, యుద్ధ విమానాలను గగన తలంలోనే తునాతునకలు చేయడం ప్రపంచం దృష్టిని ఆకర్షించింది. అప్పటివరకు భారత్‌తో సత్సంబంధాలు కలిగి ఉన్న అమెరికా ఉలిక్కిపడి, ఉగ్రవాద దేశమైన పాక్‌కువంత పాడుతూ భారత్‌ను అనేక విధాలుగా ఇబ్బంది పెడుతూ ప్రపంచం దృష్టిలో చులకన కావడం జరిగింది. ప్రపంచ దేశాలు ఆయిల్ సంక్షోభం ఎదుర్కొంటున్న తరుణంలో భారత్‌కు కారు చౌకగా రష్యా ఇబ్బడిముబ్బడిగా చమురు సరఫరా చేయడాన్ని అమెరికా జీర్ణించుకోలేక, ఓర్వలేని తనంతో భారత్‌పై అకారణంగా వాణిజ్య సుంకాలను పెంచి, టారిఫ్ వార్ కొనసాగిస్తూ, భారత్ ఆర్థిక వ్యవస్థను దెబ్బ తీయాలని యత్నిస్తున్నది. అమెరికాను పట్టించుకోకుండా భారత్ రష్యాతో స్నేహం కొనసాగించడం ట్రంప్‌కుమింగుడు పడడం లేదు. సింధు జలాల నిలుపుదలతో పాక్ ఎడారిలా మారే అవకాశమున్నా, ప్రజల ఆకలి కేకలను పట్టించుకోకుండా భారత్‌ను లక్ష్యంగా చేసుకుని పావులు కదపడం, భారత్‌పై కక్షతో బంగ్లాదేశ్ ప్రజలను రెచ్చగొట్టి, చిచ్చు పెట్టాలని ప్రయత్నిస్తూ, ఇస్లామిక్ ర్యాడికల్ తీవ్రవాదులతో కలిసి, బంగ్లాదేశ్‌లో స్థిరబడిన భారత జాతీయులను హింసకు గురిచేయడం అత్యంత పాశవికమైన చర్య. అవామీ లీగ్ పార్టీని ఎన్నికల బరిలో లేకుండా చేయడానికి ప్రయత్నించిన ఒక మతోన్మాద "ఇంక్విలాబ్ మంచా" నాయకుడైన షరీఫ్ ఉస్మాన్ హాదీ హత్యకు ప్రతీకారంగా బంగ్లాదేశ్‌లోని భారతీయులను ఊచకోత కోయడం దానవ సంస్కృతికి అద్దం పడుతున్నది. అవామీ లీగ్ పార్టీని వచ్చే ఫిబ్రవరిలో జరిగే ఎన్నికల్లో పోటీ చేయనీయకుండానిషేధిం చడంవలన షేక్




హసీనా ప్రత్యర్థి బేగం ఖలీదా జియా కుమారుడు తారీఖ్ రహ్మాన్ ఈఎన్నికల్లో విజయం సాధించడం కేవలం లాంఛన ప్రాయమే. ఎన్నికలు జరిగే వరకు బంగ్లాదేశ్‌లో చెలరేగిన మంటలు ఆగునా? బంగ్లాదేశ్ ఉద్యమాలు ఎగదోస్తున్నదెవరు? పాక్, బంగ్లాదేశ్‌లలోని పరిస్థితులు ఇలా ఉండగా, ఆఫ్ఘనిస్థాన్ పాక్‌పై దాడులుచేస్తూ, పాక్ పాలకులకు ముచ్చెమటలు పట్టిస్తున్నది. ఇదిలా ఉండగా, ఇరాన్ ఇజ్రాయిల్ మధ్య తీవ్రమైన సంఘర్షణలు జరిగి, ప్రపంచాన్ని భయభ్రాంతులకు గురిచేసాయి. గాజాలో ఇజ్రాయిల్ మారణహోమంలో ఎంతోమంది బలైపోయారు. గాజాలో ఆకలికేకలు మిన్నంటుతున్నాయి. ఉక్రెయిన్, రష్యాల మధ్య సంవత్సరాల తరబడి సాగుతున్న యుద్ధంలో ఇరుపక్షాలకు చెందిన సైనికులు, పౌరులు లక్షల సంఖ్యలో మరణించారు. అయినప్పటికీ ఈ రెండు దేశాలమధ్య మారణహోమం ఆగడం లేదు. 2025ను యుద్ధాల సంవత్సరంగా భావించాలి. ఇక భారత్ విషయానికొస్తే సౌదీ అరేబియా నుండి 11వేలకు పైగా భారతీయులను బహిష్కరించడం దురదృష్టకరం. భారతీయులను వివిధకారణాల రీత్యా వెనక్కిపంపడంలో ప్రపంచంలో సౌదీ అరేబియా, అమెరికా దేశాలు మొదటి, రెండుస్థానాల్లో ఉన్నాయి. భారతీయుల బహిష్కరణ అంశంపై సౌదీ అరేబియా అత్యుత్సాహం ప్రదర్శించడంపై భారత్ దృష్టిసారించాలి. అమెరికా టారిఫ్‌వార్ కొనసాగిస్తున్నా, భారత్ నాల్గవ ఆర్థికవ్యవస్థగా ఎదగడంశుభసూచకం. అయితే అమెరికా డాలర్ విలువ పెరిగి, రూపాయి విలువ క్షీణించడం ఆందోళనకరం. దేశంలో సర్‌వివాదం కొనసాగుతూనే ఉంది. పశ్చిమ బెంగాల్‌లో హింసా కాండ ఫలితం రాబోయే ఎన్నికల్లో మమతా బెనర్జీ అధికారానికి మంగళం పాడే సూచనలు కనిపిస్తున్నాయి. 2025జూన్ నెలలో అహ్మదాబాద్ నుండి లండన్‌కు బయలు దేరిన ఎయిర్ ఇండియా విమానం టేకాఫ్ దశలోనే కూలిపోయి, సుమారు260మంది ప్రయాణీకులు మరణించిన సంఘటన అత్యంత విషాదాన్ని మిగిల్చింది. ఈ ప్రమాదంలో ఒకే ఒకవ్యక్తి మృత్యుంజయుడై బయటపడడం విశేషం. ఇక తెలుగురాష్ట్రాల రాజకీయాల్లో విమర్శలు, వివాదాలు కొనసాగుతూనే ఉన్నాయి. రెండేళ్ల మౌనం తర్వా త కె.సి.ఆర్ ఫాం హౌస్‌ను వీడి రేవంత్ సర్కార్ పై విరుచుకుపడుతున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడుల కోసం విస్తృత ప్రయత్నాలు కొనసాగుతున్నాయి. రాజధాని అమరావతి నిర్మాణ పనులు జోరందుకున్నాయి. పలు కేంద్ర ప్రభుత్వ సంస్థలు అమరావతిలో అడుగుపెట్టాయి. మెడికల్ కాలేజీల విషయంలో వై.సి.పి పోరుబాటలో పయనిస్తున్నది. పాలక కూటమిపై వై.సి.పి రఫ్ఫా రఫ్ఫా అంటూ వివాదాస్పద నినాదాలతో 2029 ఎన్నికల్లో విజయం కోసం రణనినాదం చేస్తున్నది. రాజకీయాలు హుందాగా నడపడానికి కేంద్రం, ఎన్నికల సంఘం చొరవ తీసుకోవాలి. 2025వ సంవత్సరంలో ప్రపంచ పరిణామాలు బాధను, అసంతృప్తిని మిగిల్చాయి. కాలగర్భంలో కలిసిపోతున్న 2025వ సంవత్సరపు చేదు జ్ఞాపకాలు పునరావృతంకాకుండా కొంగొత్త ఆశలతో అడుగిడుతున్న నూతన సంవత్సరం 2026 ప్రజల జీవితాల్లో సరికొత్త మార్పులు తీసుకురావాలని, యుద్ధాలు పరిసమాప్తి కావాలని, హింసకు తావులేని ప్రపంచం ఏర్పడాలనికోరుకుంటూ, కదిలేకాలంలో ఒదిగిపోయిన జ్ఞాపకాలను అనుభవాలుగా మలచుకుని, నూతన సంవత్సరాన్ని ఘనంగా స్వాగతిద్దాం. ●

# పద్మావతి ఘాట్‌ను పరిశుభ్రంగా ఉంచాలి

## మున్సిపల్ కమిషనర్ ధ్యానచంద్ర

**విజయవాడ కార్పొరేషన్,డిసెంబరు 30,ప్రభాతవార్త:** పద్మావతి ఘాట్‌ను పరిశుభ్రంగా ఉంచాలని, పారిశుద్ధ నిర్వహణ సక్రమంగా నిర్వహించాలని మున్సిపల్ కమీషనర్ ధ్యానచంద్ర అధికారులను ఆదేశించారు. మంగళవారం తన పర్యటనలో భాగంగా ఆయన రాణీగారితోట, కృష్ణలంక,



స్క్రూబ్రిడ్జి ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముక్కోటి ఏకాదశి సందర్భంగా వివిధ ఆలయాలకు భక్తులు వెళ్తుంటారు కాబట్టి వారికి ఎటువంటి ఇబ్బంది కల్గకుండా పారిశుద్ధ నిర్వహణ,త్రాగునీటి సదుపాయం కల్పించేటట్లు అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం కృష్ణలంక, సాయిబాబా గుడి వద్ద ఉన్న అన్న క్యాంటీన్‌ను ఆయన పరిశీలించారు. అన్న క్యాంటీన్లో ఎటువంటి లోపాలు ఉండకూడదని, మరమ్మత్తులను వెనువెంటనే పూర్తి చేయాలని అన్న క్యాంటీన్‌కు వచ్చే ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా చూసుకోవాలని అధికారులను ఆదేశించారు. పర్యటనలో ఆయనతో పాటు అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ గోపాలకృష్ణ నాయక్,శానిటరీ సిబ్బంది పాల్గొన్నారు.

# వార్షిక నేర సమీక్షా సమావేశం

**విజయవాడ కార్పొరేషన్,డిసెంబరు 30,ప్రభాతవార్త:** సిపి రాజశేఖరబాబు వార్షిక నేర సమీక్షా సమావేశాన్ని మంగళవారం తన కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్చి 2025లో ఎన్టీఆర్ పోలీసు అధికారుల శాంతి భద్రతల పర్యవేక్షణ వల్ల క్రైం రేటు తగ్గిందన్నారు. ఈ సంవత్సరం




9,503 క్రైంలు నమోదయ్యాయన్నారు. టెక్నాలజీని అడాప్ట్ చేసుకుని నేరాలను తగ్గించగలిగామన్నారు. మార్చి 2025లో సిసి టివీలను డిజిటల్ హెల్త్ మేనేజ్‌మెంట్ అనే అప్లికేషన్‌ను తీసుకొచ్చామన్నారు. హోం శాఖ మంత్రి సమక్షంలో సురక్ష కార్యక్రమాన్ని ఏర్పాటు చేసామని, ఈ సందర్భంగా 1000 సిసి కెమేరాలను ఏర్పాటు చేసామన్నారు. నేరం జరిగిన చోట నేరస్థుల ఫింగర్ ప్రింట్‌లు దొరికే అవకాశాలు సన్నగిల్లుతున్న నేపథ్యంలో, సాక్ష్యాలను సేకరించడానికి గాను 10వేల సిసి కెమేరాలను పబ్లిక్ ప్లేసెస్‌లో వీటిని వినియోగించడం వల్ల అత్యున్నత ప్రగతిని సాధించామన్నారు. ప్రతి టెంపుల్ లోను డిజైన్ సురక్ష అనే కార్యక్రమం ద్వారా ప్రతి చోట సిసి కెమేరాలను ఏర్పాటు చేయాలని సంకల్పించామన్నారు. విస్తృతంగా డ్రోన్‌లను ఏర్పాటు చేసామన్నారు. ఎఫ్ఆర్ఎస్ తదితరాలు ఏర్పాట్లు చేయడం వల్ల క్రైం రేటు తగ్గిందన్నారు. విజయవాడ నగర కమీషనరేట్ పరిధిలో తొలి సారిగా క్రైం రేటును తగ్గించామన్నారు. రోడ్డు ప్రమాదాలను కూడ చాలా వరకు తగ్గించగలిగామన్నారు. ఆర్థిక నేరాల గురించి,గంజాయికి సంబంధించి డ్రోన్‌ల ద్వారా నేరాలను అరికట్టగలిగామన్నారు. గంజాయి నేరాలను నియంత్రించడం వల్ల గంజాయి రేటు విపరీతంగా పెరిగిందన్నారు. సైబర్ క్రైం కూడ తగ్గిందన్నారు. 202 ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయన్నారు. డెకాయిటీలు,రాబరీలు కూడ తగ్గాయన్నారు. స్నాచింగ్ కేసులు కూడా కొంత మేరకు తగ్గించగలిగామన్నారు. ప్రాపర్టీ నేరాలకు సంబంధించిన కేసులు 821 నమోదయ్యాయన్నారు. దాడి కేసులో గత సంవత్సరంతో పోల్చుకుంటే చాలా వరకు తగ్గాయని, ఈ సంవత్సరం 902 కేసులు నమోదయ్యాయని, మహిళలపై దాడికి సంబంధించిన కేసులు గత సంవత్సరం కంటే తగ్గాయని ఈ సంవత్సరం 1569 కేసులు నమోదయ్యాయన్నారు. ఫోక్సో కేసులు గత సంవత్సరం 204 కేసులు నమోదైతే ఈ సంవత్సరం 165 కేసులు నమోదయ్యాయన్నారు. రోడ్డు ప్రమాదాలకు సంబంధించి గత సంవత్సరం 1245 కేసులు నమోదైతే ఈ సంవత్సరం 1009 కేసులు నమోదయ్యాయని వీటిని కూడా బాగా తగ్గించగలిగామన్నారు.ఆర్థిక నేరాలకు సంబంధించిన కేసులు మాత్రం కొంత మేరకు పెరిగాయన్నారు. నార్కోటిక్స్ డ్రగ్స్‌కు సంబంధించిన కేసులు కూడ కొంత మేరకు గత సంవత్సరం కంటే పెరిగటాయన్నారు. సైబర్ క్రైంల విషయానికి వస్తే ఈ సంవత్సరం 202 కేసులు మాత్రమే నమోదయ్యాయన్నారు.

మర్డర్ ఫర్ గెయిన్ కేసులు ఈ సంవత్సరం 3 నమోదయ్యాయన్నారు. డెకాయిటీ కేసులు ఈ సంవత్సరం ఏమీ నమోదు కాలేదన్నారు. రాబరీ కేసులు గత సంవత్సరం 35 కేసులు నమోదవ్వగా ఈ సంవత్సరం మాత్రం 14 కేసులు మాత్రమే నమోదయ్యాయన్నారు. హౌస్ బ్రేకింగ్ కేసులు పగటిపూట జరిగిన నేరాలు 36 నమోదవ్వగా,రాత్రి జరిగే నేరాలు 96 నమోదయ్యాయన్నారు. ఇవి కూడ గత సంవత్సరం కంటే తక్కువ నమోదయ్యాయన్నారు. చోరీ కేసులు ఈ సంవత్సరం తక్కువగా నమోదయ్యాయని ఇది నేర నియంత్రణలో భాగంగా దీనిని సాధించామన్నారు. స్నాచింగ్ కేసులు కొంత మేరకు పెరిగాయన్నారు. వివాహానికి సంబంధించిన నేరాలకు సంబంధించి 796 కేసులు నమోదయ్యాయన్నారు. లైంగిక దాడికి సంబంధించి 103 కేసులు నమోదు అవ్వగా,మహిళలపై అవమానపర్చినట్లుగా నమోదైన కేసులు 670 నమోదయ్యాయని ఇవి గత సంవత్సరంలో నమోదైన కేసుల కంటే తగ్గిందన్నారు. ఎస్‌సి,ఎస్‌టి అత్యాచార నిరోధక చట్టానికి సంబంధించిన కేసులు 57 నమోదయ్యాయని ఇవి కూడ గత సంవత్సరం కంటే తగ్గాయన్నారు. డిజిటల్ అరెస్ట్‌ల పేరుతో మోసం జరిగే కేసులపై ప్రజలకు అవగాహన కల్పించి వాటిని నియంత్రించగలిగామన్నారు. దసరా శరన్నవరాత్రుల సందర్భంగా ఎటువంటి నేరం జరుగకుండా ఆపగలిగామన్నారు. 2.51 కోట్ల విలువైన ఐ ఫోన్‌లను పట్టుకుని సదరు నేరాన్ని నియంత్రించగలిగామన్నారు.ఈ సంవత్సరం ఎబిసిడి అవార్డుల్లో మొదటి బహుమతి ఎన్టీఆర్ పోలీస్ కమీషనరేట్ గెలుచుకోవడం,సదరు ప్రశంసా పత్రాన్ని డిజిపి చేతుల మీదుగా అందుకోవడం గొప్ప విషయమన్నారు.సైబర్ క్రైంలకు సంబంధించి ఈ సంవత్సరం గత సంవత్సరం కంటే ఈ సంవత్సరం ఎక్కువ అమౌంట్‌ను ఫ్రీజ్ చేశామన్నారు.హిట్ అండ్ రన్ కేసులు మొత్తంగా 328 నమోదు కాగా ఈ సంవత్సరం మొత్_ం రూ.2 కోట్లను భాధితులకు నష్టపరిహారంగా అందించగలిగామన్నారు.ఈ సంవత్సరం 34 మర్డర్ కేసులు నమోదయ్యాయని, గత సంవత్సరం కంటే వీటి రేటు తగ్గిందన్నారు. కిడ్నాప్,కల్పబుల్ హోమిసైడ్,రైటింగ్,తీవ్ర గాయాలు,సాధారణ గాయాలు, హత్యాయత్నం కేసులు కూడ గత సంవత్సరం కంటే ఈ సంవత్సరం చాలా వరకు తగ్గాయన్నారు. న్యాయస్థానాల్లో విచారణ జరిగిన కేసుల్లో జీవిత ఖైదు పడిన కేసులు 9 కాటగా,10 సంవత్సరాల శిక్ష పడిన కేసులు 18,3 సంవత్సరాల నుండి 7 సంవత్సరాలు శిక్ష పడిన కేసులు 27 వరకు ఈ సంవత్సరం ఉన్నాయన్నారు.ఈ సంవత్సరం శిక్షల శాతం బాగా పెరిగిందన్నారు.ప్రాపర్టీకి సంబంధించిన కేసుల్లో చాలా వరకు రికవరీ చేశామన్నారు. టెక్నాలజీ ద్వారా నేరాలను చాలా వరకు నియంత్రించగలిగామన్నారు. డ్రోన్ల ద్వారా ఎన్టీఆర్ కమీషరేట్ పరిధిలో నేరాలకు అడ్డుకట్ట వేశామని పేర్కొన్నారు. ఈ సమావేశంలో పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# శ్రీవాసవి కన్యకాపరమేశ్వరికి ఘనంగా సహస్రనామ పారాయణ క్రతువు

**ఎ కొండూరు, డిశంబర్ 30, ప్రభాతవార్త :** ఎన్‌టిఆర్ జిల్లా తిరువూరు నియోజకవర్గం ఎ కొండూరు మండలం కంభంపాడు గ్రామంలో శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయంలో సోమవారం అన్నపూర్ణ సహస్రనామ పూజ కార్యక్రమం అత్యంత భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. ఈ సహస్రనామ పార్యాణలో 260మంది భక్తులు పాల్గొని బియ్యపు రాశులు కోటి మణిద్వీప వర్ణన కార్యక్రమంలో భక్తులతో కిటకిటలాడుతూ దిగ్విజయంగా నిర్వహించారు. తిరువూరు విసన్నపేట ఎ కొండూరు గంపలగూడెం జుజ్జూరు మండలాలతో పాటు రాజుగూడెం గొల్లమండల కోడూరు తదితర గ్రామాల నుండి భక్తులు విచ్చేసి అమ్మవారి తీర్థప్రసాదాలు స్వీకరించారు. కంభంపాడు పట్టణ వర్తక వ్యాపారి వేములపల్లి పిచ్చయ్య భక్తులకు అన్నప్రసాద వితరణ గావించారు. భక్తులకు అమ్మవారి ఆశీస్సులు కలగాలని ఆలయంలో వైదిక కమిటీ, ఆలయ కమిటీ వారు ప్రత్యేక పూజలు నిర్వహించారు.



# ప్రవాసాంధ్రుడు బొప్పన మహీనాద్ చౌదరికి ఎంతో రుణపడి ఉంటాం : చీమలపాడు రజకులు

**ఎ కొండూరు, డిశంబర్ 30, ప్రభాతవార్త :** ప్రవాసాంధ్రుడు విజయవాడకు చెందిన బొప్పన మహీనాద్ చౌదరి (ఎన్నారై) ఉదార స్వభావంతో ఎన్‌టిఆర్ జిల్లా ఎ కొండూరు మండలం చీమలపాడు గ్రామంలోని రజకవృత్తి చేసుకుని జీవించే రజక కులస్తుల జీవితాల్లో ఎన్నారై మహీనాధ్ చౌదరి విజయవాడ ఎంపి కేశినేని చిన్ని తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావుల సాకారంతో ఎన్నారై మహీనాధ్ తన ట్రస్ట్ ద్వారా రజకులకు ఉచితంగా ఇస్త్రీ పెట్టెలు తోపుడుబండ్లు అందించి వారికి మెరుగైన జీవనోపాధికి తోడ్పాటు అందించడం పట్ల తమ నైరాస్యం దీనమైన బతుకుల్లో వెలుగును ప్రకాసింప చేసిన ఎన్నారై మహీనాధ్ చౌదరికి తాము ఎంతో రుణపడి ఉంటామని ఈ సందర్భంగా గవ్వలపల్లి నాగేశ్వరరావు, గవ్వలపల్లి జమలయ్య, సత్యనారాయణ, తదితర పేద లబ్దిదారులు సంతోషాన్ని వ్యక్తం చేస్తూ ఎన్నారై మహినాద్ చౌదరి, ఎంపి కేశినేని చిన్నికి, ఎమ్మెల్యే శ్రీనివాస్‌కు కృతజ్ఞతలు తెలిపారు.



ఎన్నారై మహీనాద్

విజయవాడ వార్త

# వంతెన నిర్మాణం ఎప్పటికో..?

- -వినగడవ వంతెనకు నిధుల లేమి
- -అంచనా విలువ రూ. 30కోట్లు
- -మంజూరైన నిధులు రూ.2కోట్లు
- -లోలెవెల్ కాజ్‌వేతోనే సరి.

**గంపలగూడెం, డిసెంబర్ 30, ప్రభాతవార్త:** గంపలగూడెం మండలం వినగడప వద్ద కట్టెలేరు వాగుపై గతంలో వరదలకు కొట్టుకుపోయిన వంతెన స్థానంలో రూ.30కోట్లతో హైలెవెల్ బ్రిడ్జి నిర్మాణం జరుపుతామని స్థానిక ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు ఇచ్చిన హామీ నీటిమూటగానే మిగిలిపోయింది. తాము అధికారంలోకి వచ్చిన 6 నెలల్లో వంతెన నిర్మాణం పూర్తి చేస్తామని ఎన్నికల సమయంలో చెప్పిన ఎమ్మెల్యే ఇంతవరకు ఈ పట్టించుకున్న దాఖలాలు లేవు. ప్రభుత్వస్థాయిలో అనుమతులు సాధించ లేకపోయారని మండల ప్రజలు వాపోతున్నారు. ఆర్ అండ్ బీ అధికారులు పలుమార్లు అంచనాలు పెంచి ప్రభుత్వానికి వంతెన నిర్మాణ ప్రతిపాదనలు పంపినా ఆర్థికశాఖ ఆమోదం లభించలేదు. ప్రభుత్వ స్థాయిలో ఈ వంతెనకు అనుమతుల సాధనలో విఫలమైన పాలకులు తిరువూరు నియోజకవర్గంలో పదే పదే వినగడవ వంతెన నిర్మిస్తామని ప్రకటించి చేతులు దులుపుకుంటున్నారని పలువురు విమర్శిస్తున్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో స్వయానా తిరువూరు పర్యటన వచ్చిన అప్పటి ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి వినగడప వంతెన నిర్మాణం పూర్తి చేస్తామని బహిరంగ సభలో ప్రకటించిన హామీ కూడా నిలబెట్టుకోలేకపోవడం శోచనీయం. ఎన్నికల సమయంలో వినగడప వంతెన నిర్మాణమే ఎజెండాగా ప్రచారం చేసుకున్న కూటమి నేతలు తదుపరి దాని ఊసే ఎత్తక పోవడంతో వామపక్షాల నాయకులు పలుమార్లు ఆందోళనలు జరిపారు.

**అంచనా రూ. 30కోట్లు, అనుమతి రూ.2కోట్లు :** వినగడవ పెద్ద కట్టెలేరుపై హైలెవెల్ వంతెన నిర్మించడానికి రూ.30కోట్ల నిధులు అవసరమని



ఆర్ అండ్ బీ అధికారులు ప్రతిపాదించారు. గతంలో ఉన్న లోలెవెల్ కాజ్ వే తరచు కొట్టుకుపోవడంతో రాకపోకలకు ఇబ్బందు లెదురవు తున్నాయని, వరద ప్రవాహం ఉధృతంగా ఉండే ప్రదేశమైనందున వంతెన సాధ్యమైనంత ఎత్తులో నిర్మించాలని ఆర్ అండ్ బీ అధికారులు నివేదించారు. గత జూన్ లో వంతెన నిర్మాణానికి అనుమతి వచ్చేసిందని, ఇక టెండర్లు పిలవడమే తరువాయని అధికార పార్టీ నేతలు విస్తృతంగా ప్రచారం చేశారు. అయితే తదుపరి రూ.30కోట్ల నిధులు ఈ వంతెన నిర్మాణానికి కేటాయించబోమని ఆర్థికశాఖ తేల్చిచెప్పడంతో అధికారులు మిన్నకున్నారు. నాబార్డు నుంచి గ్రాంట్లు వస్తేనే వంతన నిర్మాణం సాధ్యపడుతుందని కూడా ఉన్నతాధికారులు స్పష్టం చేశారు. తాజుగా లోలెవెల్ కాజ్ వే నిర్మాణానికి అనుమతి ఇస్తామని, రూ.2కోట్లతో ఇది పూర్తయ్యే విధంగా చూడాలని, ఇందుకు అవసరమైన అంచనాలు రూపొందించాలని కూడా ఆదేశించారు.

**ప్రజల ఇబ్బందులు పట్టవా? కోట దాను, మాజీ ఎంపీపీ, గంపలగూడెం :**



గంపలగూడెం మండలంలోని 10 గ్రామాలకు రాకపోకల నిమిత్తం వినగడప వద్ద కట్టెలేరు వంతెన నిర్మించాలని ఎంతోకాలంగా కోరుతున్నా పాలకులు పట్టించుకో పట్లేదు. వంతెన నిర్మాణానికి నిధుల సాధనలో ఎమ్మెల్యే ఉదాసీనవైఖం అవలంబించడం తగదు.

**హైలెవెల్ వంతెన నిర్మించాలి యరదేశి రామారావు, తిరువూరు :** వినగడప వద్ద కట్టెలేరుపై వంతెన నిర్మాణాన్ని అధికారులు, ప్రజాప్రతినిధులు తేలికగా తీసుకోవడం విచారకరం. శాశ్వతంగా హైలెవెల్ వంతెన నిర్మించాలని కోరుతుంటే లోలెవెల్ కాజ్‌వేతో సరిపెట్టడం ఎంతవరకు సమంజనం, రూ.30కోట్లతో హై లెవెల్ వంతెన నిర్మించకపోతే ప్రజలకు ఇబ్బందులు తప్పవు.



# మద్యం వద్దు-వేగం వద్దు-ప్రాణం ముద్దు అనే నినాదంతో ర్యాలీ

## ర్యాలీని ప్రారంభించిన సిపి రాజశేఖరబాబు

**విజయవాడ కార్పొరేషన్,డిసెంబరు 30,ప్రభాతవార్త:** హెల్మెట్‌పై అవగాహన కల్పించడం వల్ల చాలా మంది ద్విచక్ర వాహనదారులు చిన్న చిన్న ప్రమాదాలతో బయటపడ్డారని సిపి రాజశేఖరబాబు స్పష్టం చేశారు. మంగళవారం విజయవాడ ట్రాఫిక్ పోలీసులు,కాంపేనియన్ షిప్ మెంబర్స్





అధ్వర్యంలో నూతన సంవత్సరం 2026 సందర్భంగా మద్యం సేవించి వాహనాలు నడపరాదని, మద్యం వద్దు-వేగం వద్దు-ప్రాణం ముద్దు అనే నినాదంతో ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం నుంచి బెంజి సర్కిల్ వరకు 2కె వాక్తాన్ ర్యాలీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సిపి రాజశేఖరబాబు ఈ ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తొలుత 2025 సంవత్సరానికి వీడ్కోలు పలుకుతూ 2026వ సంవత్సరం లోనికి అడుగు పెడుతున్నామని,ఈ సంవత్సర కాలంలో ఎన్టీఆర్ పోలీసులు ముఖ్యంగా ట్రాఫిక్ పోలీసులు అకుంఠిత దీక్షతో పనిచేశారని, రోడ్డు ప్రమాదాలను తగ్గించగలిగారన్నారు. 2024లో 454 మంది రోడ్డు ప్రమాదాలలో చనిపోయారని, 2025లో రోడ్డు ప్రమాద మరణాల నుండి దాదాపు 88 మందిని రక్షించగలిగామన్నారు. దీనికి ట్రాఫిక్ డిసిపి,వారి సిబ్బందికి ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. 88 మంది ప్రాణాలను కాపాడటం అంటే 88 కుటుంబాల జీవితాలు మనం కాపాడిన వారం అవుతామన్నారు. ముఖ్యంగా హెల్మెట్‌పై అవగాహన కల్పించడం వల్ల చాలా మంది ద్విచక్ర వాహనదారులు చిన్న చిన్న ప్రమాదాలతో బయటపడ్డారని, ఈ అవగాహన వలన 70 నుండి 80 శాతం మంది హెల్మెట్‌లను వినియోగిస్తున్నారని,రోడ్డు ప్రమాద మరణాలు ఇంకా తగ్గించడానికి అందసరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ప్రజలు కూడా రోడ్డు సేఫ్టీ అనేది ఒక ఉద్యమంగా తీసుకుపోవాలని, వీటన్నిటి కంటే ముఖ్యంగా ప్రజలకు స్వీయ క్రమశిక్షణ అనేది ముఖ్యం అని తెలియచేశారు. అనంతరం 2కె వాక్తాన్ ర్యాలీని ఆయన ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో ఆయనతో పాటు ట్రాఫిక్ డిసిపి షిరీన్ బేగం ,ట్రాఫిక్ ఎసిపిలు,సిఐలు, కాంపేనియన్ షిప్ మెంబర్లు,కళాశాల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# వీధి కుక్కలకు ఏర్పాటు చేసిన ఆహార ప్రదేశ నిర్వహణకు జంతు ప్రేమికుల సహకారం అవసరం : అర్జునరావు

**విజయవాడ కార్పొరేషన్,డిసెంబరు 30,ప్రభాతవార్త :** వీధి కుక్కలకు ఏర్పాటు చేసిన ఆహార ప్రదేశం నిర్వహణకు జంతు ప్రేమికుల సహకారం అవసరమని మున్సిపల్ కార్పొరేషన్ చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ కె.అర్జునరావు పేర్కొన్నారు.





మున్సిపల్ కమీషనర్ ధ్యానచంద్ర ఆదేశాల మేరకు ప్రధాన కార్యాలయంలోని నూతన భవనంలో,సమావేశపు హాలులో చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ కె.అర్జునరావు జంతు ప్రేమికులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం ఏర్పాటు చేసిన వాధి కుక్కలకు ఆహారం పెట్టే ప్రదేశాలకు జంతు ప్రేమికుల సహకారం ఎంతో అవసరమన్నారు. కార్పొరేషన్ పరిధిలో ప్రతి సచివాలయానికి ఒక ప్రదేశాన్ని వీధి కుక్కలకు ఆహారం పెట్టే ప్రదేశంగా గుర్తించి ఏర్పాటు చేశారని, ఈ 286 డాగ్ ఫీడింగ్ జోన్లకు జంతు ప్రేమికులకు మాపింగ్ చేస్తున్నామని, తద్వారా ్రతి ఫీడింగ్ జోన్‌కు జంతు ప్రేమికులు భాధ్యత వహించి ఈ ఫీడింగ్ జోన్లు నిర్వహించాలని తెలిపారు. ఈ సమావేశంలో వీధి కుక్కలు ఆహారం పెట్టే ప్రదేశాలలో ఏవైనా మార్పులు కావాలన్నా వారి సూచనలను ఖచ్చితంగా పరిగణనలోకి తీసుకుంటామన్నారు. ఈ సమావేశంలో అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ గోపాల నాయక్,వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ బి.సోమశేఖరరెడ్డి,జంతు ప్రేమికులు పాల్గొన్నారు.

# నిబంధనలు మీరితే కఠినచర్యలు తప్పవు

**కంకిపాడు డిసెంబరు30,ప్రభాతవార్త :** కుటుంబసభ్యుల బంధుమిత్రుల సమక్షంలో నూతన సంవత్సరానికి ప్రశాంత వాతావరణంలో స్వాగంల పలకాలని గన్నవరం సబ్‌డివిజినల్ పోలీస్‌ఆఫీసర్ సి.హెచ్.శ్రీనివాసరావు తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం ఆయన మాట్లాడుతూ ప్రజలందరికీ నూతనసంవత్సర శుభాకాంక్షలు తెలియజేస్తూ 2026వ సంవత్సరంలో మప్రజలందరూ క్షేమంగా సురక్షితంగా సుఖసంతోషాలతో ఉండాలని ఆయన ఆకాంక్షించారు. జిల్లాలో శాంతి భద్రతలకు భంగం కలిగించకుండా నిబంధనలకు లోబడే వేడుకలు జరుపుకోవాలని సూచించారు. బహిరంగ ప్రదేశాలలో కేకులు కట్‌చేయడం,అశ్లీలనృత్యాలు చేయడం, పార్టీలు నిర్వహించడం, బహిరంగ ప్రదేశాలలో గుమిగూడడం, లౌడ్‌స్పీకర్లు పెట్టడం, డీజేలు వాడడం, హాస్పిటల్స్, వృద్ధాశ్రమాలు వద్ద అధికశబ్దం చేయడం, మందుగుండు సామాగ్రిని కాల్చడం చేస్తే కఠినచర్యలు తీసుకుంటామని ద్విచక్రవాహనాలకు సైలెన్సర్‌తీసి ర్యాష్ డ్రైవింగ్, ట్రిపుల్ డ్రైవింగ్, బయట మద్యం సేవించడం వంటి కార్యకలాపాలు చేస్తే ఉపేక్షించేదిలేదని హెచ్చరించారు. డిసెంబరు 31వ తేదీ సాయంత్రం నుండి గన్నవరం సబ్ డివిజన్ పరిధిలో పోలీస్ పికెట్స్ గస్తీ బృందాలను నియమించనున్నామని హెచ్చరించారు. ప్రజలందరూ స్థానిక పోలీసులకు సహకరించాలని కోరారు.



# దేవాలయాల్లో ముక్కోటి వేడుకలు

**గంపలగూడెం, డిసెంబరు 30, ప్రభాతవార్త:** ముక్కోటి ఏకాదశి వేడుకలు గంపలగూడెం మండలంలోని పలు దేవాలయాల్లో మంగళవారం నిర్వహించారు. తెల్లవారురఝాము నుంచి ఆలయాల్లో భక్తులు ఉత్తర ద్వారదర్శనం కోసం బారులు తీరారు. గంపలగూడెంలోని సీతారామ స్వామి దేవస్థానం, ఊటుకూరు కోదండ రామాలయం, నెమలి శ్రీవేణుగోపాలస్వామి దేవస్థానం, గోసవీడు వేణుగోపాల స్వామి, పెనుగొలను మెట్టగుట్ట శ్రీనివాస స్వామి దేవస్థానాలలో ముక్కోటి పర్వదిన సందర్భంగా భక్తులు విశేషపూజలు నిర్వహించారు. పలు దేవాలయాల్లో స్వామివారిని గరుడవాహనంపై ఊరేగించారు. తిరువూరు సిఐ గిరిబాబు ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.



# శాంతి భద్రతలకు విఘాతం కల్గిస్తే కఠిన చర్యలు

## -ఎస్సై గంధం మహాలక్ష్మడు

**ఎ కొండూరు, డిశంబర్ 30, ప్రభాతవార్త :** ఎన్‌టిఆర్ జిల్లా పోలీస్ కమీషనర్ జివి రాజశేఖర్‌బాబు ఆదేశాల మేరకు తిరువూరు పోలీస్ సర్కిల్ పరిధిలోని ఎ కొండూరు మండలంలో డిసెంబర్ 31 రాత్రి నూతన సంవత్సరం వేడుకల సందర్భంగా శాంతి భద్రత దృష్ట్యా పోలీస్ ఆంక్షలు అమలులో ఉంటాయని ఎస్సై గంధం మహాలక్ష్మడు తెలిపారు. మండల ప్రాంత ప్రజలు చట్టాన్ని గౌరవించి పోలీసులకు సహకరించాలని ఎస్సై మహాలక్ష్మడు కోరారు. సిపి



ఆదేశాల మేరకు అర్ధరాత్రి విజయవాడ మైలవరం ఎ కొండూరు తిరువూరు జాతీయ రహదారి-30పై వేడుకలకు అనుమతి లేదని మద్యం సేవించి వాహనాలు నడపరాదని ట్రిపుల్ రైడింగ్ అతివేగం అజాగ్రత్త నిర్లక్ష్యంగా వాహనాలు నడపరాదని ట్రాఫిక్ ఆంక్షలు గుంపులు గుంపులుగా చేరి అల్లర్లు చేస్తే కఠిన చర్యలు తప్పవని సైలెన్సర్లు తొలగించి అధిక శబ్దాలు విన్యాసాలు, బాణాసంచా నిషేధమని పోలీస్ గస్తీ ముమ్మరంగా కొనసాగుతుందని రోడ్డు ప్రమాదాలు ఇబ్బందులు లేకుండా బాధ్యతాయుతంగా ఏకాగ్రతతో భద్రంగా 2026 కొత్త సంవత్సరాన్ని స్వాగతిస్తూ ఆహ్లాదకరంగా సంతోషంగా జరుపుకోవాలని ఎస్సై గంధం మహాలక్ష్మడు మండల ప్రాంత ప్రజలకు ముఖ్యంగా యువతకు విజ్ఞప్తి చేశారు. మండలంలోని అన్ని గ్రామాల్లో పలు ఆంక్షలు విధించినట్లు ఎ కొండూరు ఎస్సై గంధం మహాలక్ష్మడు తెలిపారు. డిసెంబర్ 31 రాత్రి మద్యం సేవించి రోడ్లపై తిరగడాలు మరియు జాతీయ రోడ్లపై వాహన చోదకులు అలాగే బైక్ ఓవర్ స్పీడ్ రేసింగ్‌లు లైసెన్స్ మరియు సరైన పత్రాలు లేకుండా నిబంధనలకు విరుద్ధంగా హైవేపై వాహనాలు నడిపితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్సై గంధం మహాలక్ష్మడు హెచ్చరించారు. మండలంలో ప్రభుత్వ వైన్స్ మద్యం షాపులు యథాప్రకారంగా రాత్రి 10 గంటల వరకే పనిచేయాలని ఎస్సై గంధం మహాలక్ష్మడు తెలిపారు. డిసెంబర్ 31కి బైబై చెబుతూ జనవరి 2026కి స్వాగతం చెబుతూ హ్యాపీ న్యూ ఇయర్ వేడుకలను కేక్ కటింగ్‌లతో ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని డిసెంబర్ 31 నిబంధనలకు వ్యతిరేకంగా వ్యవహరించే వారిపై చట్టపరమైన చర్యలు కేసులు నమోదు చేస్తామని ఎస్సై గంధం మహాలక్ష్మడు హెచ్చరించారు.

# పోలీసుస్టేషను తనిఖీ చేసిన డీసీపీ

**గంపలగూడెం డిసెంబర్ 30 ప్రభాతవార్త:** గంపలగూడెం పోలీస్ స్టేషనును విజయవాడ పోలీస్ కమిషనరేట్ రూరల్ డీసీపీ లక్ష్మీనారాయణ మంగళవారం వార్షిక తనిఖీచేశారు. గ్రామాల్లో జూదాలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని, వ్యవస్థీకృత నేరాలకు పాల్పడేవారిపై నిఘా ఉంచాలని, సైబర్ నేరాలు, బెట్టింగులు, ఇతర జూదాల కట్టడికి కఠిన చర్యలు తీసుకోవాలని డీసీపీ ఆదేశించారు. రికార్డుల నిర్వహణలో ఖచ్చితత్వం ఉండాలని, వివిధ సమస్యలపై పోలీసుస్టేషనుకు వచ్చే కక్షి దారులకు సత్వర న్యాయం జరిగే విధంగా చూడాలన్నారు. మైలవరం ఏసీపీ ప్రసాదరావు పాల్గొన్నారు.



# వైకాపా నాయకుడు తెదేపాలో చేరిక

**గంపలగూడెం డిసెంబర్ 30, ప్రభాతవార్త:** మండలంలోని కొనిజర్ల గ్రామానికి చెందిన వైయస్సార్సీపి నాయకుడు బొల్లా కరుణాకర్ రావు తన అనుచరులతో తెలుగుదేశం పార్టీలో చేరారు. మంగళవారం మండలంలోని తోటమూలలోని కళ్యాణమండపంలో జరిగిన తెదేపా ఎన్టీఆర్ జిల్లా రైతు సంఘం అధ్యక్షుడు చెరుకు రాజేశ్వరరావు, దేవాభక్తుని సీతారాం ప్రసాద్, మండల పార్టీ నాయకులు కరుణాకర్ రావు ను పార్టీ లోనికి పచ్చ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. సీనియర్ నాయకులు రేగళ్ల వీరారెడ్డి, ఏఎంసీ చైర్మన్ రేగళ్ల లక్ష్మీ అనిత, గంపలగూడెం సర్పంచ్ కోట పుల్లమ్మ, మండల పార్టీ అధ్యక్షుడు మానికొండ రామకృష్ణ, తిరువూరు మండల పార్టీ అధ్యక్షుడు దుబ్బాక వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



# ఎస్‌టియు 2026 డైరీ,క్యాలెండర్ ఆవిష్కరణ

**ఎ కొండూరు, డిశంబర్ 30, ప్రభాతవార్త :** ఎస్‌టియు ఎ కొండూరు 2026 డైరీ స్టిక్కర్ కాలెండర్‌ను ఎంఈవో ఎం.రాజశేఖర్ మంగళవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎపి స్టేట్ సెక్రటరీ ఎం.బసవయ్య ఎన్‌టిఆర్ జిల్లా అసోసియేట్ ప్రెసిడెంట్ ఎన్.జార్జ్ వాషింగ్టన్, మండల అధ్యక్షుడు బి.రామ్‌నాయక్, ప్రధాన కార్యదర్శి బి.జ్ఞాన ప్రసూన, ఆర్థిక కార్యదర్శి ఎం.శేఖర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంఈవో ఎం.రాజశేఖర్ ఎస్‌టియు రాష్ట్ర జిల్లా మండల శాఖ నేతలను అభినందించి క్రిస్మస్ నూతన సంవత్సరమ మరియు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు.



# పరిశ్రమల స్థాపనకై ప్రభుత్వ ప్రత్యేకదృష్టి

## కృష్ణాజిల్లా కలెక్టర్ డీకె బాలాజీ

**పెనమలూరు డిసెంబరు30,ప్రభాతవార్త :** పరిశ్రమల ఏర్పాటుకు ప్రభుత్వం ప్రత్యేక ప్రోత్సాహకాలు అందజేస్తుందని, భూకేటాయింపులు జరిగి అనుమతులు మంజూరు చేసిన యూనిట్ల స్థాపనకై ప్రత్యేకదృష్టి పెట్టాలని జిల్లా కలెక్టర్ డీ.కె.బాలాజీ అధికారులను ఆదేశించారు.మంగళవారం పెనమలూరు నియోజకవర్గంలోని కానూరు గ్రామంలో పారిశ్రామికవేత్తలు అధికారులను ఒక వేదిక వద్దకు చేర్చి పారిశ్రామికవాడల్లో నెలకొన్న సమస్యలపై చర్చావేదికను నిర్వహించారు.పారిశ్రామికవేత్తల సమస్యలను పరిష్కరించగలిగిన వాటిని పరిష్కరించి లేనివి ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్ళి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఒక ఇంటి నుంచి పారిశ్రామికవేత్తను తయారుచేయాలనే లక్ష్యంతో పారిశ్రామిక వాడలలో మౌలిక వసతులు కల్పించి ప్రభుత్వ రాయితీలను అందించి ప్రోత్సహిస్తోందని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.వారి సమస్యల పరిష్కారం కోసం ప్రతి 20మంది వ్యాపారవేత్తలకు ఒక ప్రత్యేక అధికారిని నియమిస్తామని వారిచ్చే నివేదికే కీలకమని తెలిపారు.ఈ సమావేశంలో గుడివాడ ఆర్డీవో జి.బాలసుబ్రహ్మణ్యం, పరిశ్రమల శాఖ జిఒల్లా మేనేజర్ ఆర్.వెంకట్రావ్, మల్లవల్లి పారిశ్రామికవాడ ఛైర్మన్ జి.రవికుమార్,ప్రభుత్వ శాఖల జిల్లా అధికారులు, పారిశ్రమికవేత్తలు తదితరులు పాల్గొన్నారు.



# వేడుకలు శృతిమించితే కఠిన చర్యలు తప్పదు : పోలీసు కమిషనర్ రాజశేఖర్

**విజయవాడ, డిసెంబరు 30(ప్రభాతవార్త ) :** నూతన సంవత్సరం సందర్భంగా రాత్రి వేళల్లో వేడుకలు శృతిమించితే కఠిన చర్యలు తప్పవని



విజయవాడ పోలీసు కమిషనర్ ఎస్.వి.రాజశేఖర్ బాబు హెచ్చరించారు. వేడుకలు ఆమోదయోగ్యం, ఆహ్లాదకరంగా, ఆరోగ్యంగా, హానిరహితంగా ఉండాలని ఆయన కోరారు. ఎన్.టి.ఆర్ జిల్లా ప్రజలకు, పోలీస్ అధికారులు, సిబ్బందికి పోలీస్ కమీషనర్ ఎస్.వి. రాజశేఖర్ బాబు 2026 నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియచేశారు. డిసెంబర్ 31 రాత్రి నూతన సంవత్సరం వేడుకల సందర్భంగా ప్రజా భద్రత దృష్ట్యా ఆంక్షలు అమల్లో ఉంటాయని ఆయన పేర్కొన్నారు. ప్రజలు పోలీసులకు సహకరించి, చట్టాన్ని గౌరవించాలని విజ్ఞప్తి చేశారు. అర్ధరాత్రి రోడ్లపై వేడుకలకు అనుమతి లేదని, మద్యం సేవించి వాహనాలు నడపరాదని, ట్రిపుల్ రైడింగ్, అతి వేగం, అజాగ్రత్త డ్రైవింగ్ పై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బందర్ రోడ్, ఏలూరు రోడ్, రోడ్లు బెంజ్ సర్కిల్, కనకదుర్గ ఫ్లైఓవర్లపై ట్రాఫిక్ ఆంక్షలు అమలు చేస్తున్నామని, ప్రజలు గుంపులు గుంపులుగా చేరి అల్లర్లు చేయరాదని, కేకలు వేస్తూ వాహనాలపై తిరగరాదని సూచించారు. నగరంలో గస్తీ ముమ్మరంగా కొనసాగుతుందని, ప్రధాన రహదారుల్లో ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 31వ తేదీ అర్ధరాత్రి నుంచి జనవరి 1వ తేదీ ఉదయం వరకు కనకదుర్గ ఫ్లైఓవర్, బెంజి సర్కిల్ ఫ్లైఓవర్లపై రాకపోకలు నిషేధిస్తున్నట్లు పేర్కొన్నారు. మద్యం సేవించి అల్లర్లు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని, అధిక శబ్దాలు, సైలెన్సర్ తొలగింపు విన్యాసాలు, బాణాసంచా నిషేధం విధించినట్లు పేర్కొన్నారు. రోడ్డు ప్రమాదాలు, ఇబ్బందులు లేకుండా బాధ్యతాయుతంగా, భద్రంగా నూతన సంవత్సరాన్ని ఆహ్లాదకరంగా జరుపుకుందామని కమిషనర్ పిలుపునిచ్చారు.

# పిపిపి విధానంలో అదనంగా 100 వైద్య సీట్లు : యార్లగడ్డ

**గన్నవరం, డిసెంబర్ 30, ప్రభాతవార్త :** రాష్ట్రవ్యాప్తంగా పిపిపి విధానంలో నిర్మించనున్న 10 మెడికల్ కళాశాలల్లో పేద విద్యార్థులకు అదనంగా 100 సీట్లు లభిస్తాయని ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు తెలిపారు. నూతన సంవత్సరం రాక సందర్భంగా గత 18 నెలల కాలంలో కూటమి ప్రభుత్వం సాధించిన విజయాలను మంగళవారం యార్లగడ్డ పత్రికా ప్రకటనలో విలేకరులకు తెలియచేసారు. ఈ సందర్భంగా యార్లగడ్డ మాట్లాడుతూ వైద్య కళాశాల నిర్మాణంలో రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న పిపిపి విధానాన్ని కేంద్ర ప్రభుత్వం సైతం సమర్ధించిందని, దేశరాజధాని ఢిల్లీలోనూ పిపిపి పద్ధతిలో వైద్య కళాశాల నిర్మిస్తున్నట్లు చెప్పారు. పిపిపి విధానంలో నిర్మించే వైద్య కళాశాలలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నియంత్రణ ఉంటుందని ఈ విషయంలో ఏ విధమైన అపోహలకు తావులేదని తేల్చి చెప్పారు. ఎన్నికల్లో సూపర్ సిక్స్



హామీలను ఇప్పటికే తమ ప్రభుత్వం నెరవేర్చిందని, మహిళలకు ఆర్థిక భరోసా కల్పించేందుకుగాను రాష్ట్ర వ్యాప్తంగా స్త్రీ శక్తి పథకం కింద 3.25కోట్ల ప్రయాణాల ద్వారా రూ.1,144కోట్లు లబ్ధి చేకూరిందన్నారు. దీపం పథకం ద్వారా ఏడాదికి మూడు ఉచిత సిలిండర్లు చొప్పున ఇప్పటివరకు దాదాపు రెండు కోట్ల సిలిండర్ల పంపిణీ చేశామని తద్వారా రూ. 2,684కోట్లు మహిళలకు ఆదా అయ్యిందన్నారు. 67.27 లక్షల మంది విద్యార్థులకు తల్లికి వందనం పథకం ద్వారా రూ. 10,090 కోట్లు మంజూరు చేసినట్లు వివరించారు. రైతుల సంక్షేమం కోసం అన్నదాత సుఖీభవ పథకం కింద 46 లక్షల మంది రైతులకు రూ. 6,310 కోట్లు రైతులు ఖాతాలో జమ చేసినట్లు యార్లగడ్డ పేర్కొన్నారు. ఏడాది రికార్డు స్థాయిలో ధాన్యాన్ని సేకరించి 24 గంటల్లో రైతులు ఖాతాలో నగదును జమ చేసినట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు. మార్కెట్ ఇంటర్వెన్షన్ స్కీం ద్వారా పొగాకు, మామిడి, కోకో, ఉల్లి పంటలకు 1,100 కోట్లు సాయంగా అందించినట్లు చెప్పారు. ఎన్టీఆర్ భరోసా పింఛన్ల ద్వారా వృద్ధులు, వికలాంగులు, వితంతువులకు ఏడాదికి రూ. 33 వేల కోట్లను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. మత్స్యకారులను ఆదుకునేందుకు మత్స్యకార భరోసా పథకం ద్వారా ఏడాదికి రూ.20 వేలు చొప్పున 1.25 లక్షల మందికి రూ. 250 కోట్లు పంపిణీ చేసినట్లు ఎమ్మెల్యే యార్లగడ్డ తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 2004 అన్నా క్యాంటీన్ ద్వారా ఇప్పటివరకు నాలుగు కోట్ల భోజనాలు నామమాత్రపు ధరకు అందించినట్లు చెప్పారు. వీటితోపాటు పాస్టర్లు, ఇమామ్ లు, పురోహితులు, లాయర్లు తదితర అన్ని వర్గాల వారికి ఆర్థికంగా చేయూతనందిస్తున్నట్లు తెలిపారు. ఎన్నికల హామీలైన సూపర్ సిక్స్ పథకాలను అమలు చేస్తూనే రాష్ట్రాన్ని అభివృద్ధి వైపు పరుగులు పెట్టిస్తున్నట్లు యార్లగడ్డ వివరించారు. పోలవరం నిర్మాణాన్ని వేగవంతం చేయడంతో పాటు రాజధాని అమరావతి లోనూ నిర్మాణ పనులు ఊపందుకున్న సంగతిని యార్లగడ్డ గుర్తు చేశారు. విశాఖపట్నం ను ఐటీ హబ్ గా తీర్చిదిద్దుతున్నట్లు చెప్పారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కృషితో ఇక్కడ గూగుల్ డేటా సెంటర్ తో పాటు టిసిఎస్, కాగ్నిజెంట్ వంటి పేరొందిన ఐటీ సంస్థలు విశాఖపట్నంలో కార్యకలాపాలు సాగిస్తున్నట్లు వివరించారు. నిరుద్యోగ యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా రాష్ట్రంలో పెద్ద ఎత్తున పరిశ్రమలు ఏర్పాటుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కృషి చేస్తున్నట్లు తెలిపారు. విద్యా వ్యవస్థను గాడిలో పెట్టేందుకు మంత్రి లోకేష్ చిత్తశుద్ధితో కృషి చేస్తున్నారని ప్రశంసించారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల ప్రగతిని తల్లిదండ్రులకు వివరించేందుకు తొలిసారిగా పేరెంట్ టీచర్ మీటింగ్ను ప్రవేశపెట్టినట్లు వివరించారు. రాష్ట్రానికి ఐటీ సంస్థలు రావడంలో మంత్రి లోకేష్ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. గత ప్రభుత్వ పాలనలో అస్తవ్యస్తంగా మారిన పంచాయతీరాజ్ వ్యవస్థను గాడిలో పెట్టేందుకు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పంచాయతీరాజ్ వ్యవస్థను ప్రక్షాళన చేస్తున్నట్లు వెంకట్రావ్ పేర్కొన్నారు. పంచాయతీరాజ్ వ్యవస్థలో పూర్తిపారదర్శక సేవలందించేందుకు ఉప ముఖ్యమంత్రి తీసుకున్న చర్యలు సత్ఫలితాలు ఇస్తున్నట్లు యార్లగడ్డ తెలిపారు. రాష్ట్ర ప్రజల శ్రేయస్సు కోసం పనిచేస్తున్న కూటమి ప్రభుత్వానికి ప్రజలందరూ అండగా ఉండాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెంకట్రావు పిలుపునిచ్చారు.

# సిఐటియు అఖిలభారత మహాసభలు జయప్రదం కోరుతూ బైక్ ర్యాలీ

**మైలవరం, డిశంబర్ 30, ప్రభాతవార్త :** సిఐటియు అఖిలభారత 18వ మహాసభలు జయప్రదం చేయాలని కోరుతూ మైలవరం మండల కేంద్రంలో సిఐటియు కార్యాలయం నుండి బస్టాండ్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు ఈ



సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు సిహెచ్ సుధాకర్ మాట్లాడుతూ ఉద్యోగ, కార్మిక సమస్యల పరిష్కారం కోసం సిఐటియు నిత్యం ఆందోళన పోరాటాలు నిర్వహిస్తున్నది, కార్మిక హక్కులు, సంక్షేమంతో పాటు ప్రభుత్వ రంగ సంస్థలు, పరిశ్రమల రక్షణ కోసం పోరాటాలు నిర్వహిస్తుందని అన్నారు, కేంద్రంలో మూడోసారి అధికారంలోకి వచ్చిన బిజెపి ప్రభుత్వం మరింత దూకుడుగా వ్యవహరిస్తూ కార్మిక వర్గం అనేక త్యాగాలతో సాధించుకున్న 29 కార్మిక చట్టాలను రద్దుచేసి నాలుగు లేబర్ కోడ్స్ గా మార్చి కార్మికులను కట్టు బానిసలుగా చేస్తుందని అన్నారు, ఈ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నాలుగు లేబర్ కోడ్స్ రాష్ట్రాల ముఖ్యమంత్రులు ఆలోచనలో ఉంటే ఆంధ్ర రాష్ట్రంలో ఉన్న కూటమి ప్రభుత్వం రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఒక అడుగు ముందుకు వేసి ఎనిమిది గంటల పని విధానాన్ని మార్చి 10 గంటల పని పెంచి మహిళలు రాత్రిపూట షిఫ్ట్లతో పని చేసేందుకు అనుమతిస్తూ చట్టం చేసిందని ఇది కార్మికులను మరింత దోపిడీ చేయడానికి అవకాశం కల్పిస్తుందని, మహిళల రక్షణకు తీవ్ర విఘాథంగా ఉంటుం దని ఆవేదన వ్యక్తం చేశారు,తక్షణమే లేబర్ కోడ్స్ ఉపసంహరించుకోవాలని లేని పక్షంలో దేశవ్యాప్త ఉద్యమాన్ని చేస్తామని హెచ్చరించారు, కార్యక్రమంలో రైతు సంఘం మండల కార్యదర్శి వజ్రాల వెంకటరెడ్డి, బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ మండల నాయకులు మధు శ్రీనివాసరావు, సురేష్ బాబు, ఎస్ విజయ్, పి కోటేశ్వరావు, తిరుపతిరావు, మారేశ్వర్రావు పాల్గొన్నారు.

# వైకుంఠ ఏకాదశి సందర్బంగా ఉత్తర ద్వార దర్శనం

**తిరువూరు, డిశంబర్ 30, ప్రభాతవార్త :** తిరువూరు పాటిమీద దాసాంజనేయ స్వామి వారి ఆలయంలో వైకుంఠ ఏకాదశి సందర్భముగా మంగళవారం ఆలయంలో స్వామివారు ఉత్తర ద్వార దర్శనం కల్పించారు.



# మున్సిపల్ బడ్జెట్ సమావేశం

**తిరువూరు, డిశంబర్ 30, ప్రభాతవార్త :** తిరువూరు మున్సిపల్ చైర్పర్సన్ కె.నిర్మల అధ్యక్షతన మున్సిపల్ బడ్జెట్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో 2025-26 సవరించిన బడ్జెట్ అంచనాలు, 2026-27 సంవత్సరానికి బడ్జెట్



అంచనాలపై చర్చ కొనసాగింది. ప్రజలపై పన్నుల భారం పడకుండా చూడాలని, ఇతరత్రా ఆదాయ వనరులపై దృష్టి సారించాలని కౌన్సిలర్లు సూచనలు చేశారు. కొన్ని సమస్యలను ప్రస్తావించిన సభ్యులు పరిష్కారానికి చర్యలు తీసుకొని అధికారులను కోరారు.



# వైభవంగా ముక్కోటి ఏకాదశి

**తిరువూరు, డిశంబర్ 30, ప్రభాతవార్త :** తిరువూరు టౌన్లో మంగళవారం అత్యంత పవిత్ర పర్వదినం ముక్కోటి ఏకాదశి



సందర్భంగా శ్రీమహావిష్ణు కృపతో జీవితం వైకుంఠ మార్గంలో నడిచే దినమే ముక్కోటి ఏకాదశి తెల్లవారుజామున మూడు గంటల నుండి ఉత్తర ద్వార దర్శనాలతో భక్తజన సందోహంతో దేవాలయాలు కిటకిటలాడాయి. ఆ క్రమంలో శ్రీ రామలింగేశ్వర స్వామి దేవాలయ నందు ప్రత్యేక పూజల్లో చైర్మన్ జంగాల మురళీకృష్ణ దంపతులు, వెంకటాచల స్వామి వారి దేవాలయ చైర్మన్ పర్వతం శ్రీనివాసరావు దంపతులు, మున్సిపల్ కౌన్సిలర్ నాళ్ల సురేంద్ర లక్ష్మి మరియు భక్తజన సందోహం పాల్గొన్నారు.

# వైకుంఠ ఏకాదశి సందర్భంగా టిటిడిలో 10 వేల మందికి అన్నదానం

**విజయవాడ కార్పొరేషన్,డిసెంబరు 30,ప్రభాతవార్త:** వైకుంఠ ఏకాదశి సందర్భంగా లబ్బీపేట లోని టిటిడి దేవస్థానంలో మంగళవారం భక్త జన సమూహం పోటెత్తింది. శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని ఉదయం 1.30కు భక్తులకు ఉత్తర ద్వార దర్శనం కల్పించారు.అనంతరం ఉదయం నుండి సాయంత్రం వరకు విశేష పూజాదికాలు ఘనంగా జరిగాయి. ఉదయం సుప్రభాత సేవ,కైంకర్యాలు,ధనుర్మాస కైంకర్యాలు,తోమాల సేవ,అభిషేకాలు,అర్చనలు,నైవేద్యాలను పురోహితులు స్వామి వార్కి నివేదించారు. భక్తులు టిటిడి దేవస్థానానికి పోటెత్తడంతో ఆ రోడ్లన్నీ జనసంద్రమయ్యాయి. రాత్రి 9 గంటలకు ఏకాంత సేవతో పూజా కార్యక్రమాలు ముగిసాయి. టిటిడి అర్థ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆలయాన్ని తొలుత పూలతో అలంకరించడంతో పాటు భక్తుల సౌకర్యార్థం క్యూ లైన్లు,దాదాపు 10 వేల మందికి అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. 'గోవింద' నామ స్మరణతో దేవాలయ పరిసర ప్రాంతాలు ఆధ్మాత్మికతను సంతరించుకున్నాయి. కార్యక్రమంలో ఆలయ సూపరిండెంటెంట్ మల్లిఖార్జునరావు,ఇనస్పెక్టర్ లలితా రమాదేవి,ఆలయ అర్చకులు మురళీకృష్ణ,శశికిరణ్,హేమంత్,ఆనంద్ కృష్ణలు పూజాదికాలను



నిర్వహించగా, న్యాయవాదులు విజయకుమార్,పడవల ఏడుకొండలు ,ప్రసాద్,భక్తులు ప్రసాదరెడ్డి,సుబ్రహ్మణ్యం,శ్రీనివాసరెడ్డి తదితరులు తమ వంతు సహకారాన్ని అందించారు. మహిళా భక్తులు శాంతిశ్రీ,తులసి,రాజేశ్వరి తదితరులు తమ వంతు సాయం అందించడంతో పాటు భక్తులకు అన్న ప్రసాదాన్ని వితరణ చేయడంలో ప్రముఖ పాత్ర వహించారు. కార్యక్రమం ఆద్యంతం భక్తుల గోవింద నామ స్మరణతో ఆ ప్రాంతం ఆధ్యాత్మికతను సంతరించుకుంది.

# రాష్ట్ర గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం క్యాలెండర్ను ఆవిష్కరించిన సిఎం

**విజయవాడ,డిసెంబర్30,ప్రభాతవార్త:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సచివాలయంలో గౌరవ రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యులను వారి చాంబర్లో కలిసి విదేశీ పర్యటనకు ముఖ్యమంత్రి వెళ్ళుచున్నందున ఈ రోజు ముందుగా గౌరవ ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారికి 2026 నూతన సంవత్సరం శుభాకాంక్షలు తెలియజేసిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం. రాష్ట్ర అధ్యక్షులు. భూపతి రాజు రవీంద్ర రాజు. తదుపరి ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం.క్యాలెండర్ను గౌరవ ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు గారితో ఆవిష్కరించిన చేయించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ



ఉద్యోగుల సంఘం. రాష్ట్ర అధ్యక్షులు. శ్రీ కె. ఆర్. సూర్యనారాయణ, రాష్ట్ర ఉపాధ్యక్షులు, సుగుణమ్మ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం. రాష్ట్ర అధ్యక్షులు భూపతి రాజు రవీంద్ర రాజు, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు రాటకొండ శ్రీనివాస్ పాల్గొన్నారు.

# ఘనంగా శ్రీ జయరామ విజ్ఞాన విహార పాఠశాల వార్షికోత్సవం

**ఉంగుటూరు, డిసెంబర్ 30, ప్రభావతార్త:** కృష్ణాజిల్లా, ఉంగుటూరులో శ్రీ విజ్ఞాన విహార ఎడ్యుకేషనల్ సొసైటీ కార్యదర్శి ముళ్లపూడి గోవిందరావు అధ్యక్షతన పాఠశాల ప్రిన్సిపాలన ఎం. సావిత్రి ఆధ్వర్యంలో శ్రీ జయరామ విజ్ఞాన విహార పాఠశాల 19వ వార్షికోత్సవం ఘనంగా జరిపారు. కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ విశ్వ హిందూ పరిషత్ ప్రాంత సంఘటన కార్యదర్శి శ్రీనివాసరెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని విద్యార్థులకు ఉత్తమ విలువలతో కూడిన విద్య ప్రాధాన్యతను వివరించారు. మధ్యాహ్నం నిర్వహించిన శారీరక ప్రదర్శనలు, సాయంత్రం భరతనాట్యం, కూచిపూడి తదితర భారతీయ సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. గన్నవరం మాజీ ఎమ్మెల్యే డాక్టర్ దాసరి వెంకట బాలవర్ధనరావు, దక్షిణ భారత హిందీ ప్రచార సభ, సీనియర్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ పేరిశెట్టి శ్రీనివాసరావు, పూర్వ విద్యార్థుల తరపున హైదరాబాద్ ప్రోగ్రామ్ అనలిస్ట్ మీడియా మింట్ ఆత్మకూరి నాగేంద్రబాబు గౌరవ అతిథులుగా పాల్గొని ప్రతిభవంతులైన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

# వైభవంగా నృసింహుని ముక్కోటి ఉత్తర ద్వార దర్శనం

**మంగళగిరి, డిసెంబర్ 30, ప్రభాతవార్త :** మంగళగిరిలో పట్టణంలో వేంచేసియున్న శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ లక్ష్మీ నరసింహ స్వామివారి ముక్కోటి ఉత్తర దర్శనం కార్యక్రమం అత్యంత వైభవంగా నిర్వహించారు. తెల్లవారుజామున నాలుగు గంటల నుంచి శ్రీ స్వామి వారు ఉభయ దేవేరుల సమేతంగా బంగారు గరుడ వాహనంపై ఉత్తర ద్వారంలో భక్తులకు కనువిందుగా దర్శనం ఇచ్చారు.వైకుంఠ ఏకాదశి రోజున బంగారు దక్షిణావృత శంఖంతో భక్తులకు తీర్థ ప్రసాదాన్ని పంపిణీ చేయడం గత కొన్నేళ్లుగా ఆనవాయితీగా వస్తోంది. ఆనాటి నుంచి ప్రతి ఏటా ముక్కోటి ఏకాదశి రోజున దక్షిణావృత శంఖంతో లక్ష్మీ నరసింహ స్వామికి అభిషేక పూజలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ ఏడాది కూడా శంఖం ద్వారానే భక్తులకు తీర్థం పంపిణీ చేశారు. బంగారు దక్షిణావృత శంకుతో తీర్థం స్వీకరించేందుకు హద్దులు భారీగా పాల్గొన్నారు. పలువురు న్యాయమూర్తులు, రాజకీయ నాయకులు, వివిధ రంగాలకు చెందిన ఉన్నతాధికారులు పాల్గొని శ్రీ స్వామివారి తీర్థ ప్రసాదాలను స్వీకరించారుశంకు తీర్థం స్వీకరించేందుకు మంగళగిరి చుట్టుపక్కల ప్రాంతాల నుంచి ఏ కాకుండా ఇద్దరు ప్రాంతాల నుంచి కూడా భక్తులు భారీగా పాల్గొన్నారు. భక్తుల తాకిడి



విపరీతంగా ఉండటతో ,భక్తుల మనోభావాలను దృష్టిలో పెట్టుకొని ఆలయ అధికారులు ఏడాది రెండు రోజులపాటు భక్తులకు శంకు తీర్థం అందుబాటులోకి తీసుకొచ్చారు. వైకుంఠ ఏకాదశి సందర్భంగా మంగళవారం తెల్లవారుజామున నాలుగు గంటల నుంచి స్వామి వారు ఉత్తర ద్వారంలో భక్తులకు మధ్యాహ్నం ఒంటిగంట వరకు దర్శనమిచ్చారు. అనంతరం శ్రీ స్వామి వారి గ్రామోత్సవం ఘనంగా నిర్వహించారూ. ఓంకార నాదం వినిపించే ఈ బంగారు దక్షిణావృత శంఖం తీర్థం స్వీకరిస్తే గృహ, గ్రహ, ఇతి బాధలు, వ్యాధులు తొలగిపోవునని భక్తుల విశ్వాసం. ఆలయ కార్యనిర్వాహణాధి .కారి కోగంటి సునీల్ కుమార్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

# గోవింద నామస్మరణతో మార్మోగిన భావదేవుని ఆలయం

**పొన్నూరు, డిసెంబర్ 30,ప్రభాతవార్త:** గోవిందా.....గోవిందా.....జై భావదేవ....జైజై భావదేవ....అనే భక్తుల నినాదాలతో దక్షిణకాశీగా, టెంపుల్ సిటీగా ప్రసిద్ధిగాంచిన స్వర్ణపురి పట్టణ మార్మోగిపోయింది. వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని పట్టణంలోని అతి పురాతనమైన స్వయంభూగా వెలసిన శ్రీ సుందరవల్లీ రాజ్యలక్ష్మి సమేత శ్రీ సాక్షి భావనారాయణస్వామివారి ఉత్తర ద్వార దర్శనానికి భక్తులు పెద్ద ఎత్తున క్యూ కట్టారు. ఉత్తర ద్వారంలో స్వామివారిని దర్శించుకొంటే సర్వసుఖాలు కలుగుతాయని, ముక్కోటి దేవతలను దర్శించుకున్న ఫలితం దక్కుతుందని భక్తుల విశ్వాసం. అందులో భాగంగా ఈ ఏడాది నూతనంగా వచ్చిన ధర్మకర్తల మండలి సభ్యులు గతంలో ఎన్నడూ లేని విధంగా దేవాలయాన్ని వివిధ రకాల పుష్పాలతో అందంగా అలంకరించారు. సాక్షాత్తు ఆ వైకుంఠమే స్వర్ణపురి పట్టణానికి వచ్చిందా..? అన్న విధంగా దేవాలయాన్ని తీర్చి దిద్దారు. దేవాలయంలో ఆధ్యాత్మిక శోభ ఉట్టిపడింది. భక్తులు వేకువ జామునే తలంటుస్నానాలు ఆచరించి, సాంప్రదాయబద్ధమైన నూతన వస్త్రాలు ధరించి స్వామివారి దర్శనానికి వచ్చారు. భక్తులు క్యూ లైన్ల ద్వారా ప్రశాంతమైన వాతావరణంలో స్వామివారిని దర్శించుకుని తన్మయత్వాన్ని చెందారు. అర్చకస్వాములు గోవర్ధనం రామకృష్ణ, గౌతమ్, గురుమూర్తి ఆధ్వర్యంలో వేకువజామున నాలుగు గంటలకే శ్రీ స్వామి, అమ్మవార్లను ప్రత్యేకంగా వేదికపైకి వేంచేపుచేసి ఉత్తర ద్వారంలో దర్శన భాగ్యాన్ని కల్పించారు. దేవాలయంలోకి వచ్చిన భక్తులకు తనివితీరా, కన్నుల విందుగా శ్రీ భావదేవుని మూలవిరాట్ను ఇతర ఉపాలయాలను దర్శించుకొని భక్తిపారవశ్యాన్ని పొందారు. అనంతరం భక్తులకు పులిహోర, దద్ధ్యోధనము, చక్రపొంగలి తదితర ప్రసాదాలను పంపిణీ చేశారు. స్వామివారిని దర్శించుకున్న భక్తులకు దక్షిణావృత శంఖుతో తీర్ధాన్ని అందజేశారు. ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ నాలుగు గంటలకే దేవాలయానికి వచ్చి స్వామివారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. స్వర్ణపురి పట్టణంలో తిరునాళ్ళ శోభ ఉట్టిపడింది. దేవాలయం అసిస్టెంట్ కమిషనర్ గాండ్ల కామేశ్వరమ్మ పర్యవేక్షణలో ధర్మకర్తల మండలి సభ్యులు శిఖాకొల్లి గుర్నాధరావు, ధరణికోట పద్మావతి, ఆకురాతి అనూరాధ, గుడివాడ పవన్, ఊటుకూరి బాజి శిరీషా, సింహాద్రి వెంకటలక్ష్మీ, పరాశరం రంగవల్లి, కాట్రగడ్డ రామచంద్రరావు, కూరాకుల సత్యనారాయణ, ఎక్స్ అఫిషియో సభ్యులు పొన్నూరు బాలగంగాధర తిలక్తో పాటు పలువురు భక్తులు ఆకురాతి శ్రీనివాసరావు, ధరణికోట సాయికిరణ్ భక్తులకు ఏర్పాట్లు చేశారు.

# యువత సేవాభావాన్ని అలవర్చుకోవాలి

**ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, డిసెంబర్30, ప్రభాతవార్త:** నేటి యువత అన్ని రంగాల్లో రాణిస్తున్నారని వాటితో పాటు సేవా భావాన్ని అలవర్చుకుని దేశానికి కీర్తి ప్రతిష్టలు పెంచాలని రాష్ట్ర ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ ఆచార్య మద్దినేని సుధాకర్ సూచించారు. జాతీయ సేవా పథకం ఉత్తమ పురస్కారాల కార్యక్రమం మంగళవారం జరిగింది. ఈ కార్యక్రమానికి ఇన్చార్జ్ వీసి ఆచార్య కె.గంగాధరరావు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. వర్సిటీ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ ఆచార్య వి.దివ్య తేజోమూర్తి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన



గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులకు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లకు పురస్కారాలు అందజేశారు. ఇన్చార్జ్ రెక్టార్ ఆచార్య ఆర్.శివరాం ప్రసాద్, ఇన్చార్జ్ రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహాచలం, వర్సిటీ కళాశాలల ప్రిన్సిపాల్స్ ఆచార్య కె.వీరయ్య, ఆచార్య యం.సురేష్కుమార్, ఆచార్య పి.పి.సత్యపాల్ కుమార్, ఆచార్య తేజోమూర్తి, ఓఎస్డి ఆచార్య ఆర్వీఎస్ఎస్ఎన్. రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

**ఎల్ఎల్ ఎం 4వ సెమిస్టర్ ఫలితాలు విడుదల**

ఏఎన్యు పరిధిలో ఎల్ఎల్ఎం కోర్సుకు అక్టోబరులో జరిగిన 4వ సెమిస్టర్ పరీక్షల ఫలితాలను మంగళవారం సిఇ ఆలపాటి శివప్రసాదరావు విడుదల చేశారు. 111మందికి 78మంది ఉత్తీర్ణత సాధించినట్లు పేర్కొన్నారు.

**పీజీ కోర్సుల రీవాల్యూయేషన్ ఫలితాలు విడుదల**

ఏఎన్యు పరిధిలో జూలైలో జరిగిన పలు పీజీ కోర్సుల రీవాల్యుయేషన్ ఫలితాలను సిఇ విడుదల చేశారు. ఎంబిఏ, ఎంబిఏ (ఐబి) ఎంఎస్సీ ఫుడ్సైన్స్, బయో కెమిస్ట్రీ 2వ సెమిస్టర్, 2/3 ఎల్ఎల్బి 4వ సెమిస్టర్, 4/5 ఎల్ఎల్బి 8వ సెమిస్టర్ ఫలితాలు విడుదల చేశారు.

# ఉన్నత చదువులకు తొలిమెట్టు 10వ తరగతి

## గుంటూరు జిల్లా కలెక్టర్

**గుంటూరు విద్య, డిసెంబర్ 30 ప్రభాతవార్త :** భవిష్యత్తులో ఉన్నత చదువులకు పదవ తరగతి కీలకమని జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా విద్యార్థులకు సూచించారు. మంగళవారం స్థానిక ఏ.టి అగ్రహారంలోని ఎస్.కే.బి.ఎం మున్సిపల్ ఉన్నత పాఠశాలను జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా సందర్శించి పదవ తరగతి విద్యార్థులతో మాట్లాడారు. పదవ తరగతి విద్యార్థుల తరగతుల గదులకు కలెక్టర్ వెళ్లి విద్యా బోధనను, రానున్న పదవ తరగతి పరీక్షలకు సన్నద్ధత వివరాలను తెలుసుకున్నారు. డాక్టర్లు, ఇంజనీర్లు, శాస్త్రవేత్తలు, ఉపాధ్యాయులు, సీఎలు, ఆర్మీ అధికారులుగా ఎంత మంది అవ్వాలనుకుంటున్నారని విద్యార్థులను ప్రశ్నించి వారి స్పందనను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ విద్యార్థులతో మాట్లాడుతూ పదవ తరగతిలో సాధించిన మార్కులు భవిష్యత్తులో ఉన్నత చదువులకు, ఉపాధి అవకాశాలకు కీలకమవుతాయని తెలిపారు. ప్రతి ఒక్కరు శ్రద్ధగా చదువుకొని రానున్న పదవతరగతి పరీక్షలలో రాష్ట్ర, జిల్లా స్థాయిలో అత్యుత్తమ మార్కులు సాధించాలని, నూరు శాతం ఉత్తీర్ణత సాధించాలన్నారు. ప్రభుత్వం రానున్న పదవ తరగతి పరీక్షలకు నిర్దేశించిన ప్రణాళిక ప్రకారం చదువుకోవాలన్నారు. పదవ తరగతి విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా అవసరమైన అన్ని చర్యలను తీసుకోవడం జరుగుతుందని చెప్పారు. ప్రతి పాఠశాలకు ఒక ప్రత్యేక అధికారిని నియమించామని సమస్యలు ఏమైనా ఉంటే వారి దృష్టికి తీసుకువస్తే వెంటనే పరిష్కార దిశగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. పలువురు విద్యార్థులు మాట్లాడుతూ అసెస్మెంట్ పరీక్షలు బుక్లెట్లో కాకుండా మాక్ టెస్ట్ పరీక్షలు ప్రత్యేకంగా నిర్వహించాలని, లెక్కలు, బయాలజీ సైన్సు, హిందీ తరగతులు అదనంగా నిర్వహించాలని, సాయంత్రం స్టడీ అవర్స్ లో అల్పాహారం అందించాలని జిల్లా కలెక్టర్ ను కోరారు. వీటిపై జిల్లా కలెక్టర్ స్పందిస్తూ విద్యార్థులు తెలిపిన విధంగా మాక్ టెస్ట్ పరీక్షలు ప్రత్యేకంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని, విద్యార్థులకు అవసరమైన సబ్జెక్టులకు అదనంగా తరగతులు నిర్వహించాలని పాఠశాల ఉపాధ్యాయులకు సూచించారు. జిల్లా వ్యాప్తంగా అన్ని పాఠశాలల్లో 10వ తరగతి విద్యార్థులతో ప్రధానోపాధ్యాయులు ప్రత్యేకంగా మాట్లాడి వారికి అవసరమైన సబ్జెక్టులలో అదనపు తరగతులు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని డీఈఓ ను ఆదేశించారు. పదవ తరగతి విద్యార్థులకు సాయంత్రం స్టడీ అవర్లో అల్పాహారం అందిస్తామని జిల్లా కలెక్టర్ విద్యార్థులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి డా. సలీం భాష, ఎంఈఓ ఖుద్దూస్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఖాజావలి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# బాధ్యతే అసలైన గౌరవం



ప్లాట్ఫామ్ పై నిలబడి రైలు కోసం జనంలో ఆమె ఒకరు. కానీ, తను రైలు ఎక్కడానికి కాదు. ఆ ట్రైన్ నుంచి దిగే ప్రయాణికుల కోసం. వాళ్లిచ్చే సామాన్లు మోస్తేనే ఆమె పిల్లల కడుపు నిండుతుంది. తనే సంధ్యా మారవి. భర్త మరణంతో పిల్లల భవిష్యత్తుకోసం రైల్వే కూలీగా మారారు. జీవితం ఎప్పుడు ఎలాంటి మలుపు తిరుగుతుందో ఎవరికీ తెలీదు. 2016లో భర్త మరణం సంధ్య మారవిని కుదిపేసింది. చేతిలో చిల్లిగవ్వలేదు. ముగ్గురు పిల్లలు. తను బాధ పడుతూ కూర్చుంటే వారి కడుపు నిండేదెలా అనుకున్నారామె. దాంతో కుటుంబ భారాన్ని భుజాలపై వేసుకున్నారు. ఎప్పుడూ ఇంటి నుంచి బయటికి వెళ్లింది లేదు. పెద్దగా చదువు లేదు. ఏ పని చేయాలో తెలియలేదు. అలాగని ఎవరి దగ్గర చేయి చాచలేదు. కష్టాన్నే నమ్ముకున్నారు సంధ్య. కుటుంబాన్ని పోషించడానికి మగవాళ్లు మాత్రమే రైల్వే కూలీనే వృత్తిగా ఎంచుకోవచ్చు. జబల్పూర్ రైల్వే స్టేషన్‌లో బ్యాడ్జ్ నంబర్ 36, ఎరుపు చొక్కా ధరించి కూలీగా మారారీమె. 400మంది పురుషుల మధ్యలో ఒక్కరే మహిళ. ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రతిసారీ సుమారు 45 కేజీల బరువుని భుజాలపై మోసుకెళ్లాలి. అయినా భయపడలేదు. మొదటిసారి నేను స్టేషన్‌లో పనిచేయడానికి నిలబడినప్పుడు అందరూ వింతగా చూశారు. మగవాళ్ళు మాత్రమే చేసే పని నీవల్ల అవుతుందా? ఇంత బరువు మోయగలవా అన్నట్లు చూశారు. వాళ్ల ముందే లగేజీని మోసి చూపించా. పరిస్థితులు ఎంత కఠినంగా ఉన్నా సంకల్పం బలంగా ఉంటే ఏది అసాధ్యం అంటారు సంధ్య. రోజూ కట్నీ నుంచి జబల్పూర్‌కు 45కి.మీ రవాణా ప్రయాణికుల పిలుపుకోసం ఎదురు చూస్తుంటారీమె.

**అమ్మ మేల్కొంటుంది.....** స్టేషన్‌లో పనులు ముగించుకుని ఇంటికి వెళ్లగానే ఆమెలోని కూలీ నిద్రపోయి అమ్మ మేల్కొంటుంది. పిల్లలకి అన్న తినిపించి, చదువు చెప్పి, నిద్రపుచ్చే వరకూ విశ్రాంతి తీసుకోరామె. 'భుజాన మోసేది ప్రయాణికుల బరువులు కాదు, నా ముగ్గురు పిల్లల భవిష్యత్తు' అంటారు సంధ్య. కష్టాలకు కుంగిపోకుండా నేను వాటిని గెలవగలను అని నిరూపించుకున్నారు. చేసే పని ఎలాంటిది అని ఆలోచించకుండా బాధ్యతే అసలైన గౌరవం అనుకున్న సంధ్య ఈ తరం మహిళలకి స్ఫూర్తిదాయకమే కదూ !

# పుస్తకంలో దాచేద్దాం !

**నగలంటే ఏ అమ్మాయికైనా ఇష్టమే!**


చిన్నప్పుడు అమ్మ నగలను ఆశ్చర్యంగా చూడటాన్నైతే అస్సలు మర్చిపోలేం, అక్కడ నగ అందమేనా మనం మెచ్చేది? కాదు... ఓ పెట్టెలో పొందిగ్గా ఆభరణాలు అమర్చడమూ ఆకర్షించే విషయమే. అదీ వారసత్వంగా వస్తుందో ఏమో కానీ... మనదీ అదే బాట. ఓపికగా ఒక్కోటి చక్కగా అమరుస్తాం. ఇక్కడ బంగారం, గిట్టు అన్న తేడా అస్సలు చూపించం. అన్నీ ఒకచోట ఉంటాయి, పొడవ్వవు. వెతుక్కో కుండా త్వరగా తీసుకోవడానికి వీలుగా ఉంటాయనీ జ్యువెల్లరీ బాక్సులు వాడుతుంటాం. ఇంత శ్రద్ధ చూపే మనకి చిక్కులు ఎప్పుడొస్తాయి? ప్రయాణాల్లోనే కదూ! అట్టి పెట్టెలు పెట్టెలు విడివిడి వాటిల్లో సర్దుకుని తీసుకెళ్లలేం. స్థల వృథాతో పాటు చోరీ భయం. అలాగని తీసుకెళ్లకుండానూ ఉండలేం. మరెలా అంటే... ఈ జ్యువెల్లరీ స్టోరేజ్ బుక్స్ తెచ్చుకుంటే సరి.



చూడటానికి పుస్తకంలానే ఉంటుంది. తెరిస్తే కానీ... అసలు గుట్టు బయటపడదు. అన్ని రకాల నగలూ పెట్టుకునేలా వీటిని తీర్చిదిద్దారు. వీటిలో మీకు కావాల్సిందే ఏంచుకుంటే సరి. చక్కగా చేతిలో పట్టుకుని వెళ్లినా పోతాయన్న భయం ఉండదు. బాగా ఉన్నాయి కదూ! కావాలనుకుంటే ఆన్‌లైన్‌లో వెతికేయండి మరి.

# తిరుప్పావై

## 16వ పాశురము



నాయకనాయ్ నిన్ఱ
నందగోపనుడైయ
కోయిల్ కాప్పానే! కొడిత్తోన్టుమ్
తోరణ
వాశల్ కాప్పానే! మణిక్కదవమ్
తాళ్ తిఱవాయ్,
ఆయర్ శిఱుమియరోముక్కు,
అఱైపఱై
మాయన్ మణివణ్ణన్ నెన్నలే
వాయ్‌నేర్‌న్దాన్,
తాయోమాయ్ వన్దోమ్ తుయిలెళ
పాడువాన్,
వాయాల్ మున్న మున్నమ్
మాత్తాదే అమ్మా ! నీ,
నేశనిలైక్కదవమ్ నీక్కేలో
రెమ్బావాయ్

అది నందగోపాలుని భవనము, జెండాలతో ప్రకా శించుచున్నది. తోరణములతో అలంకరించబడి యున్నది. మణులతో పొదగబడిన తలుపులు గలది. లోనికేగుటకు గోపికలు, అక్కడ కావలియున్న భవనరక్షకుని అనుమతి కోరుతున్నారు."మాయావి, ఇంద్రనీలవర్ణుడగు సర్వేశ్వరుడు ఖపరఖ అను ధ్వనిచేయు వాయిద్యమును మాకు ఇస్తానని మాట ఇచ్చినాడు. ఏ ప్రతిఫలము ఆశించక పరిశుభ్రంగా వచ్చాము. నిద్రనుండి లేచునటుల పాడుటకు వచ్చినాము. నీవు ఏ అభ్యంతరము చెప్పక దృఢముగా నున్న తలుపులను తెరువుము. మమ్ముల లోపలికి వచ్చుటకు అనుమతినిమ్ము" అని గోపికలు ద్వారపాలకుని ప్రార్థిస్తున్నారు.

ఫలం : "ఆచార్యుని అనుగ్రహం లభిస్తుంది"

# టీ బానిసలేనా.. అయితే ఆపాల్సిందే

అలవాట్లు, ఇష్టాలు అన్నీ హద్దుల్లోనే ఉండాలి. లేదంటే అవి తెచ్చే సమస్యలు వర్ణనాతీతం. రోజూ ఉదయం మనల్ని పలకరించే చాడ్కి కూడా ఇది వర్తిస్తుంది. అసలే శీతకాలం... వేడివేడిగా టీ తాగితే వచ్చే ఉత్తేజం మాటల్లో చెప్పలేం. అందుకే నిద్ర లేచాక ఒక కప్పు టీతోనే మొదలవుతుంది మహిళల రోజు, ఇలా ఉదయం, సాయంత్రం, మహా అయితే అలసట ఎక్కువైనప్పుడో ఓ కప్పు టీ తాగితే పర్వాలేదు కానీ... కొందరు చాలాసార్లు తాగుతుంటారు. చుట్టాలు వచ్చారు. స్నేహితులకి కంపెనీ ఇవ్వాలి. తల నొప్పి వస్తోంది... ఇలా చెప్పుకొంటూ పోవాలే కానీ చాంతాడంత ఉంటుంది. వీటన్నింటివల్ల శరీరంలో కెఫీన్ స్థాయులు ఎక్కువవుతున్నాయి. మానసిక సమస్యలు దీని పర్యవసానమే అంటున్నారు నిపుణులు. ప్రశాంతత, నిద్రను ప్రోత్సహించే అడెనోసిన్ గ్రాహకాలను అడ్డుకుంటుంది కెఫీన్. దాంతో నిద్రలేమి సమస్యలతో బాధపడు తుంటారు. హృదయ స్పందన రేటు మీద దీని ప్రభావం పడుతుందట.



టీ తయారీలో వాడే పాలు, చక్కెర జీవక్రియా రేటుని దెబ్బతీస్తాయి. దాంతో ఆజీర్తి, ఉబ్బరం వంటి జీర్ణసంబంధిత సమస్యలూ పెరుగుతాయి. పైగా, ఇప్పటికే యాంగ్జయిటీతో బాధపడుతున్నవారు టీ ఎక్కువగా తాగడం వల్ల అందులోని కెఫిన్ నాడీ వ్యవస్థ పనితీరును దెబ్బతీస్తుంది. పర్యవసానంగా... మానసిక రుగ్మతలు ఇంకా పెరుగుతాయి. అందుకే రోజుకు 400మి.గ్రా.కి మించకూడదని నిపుణులు భావిస్తున్నారు. వయసును బట్టీ పూర్తిగా మార్పులు ఉంటాయట. గర్భిణులు యాంగ్జయిటీ సమస్యలున్న వారు అయితే 200మి.గ్రాకి మించకుండా చూసుకోవాలట.

# రుచులలో భారత్ 13వ స్థానం



ప్రపంచ వ్యాప్తంగా ఎన్నెన్ని రుచులున్నా వాటిల్లో మనదేశ వంటలకు ఒక ప్రత్యేకత ఉంది. పాయసం నుంచి పరోటా వరకూ, బిర్యానీ నుంచి పావ్ భాజీ వరకూ దేనికైనా తినేదాకా.. నోరూరిస్తుంది. తినేశాక.. ఖిఇంతకంటే ఇంకేం కావాలి?!ఖి అనేంత సంతోషాన్ని, సంతృప్తిని ఇస్తుంది. అందుకే మన వంటకాలు ప్రపంచవ్యాప్తంగా భళీ అనిపిస్తాయి. ఈ ఏడాది కూడా మన రుచులు ప్రశంసలు పొందాయి. టేస్ట్ అట్లాస్ 2025/26 ప్రపంచ 100 ఉత్తమ వంటకాల జాబితాలో వివిధ వంటకాలతో మనదేశం 13వ సంపాదించుకుంది. ప్రపంచవ్యాప్తంగా 100 ఉత్తమ ఆహార నగరాల్లో మనవి ఆరున్నాయి. మన ఘాటైన వంటలు ప్రపంచాన్ని ఆకట్టు కున్నాయి. ఇందులో ముంబై 5వ, హైదరాబాద్ 54వ స్థానాల్లో నిలిచాయి. భేల్పురి, పావ్ భాజీ, మోదక్, రగ్గా పట్టీస్, వడ పావ్లతో ముంబై, బిర్యానీ, పెసరట్టు, హలీమ్, చికెన్5, కరాచీ బిస్కెట్లతో హైదరాబాద్ తమదైన గుర్తింపు సాధించాయి. అమృత్‌సర్ 48, న్యూఢిల్లీ 53, కోల్‌కతా 73, చెన్నై 93 స్థానాల్లో నిలిచాయి. టేస్ట్ ఆఫ్ అట్లాస్ ర్యాంకింగ్స్లో ఇటలీ మొదటి స్థానంలో నిలిచింది.



# దగ్గుకు చిట్కా

ఈ కాలంలో జలుబుతోపాటు మనల్ని వేధించే వాటిల్లో దగ్గు కూడా ఉంటుంది. దీన్ని సహజంగా తగ్గించుకోవాలా? ఈ చిట్కా ప్రయత్నించండి. ఒక గిన్నెలో పావుకప్పు చొప్పున అల్లం, తమలపాకు రసాలు, తేనె తీసుకోండి. సన్నని సెగమీద ఈ గిన్నెని ఉంచి పాకంలా తయారయ్యేదాకా వేడి చేయండి. దాన్ని ఓ గాజు సీసాలోకి తీసుకోండి. అరచెంచా మిశ్రమాన్ని గోరువెచ్చని నీటితో తీసుకోండి. రోజుకి 2-3 సార్లు తీసుకుంటే త్వరగా తగ్గుతుంది.

## రంగవల్లి



25 చుక్కలు, 3 వరుసలు, ఇటు అటు వదిలి 3 వచ్చే వరకు



- మంజుల
తాడిపత్రి



### ముగ్గులకు ఆహ్వానం

**మా చిరునామా:** ఎడిటర్, 'చెలి' వార్త, నం.396, లోయర్ ట్యాంక్‌బండ్, డిబిఆర్ మిల్స్ పక్కన, హైదరాబాద్-80.Gmail: cheli@vaartha.com

కృత్రిమ మేధతో రూపొందించిన ముగ్గులు పంపవద్దు

## తెర

# సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ పై సిద్ధు ఆరో చిత్రం

ముచ్చటగా మూడోసారి చేతులు కలిపిన సిద్ధు జొన్నలగడ్డ, సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ తన ప్రత్యేకమైన కథా ఎంపికలు, శక్తివంతమైన నటనతో ప్రేక్షకుల హృదయాలను గెలుచుకున్న స్టార్ బాయ్ సిద్ధు జొన్నలగడ్డ, తన ఆరో చిత్రానికి సిద్ధమవుతున్నారు. తాజాగా ఈ చిత్రాన్ని అధికారికంగా ప్రకటించారు. ఈ సందర్భంగా విడుదలైన అద్భుతమైన పోస్టర్ అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. సిద్ధు జొన్నలగడ్డ, సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ కలయికలో వస్తున్న మూడో చిత్రమిది.



గతంలో వీరి కలయికలో వచ్చిన డీజే టిల్లు, టిల్లు స్క్వేర్ సినిమాలు భారీ విజయం సాధించాయి. ఇప్పుడు వారు హ్యాట్రిక్ కోసం సన్నద్ధమవుతున్నారు. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. తన ప్రత్యేకమైన కథన శైలితో గుర్తింపు పొంది, తెలుగు చిత్ర సీమలో ప్రతిభగల యువ దర్శకుల లో ఒకరి గా పేరు గాంచిన స్వరూప్ ఆర్ఎస్‌జే.. ఈ ప్రతిష్టాత్మక చిత్రం యొక్క కథ, కథనం మరియు దర్శకత్వ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. అద్భుతమైన కథాకథనా లతో ప్రేక్షకులను ఆకట్టుకునే ఓ కొత్త ప్రపంచాన్ని తెరపై ఆవిష్కరించనున్నారు.

# 'రాజా సాబ్' ట్రైలర్ 2.ఓ రిలీజ్



రెబల్ స్టార్ ప్రభాస్ నటిస్తున్న ప్రెస్టీజియస్ మూవీ "రాజా సాబ్". ఈ చిత్రాన్ని హారర్ కామెడీ జానర్‌లో ఎవర్ గ్రీన్ మూవీగా నిలిచిపోయేలా తెరకెక్కిస్తున్నారు దర్శకుడు మారుతి. "రాజా సాబ్" సినిమాను భారీ ప్రొడక్షన్ వ్యాల్యూస్ తో అన్ కాంప్రమైజ్డ్‌గా నిర్మిస్తున్నారు నిర్మాతలు టీజీ విశ్వప్రసాద్, కృతి ప్రసాద్. మాళవిక మోహనన్, నిధి అగర్వాల్, రిద్ధి కుమార్ ఈ చిత్రంలో హీరోయిన్స్‌గా నటిస్తున్నారు. సంక్రాంతి సందడిని రెట్టింపు చేసేందుకు జనవరి 9న "రాజా సాబ్" సినిమా వరల్డ్ వైడ్ గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రెడీ అవుతోంది. ఈ రోజు ఈ సినిమా ట్రైలర్ 2.ఓ రిలీజ్ చేశారు. ఎన్నో సర్ ప్రైజింగ్ ఎలిమెంట్స్ ప్యాకేజ్ చేసిన ఈ ట్రైలర్ ప్రేక్షకుల్ని "రాజా సాబ్" ప్రపంచంలోకి తీసుకెళ్లింది. "రాజా సాబ్" ట్రైలర్ 2.ఓ ఎలా ఉందో చూస్తే గంగమ్మ (జరీనా వాహబ్) ముద్దుల మనవడు రాజా సాబ్ (ప్రభాస్), అన్నీ మర్చిపోయే గంగమ్మ తన భర్త (సంజయ్ దత్)ను మర్చిపోలేక పోతుంది. ఓ మిస్టరీగా మారిన తాతను కలిసే సాహసా నికి రాజా సాబ్ సిద్ధమవుతాడు. అడుగు అడుగునా ప్రమాదాలు నిండి ఉన్న మయసభ లాంటి తాత భారీ హవేలీలో అడుగుపెడతాడు రాజాసాబ్. ఆ హవేలీలోకి వెళ్లిన వారిని ఎవరిని ఎలా వేటాడాలో డిజైన్ చేసి పెడతాడు తాత. హిప్నాటిజంతో పాటు దుష్ట శక్తులను శాసించగల తాత.. రాజాసాబ్, అతనితో వచ్చిన వారిని ఎలా ఇబ్బంది పెట్టాడు ? తాత సృష్టించిన ప్రమాదాల నుంచి రాజాసాబ్ ఎలా బయటపడ్డాడు ? తాను వెళ్లిన మిషన్‌ను రాజా సాబ్ కంప్లీట్ చేసుకున్నాడా? లేదా ?, దేవనగర సంస్థ జమీందారిణి గంగాదేవి, సాధారణ మధ్య తరగతి గంగమ్మగా ఎందుకు జీవిస్తోంది ?

# 'సైక్ సిద్ధార్థ' డిఫరెంట్‌గా ప్రెజెంట్ చేశారు

**- నిర్మాత డి. సురేశ్ బాబు**



యంగ్ హీరో శ్రీ నందు తన అప్ కమింగ్ మూవీ సైక్ సిద్ధార్థ'కు రానా దగ్గుబాటి స్పిరిట్ మీడియా బ్యాకింగ్‌తో వస్తు న్నారు. ఈ చిత్రానికి వరుణ్ రెడ్డి దర్శకత్వం వహించారు. స్పిరిట్ మీడియా, నందునెస్ కీప్ రోలింగ్ పిక్చర్స్ బ్యానర్లపై శ్రీ నందు, శ్యామ్ సుందర్ రెడ్డి తుడి సంయుక్తంగా నిర్మించారు. మ్యాడ్ మాక్స్ స్టైల్ మ్యాడ్‌నెస్‌తో యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్‌గా రూపొందిన సైక్ సిద్ధార్థ లో హై ఎనర్జీ ఎంటర్టైన్మెంట్ వుండబోతుంది. ఈ చిత్రంలో యామిని భాస్కర్ కథానాయికగా నటించగా, ప్రియాంక రెబెకా శ్రీనివాస్, సాక్షి అత్రీ, మోనిక కీలక పాత్రలు పోషించారు. ఇప్పటికే విడుదలైన టీజర్ ట్రైలర్ కు అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. జనవరి 1న సైక్ సిద్ధార్థ గ్రాండ్‌గా విడుదల కానుంది. ఈ సందర్భంగా ప్రెస్ మీట్ నిర్వహించారు.నిర్మాత డి. సురేష్ బాబు మాట్లాడుతూ.. అందరికీ నమస్కారం. సినిమాలకి ముఖ్యంగా చిన్న సినిమాలకి ఆడియన్స్ థియేటర్స్ కి రావడం తగ్గిపోతుందని తరుచు మాట్లాడుతుంటాం. అయితే కొన్నిసార్లు చిన్న సినిమాలని ఆడియన్స్ చాలా అద్భుతంగా థియేటర్స్‌లో ఆదరిస్తున్నారు.హీరో శ్రీ నందు మాట్లాడుతూ... అందరికి నమస్కారం. మీడియా మిత్రులకు ధన్యవాదాలు. దండోరా లో నా పర్ఫార్మెన్స్ కి చాలా మంచి అప్రిషియేషన్స్ ఇచ్చారు. ఈ సినిమా రిలీజ్‌కి ముందు అది నాకు మంచి బూస్ట్ ఇచ్చింది. డైరెక్టర్ వరుణ్ రెడ్డి మాట్లాడుతూ.. థియేటర్స్ కి వచ్చి గట్టిగా కేకలు వేసి ఫుల్ గా ఎంజాయ్ చేసే తెలుగు ఆడియన్స్‌కి ఈ సినిమా అంకితం. కనీసం 30 నిమిషాల పాటు నాన్ స్టాప్‌గా కేకలు వినిపిస్తాయి.

# ' శంబాల' చూసి ఎంజాయ్ చేశాను

**అల్లు అరవింద్**



ఆదికి వచ్చిన సక్సెస్ చూసి అందరూ సంతోషిస్తున్నారు.. డివైన్ బ్లాక్ బస్టర్ ఈవెంట్‌లో మెగా డైరెక్టర్ బాబీ.. నిజాయితీగా సినిమా తీస్తే ప్రేక్షకులు సక్సెస్ ఇస్తారని మరోసారి నిరూపించారు.. డివైన్ బ్లాక్ బస్టర్ ఈవెంట్‌లో సందీప్ కిషన్.. శంబాలని థియేటర్లోనే చూడండి.. కచ్చితంగా డిజప్పాయింట్ అవ్వరు.. డివైన్ బ్లాక్ బస్టర్ ఈవెంట్‌లో ఆది సాయి కుమార్.. ..ప్రతీ ఒక్కరూ మన ఆది హిట్టు కొట్టారు అని చెబుతుంటే ఆనందంగా ఉంది.. డివైన్ బ్లాక్ బస్టర్ ఈవెంట్‌లో సాయి కుమార్.. ఆది సాయి కుమార్ హీరోగా నటించిన 'శంబాల' చిత్రం ప్రస్తుతం సక్సెస్ ఫుల్‌గా దూసుకుపోతోంది. ఈ కార్యక్రమానికి ఏస్ ప్రొడ్యూసర్ అల్లు అరవింద్, ప్రముఖ దర్శకులు వశిష్ట, బాబీ, యంగ్ హీరో సందీప్ కిషన్, ప్రముఖ రచయిత కోన వెంకట్ ముఖ్య అతిథులుగా విచ్చేశారు. ఈ ఈవెంట్‌లో.. ..అల్లు అరవింద్ మాట్లాడుతూ.. .. శంబాల సినిమాని యుగంధర్ ముని అద్భుతంగా తెరకెక్కించారు. సాయి కుమార్‌తో మాది మూడు తరాల అనుబంధం ఉంది. ..ఆది సాయి కుమార్ మాట్లాడుతూ.. 'శంబాల' సక్సెస్ మీట్‌కు వచ్చిన ప్రతీ ఒక్కరికీ థాంక్స్. అడిగిన వెంటనే వచ్చిన అల్లు అరవింద్ గారికి థాంక్స్. డైరెక్టర్ బాబీ మాట్లాడుతూ.. ..సాయి కుమార్ గారి మంచితనం వల్లే ఇండస్ట్రీ అంతా ఇలా కదిలి వస్తోంది. కొడుకు సక్సెస్ అయితే తండ్రి ఎలా సంతోషిస్తారో నాకు తెలుసు. .డైరెక్టర్ వశిష్ట మాట్లాడుతూ.. .. సాయి కుమార్ ఈ ఏడాది ప్రారంభంలో హిట్టు కొట్టారు. ఆది ఏడాది చివర్లో హిట్ కొట్టారు.

# 'పెద్ది'లో జగపతిబాబు ఫస్ట్ లుక్ రిలీజ్



మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ ప్రస్తుతం హైలీ యాంటిసిపేటెడ్ రూరల్ యాక్షన్ ఎంటర్‌టైనర్ 'పెద్ది' షూటింగ్‌లో బిజీగా ఉన్నారు. ఈ చిత్రానికి బుచ్చి బాబు సానా దర్శకత్వం వహిస్తున్నారు. వృద్ధి సినిమాస్ బ్యానర్‌పై వెంకట సతీష్ కిలారు నిర్మిస్తున్నారు. సుకుమార్ రైటింగ్స్‌తో కలిసి మైత్రి మూవీ మేకర్స్ ఈ చిత్రాన్ని గర్వంగా సమర్పిస్తున్నారు. భారీ బడ్జెట్‌తో, అద్భుతమైన నిర్మాణ విలువలతో రూపొందుతున్న 'పెద్ది' ఒక అద్భుతమైన థియేట్రికల్ అనుభూతిని అందించబోతోంది. రామ్ చరణ్ సరసన జాన్వీ కపూర్ కథానాయికగా నటిస్తుండగా, శివ రాజ్‌కుమార్, జగపతి బాబు, దివ్యేందు శర్మ వంటి నటీనటులు కీలక పాత్రల్లో నటిస్తు న్నారు. అప్పలసూరి పాత్రలో జగపతి బాబును పరిచయం చేస్తూ చిత్ర బృందం ఆయన ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను విడుదల చేసింది.ఈ పోస్టర్‌లో జగపతి బాబు ఇంటెన్స్ అవతార్‌లో కనిపిస్తున్నారు. ఇది సినిమాలోని గ్రామీణ నేపథ్యానికి పర్ఫెక్ట్ యాప్ట్. చెదిరిన సాల్ట్ అండ్ పెప్పర్ జుట్టు మును ఎన్నడూ చూడని అవతార్‌లో కనిపిస్తూ,తన రఫ్ లుక్‌కు మరింత వన్నె తెచ్చారు. దారంతో కట్టిన విరిగిన కళ్లద్దాలు ఆ పాత్ర యొక్క కఠినమైన వ్యక్తిత్వాన్ని, అప్పలసూరి పాత్ర డెప్త్‌ని ఇంటెన్స్‌గా ప్రెజెంట్ చేశాయి. పెద్ది మార్చి 27, 2026న గ్రాండ్ పాన్ ఇండియా థియేట్రికల్ రిలీజ్ కానుంది. 2026లో బిగ్గెస్ట్ సినిమాటిక్ ఈవెంట్లలో ఒకటిగా పెద్ది అలరించబోతోంది

# కొత్త నిర్మాణ సంస్థ 'బండ్ల గణేష్ బ్లాక్‌బస్టర్స్'



నటుడిగా కెరీర్ ప్రారంభించి, ఆ తర్వాత నిర్మాతగా మారిన బండ్ల గణేష్, మాస్ మహారాజా రవితేజ నటించిన 'అంజనేయులు' చిత్రంతో సినీ నిర్మాణ రంగంలోకి అడుగుపెట్టారు. ఈ సినిమాతోనే ఆయన తన సొంత బ్యానర్ పరమేశ్వర ఆర్ట్ ప్రొడక్షన్స్‌ను ప్రారంభించారు. పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ నటించిన సంచలన బ్లాక్‌బస్టర్ 'గబ్బర్ సింగ్' చిత్రంతో ఈ బ్యానర్‌కు మొదటి బిగ్గెస్ట్ బ్లాక్ బస్టర్ లభించింది.ఇప్పుడు తన కొత్త నిర్మాణ సంస్థ బండ్ల గణేష్ బ్లాక్‌బస్టర్స్ (బీజీ బ్లాక్‌బస్టర్స్) ని అనౌన్స్ చేశారు. ఈ కొత్త అధ్యాయాన్ని మరింత ప్రత్యేకంగా మార్చే విషయం ఏమిటంటే, ఇందులో నెక్స్ట్ జనరేష్ భాగస్వామ్యం కావడం.బీజీ బ్లాక్‌బస్టర్స్ బ్యానర్ ద్వారా మనసుకి దగ్గరగా ఉండే సినిమాలు, నిజాయితీతో కూడిన కథలు, కంటెంట్ రిచ్ చిత్రాలను ప్రేక్షకులకు అందించాలనే లక్ష్యంతో బండ్ల గణేష్ ముందుకు సాగుతున్నారు. కొత్త ఆలోచనలు, వినూత్న కథనాలు, ఫ్రెష్ టాలెంట్‌కు అవకాశం ఇవ్వడమే ఈ బ్యానర్ ప్రధాన ఉద్దేశం.బండ్ల గణేష్, అతని టీం వరుసగా ఎక్సయిటింగ్ ప్రాజెక్టులను నిర్మించడానికి ప్రణాళికలు చేస్తున్నారు. ఇప్పటికే ఒక ప్రాజెక్ట్ ఖరారైంది, దీనికి సంబంధించిన అధికారిక ప్రకటన త్వరలో వెలువడనుంది.

## ఉత్తమ ఎన్ఎస్ఎస్ అధికారిగా డాక్టర్ దాసు

**రేపల్లె, డిసెంబరు 30, ప్రభాతవార్త:** ఆచార్య నాగార్జున విశ్వ విద్యాలయం ఆధ్వర్యంలో 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి రేపల్లె ఎబిఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి,చరిత్ర విభాగం అధ్యాపకుడు డాక్టర్ ఎం.దాసుకు ఉత్తమ ఎన్ఎస్ఎస్ కార్యక్రమ అధికారి అవార్డు లభించింది.ఈ అవార్డును విశ్వ విద్యాలయ ఉపకులపతి ప్రొఫెసర్ కె.గంగాధరరావు ప్రధానం చేశారు.మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అవార్డు గ్రహీత డాక్టర్ ఎం.దాసును అనగాని భగవంతరావు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి.సి.రవిచంద్ర కుమార్,అధ్యాపకులు, విద్యార్థులు అభినందించారు.సామాజిక సేవలను విస్త్రృతం చేస్తూ జాతీయ స్థాయిలో రాష్ట్రపతి అవార్డు సాధించాలని దాసును ప్రోత్సహిస్తూ అభినందనలు తెలిపిన ప్రముఖులు ఆకాంక్షించారు.



# బాపట్ల జిల్లా వార్త



## నేడు ఎన్టీఆర్ పింఛన్ల పంపిణీ



**బాపట్ల,డిసెంబర్30,ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న యన్ టి ఆర్ భరోసా పింఛన్లు బుధవారం రోజున పంపిణీ చేయడం జరుగుతున్నదని జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు 2026 జనవరి 1వ తేది పంపిణీ చేయవలసిన పెన్షన్లు బుధవారం ఉదయం 7 గంటల నుండి పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు. బాపట్ల జిల్లా లో జనవరి నెలలో 2,25,485 మందికి వివిధ రకాల పింఛన్లను పొందుతున్న ఫించన్ దారులకు రూ.96.57 పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. మంగళవారం రోజే సచివాలయం సిబ్బంది బ్యాంకు ల నుండి నగదు డ్రా చేసుకోవడం జరిగిందని, బుధవారం ఉదయం 7 గంటల నుండి పింఛన్లు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ఆ రోజు వంద శాతం పెంచన్లు పంపిణీ చేయాలన్నారు. అనివార్య కారణం ల చేత బుధవారం రోజు తీసుకోని వారికి 2 వ తేదీ శుక్రవారం రోజు పంపిణీ చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు అందించారు.

## ఆర్థిక రంగంలో మహిళలు అభివృద్ధి సాధించాలి

**రేపల్లె, డిసెంబరు 30, ప్రభాతవార్త:** సంపూర్ణ అక్షరాస్యతను సాధించినప్పుడే ఆర్థిక రంగంలో అభివృద్ధి సాధించగలరని డిపిఎం ఉసిరిపాటి సుబ్బారావు అన్నారు.మంగళవారం స్థానిక



మండల మహిళా సమాఖ్య భవనంలో ఆర్థిక క్రమశిక్షణ,అక్షరాస్యత అంశాలపై శిక్షణా కార్యక్రమం జరిగింది.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రేపల్లె,వేమూరు నియోజక వర్గాలలోని ఆర్థిక సంఘాలు ప్రణాళికాబద్ధంగా పురోగతి సాధించాలన్నారు.ఆర్థికపరమైన అవగాహన కలిగి ఉండాలని ఆయన చెప్పారు.శ్రీనిధి,బ్యాంకులలో మాత్రమే అవసరమైన రుణాలు పొందాలని సూచించారు.స్వయం సహాయక సంఘాల సభ్యులు అవగాహన కలిగిఉంటే అప్పుల ఊబిలో చిక్కుకోరని తెలిపారు.ప్రైవేటు వ్యక్తుల వద్ద రుణాలు చేస్తే అధిక వడ్డీలు చెల్లించలేక ఏజెంట్లతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న పరిస్థితులను గమనించాలని సుబ్బారావు గుర్తుచేశారు.అవసరాలకు తగిన విధంగా బ్యాంకు రుణాలు పొందితే ఎటువంటి ఇబ్బందులు ఉండవని చెప్పారు.కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రతి లబ్ధిదారుడు పొందే విధంగా సంఘాల నిర్వాహకులు ప్రయత్నించాలన్నారు. పెన్షన్స్,కజిబివి పథకాల వలన ఆర్థిక ప్రయోజనాన్ని పొందగలరని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ సమావేశంలో బ్యాంకు అధికారి లక్ష్మణాచారి,ఎపిఎం గోపి,క్లస్టర్ స్థాయి సిసిలు డి.ఆనంద్,ఎం.లక్ష్మీ సోమేశ్వరి, ఎస్.పూర్ణ, మహమ్మద్ నూరిన్ ఇస్సా,ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు ఎరువులు పంపిణీ చేయాలి

### జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్

**బాపట్ల,డిసెంబర్30,ప్రభాతవార్త:** రైతుల వ్యవసాయ భూములు ఏ మండలంలో ఉంటే ఆ మండలంలోనే రైతులకు ఏరువులు అందజేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వి. వినోద్ కుమార్ తెలిపారు. మంగళవారం సాయంత్రం స్థానిక జిల్లా కలెక్టరేట్లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ నందు ఏరువులు పంపిణీ, ప్రధానమంత్రి అవాక్ యోజన పథకం ద్వారా నిర్మించే గృహ నిర్మాణాలు,మున్సిపాలిటీ సేవలు, ఇంటింటి నుండి చెత్త సేకరణ వంటి అంశాలకు సంబంధించి మండల వ్యవసాయ అధికారులు, ఏడీలు, గృహ నిర్మాణ సంస్థ ఏఈ లు,డీఈలు, మున్సిపల్ కమిషనర్లు తో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వ్యవసాయ రైతుల భూములు ఏ మండలంలో ఉంటే అదే మండలంలోనే రైతులకు అవసరమైన ఎరువులు పంపిణీ చేయాలని సంబంధిత మండల వ్యవసాయ అధికారులు ఆదేశించారు. వ్యవసాయ సాగు చేసి రైతులకు ఇబ్బంది లేకుండా ఎరువులు పంపిణీ చేయవలసిన బాధ్యత మండల వ్యవసాయ అధికారుల పై ఉందన్నారు. జిల్లాలో ఎక్కడైనా ఎరువులు సమస్యలు ఉంటే వెంటనే జిల్లా కలెక్టర్ దృష్టి కి తీసుకురావాలన్నారు. ఎరువులు పంపిణీ సంబంధించి ఇంకా అభివృద్ధి చేయాలని మండల వ్యవసాయ అధికారులను ఆదేశించారు. ఐఎఫ్ఎమ్ఎస్ ను ప్రతిరోజు అప్డేట్ చేయాల్సి న బాధ్యత మండల వ్యవసాయ అధికారులదేనని, ఎరువులు బాగా పంపిణీ చేసిన



మండల వ్యవసాయ అధికారులకు జనవరి 26వ తేదీన అవార్డులు అందించడం జరుగు తుందన్నారు, మండలాల వారీగా నిల్వఉన్న ఎరువులు వివరాలకు సంబంధించి కలెక్టర్ మండల వ్యవసాయ శాఖ అధికారులను అడిగి తెలుసుకున్నారు. రాష్ట్ర స్థాయిలో గృహ నిర్మాణంలో బాపట్ల జిల్లా టాప్ 3 లో ఉండేలా గృహ నిర్మాణ శాఖ అధికారులు పనిచేయాలన్నారు. జిల్లాలో ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకము ద్వారా చేపడుతున్న పేదల గృహ నిర్మాణాలు వేగవంతంగా పూర్తి చేయాలని, జిల్లాలో నిర్మాణాలు చేపడుతున్న పేదల గృహాలకు సంబంధించి ఏమైనా సమస్యలు, ఇబ్బందులు ఉంటే వాటిని తన దృష్టి కి తీసుకురావాలన్నారు. లబ్ధిదారుల బ్యాంక్ అకౌంట్ ను అప్డేట్ చేసి గృహ నిర్మాణాలు పూర్తిచేసుక నేలా వారికి అవగాహన కల్పించాలన్నారు. గృహ నిర్మాణ కి సంబంధించి నిధులు పుష్కలంగా ఉన్నాయని, గృహ నిర్మాణాలను వేగవంతంగా పూర్తి అయ్యేలా గృహ నిర్మాణ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. గృహ నిర్మాణ పురోగతిలో కొన్ని మండలాలు చాలా తక్కువగా ఉండటం వల్ల వాటికి సంబంధించి గల కారణాలను తెలియజేయా లన్నారు. మున్సిపాలిటీ లలో ప్రతి రోజు ఇంటింటి నుండి వంద శాతం చెత్తను సేకరించి వెంటనే చెత్తను డంపింగ్ యార్డ్ కు తరలించాలన్నారు, మున్సిపాలిటీల పరిధిలో చేపట్టే సేవల పై ప్రజలకు పూర్తి అవగాహన కలిగించాలన్నారు. ఈ సమావేశంలో ఇంచార్జి జిల్లా వ్యవసాయ అధికారిణి అన్నపూర్ణ గృహ నిర్మాణ సంస్థ పిడి వెంకటేశ్వరరావు బాపట్ల, చీరాల రేపల్లె అద్దంకి మున్సిపల్ కమిషనర్లు రఘునాద్ రెడ్డి, రవేంద్ర బాబు, జోసఫ్,సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ముక్కోటి ఏకాదశి

**భట్టి ప్రోలు(రేపల్లె),డిసెంబరు 30, ప్రభాతవార్త:** మండలంలోని ఐలవరంలో మంగళవారం ముక్కోటి ఏకాదశి పర్వదినాన్ని ఘనంగా నిర్వహించారు.శ్రీ వేణుగోపాలస్వామి, సీతా రామాలయం తదితర దేవాలయాలలో తెల్లవారు జాము నుంచి స్వామి వారి ఉత్తర ద్వార దర్శన కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. అరటి బొత్తలతో గరుడ వాహనంపై స్వామి వారి ఉత్తర ద్వార దర్శనం ఏర్పాటు చేయడాన్ని భక్తులను విశేషంగా ఆకర్షించింది. వేణుగోపాల స్వామి దేవాలయం నుంచి సమరసత నగర సంకీర్తన సంఘం ఆధ్వర్యంలో



నగర సంకీర్తనలు చేశారు.నందిపాటి కుటుంబీకులు ముక్కోటి ఏకాదశి గ్రామోత్సవం నిర్వహించారు. హరే రామ హరే కృష్ణ నామ సంకీర్తన 24 గంటల పాటు నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు.ఈ కార్యక్రమంలో అర్చకులు దీవి రఘునాథ చక్రవర్తి,నందిపాటి నాగమల్లేశ్వరరావు,జంజనం హేమశంకం రావు,వామనపల్లి కోటేశ్వరరావు, దీపాల సత్యనారాయణ,కొసనం భాస్కర వెంకట రమణ,కె.సుబ్రహ్మణ్య ప్రసాద్,జె.సాంబశివ రావు,డి.వాసు,జి.బాబూరావు, ఎన్.సత్య నారాయణ, కె.నరసింహారావు, సూర్యావతి తదితరులు పాల్గొన్నారు. భట్టిప్రోలులోని శ్రీ వాసవీ అమ్మవారి దేవాలయంలో దేవస్థానం కమిటీ అధ్యక్షుడు తూనుగుంట్ల సాయిబాబా ఆధ్వర్యంలో ముక్కోటి ఏకాదశి కార్యక్రమాలు అత్యంత వైభవంగా జరిగాయి.సంక్షిప్త భగవద్గీత,విష్ణు సహస్రనామ పారాయణం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మానేపల్లి రఘునాధబాబు, ఎం.రఘునాధ బాబు,పార్వతి, శంకరసాయి,ఎం.శైలజ కుమారి తదితరులు పాల్గొన్నారు. మండలంలోని అద్దేపల్లి,వెల్లటూరు, సూరేపల్లి,వేమవరం ,పెదపులివర్రు, పల్లెకోన, కోనేటిపురం, సూరేపల్లి,పడమటపాలెం,ఓలేరు తదితర గ్రామాలలో ముక్కోటి ఏకాదశి కార్యక్రమాలు జరిగాయి.

## ఫిబ్రవరి 1,2 తేదీలలో టైప్ రైటింగ్ పరీక్షలు

**రేపల్లె, డిసెంబరు 30, ప్రభాతవార్త:** టైప్ రైటింగ్ పరీక్షల తేదీలలో మార్పులు చేస్తూ రాష్ట్ర సాంకేతిక విద్యాశాఖ అధికారులు ఆదేశాలు జారీచేశారని అంధ్రప్రదేశ్ టైప్ రైటింగ్ షార్ట్‌హ్యాండ్ ఇనిస్టిట్యూట్స్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు సి.వి.మోహనరావు తెలిపారు.మంగళవారం ఆయన మాట్లాడుతూ 2026 సంవత్సరం ఫిబ్రవరి 1,2 తేదీలలో టైప్ రైటింగ్ పరీక్షలు జరుగుతాయని చెప్పారు.ఈ మార్పును టైప్ ఇనిస్టిట్యూట్ల నిర్వాహకులు,విద్యార్థులు గమనించాలని మోహనరావు కోరారు.షార్టు హ్యాండ్ పరీక్షల నిర్వహణలో ఎలాంటి మార్పు లేదని ఆయన తెలియజేశారు.

## జిల్లా స్థాయి డాన్స్ పోటీలలో కర్లపాలెంకు బహుమతులు

**కర్లపాలెం,డిసెంబర్30,ప్రభాతవార్త:** జిల్లా స్థాయిలో నిర్వహించిన డాన్స్ పోటీలలో కర్లపాలెం మండలం పలు బహుమతి సాధించారు. పాటలు



మరియు డాన్స్ పోటీలలో కర్లపాలెం మండలం ఇందిరా నగర్ స్కూల్ విద్యార్థి యామిని శ్రీజకు సోలో డాన్స్ లో ద్వితీయ బహుమతి లభించింది. ఈ బహుమతిని జిల్లా సమన్వయకర్త మట్ట జోష్నా మరియు న్యాయ నిర్ణీత పెద్ద గొల్లపాలెం పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సుభాషిని అందజేశారు. ఈ సందర్భంగా మిగతా పోటీలలో కర్లపాలెం విద్యార్థులు బహుమతులు సాధించడం పట్ల ఎంఈఓ మనోరంజన్ హర్షం వ్యక్తం చేశారు. విద్యార్థులు చదువుతోపాటు అన్ని విషయాల్లో రాణించాలని ఆమె స్పష్టం చేశారు

## ఆర్టీసీ కార్మికుల నిరసన

**రేపల్లె, డిసెంబరు 30, ప్రభాతవార్త:** రేపల్లె ఆర్టీసీ డిపోలో సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం డిపో ఎదుట



కార్మికులు నిరసన తెలియజేశారు.రేపల్లె డిపోలో ఎస్.కె.ఫాతిమా(డబ్ల్యూఎఫ్‌టి) సస్పెన్షన్ ఎత్తి వేయాలని,గ్యారేజీ కార్మికుడు సుందరరావు అక్రమ బదిలీ రద్దు చేయాలని కార్మికులు డిమాండ్ చేశారు.కార్మికుల శ్రేయస్సును డిపో అధికారులు దృష్టిలో ఉంచుకోవాలని విజ్ఞప్తి చేశారు.రేపల్లె డిపోలో ఉదయం 4.45 గంటలకు తొలి సర్వీసు ప్రారంభమైన దగ్గర నుంచి కార్మికులు ఎర్ర బ్యాడ్జీలతో నిరసన ప్రారంభించారు.ఈ కార్యక్రమం లో రేపల్లె ఆర్టీసీ డిపో కార్యదర్శి చిట్టిబాబు,బాపట్ల జిల్లా ఎంప్లాయీస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి పి.కమలాకర్,జిల్లా కమిటీ నాయకులు రంగనాధ్ ఎన్.వెంకటేశ్వర్లు,రేపల్లె డిపో ఎంప్లాయీస్ యూనియన్ సభ్యులు, కార్యకర్తలు,మహిళా సభ్యులు,గ్యారేజీ కార్మికులు పాల్గొన్నారు.

## రెండు గ్రామాల్లో పొలం పిలుస్తోంది

**వట్టిచెరుకూరురూరల్, డిసెంబర్ 30, ప్రభాతవార్త :** మండలంలోని అనంతవరప్పాడు, లేమల్లెపాడు గ్రామాలలో మంగళవారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయాధికారి చందవోలు సునీత పాల్గొని రైతులతో కలిసి శనగ మరియు మిరప పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ శనగ పంటలో ఎండు తెగులు ఆశించిన మొక్కలు ఒక్కసారిగా కాడలతోపాటు ముడుచుకుపోయి చనిపోతాయన్నారు.వేరు మరియు కాండాన్ని చీల్చి చూసినపుడు గోధుమ లేదా నలుపు రంగులో చార కనిపిస్తుందని వివరించారు. ఈ తెగులు కలుగజేయు శిలీంద్రము విత్తనము మరియు మట్టి ద్వారా వ్యాపిస్తుందన్నారు. దీని నివారణకు ఎండుతెగులు ఉధృతి ఎక్కువగా ఉన్న ప్రాంతంలో 2 గ్రా.ట్రైకోడెర్మా విరిడిని 900గ్రాములు పశువుల ఎరువును మరియు 10గ్రా.ల వేప పిండితో కలిపి వాడాలని రైతులకు తెలియచేశారు.మొక్కజొన్నలో



కాండం తొలుచు పురుగు గమనించినచో ట్రైకోగ్రామా కిలోనిస్ పరన్నా జీవి గుడ్లని ఎకరాకు 23 ట్రైకోకార్డ్స్ రూపంలో రెండు విడతలుగా 12 మరియు 22రోజుల పైరు దశలలో విడుదల చేయాలని, మోనో క్రోటో ఫాస్ 36ఎస్.యల్ ఎకరాకు 320 మిల్లీ.లీ లేదా క్లోరంట్రినిలిప్రోల్ (క్రోరాజెన్) ఎకరాకు 60 మిలిలీటర్ను 200 లీ నీటిని కలిపి పైరు మొలకేతినా 1012 రోజులకు పిచికారీ చేయాలని సూచించారు. కార్యక్రమంలో ధాత్చ్ కాలేజీ కోఆర్డినేటర్ మనోజ్, విహెచ్ఏ రాణి, రైతులు పాల్గొన్నారు.

## అఖిల భారత మహాసభలను విజయవంతం చేయాలి

### -సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మీనారాయణ

కొల్లిపర,డిసెంబరు 30 ప్రభాతవార్త: అఖిల భారత మహాసభలను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మీనారాయణ అన్నారు.మంగళవారం మండల జయప్రదం చేయాలన్నారు. కర్షకులను.. కార్మికులను మోదీ ప్రభుత్వం అన్ని విధాల మోసం చేస్తున్నట్లు చెప్పారు.ఏపి రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ములకా శివసాంబిరెడ్డి



కేంద్రం కొల్లిపరలో వివిధ కార్మిక సంఘ నాయకులు మహాసభలను విజయవంతం చేయాలని కోరుతూ ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ విశాఖపట్నంలో ఈ నెల 31 వ తేదీ నుండి జనవరి 4 వ తేదీ వరకు జరిగే మహాసభలను మాట్లాడుతూ బ్రిటీష్ కాల ం నుండి కార్మిక వర్గం పోరాడి 44 కార్మిక చట్టాలను సాధించుకోవటం జరిగిందన్నారు.సమావేశంలో సీఐటీయూ మండల కార్యదర్శి కోటా చంద్రశేఖర్,నాయకులు శ్రీనివాసరావు,ఎం జయప్రద,దేవకుమారి తదితరులు పాల్గొన్నారు.

## అర్హులైన యానాదులకు తక్షణమే ఆధార్ కార్డులు మంజూరు చేయాలి : జాయింట్ కలెక్టర్

**చెరుకుపల్లి ,డిసెంబర్ 30, ప్రభాతవార్త :** యానాది కుటుంబానికి చెందిన ఏ ఒక్క అర్హుడు కూడా ప్రభుత్వ సంక్షేమ పథకాలకు అనర్హులుగా పరిగణించబడకూడదని యానాదుల యూత్ ఫెడరేషన్ బాపట్ల జిల్లా అధ్యక్షుడు చౌటూరి రమేష్ అన్నారు. మండలంలోని ఆరంభాగ పంచాయతీ కామినేని వారి పాలెం రోడ్డు వెంట జీవిస్తున్న కుటుంబాల వారికి ఆధార్ కార్డులు లేక ప్రభుత్వ సంక్షేమ పథకాలకు నోచుకోవడం లేదని బాపట్ల జిల్లా జాయింట్ లెక్టర్ దృష్టికి గ్రీవెన్స్ ద్వారా తీసుకువెళ్లారు. ఫిర్యాదు పట్ల స్పందించిన జాయింట్ కలెక్టర్ భావన అర్హులైన యానాదులకు తక్షణమే ఆధార్ కార్డులు మంజూరు చేయమని ఆదేశాలు ఇవ్వడం జరిగింది. దీంతో అధికారులు మండలంలోని బలుసుల పాలెం సచివాలయంలో వీరికి ప్రత్యేక ఆధార్ క్యాంపను నిర్వహించి అర్హులైన 12 మందికి ఆధార్ కార్డులను మంజూరు చేశారు. ఆధార్ కార్డులు మంజూరు అవటం పట్ల యానాదులు, సంఘం జిల్లా అధ్యక్షుడు చౌటూరి రమేష్ లు అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

## ప్రజలకు పోలీసుల హెచ్చరిక

**రేపల్లె, డిసెంబరు 30, ప్రభాతవార్త:** నూతన సంవత్సరం సందర్భంగా రేపల్లె పోలీస్ శాఖ హెచ్చరికలు జారీ చేసింది.ప్రజలు నూతన సంవత్సరాన్ని శాంతియుతంగా,సురక్షితంగా నిర్వహించాలని ప్రజల భద్రత మాత్రమే తమ లక్ష్యమని మంగళవారంస్పష్టం చేసింది. రాత్రి 10 గంటల సమయం దాటాక అనవసరంగా ఎవరూ రహదారులపై సంచరించరాదని,రాత్రి 11 గంటలు దాటాక గుంపులుగా తిరగడాన్ని నిషేదించినట్లు పోలీస్ శాఖ ప్రకటించింది.మద్యం సేవించి వాహనాలు నడపడం,అతివేగంగా నిర్లక్ష్యంగా వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని పోలీస్ శాఖ హెచ్చరించింది.లౌడ్‌స్పీకర్లు వినియోగించి ప్రజలను ఉపేక్షిస్తే చర్యలు తప్పవని,మహిళల భద్రతపై ప్రత్యేక నిఘా ఉంచామని పోలీస్ శాఖ పేర్కొంది.బహిరంగ ప్రదేశాలలో కేక్‌లు కట్ చేయడం,టపాసులు పేల్చడం,గందరగోళం సృష్టించడం వంటి చర్యలకు పాల్పడితే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని పోలీస్ శాఖ స్పష్టం చేసింది.

## రెవెన్యూ క్లినిక్స్ పేరుతో రెవిన్యూ సమస్యలన్ని పరిష్కరించాలి

**బాపట్ల,డిసెంబర్30,ప్రభాతవార్త:** రెవెన్యూ క్లినిక్స్ పేరుతో రెవిన్యూ సమస్యలన్ని పరిష్కరించాలని సి సి ఎల్ ఏ ప్రత్యేక కార్యదర్శి జయలక్ష్మీ తెలిపారు. రాష్ట్ర రాజధాని



అమరావతి నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లతో మంగళవారం ఆమె వీక్షణ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికిజిల్లా నుంచి జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ హాజరయ్యారు .ఈ సందర్భంగా సిసిఎల్ ఏ ప్రత్యేకకార్యదర్శి మాట్లాడుతూ భూ సమస్యలపై వచ్చిన ఫిర్యాదులను పరిపూర్ణంగా పరిష్కరించడమే ముఖ్య ఉద్దేశమన్నారు. నమోదైన అర్జీల పరిష్కారం కొరకు సంబంధిత గ్రామాలలోకి దస్త్రాలను తీసుకువెళ్లి విచారించాల్సి ఉందన్నారు. తొమ్మిది జిల్లాలలో ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు.బాపట్ల జిల్లాలోనూ ఈ కార్యక్రమం సమర్ధంగా నిర్వహించా లన్నారు. ఎస్సీ, ఎస్టీలకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని ప్రభుత్వం ఆదేశించింద న్నారు. ఐ వి ఆర్ ఎస్ ద్వారా అర్జీదారుల అభిప్రాయాలను తెలుసుకుంటామన్నారు. ఈ నేపథ్యంలో నాణ్యతతో అర్జీలను పరిష్కరించాల న్నారు. ఈ కార్యక్రమాలలోనే రెవిన్యూ దస్త్రాలను డిజిటైజేషన్ చేయాలన్నారు. పాత దస్త్రాలన్నింటిని అత్యంత భద్రతతో స్కానింగ్ చేసి, తదుపరి సంబంధిత పోర్టల్ లో నిక్షిప్తం చేయాల్సి ఉందన్నారు. కొత్త జిల్లాల ఆవిర్భావ చట్టం అనుసరించి కలెక్టర్లు సహాయక చర్యలు చేపట్టాలన్నారు.ఈ సమావేశంలో జిల్లా సంయుక్త కలెక్టర్ భావన విశిష్ట, బాపట్ల ఆర్డిఓ పి గ్లోరియా, కలెక్టరేట్ ఏవో మల్లికార్జున్, తదితరులు పాల్గొన్నారు.

## పేదలకు విద్యా,వైద్యం అందేలా కృషి చెయ్యాలి

### బాపట్ల ఎంపిపి చిన్న పోతుల హరిబాబు

**బాపట్ల,డిసెంబర్30,ప్రభాతవార్త:** గ్రామీణ ప్రాంతాల్లో పేదలకు మెరుగైన విద్యా, వైద్య సౌకర్యాలు కల్పన కోసం అధికారులు కృషి చెయ్యాలని యంపిపి చిన్న పోతుల హరిబాబు చెప్పారు.స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మంగళవారం సర్వ సభ్య సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాల విద్యార్థుల కు చదువు తో పాటు, గుణగణాలు, సత్ప్రవర్తన గురించి కూడా తెలపాలని ముఖ్యంగా మత్తు పదార్థాలకి, సెల్ ఫోన్ లకు బానిసలు కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఇప్పటికీ దళిత, గిరిజన ప్రాంతాల్లో పేదలకు మౌలిక సదుపాయాలు లేక అనేక ఇబ్బందులు పడుతున్నారని వారి అవసరాలు తీర్చడం తో పాటు అనారోగ్యం తో బాధపడుతున్న వారికి నాణ్యమైన వైద్యం అందించాలని అధికారులకు హితవు పలికారు.సమావేశానికి అధ్యక్షత వహించిన యంపిడివో బి.బాబురావు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ఇంటి నివేశన స్థలాలకు హక్కు పత్రాలు ఇచ్చే స్వామిత్వ



పథకం,మన మిత్ర వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా ప్రభుత్వ సేవలు , ఏకీకృత కుటుంబ సర్వే తో అర్హులకు సంక్షేమ పథకాల అమలు లో ప్రజా ప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని చెప్పారు. సర్వసభ్య సమావేశంలో యంపిటిసి సభ్యులు, సర్పంచ్ లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు

## మహిళల రక్షణలో కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యం

**రేపల్లె, డిసెంబరు 30, ప్రభాతవార్త:** రాష్ట్రంలో మహిళలపై లైంగిక దాడులు, అత్యాచారాలు, హత్యలు పెరిగిపోతున్నాయని ప్రగతిశీల మహిళా సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు



శీలం ఏసమ్మ ఆందోళన వ్యక్తం చేశారు.మంగళవారం రేపల్లె పట్టణంలోని ఉప్పూడి కాల్వకట్టపై ప్రగతిశీల మహిళా సంఘం కార్యాలయం వద్ద సమావేశం జరిగింది. జనవరి 5వ తేదీ బాపట్లలో డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ భవనంలో నిర్వహించే ఉమ్మడి గుంటూరు జిల్లా స్థాయి జనరల్ కౌన్సిల్ సమావేశం పోస్టర్‌ను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా శీలం ఏసమ్మ ప్రసంగిస్తూ మహిళలకు రక్షణ కల్పించడంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని విమర్శించారు. ఉత్తరప్రదేశ్‌లో ఓ మైనర్ బాలికపై అత్యాచారం చేసిన బిజెపి ఎమ్మెల్యే కులదీప్‌సింగ్‌కు ఢిల్లీ హైకోర్టు బెయిల్ మంజూరు చేయడం విచారకరమన్నారు.ట్రయిల్ కోర్టు విధించిన యావజ్జీవ శిక్షను యధావిధిగా కొనసాగించాలని ఏసమ్మ డిమాండ్ చేశారు.నిరుపేదలకు నివేశన స్థలాలు మంజూరు చేయాలని ఆమె విజ్ఞప్తి చేశారు.సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని ఆమె డిమాండ్ చేశారు.చట్ట నిబంధనల ప్రకారం మహిళా చట్టాలను అమలు చేయాలని సూచించారు.బాపట్లలో జరిగే కౌన్సిల్ సమావేశంలో పిఒడబ్ల్యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.అనసూయ,సిపిఐఎంఎల్ న్యూ డెమోక్రసీ నాయకులు యు.గనిరాజు,పిఒడబ్ల్యూ నాయకులు ఎస్‌కె రజియా,సిహెచ్.సావిత్రి,డి.రాములమ్మ తదితరులు ప్రసంగిస్తారని ఆమె వివరించారు.ఈ సమావేశంలో ప్రగతి శీల మహిళా సంఘం నాయకులు డి.నాగలక్ష్మి, ఈశ్వరమ్మ, మాధవి, లక్ష్మి,నాగేంద్ర,ఎఐకెఎంఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు ఎన్.పోతురాజు తదితరులు పాల్గొన్నారు.

## భూసారాన్ని పరిరక్షించుకోవాలి

రేపల్లె, డిసెంబరు 30, ప్రభాతవార్త:భూమిలో ఉండే సారమే పంటలకు ప్రాణాధారమని ఏరువాక కేంద్రం జిల్లా కో ఆర్డినేటర్,వ్యవసాయ శాస్త్రవేత్త కె.అచ్చుతరాజు చెప్పారు.మంగళవారం మండలంలోని పేటేరులో రైతు సేవా కేంద్రం వద్ద కిసాన్ గోష్టి కార్య క్రమంలో ఆయన మాట్లాడుతూ భూసారాన్ని పరిరక్షించేందుకు తగిన పద్ధతులను అనుసరించాలన్నారు.అపరాల సాగుపై రైతులు మెళుకువలు పాటించి అధిక దిగుబడులు పొందాలని ఆయన సూచించారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారులు,సిబ్బంది,రైతులు పాల్గొన్నారు.



## ప్రజలకు పారదర్శకంగా సేవలందించాలి

**బాపట్ల,డిసెంబర్30,ప్రభాతవార్త:** ప్రజలకు పారదర్శకంగా సేవలు అందించాలని బాపట్ల డివిజన్ డెవలప్‌మెంట్ అధికారి విజలక్ష్మీ అన్నారు. మండల పరిదిలోని అప్పికట్ల, గుడిపూడి గ్రామాలను మంగళవారం బాపట్ల డివిజనల్ డెవలప్మెంట్ ఆఫీసర్ విజయలక్ష్మీ పర్యటించారు.ఈ సందర్భంగా అమె మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు తీరును పరిశీలించి, గ్రామ సచివాలయం ఉద్యోగులు ప్రజలకు అందుబాటులో వుండి, ప్రజలకు



పారదర్శకంగా సేవలందించాలన్నారు. ముఖ్యంగా ఏకీకృత కుటుంబ సర్వే గురించి అందరికీ అవగాహన కల్పించాలన్నారు. అప్పికట్ల గ్రామ సచివాలయం ఉద్యోగులు తో సమీక్ష నిర్వహించి సిబ్బంది కి పలు సూచనలు చేశారు. గుడిపూడి లోని చెత్త నుండి సంపద తయారీ కేంద్రం, మంచి నీటి శుద్ధి యంత్రాల పని తీరు ను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. డిడివో తో పాటు జియస్ డబ్ల్యుఎస్ డిప్యూటీ ఎంపిడివో పల్నాటి శ్రీరాములు, గుడిపూడి సర్పంచ్ డి. హనుమాంజయ, పంచాయతీ కార్యదర్శులు కరీమ్ రెడ్డి, నాగమల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు

## చెరుకుపల్లి చెన్నకేశవాలయంలో స్వామివారి ఉత్తర ద్వార దర్శనం

**చెరుకుపల్లి ,డిసెంబర్ 30 ( ప్రభాతవార్త) :** ముక్కోటి ఏకాదశి సందర్భంగా మండలంలోని అన్ని ఆలయాలు భక్తజన సందోహంగా మారాయి. మంగళవారం తెల్లవారుజామున మూడు గంటల నుండి భక్తులు ఆలయాలకు తరలి ఉత్తర ద్వారం



ద్వారా స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా భక్తులు ఆలయాలు స్వామివార్లకు ప్రత్యేక అభిషేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారు పలచోట్ల ప్రత్యేక వాహనాల పైన అధిష్టించి భక్తులకు దర్శనమిచ్చారు. తెల్లవారుజామునండి ఆలయాల్లో విష్ణు సహస్ర నామార్చనతో భక్తులు పూజా, భజన కార్యక్రమాలను, పారాయణాలను నిర్వహించారు. ఆలయాల్లో మహిళలు ప్రత్యేక అలంకారాలతో వేసిన ముగ్గులు మరియు విద్యుత్ కాంతులు విశేషంగా ఆకట్టుకున్నాయి.

## డిఎస్పీ కార్యాలయాన్ని తనిఖీ చేసిన ఎస్పీ

**రేపల్లె, డిసెంబరు 30, ప్రభాతవార్త:** వార్షిక తనిఖీలో భాగంగా రేపల్లెలోని డిఎస్‌పి కార్యాలయాన్ని మంగళవారం రాత్రి బాపట్ల జిల్లా ఎస్‌పి బి.ఉమామహేశ్వర్ తనిఖీ చేశారు. రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు.రౌడీ షీటర్ల కదలికలపై కింది స్థాయి పోలీస్ అధికారులతో చర్చించారు.తగిన సూచనలు జారీచేశారు.ఈ కార్యక్రమంలో రేపల్లె డిఎస్పీ ఎ.శ్రీనివాసరావు, రేపల్లె టౌన్ సి.ఐ మల్లికార్జునరావు,రూరల్ సిఐ ఆర్.సురేష్‌బాబు,వేమూరు సిఐ ఆంజనేయులు, చుండూరు సిఐ ఆనందరావు, ఎస్ఐలు శివయ్య,జ్యోతి, భార్గవ్, అనిల్,బాబూరావు ,తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

# దేశం కోసం జీవితం అంకితంచేసిన అమ్మ

## ఖలీదా జియా మృతిపట్ల ఆమె కుమారుడి భావోద్వేగం



**ఢాకా, డిసెంబరు 30:** బంగ్లాదేశ్ మాజీ ప్రధాని, బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ (బీఎన్‌పీ) అధినేత్రి ఖలీదా జియా మృతి పట్ల ఆమె కుమారుడు, పార్టీ తాత్కాలిక ఛైర్మన్ తారిఖ్ రెహమాన్ తీవ్ర భావోద్వేగానికి లోనయ్యారు. అనారోగ్యంతో బాధపడుతున్న 80 ఏళ్ల ఖలీదా జియా ఢాకాలోని ఎవర్‌కేర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఈరోజు ఉదయం 6 గంటలకు తుదిశ్వాస విడిచారు. తల్లి మరణంపై స్పందిస్తూ తారిఖ్ రెహమాన్ సోషల్ మీడియా వేదిక ఎక్స్ లో ఒక ఉద్వేగభరితమైన పోస్ట్ చేశారు. నా తల్లి అల్లా పిలుపు మేరకు మనల్ని విడిచి వెళ్లిపోయారు. చాలా మందికి ఆమె ప్రజాస్వామ్యానికి తల్లివంటిది (మదర్ ఆఫ్ డెమోక్రసీ), రాజీపడని నాయకురాలు. కానీ, నాకు మాత్రం ఆమె దేశం కోసమే జీవితాన్ని అంకితం చేసిన ప్రేమగల అమ్మని పేర్కొన్నారు. కష్టకాలంలోనూ ఆమె కుటుంబానికి అండగా నిలిచారని తారిఖ్ గుర్తుచేసుకున్నారు. దేశం కోసం తన భర్తను, బిడ్డను కోల్పోయినప్పటికీ దేశ ప్రజలనే తన కుటుంబంగా భావించారని, ఆమె త్యాగాలు బంగ్లాదేశ్ ప్రజాస్వామ్య చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాయని నివాళులర్పించారు. ఖలీదా జియా మృతికి సంతాపంగా బీఎన్‌పీ 7 రోజుల సంతాప దినాలను ప్రకటించగా, బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వం 3 రోజుల అధికారిక సంతాపం, బుధవారం సాధారణ సెలవు ప్రకటించింది. రేపు ఢాకాలో ఆమె అంత్యక్రియలు నిర్వహించనున్నారు. ఈ పరిణామాల నేపథ్యంలో తారిఖ్ రెహమాన్ అధ్యక్షతన పార్టీ అత్యవసర సమావేశం నిర్వహించి భవిష్యత్ కార్యాచరణపై సీనియర్ నేతలతో చర్చించారు.

# వెనెజులా భూభాగంపై తొలిసారి అమెరికా దాడి.. ధ్రువీకరించిన ట్రంప్

**వాషింగ్టన్, డిసెంబరు 30:** వెనుజులా భూభాగంపై తొలిసారిగా అగ్రరాజ్యం అమెరికా దాడికి పాల్పడింది. పడవల్లో డ్రగ్స్ లోడింగ్‌కు వాడే డాక్‌పై అమెరికా దళాలు దాడి చేశాయి. ఈ విషయాన్ని ఫ్లోరిడాలో జరిగిన సమావేశంలో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ధ్రువీకరించారు. 'ముందుగా అన్ని బోట్లను ధ్వంసం చేశాం. ఇప్పుడు వాటిని తరలించే ప్రాంతాన్ని కొట్టాం. ఆ డాక్ ఇక లేదు' అని తెలిపారు. గత వారం ఓ రేడియో ఇంటర్వ్యూలో కూడా ఈ దాడి గురించి ట్రంప్ ప్రస్తావించారు. ఓ పెద్ద సౌకర్య కేంద్రంపై అమెరికా ఆపరేషన్ జరిగిందని తెలిపారు. తాజాగా ఇప్పుడు రెండోసారి ఈ దాడి గురించి వెల్లడించారు. అయితే ఈ దాడి జరిగిన ప్రాంతం ఎక్కడ ఉంది? దాడి ఎప్పుడు జరిగిందనే విషయాన్ని ట్రంప్ వెల్లడించలేదు. ఈ దాడిలో కేవలం అమెరికా సైన్యమే పాల్గొందా? సిఐఎ ప్రమేయం ఉందా అన్న వివరాలు బయటపెట్టలేదు. ఈ దాడి వెనుజులా భూభాగంపైనే జరిగిందా? లేదా అన్నది కూడా ఇంకా స్పష్టం కాలేదు. ఈ దాడిపై వైట్‌హౌస్ కూడా ఎలాంటి వివరాలు వెల్లడించలేదు. గతంలో డ్రగ్స్ తరలించే బోట్లపై దాడుల సమయంలో చిత్రాలు, విడియోలను పెంటగాన్ విడుదల చేసింది. కానీ ఈ డాక్ ధ్వంసానికి సంబంధించి ఇప్పటివరకు ఎలాంటి ఫొటోలు విడుదల చేయలేదు. మరోవైపు వెనుజులా ప్రభుత్వం కూడా అధికారికంగా స్పందించలేదు. డ్రగ్స్ స్మగ్లింగ్‌పై అమెరికా గత యేడాది సెప్టెంబరు నుంచి ఉక్కుపాదం మోపుతోంది. పసిఫిక్, కరేబీయన్ సముద్రాల్లో డ్రగ్స్ అక్రమ రవాణా చేస్తున్నాయని ఆరోపిస్తూ 20కిపైగా బోట్లపై అమెరికా దాడులు చేసింది. వీటిలో చాలావరకు వెనుజులాకు చెందిన బోట్లే ఉన్నాయని అమెరికా చెబుతుంది. ఈ మొత్తం దాడుల్లో 100 మంది వరకు చనిపోయినట్లు సమాచారం.

# మోడీ, అమిత్‌షాలు దుర్యోధన, దుశ్శాసనులు.. పశ్చిమబెంగాల్ సిఎం మమతా బెనర్జీ



**కోల్‌కతా, డిసెంబర్ 30:** పశ్చిమబెంగాల్ సిఎం, తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమతా బెనర్జీ బిజెపిపై విరుచుకుపడ్డారు. ముఖ్యంగా ప్రధాని నరేంద్రమోడీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షాలను టార్గెట్ చేస్తూ విమర్శలు చేశారు. బెంగాల్ రాష్ట్రంలో ఉగ్రవాద నెట్‌వర్క్‌లు పనిచేస్తున్నాయని అమిత్ షా చేసిన ఆరోపణలపై స్పందిస్తూ పహల్గాం దాడిని కేంద్రమే చేసిందా? అని మమతా ప్రశ్నించారు. బెంగాల్‌లోని బంకురాలోని బిర్సింగ్‌పూర్‌లో జరిగిన ఒక ర్యాలీలో ప్రసంగిస్తూ, అమిత్ షా, ప్రధానమంత్రి నరేంద్ర మోడీలను మహాభారత ఇతిహాసంలోని ఇద్దరు ప్రతినాయకులైన దుశ్శాసన, దుర్యోధనులుగా అభివర్ణించారు. శకుని శిష్యుడైన దుశ్శాసనుడు సమాచారం సేకరించడానికి బెంగాల్‌కు వచ్చాడు. ఎన్నికలు రాగానే ఈ దుశ్శాసన, దుర్యోధనులు ప్రత్యక్షమవుతారు అని ఆమె అన్నారు. బెంగాల్ ఉగ్రవాదులకు కేంద్రంగా మారిందన్న హోంమంత్రి వ్యాఖ్యలపై స్పందిస్తూ, మమతా ఎదురుదాడికి దిగారు. జమ్మూకశ్మీర్‌లో ఉగ్రవాదులు లేకపోతే, పహల్గాం ఎలా జరిగింది? పహల్గాంలో దాడిని మీరే చేశారా? ఢిల్లీలో జరిగిన సంఘటన వెనుక ఎవరున్నారు? అని అడిగారు. బెంగాల్‌లో కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ఓటర్ల జాబితా ప్రక్రియపై మమత విమర్శలు చేశారు.

రాష్ట్రవ్యాప్తంగా ప్రజలను ఎస్ఐఆర్ పేరుతో వేధిస్తున్నారని అన్నారు. రాజ్‌బన్షీలు, మతువాలు, ఆదివాసీలు వంటి అణగారిన వర్గాలను లక్ష్యంగా చేసుకుంటున్నారన్నారు. ఎస్ఐఆర్ కింద 1.5 కోట్ల మంది పేర్లను తొలగించాలని యోచిస్తున్నారని ఆమె అన్నారు. దీని ద్వారా బెంగాలీల ఓటు హక్కును తొలగించే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు.

# సంస్కరణల ఎక్స్‌ప్రెస్‌లోకి అడుగు పెట్టాం

**- వికసిత్ భారత్ లక్ష్యంగా సంస్కరణలు అమలు**

**- ఇంధనం, పన్నులు, విద్య రంగాల్లో విప్లవాత్మక సంస్కరణలు: ప్రధాని మోడీ**



**న్యూఢిల్లీ, డిసెంబరు 30:** ఇంధనం, పన్నులు, వాణిజ్యం, విద్య తదితర రంగాల్లో 2025లో పరివర్తనాత్మక సంస్కరణలు అమలు చేశామని, తద్వారా భారత్ సంస్కరణ ఎక్స్‌ప్రెస్‌లోకి అడుగు పెట్టిందని ప్రధానమంత్రి నరేంద్రమోడీ ప్రకటించారు. వికసిత్ భారత్ లక్ష్యంగా కార్మిక చట్టాలు, జన్ విశ్వాస్, సెక్యూరిటీల మార్కెట్, ఆదాయ పన్ను, జిఎస్‌టిలో మార్పులను ఈ సందర్భంగా ప్రస్తావించారు. ఈ మేరకు మంగళవారం లింక్డ్‌ఇన్‌లో ప్రధాని మోడీ పోస్ట్ చేశారు. భారత్ సంస్కరణ ఎక్స్‌ప్రెస్‌లోకి అడుగుపెట్టిందని పేర్కొంటూ, 2025లో సంస్కరణల జాబితాను జతచేశారు. "2025 వివిధ రంగాల్లో విప్లవాత్మక సంస్కరణలను చూసింది. ఇవి మన వృద్ధి ప్రయాణానికి ఊతం ఇచ్చాయి. అవి వికసిత్ భారత్‌ను నిర్మించడానికి మన ప్రయత్నాలను కూడా మెరుగు పరుస్తాయి" అని ప్రధాని సోషల్ మీడియాలో రాసుకొచ్చారు. 2025ని నిరంతర జాతీయ మిషన్‌గా సంస్కరణలపై దృష్టి సారించిన సంవత్సరంగా అభివర్ణించారు. 'గత 11 సంవత్సరాలుగా కొనసాగుతున్న పునాదిపై నిర్మించబడిన నిరంతర జాతీయ మిషన్‌గా సంస్కరణలపై దృష్టి సారించిన సంవత్సరంగా భారతదేశానికి 2025 గుర్తుండిపోతుంది. తాము సంస్థలను ఆధునీకరించాం, పాలనను సరళీకృతం చేశాం, దీర్ఘకాలిక, సమగ్రవృద్ధికి పునాదులను బలోపేతం చేశాం' అని అన్నారు.

# తమిళ సీరియల్‌నటి నందిని ఆత్మహత్య



**చెన్నై, డిసెంబరు 30:** తమిళ టెలివిజన్ రంగంలో తక్కువ వయసులోనే మంచి గుర్తింపు తెచ్చుకున్న ప్రముఖ సీరియల్ నటి నందిని (20) ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఈ సంఘటన ఇండస్ట్రీని ఒక్కసారిగా షాక్‌కు గురిచేసింది. షూటింగ్ పూర్తి చేసుకుని ఇంటికి వచ్చిన కొద్దిసేపటికే ఆమె ఈ తీవ్ర నిర్ణయం తీసుకున్నట్లు ప్రాథమిక సమాచారం. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని దర్యాప్తు ప్రారంభించారు. నందిని గది నుంచి ఒక సూసైడ్ లెటర్ స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు వెల్లడించారు. ఆ లేఖలో కుటుంబ సభ్యులు తనపై పెళ్లి విషయంలో ఒత్తిడి తీసుకువస్తున్నారని, ఆ మానసిక వేదనను తట్టుకోలేకపోయానని నందిని పేర్కొన్నట్లు తెలుస్తోంది. గత కొన్ని రోజులుగా నందిని తీవ్ర మానసిక ఒత్తిడితో బాధపడుతోందని గుర్తించారు. కెరీర్ పరంగా ఎదుగుతున్న దశలోనే వ్యక్తిగత సమస్యలు ఆమెను కుంగదీసినట్లు తెలుస్తోంది. నందిని తెలుగమ్మాయే అయినప్పటికీ, ముందుగా కన్నడ సీరియల్ ఇండస్ట్రీలో అడుగుపెట్టి మొదటి సీరియల్‌తోనే మంచి పేరు తెచ్చుకుంది.



# బంగ్లా తొలి మహిళా ప్రధాని ఖలీదా జియా కన్నుమూత

**కొన్ని వారాలుగా తీవ్ర అనారోగ్యంతో మాజీ ప్రధాని**

**మాజీ అధ్యక్షుడు జియాఉర్‌రహ్మాన్ భార్యగా రాజకీయ ప్రవేశం**

**మూడుసార్లు ప్రధానిగా, బిఎన్పీఅధినేతగా బంగ్లాపై చెరగని ముద్ర**

**17 యేళ్ల తర్వాత తిరిగి స్వదేశానికి వచ్చిన కుమారుడు తారిక్ రెహ్మాన్**

**ఢాకా, డిసెంబరు 30:** బంగ్లాదేశ్ రాజకీయాల్లో ధ్రువతార, ఆ దేశ తొలి మహిళా ప్రధానమంత్రి బేగం ఖలీదా జియా (80) మంగళవారం కన్నుమూశారు. కొంతకాలంగా తీవ్ర అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ఆమె చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచినట్లు ఆమె నాయకత్వంలోని బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ (బీఎన్‌పీ) ప్రకటించింది. 80 ఏళ్ల ఖలీదా జియా వృద్ధాప్య సమస్యలతో పాటు పలు తీవ్రమైన వ్యాధులతో బాధపడుతున్నారు. వైద్యుల కథనం ప్రకారం ఆమె కాలేయ వ్యాధి, కీళ్ల నొప్పులు, మధుమేహం, గుండె, ఊపిరితిత్తులకు సంబంధించిన సమస్యలతో ఇబ్బంది పడుతున్నారు. కొన్ని వారాలుగా ఆమె ఆరోగ్యం మరింత క్షీణించడంతో ఆసుపత్రిలో ప్రత్యేక నిఘాలో ఉంచి చికిత్స అందించినప్పటికీ ఫలితం లేకపోయింది. ఆమె చికిత్స పొందుతున్న ఎవర్‌కేర్ ఆసుపత్రికి బ్రిటన్, అమెరికా, చైనా, ఆస్ట్రేలియాలనుంచి వైద్యనిపుణులు వచ్చి కృషిచేసినా ఆమె తుదిశ్వాస విడిచారు. బంగ్లాదేశ్ మాజీ అధ్యక్షుడు జియావుర్ రెహ్మాన్ భార్య అయిన ఖలీదా జియా తన భర్త మరణానంతరం రాజకీయాల్లోకి వచ్చి దేశాన్ని శాసించారు. మూడు సార్లు ప్రధానమంత్రిగా బాధ్యతలు చేపట్టిన ఆమె, బంగ్లాదేశ్‌లో ప్రజాస్వామ్య పునరుద్ధరణకు కృషి చేశారు. షేక్ హసీనాతో సాగించిన దశాబ్దాల రాజకీయ పోరు బంగ్లాదేశ్ చరిత్రలో ఒక ప్రధాన ఘట్టం. ఆమె మరణవార్త తెలియగానే బంగ్లాదేశ్ వ్యాప్తంగా ఉన్న బీఎన్‌పీ కార్యకర్తలు, అభిమానులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు. ఖలీదాకు కుమారుడు తారిక్‌రెహమాన్, కోడలు జుబైదారహమాన్, కకుమార్తె జైమా రహమాన్‌లు ఉన్నారు. 17 ఏళ్లప్రవాస జీవితం తర్వాత తొలిసారిగా ఈనెల 25వ తేదీనే ఆమెకుమారుడు ఢాకాకు వచ్చారు. జియా చిన్నకుమారుడు అరాఫత్ రహమాన్ కోకో మలేసియాలో కొన్నేళ్లక్రితమే చనిపోయారు. బ్రిటిష్ పాలనలోని భారత్ తూర్పు బెంగాల్‌లోని దిజాన్‌పూర్‌లో 1946 ఆగస్టు 15న జన్మించిన ఖలీదాజియా తల్లితండ్రులు జల్పాయిగురిలో తేయాకు వానయపారంచేసేవారు.



తూరుపబెంగాల్‌కువెళ్లినతర్వాత తూర్పు పాకిస్తాన్‌గా మారింది. 1947లో భారత్ విభజనలో పాకిస్తాన్‌కిందకువెళ్లింది. తొలినాళ్లలో ఖలదా దినాజ్‌పూర్‌లోనే గడిపారు. ప్రభుత్వ బాలికల పాఠశాలలో చదువుకున్న తర్వాత సురేంద్రనాథ్ కళాశాలలో చేరారు. 1981లో ఆమె భర్త అప్పటి అధ్యక్షుడు జియావుర్ రెహమాన్‌ను మిలిటరీ తీరుగుబాటోల 1981 మే 30వ తేదీ ఛట్టోగ్రామ్ వద్ద హత్యకు గురికావడంతో ఖలీదా క్రియాశీలక రాజకీయాల్లోకి వచ్చారు. బిఎన్‌పిని ముందుండి నడిపించి జియావుర్‌ప్రాభవాన్ని కొనసాగించారు. రహమాన్ హత్యతర్వాత ఉపాధ్యక్షుడుఅ బ్దుస్ సత్తార్ తాత్కాలిక అధ్యక్షుడుగా వచ్చారు. కొన్ని నెలలకే ఆర్మీచీఫ్ హుస్సేన్ ముహమ్మద్ ఎర్షాద్ అధికారం హస్తగతం చేసుకున్నారు. మార్షల్‌లా నడిచింది. 1982లో పార్టీలోచేరిన తర్వాత 1983లో వైస్‌ఛైర్మన్ అయ్యారు. ఆ తర్వాత 1984లో ఛైర్మన్‌గా వచ్చారు. మూడు పర్యాయాలు ఎన్నికల్లో విజయం సాధించి ప్రధానమంత్రిగా కొనసాగారు. తన దీర్ఘకాల ప్రత్యర్థి షేక్ హసీనాకు ధీటుగా ఆమె వ్యూహాలు అమలుచేసారు. రానురాను ఆమె ప్రజాజీవితం సమస్యలతో నిండిపోయింది.

# ప్రధాని మోడీ సహా పలువురు నేతల ప్రగాఢ సంతాపం



**చైనా, పాక్ నేతలతో పాటు హసీనా, యూనస్‌ల నివాళి**

**సోనియా, రాహుల్ పలువురు విపక్ష నేతల సంతాపం**

**ఖలీదా మృతితో బంగ్లాలో మూడురోజులు సంతాపదినాలు, నేడు అంత్యక్రియలు**

**న్యూఢిల్లీ, డిసెంబరు 30:** బంగ్లాదేశ్ రాజకీయాల్లో దశాబ్దాల పాటు కీలక నేతగా వ్యవహరించిన ఆ దేశ మాజీ ప్రధాని, బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ చైర్‌పర్సన్ ఖలీదా జియా మృతి పట్ల భారత ప్రధాని నరేంద్ర మోదీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. బంగ్లాదేశ్ తొలి మహిళా ప్రధానిగా ఆమె సృష్టించిన చరిత్రను గుర్తుచేసుకుంటూ, ఎక్స్ వేదికగా నివాళులర్పించారు. బంగ్లాదేశ్ అభివృద్ధిలో, అలాగే భారత్‌బంగ్లాదేశ్ సంబంధాలను బలోపేతం చేయడంలో ఆమె కీలక పాత్ర పోషించారని మోదీ పేర్కొన్నారు. 2015లో ఢాకా పర్యటన సందర్భంగా ఆమెతో జరిగిన భేటీని మోదీ ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నారు. జియా మృతి పట్ల బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వ అధినేత మహమ్మద్ యూనస్ ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆమె కుమారుడు తారిఖ్ రెహ్మాన్ ఇటీవలే లండన్ నుంచి తిరిగి రాగా, తల్లి చివరి క్షణాల్లో ఆసుపత్రిలోనే ఉన్నారు. ఖలీదా జియా మృతితో బంగ్లాదేశ్ రాజకీయాల్లో ఒక శకం ముగిసినట్లయింది. కేర్‌టేకర్ ప్రధాని మహ్మద్‌యూనస్ తన సంతాప సందేశంలో బంగ్లాదేశ్ ఒక గొప్ప సంరక్షకురాలని కోల్పోయిందని, ఆమె రాజకీయ జీవితం ఎన్నో సవాళ్లు ఎదుర్కొని దేశ అభివృద్ధికి రాజీలేని పోరాటంచేసారని పేర్కొన్నారు. ఆమె పవిత్రాత్మకు శాంతిచేకూరాలని ఆకాంక్షించారు. మాజీ ప్రధాని అవామీ లీగ్ అధ్యక్షురాలు షేక్ హసీనా తన




సంతాప సందేశంలో బంగ్లాదేశ్ రాజకీయాల్లో తీరని నష్టం వాటిల్లిందన్నారు. దేశ రాజకీయ చరిత్రలో జియా గుర్తుంచుకోదగిన నేతగా నిలిచారన్నారు. ప్రజాస్వామ్య పునరుద్ధరణకు ఎనలేని కృషిచేసారని హసీనా కొనియాడారు. అదేవిధంగా ఎఐసిసి నాయకుడు రాహుల్‌గాంధీ, సోనియా, ప్రియాంకలు కూడా ఖలీదాజియా మృతికి సంతాపం ప్రకటించారు. పొరుగుననే ఉన్న పాకిస్థాన్, చైనా దేశాధినేతలుసైతం ఖలీదాజియా మృతికి సంతాపం ప్రకటించారు. దేశంకోసం నిరంతరం అంకితమయిన నేతగా జియాను చైనా, పాక్‌నేతలు కొనియాడారు.

# రష్యా అధ్యక్షుడు పుతిన్ ఇంటి వద్ద డ్రోన్ల దాడులు

**ఉక్రెయిన్ చర్యను గగనతలంలోనే ప్రతిఘటించామన్న మాస్కో రక్షణమంత్రి**

**దౌత్యచర్చల సమయంలో ఇలాంటి దాడులు మంచిదికాదు.. ట్రంప్**



**మాస్కో, డిసెంబరు 30**: రష్యా ఉక్రెయిన్‌ల మధ్య యుద్ధంముగింపునకు వస్తున్న సందర్భంలో పుతిన్ నివాసంపై ఉక్రెయిన్‌డ్రోన్ దాడిచేసిందన్న వార్తలు దౌత్యచర్చలకు అంతరాయం కలిగించింది. తమ అధ్యక్షుడు వ్లాదిమిర్‌పుతిన్ నివాసంపై ఉక్రెయిన్ డ్రోన్లతో దాడిచేసిందని ఈదాడులను తీవ్రంగా ప్రతిఘటించామని రష్యా రక్షణ వ్యవస్థప్రకటించింది. ఈ ఘటనను ఉగ్రదాడిగా పేర్కొన్న మాస్కో యుద్ధవిరమణ చర్చలపై తమ వైఖరిని మార్చుకుంటామని వెల్లడించింది. ఆదివారం రాత్రినుంచి సోమవారం ఉదయం మధ్యలో మాస్కోలోని సెయింట్ పీటర్స్ బర్గ్‌మధ్య ఉన్న నోవ్గోరడ్‌ప్రాంతంలోని పుతిన్ అధికార నివాసం లక్ష్యంగా ఉక్రెయిన్ మొత్తం 91 డ్రోన్లు ప్రయోగించిందన్నారు. అయితే రష్యా గగనతల వ్యవస్థలన్నీ వీటిని ధ్వంసంచేసాయన్నారు. దీనితో యుద్ధవిరమణ చర్చలపై తమ వైఖరిని పునఃసమీక్ష చేసుకుంటామని రష్యా మంత్రి సెర్గీ లావ్రోవ్ అన్నారు. అయితే ఈఆరోపణలను ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ తీవ్రంగా ఖండించారు. అమెరికా నేతృత్వంలో సాగుతున్న దౌత్యప్రయత్నాలను భగ్నంచేయడానికే రష్యా ఈ ప్రమాదకర ప్రయత్నాలుచేస్తోందని విమర్శించారు. పుతిన్‌నివాసంపైదాడి కథనం పూర్తిగా కల్పితమనిచెప్పిన జెలెన్‌స్కీ యుద్ధం ముగింపునకు చర్యలు తీసుకోకుండా తప్పించుకోడానికి ఇలాంటిసాకులు చెపుతున్నదన్నారు.

**స్వయంగా పుతిన్ ఫోన్‌చేసి చెప్పారు...డొనాల్డ్‌ట్రంప్**

ఈ డ్రోన్ దాడి వ్యవహారంపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఉక్రెయిన్‌పై తీవ్ర అసహనం వ్యక్తంచేసారు. ఈ సమాచారం స్వయంగా అధ్యక్షుడు పుతిన్ తనకు చెప్పారని అంటూనే అయితే దాడిపై ఆయన సందేహాలు వ్యక్తంచేసారు. డ్రోన్‌దాడి జరక్కపోయి ఉండొచ్చని అందుకు ఆస్కారం కూడా ఉందని అన్నారు. అవమానకరంగా ప్రవర్తించడం ఒక ఎత్తు అయితే ఇంటిపై దాడిచేయడం మరో ఎత్తు అని ఇపుడే అలాంటిపనులుచేయడానికిఇది సరైన సమయం కాదని అన్నారు. అయినా దౌత్యచర్చల సమయంలో ఇలాంటి దాడులు ఎంతమాత్రం మంచిదికాదన్నారు.

# చీనాబ్‌పై కొత్త ప్రాజెక్టుకు ఆమోదం..

**పాక్ దాహంతో అల్లాడిపోవాల్సిందే**



**శ్రీనగర్, డిసెంబరు 30:** పాకిస్థాకు గడ్డు కాలం మొదలు కానుంది. పర్యావరణ మంత్రిత్వ శాఖకు చెందిన ఒక కమిటీ జమ్మూ కాశ్మీర్‌లోని కిష్త్వార్ జిల్లాలో చీనాబ్ నదిపై 260 మెగావాట్ల దుల్హస్తీ స్టేజ్–2 జలవిద్యుత్ ప్రాజెక్టుకు ఆమోదం తెలిపింది. పాకిస్థాన్‌లో ఉన్న ఇండస్ జల ఒప్పందం (ఇండస్ వాటర్స్ ట్రీటీ) ప్రస్తుతం నిలిపివేసిన విషయం తెలిసిందే. ఇండస్ నది, దాని ఉప నదుల నీటి సామర్థ్యాన్ని పూర్తిగా వినియోగించాలన్న కేంద్ర ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా ఈ నిర్ణయం తీసుకున్నారు. పహల్గామ్‌లో జరిగిన పాకిస్థాన్ ప్రేరేపిత ఉగ్రదాడి తర్వాత, 1960లో కుదిరిన ఇండస్ జల ఒప్పందాన్ని భారత్ తాత్కాలికంగా నిలిపివేసింది. ఒప్పందం ప్రకారం పాకిస్థాన్‌కు కేటాయించిన ఇండస్ నది పశ్చిమ ఉప నదులైన చీనాబ్, జీలమ్, ఇండస్‌లపై భారత్ తన హక్కులను వినియోగించుకునేందుకు వేగంగా చర్యలు ప్రారంభించింది. దీని లక్ష్యం జలవిద్యుత్ సామర్థ్యాన్ని పెంచడం, నీటి భద్రతను ప్రాధాన్యంగా తీసుకోవడం ప్రారంభించింది. దుల్హస్తీ స్టేజ్–2 ప్రాజెక్టుకు గ్రీన్‌సిగ్నల్ రావడం, జూలైలో ఇదే చీనాబ్ నదిపై 1,856 మెగావాట్ల సవాల్కోట్ జలవిద్యుత్ ప్రాజెక్టుకు అంతర్జాతీయ టెండర్లు పిలిచిన కొన్ని నెలల తర్వాత ఇది జరిగింది. ఇండస్ జల ఒప్పందం అమలులో ఉన్నప్పుడు, పశ్చిమ నదులపై భారత్‌కు కేవలం నీటిని వినియోగించకుండా విద్యుత్ ఉత్పత్తి చేసే హక్కు మాత్రమే ఉండేది. ఇప్పుడు ఒప్పందం నిలిపివేయబడినప్పటికీ, కొత్తగా ఆమోదించిన ప్రాజెక్టులన్నీ 'రన్–ఆఫ్–ది–రివర్' విధానంలోనే ఉండటం గమనార్హం.

# సంక్షిప్తంగా..

## ఐఐటి కాన్పూర్‌కు పూర్వ విద్యార్థులు రూ.100 కోట్ల విరాళం



**కాన్పూర్, డిసెంబరు 30:** ఐఐటీ కాన్పూర్ క్యాంపస్‌లో ఇటీవల నిర్వహించిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం దాతృత్వానికి ఒక మైలురాయిగా నిలిచింది. తమ కెరీర్, జీవితాల్ని తీర్చిదిద్దటంలో కీలకంగా నిలిచిన విద్యా సంస్థకు రూ.100 కోట్లు విరాళంగా అందజేస్తామని వాళ్లంతా ఉమ్మడిగా ప్రతిజ్ఞ చేశారు. దీనిపై ఐఐటీ కాన్పూర్ స్పందిస్తూ, దేశంలోనే అత్యధికం. పూర్వ విద్యార్థుల విరాళంలో ఇది చారిత్రక మైలురాయిని సూచిస్తున్నది. ఐఐటీ కాన్పూర్ పట్ల కృతజ్ఞతా భావాన్ని తెలుపుతుందని పేర్కొన్నది. ఐఐటీ కాన్పూర్‌లో మిలీనియం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సొసైటీని స్థాపించడానికి విరాళాల్ని ఉపయోగించాలని పూర్వ విద్యార్థులు ప్రతిపాదించారు. ఈ సమ్మేళనంలో పాల్గొనేందుకు ప్రపంచం నలుమూలల నుంచి పూర్వ విద్యార్థులు తరలివచ్చారు.

## ప్రియాంక కుమారుడు రెహాన్ నిశ్చితార్థం



**న్యూఢిల్లీ, డిసెంబరు 30:** కాంగ్రెస్ పార్టీ అగ్రనాయకురాలు వాయనాడు ఎంపి ప్రియాంక గాంధీ వాద్రా కుమారుడు రేహాన్‌వాద్రా వివాహ నిశ్చితార్థం జరిగింది. తన స్నేహితురాలు అవీవాబేగ్‌తో రేహాన్ నిశ్చితార్థం జరిగినట్లు సమాచారం. రెండురోజులక్రితం వీరిద్దరూ దిగిన ఫోటోను అవీవా తన ఇన్‌స్టా స్టోరీస్‌లో పంచుకున్నారు. తర్వాత అదే ఫోటోను హైలైట్స్ సెక్షన్‌లో పోస్టుచేసారు. వీరి ఎంగేజ్‌మెంట్ వార్తలకు ఈ ఫోటోలు మరింత బలాన్నిచ్చాయి. రేహాన్ అవీవా ఏడేళ్లుగాస్నేహితులు. అవీవాముందు రేహాన్‌పెళ్లిప్రస్తావన తీసుకురాగా ఆమె ఆమోదించిందని తెలుస్తోంది. వీరి ప్రేమ బంధాన్ని ఇరుకుటుంబాలు అంగీకరించి నిశ్చితార్థం జరిపించినట్లు వార్తలు వచ్చాయి. దీనిపై గాంధీ, వాద్రా కుటుంబాలనుంచి ఎలాంటిప్రకటన ఇప్పటివరకూ రాలేదు. అవీవా కుటుంబసభ్యులు ఢిల్లీకి చెందినవారని రాబర్ట్ వాద్రా కుటుంబంతో వీరికి సన్నిహిత సంబంధాలున్నట్లు చెపుతున్నారు.

## ఉత్తరాఖండ్ లోయలో పడిన బస్సు.. ఏడుగురు మృతి!



**డెహ్రాడూన్, డిసెంబర్ 30:** ఉత్తరాఖండ్‌లో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. మంగళవారం తెల్లవారుజామున అల్మోరా జిల్లాలోని శిలాపానీ ప్రాంతంలో ప్రయాణికులతో వెళుతున్న బస్సు ప్రమాదవశాత్తు లోయలో పడిపోయింది. ఈ ఘటనలో ఏడుగురు మృతి చెందగా మరో 11 మంది పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఘటనా స్థలంలో సహాయక చర్యలు కొనసాగుతున్నాయని పోలీసు పేర్కొన్నారు. అయితే ప్రమాదం జరిగిన లోయ ప్రదేశం ఇబ్బందికరంగా ఉండడం, వాహనం కింద బురద పేరుకుపోవడంతో అందులో ఇరుక్కుపోయిన వారిని వారిని బయటకు తీయడం కష్టంగా మారిందన్నారు. స్థానికుల సహాయంతో క్షతగాత్రులను సమీపంలోని ఆసుపత్రికి తరలిస్తున్నట్లు తెలిపారు. బస్సు ద్వారహాత్ మీదుగా రాంనగర్‌కు వెళుతుండగా అదుపుతప్పి లోయలో పడినట్లు ప్రాథమిక దర్యాప్తులో గుర్తించామన్నారు.

## బంగ్లాదేశ్‌లో మరో హిందూ వ్యక్తి హత్య!



**ఢాకా, డిసెంబర్ 30:** బంగ్లాదేశ్‌లో దీపూ చంద్ర దాస్, అమృత్ మండల్ అనే హిందూ యువకుల హత్యోదంతాలు మరువకముందే మరో హిందువు హత్యకు గురయ్యాడు. మయమన్‌సింగ్ జిల్లాలోని ఒక కర్మాగారంలో సెక్యూరిటీ గార్డుగా విధులు నిర్వహిస్తున్న బజేంద్ర బిశ్వాస్ (42)ను అతడి సహోద్యోగి నోమన్ మియా కాల్చి చంపినట్లు స్థానిక మీడియా వర్గాలు వెల్లడించాయి. తాము ఇద్దరం ఫ్యాక్టరీ బారక్‌లో సరదాగా మాట్లాడుకుంటున్న సమయంలో భద్రత కోసం ఉపయోగించే తుపాకీని బిశ్వాస్‌వైపు గురిపెట్టానని అనుకోకుండా చేయి ట్రిగర్‌కు తాకడంతో తుపాకీ పేలి, బుల్లెట్ అతడికి తగిలిందని నోమన్ మియా పేర్కొన్నాడు. వెంటనే ఆసుపత్రికి తరలించగా అతడు మరణించినట్లు వైద్యులు ధృవీకరించినట్లు తెలిపాడు. కేసు నమోదు చేసిన పోలీసులు నోమన్ మియాను అరెస్టు చేశారు. బిశ్వాస్ మృతికి కారణాలపై దర్యాప్తు చేస్తున్నామన్నారు.

31-12Pg6exHMNWJQE 10_31-12Pg6exHMNWJQE.qxd 30/Dec/25 10:51 PM Page 1



# రామతీర్థంలో మార్మోగిన రామనామస్మరణ



- ఘనంగా ముక్కోటి ఏకాదశి
- గిరిప్రదక్షిణకు పోటెత్తిన భక్తులు

నెల్లిమర్ల (విజయనగరం జిల్లా), డిసెంబరు 30 ప్రభాతవార్త: విజయనగరం జిల్లాలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థం రామస్వామి వారి దేవస్థానం వద్ద ముక్కోటి ఏకాదశి పర్వదినం, గిరి ప్రదక్షిణ కార్యక్రమాల నేపథ్యంలో వచ్చిన వేలాది మంది భక్తులతో శ్రీరామ నామస్మరణ మార్మోగింది. అడుగడుగునా జైశ్రీరామ్ జైశ్రీరామ్ అంటూ భక్తులు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. రామతీర్థం దేవస్థానం ఉత్తర ద్వారం గుండా వెళ్లి సీతారామ స్వాములను దర్శించుకున్నారు. అలాగే బోడికొండ మెట్ల వద్ద ఎమ్మెల్యే లోకం నాగ మాధవితో పాటు, సాధు పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాసానంద సరస్వతి ఆధ్వర్యంలో మెట్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పలు సాంస్కృతిక ప్రదర్శనలతో భక్తులు గిరిప్రదక్షిణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. సుమారు 9 కిలోమీటర్ల నిడివిగల గిరిప్రదక్షిణారోడ్డు మార్గం సుమారు ఐదు గంటల పాటు భక్తులతో కిటకిటలాడింది. బోడికొండ మెట్ల వద్ద ప్రారంభమైన గిరిప్రదక్షిణ కార్యక్రమం రామతీర్థం ఎస్ టి కాలనీ, మెయిన్ రోడ్, సీతారాముని పేట జంక్షన్, గొర్లపేట కల్లాలు మీదుగా బోడికొండ చుట్టూ వేలాదిమంది ప్రదక్షిణ చేశారు. ప్రదక్షిణ చేసిన భక్తులు బోడికొండ కొండ మీదకు వెళ్లి కోదండ రామాలయంలో రామస్వామిని దర్శించుకున్నారు. కొండపై ఉన్న వివిధ చారిత్రక చిహ్నాలను సందర్శించారు. గిరిప్రదక్షిణ ఊరేగింపులో భాగంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. గిరి ప్రదక్షణ ఊరేగింపు ఆద్యంతం ఎమ్మెల్యే లోకం నాగ మాధవి, సాధు పరిషత్ అధ్యక్షుడు శ్రీనివాసనంద సరస్వతి పాల్గొన్నారు. పలు స్వచ్ఛంద సంస్థలు ప్రతినిధులు కొండ చుట్టూ గిరిప్రదక్షిణ మార్గంలో ఉచిత రీతిన మజ్జిగ ప్యాకెట్లను, బిస్కట్ ప్యాకెట్లను, మంచినీటి ప్యాకెట్లను వితరణగా అందజేశారు. అనంతరం దేవస్థానం వెనుక భాగాన ఉన్న ఖాళీ స్థలంలో వేలాది మంది భక్తులకు దేవస్థానం అధికారులు ఉచిత భోజన సదుపాయం ఏర్పాటు చేశారు.

### దైవదర్శనానికి ప్రముఖులు హాజరు

ముక్కోటి ఏకాదశి ప్రత్యేక దినాన్ని పురస్కరించుకొని ఉత్తర ద్వార దర్శనం చేసుకునేందుకు పలువురు ప్రముఖులు మంగళవారం రామతీర్థం రామస్వామి వారి దేవస్థానానికి చేరుకున్నారు. ఉత్తర ద్వార దర్శనం తలుపులు ఉదయం ఐదున్నర గంటలకు అర్చకులు తెరిచారు. ఉత్తర ద్వారంలో ఊయలపై స్వామివారి ఉత్సవ విగ్రహాలను ఉంచి భక్తులకు దర్శనానికి అనుమతించారు. ముక్కోటి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం నాగ మాధవి దంపతులతో పాటు విజయనగరం ఎమ్మెల్యే, రామతీర్థం దేవస్థానం ఆలయ ధర్మకర్త పూసపాటి అశోక్ గజపతిరాజు కుమార్తె పూసపాటి అదితి విజయలక్ష్మి గజపతిరాజు, ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదుటి ఈశ్వరరావు, విజయనగరం జిల్లా ఎస్పీ ఏఆర్ దామోదర్, పలువురు అధికారులు రాజకీయ నాయకులు హాజరై దర్శనం చేసుకున్నారు. రామతీర్థంలో జరిగిన కార్యక్రమాలకు సుమారు 20వేల మందికి పైగా హాజరైనట్లు అధికారుల అంచనా. దేవస్థానంలో ఏర్పాట్లను ఈవో వై.శ్రీనివాసరావు అనుక్షణం పర్యవేక్షించారు. వేడుకలను, గిరిప్రదక్షిణ పురస్కరించుకొని ఎలాంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా భోగాపురం రూరల్ సిఐ బి.రామకృష్ణ పర్యవేక్షణలో నెల్లిమర్ల, డెంకాడ, పూసపాటిరేగ ఎస్ఐలు బి.గణేష్, సన్యాసినాయుడు, దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో గట్టి బందోబస్తు ఏర్పాటయింది. ఉత్తర ద్వార దర్శనం, గిరి ప్రదక్షణ కార్యక్రమాలు విజయవంతంగా ముగియడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. భక్తుల క్రమబద్ధీకరణలో పోలీసులతో పాటు పలు ప్రాంతాలకు చెందిన శ్రీవారి సేవ మహిళలు ఉచిత రీతిన సేవలు అందించారు.

# వేణుగోపాలస్వామి రథాన్ని పునః ప్రారంభిస్తాం

## ఆలయ ధర్మకర్త ఆర్.వి.ఎస్.కె రంగారావు



బొబ్బిలి (విజయనగరం జిల్లా), డిసెంబరు 30 ప్రభాతవార్త: ఎంతో చరిత్ర కలిగిన 90 ఏళ్ల క్రితం ఆగిపోయిన రథోత్సవాన్ని మళ్లీ పునః ప్రారంభిస్తామని శ్రీ వేణుగోపాలస్వామి ఆలయ ధర్మకర్త ఆర్.వి.ఎస్.కే రంగారావు అన్నారు. 90 ఏళ్ల క్రితం ప్రతి ఏడాది శ్రీ వేణుగోపాలస్వామి వారిని దీపావళి అమావాస్య రోజున రాజ కుటుంబీకులు ఎంతో వైభవంగా రథోత్సవాన్ని నిర్వహించే వారని, 1930 దశకంలో ఒకసారి స్వామివారి రథోత్సవం ఏర్పాట్లు జరుగుతున్న రోజున అనుకోకుండా మాజీ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ బొబ్బిలిలో అదే రోజు స్వతంత్రోద్యమ సభ ఏర్పాటు చేయదలచినప్పుడు ఈ రథోత్సవం ఏర్పాట్లను బొబ్బిలి రాజులు ఉద్దేశపూర్వకంగా చేస్తున్నారని కొందరు సమాచారం అందించడంతో ఆ విషయం తెలిసిన బొబ్బిలి రాజావారు నెహ్రూ గారికి మధ్యవర్తిత్వం ద్వారా వాస్తవాన్ని తెలియపరిచే ప్రయత్నం చేసినా అది ఫలించిన కారణంగా ఆ రథాన్ని విరమించాలని అర్చక స్వాములను బొబ్బిలి రాజా వారు ఆదేశించడం జరిగిందని మరి ఏ కారణంతో ఆ వేడుకలు ఇప్పటివరకు జరిపించలేదని అన్నారు. మళ్లీ ఇప్పుడు రథోత్సవ వైభవాన్ని పునః ప్రారంభించే ఉద్దేశంతో చిన్న జీయర్ స్వామి కలిసినప్పుడు బేబీ నాయన తన ఆలోచనను ఆయనకు తెలిపారు. అది మీకు దక్కిన గొప్ప అదృష్టంగా భావించి సత్వరమే పనులు ప్రారంభించమని చెప్పారన్నారు. రథం తయారీకి 27 అడుగుల ఎత్తు సుమారు 40 లక్షల ఖర్చు అవుతుందని బొబ్బిలి రాజా కుటుంబం కొన్ని కోట్ల రూపాయలు వెచ్చించి శ్రీ వేణుగోపాల స్వామి వారి సేవ ని చేస్తున్నామని తాము సొంతంగా రథాన్ని చేయించగలిగినప్పటికీ బొబ్బిలి ప్రాంత ప్రజలందరికీ స్వామి వారి సేవా భాగ్యం కలిగించదలచి దాతలను ఆహ్వానించడం జరిగిందన్నారు. ఒకటి రెండు రోజుల్లో సంప్రదించవలసిన ఫోన్ నెంబర్లు ఇస్తామని ఇందులో ఎటువంటి సమస్య లేదని ఇష్టపూర్వకంగానే దాతలు విరాళాలు ఇవ్వాలని అది పది రూపాయలైనా పదివేలు అయినా తీసుకుంటామని చెప్పడం జరిగిందన్నారు. దీనికోసం ఒక హెల్ప్ లైన్ నెంబర్ ఇస్తామన్నారు. భక్తులు ఈ సదావకాశాన్ని వినియోగించుకొని రథాన్ని పునః ప్రారంభించడానికి మీరందరూ పాత్రులు కావాలని ఆయన కోరారు.

# శేషవాహనంపై శ్రీకాళహస్తీశ్వరుడు సింహవాహనంపై దేవేరి దర్శనం



బంగారు శేష,సింహ వాహనాలపై స్వామిఅమ్మవార్ల దర్శనం

శ్రీకాళహస్తి, డిసెంబరు 30 ప్రభాతవార్త: దక్షిణ కైలాసంగా ఖ్యాతిగడించిన శ్రీకాళహస్తీశ్వరాలయంలో మంగళవారం ముక్కోటి ఏకాదశి సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయానికి పూల సొగసులతో ముస్తాబు చేసారు. అలాగే ఆలయానికి అనుబంధంగా ఉన్న ప్రసన్న వరదరాజస్వామి ఆలయంలో ఏడు ద్వారాలతో పాటు ఉత్తరద్వారాన్ని ఏర్పాటు చేసారు. విద్యుత్ దీపాలతో కళ్ళు జిగేలు మనిపించే విధంగా తీర్చిదిద్దారు. భక్తులతో కిటకిట లాడింది. వేకువ జాము నుంచి ఆలయంలో భక్తుల తాకిడి అధికమైంది. ఉదయం ఆలయంలోని అలంకార మండపంలో స్వామి అమ్మవార్లను చక్కగా ముస్తాబు చేశారు. బోయిలు స్వామి అమ్మవార్లను మోసుకుంటూ వాహనాల మండపం వద్దకు తీసుకొచ్చారు. ఇక్కడ స్వామి వారిని బంగారు శేష వాహనంపై ప్రతిష్టించారు. దేవేరి జ్ఞాన ప్రసూనాంబ అమ్మవారిని బంగారు సింహవాహనంపై ప్రతిష్టించి మేళ తాళాలు మంగళ వాయిద్యాలతో గ్రామంలో ఊరేగించారు. ఈ ఉత్సవానికి భక్తుల నుంచి విశేష స్పందన వచ్చింది. తరువాత గొబ్బెమ్మను గ్రామోత్సవం నిర్వహించారు. ఉత్సవాలను సమయపాలనతో నిర్వహించుటకు ఆలయ ఇఓ డి.బాపిరెడ్డి ఆదేశాలతో టెంపుల్ ఇన్స్పెక్టర్ వెంకటస్వామి, దఫేదార్ రాజాల పర్యవేక్షణలో గ్రామోత్సవం నిర్వహించారు.

# 'మనమిత్ర వాట్సప్ యాప్‌పై' విస్తృత ప్రచారం

## కొత్త కౌంటర్లను పరిశీలించిన దేవాదాయశాఖ కమిషనర్



శ్రీకాళహస్తి, డిసెంబరు 30 ప్రభాతవార్త: శ్రీకాళహస్తీశ్వరాలయంలో రూ.1.4కోట్లతో కొత్తగా ఒకేచోట ఏర్పాటు చేస్తున్న 8 కౌంటర్లను మంగళవారం దేవాదాయశాఖ కమిషనర్ రామచంద్రమోహన్ పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ భక్తులతో మమేక మయ్యారు. ఆలయ ఇఓ డి.బాపిరెడ్డికి పలు సూచనలు చేస్తూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'మన మిత్ర వాట్సప్'పై విస్తృత ప్రచారం చేయాలని సూచించారు. ఇది భక్తులకు ఎంతో ఉపయోగ పడుతుందన్నారు. కొత్తగా ఏర్పాటు చేసిన కౌంటర్లను పరిశీలించిన కమిషనర్ ఇక్కడ భక్తులకు అవసరమైన అన్ని సదుపాయాలు కల్పించాలన్నారు. టిక్కెట్లతో పాటు బస సదుపాయం, ఇతర సేవలకు సంబంధించిన అంశాలను పరిగణలోకి తీసుకొని ఏర్పాటు చేయాలని సూచించారు. ఇందుకు స్పందించిన ఇఓ వివరణ ఇస్తూ ఇక్కడ అనుబంధంగా మరెన్నో కౌంటర్లుకు ఇటీవల జరిగిన ధర్మకర్తల మండలిలో తీర్మానం చేసి ఉన్నట్లు వివరించారు. ఇక్కడే భక్తుల వస్తువులు భద్రపరచుటకు ఏర్పాట్లు చేస్తున్నట్లు వివరించారు.

### భక్తుల అభిప్రాయాలకు పెద్దపీట వేయాలి

ఈ సందర్భంగా పలువురు భక్తులతో కమిషనర్ రామచంద్రమోహన్ దర్శనం, సిబ్బంది ప్రవర్తన తీరు, నిత్యాన్న ప్రసాదంలో భోజనం నాణ్యత, ప్రసాదాల రుచికి సంబంధించి వాకబు చేసారు. దేవస్థానం విధి విధానాలపై ఏమైనా అసంతృప్తి ఉంటే రాతపూర్వకంగా భక్తుని నుంచి ఫిర్యాదు తీసుకొని తీసుకున్న చర్యలకు సంబంధించి ఆ భక్తునికి చరవాణి సమాచారం పంపాలని సూచించారు. ఆన్‌లైన్ సేవలకు సంబంధించి మారుమూల కూడా తెలిసే టట్లు 'మన మిత్రవాట్సప్' సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ యాప్‌పై భక్తులకు సక్రమంగా అవగాహన కల్గితే ఎంతో ప్రయోజనం ఉంటుందని వివరించారు. దర్శన విరామ సమయంలో దేవస్థానం మైకుల ద్వారా మన మిత్ర యాప్‌కు సంబంధించి ఎడతెరపి లేకుండా ప్రచారం చేసి భక్తులకు అవగాహన కల్పిస్తూ సమాచారం ఇవ్వాలని కమిషనర్ ఆదేశించారు. ఈ పరిశీలనల్లో కమిషర్ రామచంద్రమోహన్‌తో పాటు ధర్మకర్తల మండలి చైర్మన్ కొట్టె సాయిప్రసాద్, ధర్మకర్తల మండలి సభ్యులు దండి రాఘవయ్య మర్యాద పూర్వకంగా కలసినారు. కమిషనర్ పరిశీలనల్లో ఇఓ బాపిరెడ్డి, ఎఇఓలు హేమామాలిని, విద్యాసాగం రెడ్డి, మోహన్, సూపరింటెండెంట్‌లు రవి, నాగభూషనం యాదవ్, శ్రీహరి, ఇన్‌చార్జి ఇఓ శ్రీనివాసులు రెడ్డి, ఇంజనీరింగ్ విభాగానికి చెందిన కిషోర్ తదితరులున్నారు.

# మంగళగిరి పానకాల లక్ష్మీనరసింహస్వామి ఆలయం, భీమవరం మావుళ్ళమ్మ తల్లి దేవస్థానం ట్రస్ట్ బోర్డు సభ్యులు నియామకం

విజయవాడ, డిసెంబరు 30 ప్రభాతవార్త ప్రతినిధి: మంగళగిరి పానకాల లక్ష్మీనరసింహస్వామి వారి దేవస్థానం ట్రస్ట్ బోర్డు సభ్యులను 12 మందిని నియమిస్తూ ప్రభుత్వ ఉత్తర్వులు జారీ చేసింది. ఇంకొక సభ్యుడు జనరల్ కేటగిరి నుంచి నియామకానికి అవకాశం ఉందని.. తర్వాత నియమిస్తామని ఉత్తర్వుల్లో ప్రభుత్వం పేర్కొంది. ప.గో.జిల్లా, భీమవరం శ్రీ మావుళ్ళమ్మ అమ్మవారి దేవస్థానం ట్రస్ట్ బోర్డు సభ్యులను 13 మందిని నియమిస్తూ ప్రభుత్వ ఉత్తర్వులు జారీ చేసింది. వీరంతా బాధ్యతలు స్వీకరించిన తేదీ నుంచి 2 సంవత్సరాల పాటు పదవిలో ఉంటారని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.




# వైద్య సిబ్బంది తీరు మారాలి

- ఆరోగ్య భద్రత నవ సంవత్సరంలో సంకల్పం కావాలి
- వైద్య సిబ్బంది, రాష్ట్ర ప్రజలకు మంత్రి సత్యకుమార్ నూతన సంవత్సర శుభాకాంక్షలు

సచివాలయం, డిసెంబరు 30 ప్రభాతవార్త: సమగ్ర ప్రజారోగ్య భద్రత సాధనకు వైద్యులు, ఇతర సిబ్బంది తీరు మారాలని, దీంతో పాటు ప్రజల ఆచార వ్యవహారాలు, జీవనశైలిలో సమగ్ర మార్పు రావాలని వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆకాంక్షించారు. ఈ దిశగా అందరూ నూతన సంవత్సరం సందర్భంగా సంకల్పం తీసుకోవాలని మంత్రి విజ్ఞప్తి చేశారు. వైద్య సిబ్బందికి, రాష్ట్ర ప్రజలకు మంత్రి నూతన శుభాకాంక్షలు తెలిపారు. ప్రజారోగ్య పరిరక్షణ కేవలం ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాదని, ఈ లక్ష్య సాధనకు ప్రజల పూర్తి భాగస్వామ్యం కీలకమని మంగళవారంనాడు విడుదల చేసిన ఒక ప్రకటనలో మంత్రి సత్యకుమార్ యాదవ్ స్పష్టం చేశారు.

వ్యక్తిగత పరిశుభ్రత, నివాస ప్రాంతాల్లో పారిశుద్ధ్యం, ఆరోగ్యకరమైన జీవన విధానం పట్ల ప్రజలు శ్రద్ధ వహించాలని మంత్రి కోరారు. వేగంగా విస్తరిస్తున్న మధుమేహం(బ్లడ్ షుగర్), రక్తపోటు(బ్లడ్ ప్రెషర్), క్యాన్సర్ వంటి అసంక్రమణ(నాన్ కమ్యునకబుల్ డిసీజెస్) వ్యాధులకు అరికట్టడానికి ప్రజల జీవన విధానంలో సమగ్ర మార్పుల అవసరాన్ని మంత్రి నొక్కివక్కాణించారు. ఆరోగ్యకరమైన ఆహారం, నిత్య వ్యాయామం, యోగా మరియు ధ్యానం ప్రక్రియల ద్వారా శారీరక, మానసిక ఆరోగ్య పరిరక్షణపై ప్రజలు దృష్టి పెట్టాలని మంత్రి సత్యకుమార్ యాదవ్ విజ్ఞప్తి చేశారు.

ప్రభుత్వాసుపత్రుల్లోని వైద్యులు, ఇతర సిబ్బంది విధుల నిర్వహణలో వెల్లడవుతున్న కొన్ని లోపాల పట్ల మంత్రి ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజారోగ్య పరిరక్షణ కోసం కూటమి ప్రభుత్వం భారీగా నిధులు కేటాయిస్తోందని, ఆశించిన ఫలితాలు రావాలంటే వైద్యులు, పారా మెడికల్ సిబ్బంది దృక్పథాల్లో మార్పులు రావాలని మంత్రి సత్యకుమార్ యాదవ్ స్పష్టం చేశారు. గత 19 నెలలుగా కూటమి ప్రభుత్వం ప్రయత్నాలతో కొంత మార్పు స్పష్టంగా వచ్చిందని, ఈ మార్పును మరింత విస్తృతంగా, లోతుగా సాధించాలని మంత్రి అభిప్రాయపడ్డారు. ఆరోగ్యాంధ్రప్రదేశ్ సాధనగా ముఖ్యమంత్రి చంద్రబాబు ఆశయాలకనుగుణంగా అందరూ సమిష్టి కృషి చేయాలని మంత్రి సత్యకుమార్ యాదవ్ విజ్ఞప్తి చేశారు.

# సమన్వయ లోపంతో దుర్గగుడిలో విద్యుత్ అంతరాయం

- తప్పు చేసిన వారిపై చర్యలు తప్పవు
- భక్తుల మనోభావాలకు కూటమి ప్రభుత్వం పెద్దపీట
- దుర్గగుడి ఘటనపై రాజకీయ విమర్శలు దురదృష్టకరం
- మంత్రి గొట్టిపాటి రవికుమార్



విజయవాడ, డిసెంబరు 30 ప్రభాతవార్త ప్రతినిధి: విజయవాడలోని దుర్గగుడిలో విద్యుత్ అంతరాయం అంశాన్ని కొందరు రాజకీయం చేయడం దురదృష్టకరమని ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. మంగళవారం నాడు తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో మంత్రి గొట్టిపాటి మాట్లాడారు. విజయవాడ కనకదుర్గమ్మ గుడిలో సుమారు 15 నిమిషాల పాటు విద్యుత్ అంతరాయం కలగడానికి గల కారణాలపై దేవాదాయ, విద్యుత్ శాఖాధికారులతో సమావేశం నిర్వహించినట్లు మంత్రి గొట్టిపాటి తెలిపారు. విద్యుత్ అంతరాయం విషయం తన దృష్టికి రాగానే... యుద్ధప్రాతిపదికన విద్యుత్ సరఫరా పునరుద్ధరించామని వెల్లడించారు. అధికారుల మధ్య సమన్వయం లోపం వల్లే దుర్గ గుడిలో కరెంట్ సరఫరా నిలిచి పోయిందన్నారు. దీనిపై వెంటనే నివేదిక ఇవ్వాలని ఉన్నతాధికారులను ఆదేశించినట్లు స్పష్టం చేశారు. ఈ ఘటనకు సంబంధించి బాధ్యుల మీద చర్యలు తీసుకుంటామని అన్నారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూస్తామని హామీ ఇచ్చారు. భక్తుల మనోభావాలకు కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని మంత్రి గొట్టిపాటి ఉద్ఘాటించారు. జనవరి 6, 7 తేదీలో దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి ఆధ్వర్యంలో మరోసారి దుర్గ గుడి ఈవో, ముఖ్య అధికారులతో కలిసి సమావేశం కానున్నట్లు మంత్రి గొట్టిపాటి ప్రకటించారు. సమన్వయ లోపం వల్ల జరిగిన ఈ చిన్న పొరపాటును పట్టుకొని రాజకీయ విమర్శలు చేయడం తగదని మంత్రి గొట్టిపాటి హితవు పలికారు. ప్రతీ చిన్న విషయాన్ని కూడా రాజకీయ అవసరాలకు వినియోగించుకోవడం వైసీపీ నాయకులకు అలవాటుగా మారిపోయిందని విమర్శించారు. సనాతన ధర్మానికి మాత్రమే కాకుండా ఏ ధర్మానికైనా.. కూటమి ప్రభుత్వంలోనే న్యాయం జరుగుతుందని స్పష్టం చేశారు. ప్రజల ఆకాంక్షలకు తగ్గట్టుగా అద్దంకి, కందుకూరు నియోజకవర్గాలను ప్రకాశం జిల్లాలో కలపడం ఎంతో సంతోషదాయకమని మంత్రి గొట్టిపాటి రవి కుమార్ అన్నారు. గత ప్రభుత్వం చేసిన తప్పులను సరి దిద్దుతూ.. జిల్లాల పునర్విభజన జరిగిందన్నారు. పాదయాత్రలో మంత్రి నారా లోకేష్ ఇచ్చిన హామీ ప్రకారం కందుకూరు, అద్దంకిని ప్రకాశం జిల్లాలో కలిపినట్లు పేర్కొన్నారు. 2012 నుంచి అద్దంకి రెవెన్యూ డివిజన్ కోసం పోరాడుతుండగా... కూటమి ప్రభుత్వంలో సాకారమైనట్లు మంత్రి గొట్టిపాటి తెలిపారు. అద్దంకిని రెవెన్యూ డివిజన్ ఏర్పాటుకు సహకరించిన సిఎం చంద్రబాబు, మంత్రి లోకేష్, రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్‌తో పాటు మంత్రి వర్గ ఉపసంఘానికి మంత్రి గొట్టిపాటి కృతజ్ఞతలు తెలిపారు.

# బెజవాడలో తగ్గిన నేరాలు



- గత ఏడాదితో పోలిస్తే 21శాతం తగ్గుదల
- గంజాయి, డ్రగ్స్‌పై ప్రత్యేక నిఘా
- ట్రాఫిక్ నియంత్రణకు కఠిన చర్యలు
- పోలీస్ కమిషనర్ రాజశేఖర్‌బాబు వెల్లడి

విజయవాడ, డిసెంబరు 30 ప్రభాతవార్త ప్రతినిధి: రాజధాని ప్రాంత పరిధిలో కీలకమైన విజయవాడ (ఎన్టీఆర్ జిల్లా) పోలీసు కమీషనరేట్ ప్రాంతంలో వచ్చే ఏడాదిలో సైబర్ నేరాల కట్టడిపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నట్లు సీపీ రాజశేఖర్‌బాబు తెలిపారు. 2024తో పోలిస్తే ఈ సంవత్సరం నేరాల లెక్క తగ్గినట్లు, వార్షిక నేర సమీక్ష 2025లో భాగంగా వెల్లడించారు. 2025లో సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి మంచి ఫలితాలు సాధించామన్నారు. సురక్ష ప్రాజెక్ట్ ద్వారా నగరంలో ఒకేసారి వెయ్యి కెమెరాలు ఏర్పాటు చేశామన్నారు. వచ్చే ఏడాది నార్కోటిక్, ఎకనామిక్ కేసులను అరికట్టే విధంగా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఈ ఏడాది జిల్లా వ్యాప్తంగా 21 శాతం క్రైం తగ్గించామని సీపీ రాజశేఖర్ బాబు తెలిపారు. ఎవిడెన్స్ బేస్ పోలీసింగ్‌కు ప్రాధాన్యత ఇచ్చామన్నారు. ఎన్టీఆర్ జిల్లా వ్యాప్తంగా 10 వేల సీసీ కెమెరాలు ఏర్పాటు చేసామని ఆలయాల్లో, ప్రార్థనా మందిరాల్లో కూడా కెమెరాలు ఏర్పాటు చేశామన్నారు. గంజాయి, మత్తు పదార్థాల రవాణాను నియంత్రణ చేశామని వ్యాఖ్యానించారు. అస్త్రం ద్వారా ట్రాఫిక్‌ను నియంత్రిస్తున్నామన్నారు. ఎక్కడా ప్రజలకు ఇబ్బంది లేకుండా చర్యలు చేపట్టామని వెల్లడించారు. సైబర్ క్రైం తగ్గినా నగదు నష్టం ఎక్కువగా ఉందని వెల్లడించారు. 80.70 శాతం రికవరీ ఉండటం ఒక రికార్డు. 2024లో 52శాతం మాత్రమే రికవరీ ఉందన్నారు. కన్విక్షన్ 50 శాతం నిందితులకు పడిందని తెలిపారు. హత్యలు, కిడ్నాప్‌లు, అత్యాచారాలు, రోడ్డు ప్రమాదాలు తగ్గాయన్నారు. రోడ్డు ప్రమాద మరణాలు ఇరవై శాతం తగ్గాయని హెల్మెట్, సీటు బెల్ట్ పై అవగాహన కల్పించడం ద్వారా మంచి ఫలితాలు వచ్చాయన్నారు. వచ్చే ఏడాదిలో ఈ ప్రమాదాలు, మరణాల సంఖ్య తగ్గించేలా చేస్తామని వెల్లడించారు. ద్విచక్ర వాహనదారులే ఎక్కువగా ప్రమాదాల్లో మరణిస్తున్నారని తప్పకుండా ప్రతి ఒక్కరూ హెల్మెట్ వాడాలని సూచించారు. హిట్ అండ్ రన్ కేసులు 328 ఉంటే 238 మందికి ఆర్థిక సాయం రూ.2 కోట్లతో అందించామన్నారు. దేశంలోనే ఇది 3వ స్థానంలో ఉండటం ఎన్టీఆర్ పోలీస్ గొప్పగా భావిస్తున్నామన్నారు. సైబర్ క్రైంలో 9.54 కోట్ల రూపాయలను నిందితుల ఖాతాల్లో సీజ్ చేశామని తెలిపారు. నార్కోటిక్ కేసుల్లో 22 మంది పై పిట్ ఎన్డిపియస్ అమలు చేసామని రాష్ట్రంలో తొలిసారిగా ఇక్కడే ఈ సెక్షన్ కింద కేసు పెట్టామన్నారు.

### అస్త్రం యాప్ ద్వారా ట్రాఫిక్ కష్టాలు లేకుండా చర్యలు

ఎన్టీఆర్ జిల్లా క్రైమ్‌కు ఎబీసీడీఅవార్డు వచ్చిందని టీంకు పోలీస్ కమిషనర్ రాజశేఖర్ బాబు అభినందనలు చెప్పారు. పసికందులను విక్రయించే ముఠాను అరెస్టు చేశామని కీలక వ్యక్తులను అరెస్టు చేసేందుకు బృందాలు పని చేస్తున్నాయన్నారు. అస్త్రం యాప్ ద్వారా ట్రాఫిక్ కష్టాలు లేకుండా చర్యలు తీసుకున్నామని ఆయా ప్రాంతాల్లో ఇన్‌స్పెక్టర్‌ల పనితీరు కూడా తెలిసిపోతుందన్నారు. వీటి ఆధారంగా వారి పనితీరులో మార్పు వచ్చేలా చర్యలు తీసుకుంటామన్నారు. రేపు ఏ జంక్షన్‌లో రద్దీ ఉండబోతుందో కూడా ఈరోజు తెలుసుకుని ముందస్తు చర్యలు తీసుకుంటున్నామని అస్త్రం టూల్ ద్వారా కచ్చితమైన ఫలితాలు సాధిస్తున్నామని వెల్లడించారు. ఈ పాథ్ ద్వారా అంబులెన్స్ మూవ్‌మెంట్ తెలియజేస్తే గ్రీన్ ఛానల్ ఇచ్చే అవకాశం ఉంటుందని స్పష్టం చేశారు. మనం ఏ రూటులో వెళితే రద్దీ ఉండదు అని ప్రజలకు యాప్ ను అందుబాటులోకి తెస్తున్నామన్నారు. ఆయా ప్రాంతాల్లో రద్దీ, వీఐపీ మూవ్‌మెంట్ బట్టి ట్రాఫిక్ ఆగకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ డిప్లాయిమెంట్ ద్వారానే సిబ్బందికి బందోబస్తు డ్యూటీలు వేస్తున్నామన్నారు. ఇప్పుడు రాష్ట్ర వ్యాప్తంగా ఇదే విధానాన్ని అమలుకు చర్యలు తీసుకుంటున్నారని అన్నారు.

### పార్కింగ్ ప్రదేశాల్లోనూ కెమెరాలు

దసరా, భవానీ దీక్షల విరమణ, ఇతర భారీ ఉత్సవాలకు రద్దీని మానటరింగ్ చేయడంలో డ్రోన్‌లు కీలకంగా పని చేశాయని గుర్తు చేశారు. సాంకేతిక పరిజ్ఞానం ద్వారా అద్భుతంగా పని చేశామన్నారు. 18 లక్షల మంది దసరాకు వచ్చినా, భవానీ దీక్షల విరమణకు 6 లక్షలు వచ్చినా ఎక్కడా ఇబ్బంది లేకుండా చేశామన్నారు. క్యూలైన్లలో కౌంటింగ్ కెమెరాలు పెట్టి ఎప్పటికప్పుడు క్రౌడ్‌ను అంచనా వేశామని తెలిపారు. అన్ని ఆలయాల్లో వచ్చే ఏడాదిలో ఈ కౌంటింగ్ కెమెరాలు ఏర్పాటు చేస్తామన్నారు. వాటికి అనుసంధానించే సర్వర్, ఇతర పరికరాలు కొనుగోలు చేయాల్సి ఉందని వెల్లడించారు. పార్కింగ్ ప్రదేశాల్లో కూడా కౌంటింగ్ కెమెరాలు పెట్టబోతున్నామని సిపి వివరించారు.



# సారస్ మస్కట్ విడుదల

- గుంటూరులో జనవరి 6 నుండి 18 వరకు సారస్
- సారస్ మస్కట్‌గా గుంటూరు మిరపకాయ

సచివాలయం, డిసెంబరు 30 ప్రభాతవార్త: సారస్ (సేల్ ఆఫ్ ఆర్టికల్స్ ఆఫ్ రూరల్ ఆర్టిసన్స్ సొసైటీ) మస్కట్‌ను జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా మంగళవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో విడుదల చేశారు. సారస్ ను రాష్ట్ర పేదరిక నిర్మూలన సంస్థ సౌజన్యంతో జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ నిర్వహిస్తోంది. గుంటూరు మిరపకు ప్రసిద్ధి చెందడంతో "మిరప కాయ" నే మస్కట్ గా ఎంపిక చేసి రూపొందించారు. సారస్ ప్రదర్శన జనవరి 6వ తేదీ నుండి 18వ తేదీ వరకు గుంటూరులో నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గుంటూరు పట్టణంలో నర్సరావుపేట రహదారిలో రెడ్డి కళాశాల ఎదురుగా ఉన్న స్థలంలో ప్రదర్శనశాలల ఏర్పాటు జరుగుతుందన్నారు. రాష్ట్రంలో మొట్ట మొదటిసారిగా జాతీయ స్థాయి సారస్ కార్యక్రమం జరుగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రజలకు ఉచిత ప్రవేశం, పార్కింగ్ సదుపాయం ఉందన్నారు.

దేశంలోని అన్ని రాష్ట్రాల నుండి ఆయా రాష్ట్రాల సంస్కృతులను ప్రతిబింబించే చేనేతలు, హస్తకళలు, ఇతర సామగ్రిని ప్రదర్శించడం, విక్రయించడం జరుగుతుందని తెలిపారు. మినీ భారత సాంస్కృతిక, కళా సమ్మేళనంను తలపిస్తుందని చెప్పారు. ఆరు వందల మందికి పైగా చేనేత, హస్త కళాకారులు, సాంస్కృతిక కళాకారులు వస్తున్నారని, 250కు పైగా ప్రదర్శనశాలలు ఏర్పాటు చేస్తున్నారన్నారు. హ్యాండ్లూమ్స్, హ్యాండిక్రాఫ్ట్స్, చీరలు, షాల్స్, కార్పెట్లు, బెడ్ షీట్‌లు, వెదురు, లోహ, గాజు ఉత్పత్తులు, సాంప్రదాయ, ఆర్గానిక్ ఆహార పదార్థాలు, ఆభరణాలు, గృహ అలంకరణ వస్తువులు, ఆహార పదార్థాలు వంటి ఉత్పత్తులు ప్రదర్శన, విక్రయం జరుగుతుందన్నారు. ఈ మినీ భారత సమ్మేళనంలో గుంటూరు సంస్కృతి, సంప్రదాయాలు, చారిత్రక విశేషాలు తెలియజేసి జిల్లా విశిష్టతను చాటిచెప్పుటకు వేదికగా మలచాలని పిలుపునిచ్చారు. దేశం నలుమూలల నుండి స్వయం సహాయక సంఘాల సభ్యులు, కళాకారులు పెద్ద ఎత్తున పాల్గొంటున్నందున వారి సురక్షిత, భద్రత మన బాధ్యత అన్నారు. ఎట్టి పరిస్థితుల్లోను గుంటూరు గౌరవం, అభిమానం వారు చూరగోనలని పిలుపునిచ్చారు. స్వయం సహాయక సంఘాలు తయారు చేసే పర్యావరణ హిత సామాగ్రిని వినియోగిస్తూ ప్లాస్టిక్ నిషేధిత జోన్ గా, స్వచ్ఛతకు శ్రీకారం చుట్టే విధంగా తీర్చిదిద్దాలని అన్నారు.

ఈ కార్యక్రమంలో జిల్లా రెవిన్యూ అధికారి ఎన్.ఎస్.కె. ఖాజావలి, తెనాలి సబ్ కలెక్టర్ సంజన సింహా, రెవిన్యూ డివిజనల్ అధికారి శ్రీనివాస రావు, డి.ఆర్.డి.ఏ ప్రాజెక్టు డైరెక్టర్ టి. విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ వైద్యశాలల్లో ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలి

**బాపట్ల,డిసెంబర్30,ప్రభాతవార్త:** ప్రభుత్వ వైద్యశాలల్లో ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ కమిషనర్ వీర పాండ్యన్ తెలిపారు. బాపట్ల మండలం వెదుళ్ళపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని రాష్ట్ర కమిషనర్ వీర పాండ్యన్,





జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి కలిసి మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన వైద్యం అందించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఆ పి హెచ్ సి ఎక్కువ సమయం తనిఖీలు నిర్వహించారు. ఓ.పి. ఆన్ లైన్ రిజిస్ట్రేషన్, యాప్ పని తీరు అడిగి తెలుసుకున్నారు. తదుపరి డాక్టర్ వద్ద రోగులు పొందుతున్న వైద్యం, రక్త నమూనాలు, ల్యాబ్ లో రక్త పరీక్షల నిర్వహణను పరిశీలించారు. అక్కడికి వచ్చే రోగులకు ఏ.ఎన్.ఎం లు అందిస్తున్న సేవలు, ఔషధాల పంపిణీ, వైద్య పరీక్షలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు.డి చంద్రమోహన్ అనే వ్యక్తి వైద్య పరీక్షలకు రాగా అతని పేరు రిజిస్ట్రేషన్ ప్రారంభం నుంచి వైద్యం ముగిసే వరకు ఆయన పక్కనే ఉండి వైద్యం ఎలా అందుతుందని నిశితంగా పరిశీలించారు. వైద్య ఆరోగ్యశాఖలో అమలయ్యే వివిధ యాప్ ల పనితీరుపై ఆరా తీశారు. రోగులకు అవసరమైన ఔషధాలను వైద్య అధికారులు సిద్ధంగా ఉంచుకోవాలన్నారు.ప్రస్తుతం ప్రభుత్వ వైద్యశాలలో 214 రకాల ఔషధాలు అందుబాటులో ఉన్నాయన్నారు.. వాటిని జాగ్రత్తగా వినియోగించుకోవాలన్నారు. రోగులకు ఔషధాల పంపిణీ, నిల్వలను ఆయన పరిశీలించారు. కుష్టి రోగులకు పంపిణీ చేస్తున్న ఔషధాల దస్త్రాన్ని పరిశీలించారు. ఔషధాల గడువు తేదీలు, నిల్వలపై ఆరా తీశారు. పి హెచ్ సి వైద్య సిబ్బంది ఆన్ లైన్ లో వేస్తున్న ఎఫ్ ఆర్ ఎస్ హాజరును పరిశీలించారు. ఒక్కొక్కరిని పిలిచి వారి పనితీరుపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. పి హెచ్ సి లోని వివిధ విభాగాలకు చెందిన అన్ని దస్త్రాలను పరిశీలించారు. అనంతరం ఎం.ఏడుకొండలు రెడ్డి, వెంకటేశ్వర్లురెడ్డి, కె.ఏడుకొండల రెడ్డిలతో మాట్లాడారు. వైద్యం ఎలా అందుతుంది...., వైద్య అధికారులు సక్రమంగా చూస్తున్నారా, సక్రమంగా జవాబు చెబుతున్నారా... మందులు సక్రమంగా ఇస్తున్నారా.... ఎవరైనా లంచాలు అడుగుతున్నారా... అంటూ రోగులకు హలో ప్రశ్నలు వేసి అభిప్రాయాలను సేకరించారు. ప్రజల నుంచి మంచి స్పందన లభించేలా వైద్య అధికారులు, సిబ్బంది చిత్తశుద్ధితో పని చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్,వారి వెంట జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి డాక్టర్ ఎస్ విజయమ్మ, బాపట్ల ఆర్డిఓ పి గ్లోరియా, ఎన్టీఆర్ వైద్య ఆరోగ్యశ్రీ జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ ప్రవీణ్, వైద్య అధికారులు, తదితరులు ఉన్నారు.

# అంగరంగ వైభవంగా కొల్లిపరలో ముక్కోటి ఉత్సవాలు

- భక్తులతో ఆలయం కిటకిట
- శంఖుతీర్థం స్వీకరించి తరించిన భక్తులు
- గోవింద నామస్మరణతో మార్మోగిన ఆలయం

**కొల్లిపర,డిసెంబరు 30 (ప్రభాతవార్త):** వైకుంఠ ఏకాదశి పురస్కరించుకుని మండలంలో ముక్కోటి ఉత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఇందులో భాగంగా మంగళవారం మండల కేంద్రం కొల్లిపర శ్రీదేవి భూదేవి సమేత శ్రీజనార్ధనస్వామి ఆలయం ప్రాంగణంలో స్వామి వారు వైకుంఠనాధుని అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.ఉత్తర ద్వార దర్శనం ద్వారా స్వామి వారిని దర్శించుకోటం కోసం భక్తులు తెల్లవారు జామున 3 గంటలకే హాజరయ్యారు.ఆలయం వద్ద నుంచి మెయిన్‌రోడ్డు వరకు భక్తులు క్యూకట్టారు.గ్రామ ప్రజల సహకారంతో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో భక్తులు





స్వామివారిని దర్శించుకునేందుకు మెరుగైన సౌకర్యాలు ఏర్పాటు చేసారు.భక్తులు 4 గంటలకు స్వామివారిని ఉత్తర ద్వార దర్శనం చేసుకున్నారు.ఆలయ ప్రధాన అర్చకులు పరాశరం జగన్నాధాచార్యులు పర్యవేక్షణలో నిర్వహించిన కార్యక్రమంలో స్వామి వారి ఉత్సవాలు కన్నుల పండువగా జరిగాయి.ఉత్తర ద్వార రహదారిలో మహిళా భక్తులు వెంకటేశ్వరస్వామిని మరియు ధర్మో రక్షతిరక్షితః అని ఉప్పుతో రంగులతో తీర్చిదిద్దారు.భక్తులు ఆలయం చుట్టూ మూడుసార్లు ప్రదక్షణలు చేసారు.భక్తులు గోవిందా..గోవిందా..శ్రీనివాస గోవిందా..అంటూ ఆలయ ప్రాంగణం హోరెత్తించారు.గర్భాలయంలో ఉన్న శ్రీజనార్ధనస్వామిని ఆవునేతి దీపాల వెలుగులో భక్తులకు దివ్యదర్శనం జరిగింది.స్వామి వారికి ప్రత్యేక పూజలు చేసారు.భక్తులు స్వామి దర్శనం అనంతరం శంఖుతీర్థం,ప్రసాదాలు స్వీకరించారు.అనంతరం స్వామివారిని గ్రామోత్సవం నిర్వహించారు. గ్రామంలో ప్రతి వీధిలో స్వామి వార్లను ఊరేగిస్తుంటే ముఖ్యంగా మహిళలు హారతులు పట్టారు.పసుపు, కుంకుమ, కొబ్బరికాయలు, అరటిపండ్లు స్వామి వారికి అందించి తమ భక్తి భావాన్ని చాటుకున్నారు.భక్తులు స్వామి వారి వెంట నడుస్తూ ముందుకు కదిలారు.మేళతాళాలతో స్వామి వారు ముందుకు కదులుతుంటే భక్తులు కన్నులారా వీక్షించారు.సాయంత్రం ముక్కోటి ఏకాదశి సందర్భంగా గ్రామంలో ఉన్న భజన సమాజముల వారితో ఆలయంలో హరే రామ..హరే రామ..రామ రామ..హరే హరే..హరే కృష్ణ..హరేకృష్ణ..కృష్ణ కృష్ణ..హరే హరే అంటూ ఏకనామం నిర్వహించారు.ఆలయం విద్యుత్ దీపాలతో దగదగ మెరిసింది.కార్యక్రమంలో పరాశరం సీతారామాచార్యులు, పరాశరం దీవక్,వీరభద్రగిరి శర్మ,చిలుకూరి వెంకటేశ్వశర్మ, గ్రామపెద్దలు,భక్తులు పాల్గొన్నారు.

# విద్యార్థులను డ్రగ్స్ బారిన నుండి కాపాడటమే సంకల్పం లక్ష్యం

## సౌత్ డిఎస్పి భానోదయ

వట్టిచెరుకూరు రూరల్, డిసెంబర్ 30, ప్రభాతవార్త: విద్యార్థులను డ్రగ్స్ బారినుండి కాపాడటమే సంకల్పం లక్ష్యమని గుంటూరు సౌత్ డిఎస్పి జి.భానోదయ పేర్కొన్నారు. మండలంలోని కొర్నె పాడు ఐదోమైలు వద్దనున్న ప్రియదర్శిని



ఇంజనీరింగ్ కళాశాల, మలినేని ఇంజనీరింగ్ కళాశాలలో మంగళవారం గంజాయి, ఇతర మాదక ద్రవ్యాల దుష్ప్రభావాలపై పోలీస్ శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సౌత్ డిఎస్పి భానోదయ హాజరై మాట్లాడుతూ సంకల్పం అనేది మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా పోరాట ప్రత్యేక కార్యక్రమం అన్నారు. డ్రగ్స్ ఉచ్చులో యువత ఎలా చిక్కుకుంటున్నారో, వాటివల్ల కలిగే శారీరక, మానసిక, సామాజిక, న్యాయపరమైన నష్టాలపై విస్తృతంగా వివరించారు. ప్రియదర్శిని, మలినేని వంటి ప్రతిష్టాత్మక విద్యాసంస్థలో విద్యార్థులతో మమేకమవడం చాలా సంతోషంగా ఉందన్నారు. ప్రస్తుతం డ్రగ్స్ సమస్య యువతపై తీవ్ర ప్రభావం చూపుతోందని, ఇది రాష్ట్రానికే కాక దేశవ్యాప్తంగా ఎదురవుతున్న పెద్ద సవాలుగా మారిందన్నారు. ముఖ్యంగా కాలేజీ వయస్సులోనే చాలా మంది విద్యార్థులు సరదాగా డ్రగ్స్‌కు అలవాటు పడుతున్నారని ఆందోళన వ్యక్తంచేశారు. గతంలో డ్రగ్స్ వినియోగం మెట్రో నగరాలకే పరిమితమై ఉండేదని, కానీ ఇప్పుడు గ్రామాలు, పాఠశాలల వరకు విస్తరించడం అత్యంత ప్రమాదకర పరిణామమని విచారం వ్యక్తం చేశారు. అందుకే పోలీస్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పాఠశాలలు, కళాశాలలలో సంకల్పం కార్యక్రమం ద్వారా విద్యార్థులకు డ్రగ్స్ గురించి విస్తృత అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. డ్రగ్స్‌కు అలవాటు పడితే అవి శారీరకంగా, మానసికంగా వ్యక్తిని పూర్తిగా బలహీనపరుస్తాయని, చివరకు నేరాల వైపు నడిపిస్తాయని హెచ్చరించారు. డ్రగ్స్ కలిగి ఉండటం, వినియోగించడం, అమ్మడం, సరఫరా చేయడం అన్నీ ఎన్డిపీఎస్ చట్టం కింద తీవ్రమైన నేరాలుగా పరిగణిస్తారని వెల్లడించారు. డ్రగ్స్ కేసుల్లో బెయిల్ లభించకపోవడం, 20 సంవత్సరాల వరకు జైలుశిక్ష పడే అవకాశం ఉంతుందని, క్రిమినల్ హిస్టరీ ఏర్పడటం వల్ల భవిష్యత్తులో ఉద్యోగాలు, పాస్‌పోర్ట్, విదేశీ అవకాశాలు అన్నీ దెబ్బతింటాయని స్పష్టం చేశారు. చిన్న అలవాటుగా మొదలుపెట్టిన డ్రగ్ చివరకు జీవితాన్ని నాశనం చేస్తుందని తెలియజేశారు. ప్రతి విద్యార్థికి ఉజ్వల భవిష్యత్తు ఉన్నందున ఇటువంటి ప్రమాదకర అలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు.గడిచిన మూడు నెలల్లో ఎంతో మందిని డ్రగ్స్ కేసుల్లో అరెస్ట్ చేయడం జరిగిందని, సరఫరాదారులతో పాటు వినియోగదారులపై కూడా చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు.డ్రగ్స్‌కు అలవాటు పడిన విద్యార్థులను భవిష్యత్తు దృష్ట్యా ముందుగా కౌన్సిలింగ్ నిర్వహించి, తల్లిదండ్రుల సమక్షంలో అవగాహన కల్పించి పునరావాసం కల్పిస్తున్నామని తెలిపారు. అయితే సమస్య తీవ్రత దృష్ట్యా అవసరమైతే వినియోగదారులపై కూడా కేసులు నమోదు చేయాల్సి వస్తుందని పేర్కొన్నారు.డ్రగ్స్ సమాచారాన్ని తెలియజేసేందుకు కళాశాలలో డ్రాప్ బాక్స్ ఏర్పాటు చేస్తున్నామని, అందులో ఇచ్చే సమాచారాన్ని పూర్తిగా గోప్యంగా ఉంచి పోలీస్ శాఖ మాత్రమే చర్యలు తీసుకుంటుందని తెలిపారు. డ్రగ్స్ బారిన పడినవారిని అడిక్షన్ సెంటర్ల ద్వారా చికిత్స అందించి సాధారణ జీవనంలోకి తీసుకువచ్చే ప్రయత్నం చేస్తున్నామన్నారు.బి స్మార్ట్, డోంట్ స్టార్ట్ అనే నినాదంతో విద్యార్థులను డ్రగ్స్‌కు దూరంగా ఉంచేందుకు పలు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. కళాశాల చైర్మన్ చందు రామారావు మాట్లాడుతూ ఈ వయస్సులో వచ్చే తప్పుడు ఆలోచనలు, ఆకర్షణలు జీవితాన్ని నాశనం చేస్తాయని, తల్లిదండ్రులు ఇచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని విద్యార్థులకు సూచించారు. సంకల్పం వంటి కార్యక్రమాన్ని ప్రారంభించిన జిల్లా పోలీస్ అధికారులను హృదయపూర్వకంగా అభినందించారు. అనంతరం అతిథులను కళాశాల యాజమాన్యం శాలువా, మెమొండోలతో ఘనంగా సత్కరించింది. కార్యక్రమంలోకళాశాల సెక్రటరీ చందు విజయలక్ష్మి, డైరెక్టర్ సిహెచ్. రవికుమార్, ప్రిన్సిపాల్ డివివిఎస్ ఫణి కుమార్, వైస్ ప్రిన్సిపాల్ కిరణ్ కుమార్, సీఐ రామానాయక్, ఎస్ఐ బాబురావు, వివిధ శాఖల హెచ్వోడీలు, అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థినీ విద్యార్థులు, స్థానిక పోలీసులు పాల్గొన్నారు.

# ఆలయ అధికారుల తీరుపై విమర్శల వెల్లు

## త్రాగేందుకు నీళ్లు లేక భక్తుల అవస్థలు

**మంగళగిరి డిసెంబర్ 30 ప్రభాతవార్త :** మంగళగిరి ముక్కోటి ఉత్సవాలకు హాజరైన భక్తులకు తప్పని తిప్పలు. గంటల తరబడి క్యూ లైన్ లలో వేచి ఉన్న భక్తులకు కనీసం మంచినీరు కూడా అందుబాటులో ఉంచడంలో పూర్తిగా ఆలయ అధికారులు వైఫల్యం చెందారు అని చెప్పాలి. క్యూలైన్లో వేచి ఉండే భక్తుల కొరకు మంచినీరు, మజ్జిగ అందుబాటులో ఉంచుతా మని ఆలయ అధికారులు ప్రకటించుకున్నప్పటికీ,







ఆచరణలో మాత్రం ముందుకు తీసుకురాలేక పోవడం ఆలయాధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనం. శ్రీ స్వామివారి శంకు తీర్థం కోసం వేచి ఉన్న ఓ మహిళా భక్తురాలు సొమ్మసిల్లి పడి పోయిన ఘటన చోటు చేసుకుంది. ఒంటిగంటకు ఆలయంలోకి వెళ్తే దర్శనం పూర్తయ్యే నాలుగు గంటల వరకు క్యూలైన్లో వేచి ఉండటం ఆపై మంచినీళ్లు లభించక అపస్మారక స్థితిలోకి చేరుకోవాల్సి వచ్చిందని ఓ మహిళా భక్తురాలు వాపోయింది. విఐపి లను ప్రసన్నం చేసుకునే పనిలో ఆలయ అధికారులుగతంలో ఎన్నడూ లేని విధంగా ఆలయ అధికారులు స్థానిక, సామాన్య భక్తులకు శ్రీ స్వామి వారి దర్శనం, శంకు తీర్థం అందించడంలో పూర్తిగా విఫలమయ్యారు. ఆలయ అధికారులు కేవలం విఐపి లను ఉన్నతాధికారులకు, వారి కుటుంబ సభ్యులకు, వారి స్నేహితులను ప్రసన్నం చేసుకుని పనిలో పూర్తిగా నిమగ్నం కావడంతో... ఉచిత దర్శనం కోసం క్యూలలో వేచి ఉన్న భక్తులకు తీవ్ర నిరాసే ఎదురయింది. ఈసారి భక్తుల సౌకర్యార్థం 100 200లతో పాటు 500 రూపాయల టికెట్లను ఆలయ అధికారులు అందుబాటులో తెచ్చారు. రూ.500 టిక్కెట్ కొనుగోలు చేసిన వారిని వంద రూపాయలు, రెండు వందల రూపాయలు క్యూ లైన్ లో పంపించటం, కనీసం 500 రూపాయలు పెట్టి టికెట్ కొనుగోలు చేసిన వారికి మంచినీళ్లు కూడా అందించలేని పరిస్థితుల్లో ఆలయ అధికారులు ఉన్నారా అంటూ పలువురు భక్తులు నిలదీశారు. యధా విధిగా ఈ సారి ముక్కోటి పర్వదినం నాడు సైతం సిఫారసులకే ఆలయ అధికారులు పెద్దపీట వేసినట్లు తెలుస్తోంది. పరిచయం ఉన్న వారిని ప్రత్యేక మార్గం ద్వారా పంపించటం సాధారణంగా జరిగిపోయింది. ఉత్సవ నిర్వహణలో ప్రణాళిక బద్ధమైన చర్యలు లోపించటం కొట్టొచ్చినట్లు కనిపించింది.రూ. 500 వెచ్చించి టికెట్ కొనుగోలు చేసినప్పటికీ దర్శనం శంకు తీర్థం ప్రక్రియ పూర్తి కావాలంటే గంటన్నర నుంచి రెండు గంటలు సమయం పడుతుందని భక్తులు ఆవేదన వ్యక్తం చేశారు. ఆలయ అధికారులకు సన్నిహితులైతే కేవలం 10 నుంచి 15 నిమిషాల వ్యవధిలో సదరు ప్రక్రియ పూర్తయిందని తెలిపారు.ముక్కోటి ఉత్సవానికి శంకు తీర్థం కోసం వచ్చిన సామాన్య భక్తులు ఎందరో నిరాశతో వెను తిరగాల్సి వచ్చింది. క్యూలైన్ ఎంతసేపటికి ముందుకు సాగకపోవడం భారీ సంఖ్యలో ఆలయం లోపల భక్తులు నిలిచి వుండటం వలన ఎక్కువసేపు నిరీక్షించలేక వెనుతిరిగి వెళ్ళవలసి వచ్చింది.క్రింది స్థాయి సిబ్బంది పెత్తనంపై విమర్శలువిఐపి దర్శన గేటు తాళాలు ఇద్దరు ఉద్యోగులు చేతుల్లో ఉండటం చర్చనియాంశంగా మారింది. వారి ఆశీస్సులు మెండుగా ఉన్న వారికే శ్రీ స్వామి వారి దర్శనం, శంకు తీర్థం లభించే అవకాశం ఉండడం పట్ల విమర్శలు వెళ్ళు వెత్తుతున్నాయి. ఆలయ ఆలయాధికారి మిగిలినది కారుల సలహాలు సూచనలు తీసుకోవడం మానుకొని, కేవలం అవుట్సోర్సింగ్, తాత్కాలిక ఉద్యోగులైన వీరికి అత్యధిక ప్రాధాన్యత ఇవ్వడం వలన.. ఈనాటి దుస్థితికి కారణమని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు ప్రకటనకే పరిమితమైన ప్రత్యేక స్లాట్ప్రభుత్వ అధికారులకు, మీడియా ప్రతినిధులకు దర్శన సదుపాయం కల్పించేందుకు మధ్యాహ్నం మూడు గంటల నుంచి నాలుగు గంటల వరకు స్లాట్ కేటాయించి నట్లు తొలుత అధికారులు ప్రకటించారు. ఈ ప్రకటన కేవలం ప్రచారానికే పరిమితమైంది తప్ప అమలుకు నోచుకోలేదు. ముక్కోటికి ముందు కోఆర్డినేషన్ మీటింగ్ కేవలం మొక్కుబడిగా నిర్వహించినట్లు ప్రస్తుతం ఉత్సవ నిర్వహణ తీరును బట్టి స్పష్టంగా తెలుస్తోంది..

# నవరంగ్ కాంగ్రెస్‌పార్టీ జాతీయ అధ్యక్షులు షేక్ జలిల్ పై అక్రమంగా పెట్టిన కేసులకు నిరసనగా 2026 మార్చి 5వ తేదిన భారత్ బంద్‌కు పిలుపు

**తాడేపల్లి,డిసెంబరు 30,ప్రభాతవార్త :** నవరంగ్ కాంగ్రెస్‌పార్టీ జాతీయ అధ్యక్షులు షేక్ జలిల్ పై అక్రమంగా పెట్టిన కేసులకు నిరసనగా కేంద్రంలోని బిజెపి మినహా జాతీయ పార్టీలకు కూడకట్టుకొని 2026 మార్చి 5వ తేదిన భారత్ బంద్‌కు పిలుపు ఇవ్వడం జరిగిందని షేక్ జలీల్ తెలిపారు.సోమవారం మంగళగిరి గౌతమబుద్ధా రోడ్డులోని డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.అనంతరం జలీల్ మీడియాతో మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి పార్టీ మినహాయించి మిగిలిన అన్ని జాతీయ పార్టీలతో కలసి భారత్ బంద్ నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.భారత స్వాతంత్ర్యం కోసం మా ముత్తాతలు,తాతలు పోరాటాలు చేశారన్నారు.ఏ పార్టీ పోటీ చేయని విధంగా నవరంగ్ కాంగ్రెస్ పార్టీ 28 రాష్ట్రాల్లో,కేంద్రపాలిత ప్రాంతాల్లో పోటీ చేయడం జరిగిందని జలీల్ పేర్కొన్నారు.డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ రాజ్యాంగ పాలన కాకుండా రెడ్‌బుక్ చేస్తున్నారని జలీల్ విమర్శించారు.చినకాకాని గ్రామానికి చెందిన భూములను వేంకటేశ్వరరావు మరో 5గురు రైతులు నాకు అమ్ముతానని రెండు విడతలుగా రూ.కోటి 50లక్షలు అడ్వాన్స్ కింద తీసుకున్నారని,వారంతా రిజిస్ట్రేషన్‌కు రాకుండా నన్ను మోసం చేశారని జలీల్ ఆరోపించారు.వాస్తవానికి చిన్న కాకాని కి చెందిన భూములు ముక్తి మహ్మద్ వారసులు,బంధువులు జిల్లా హైకోర్టులో వారికి అనుకూలంగా తీర్పు వచ్చిన అగ్రకుల దురహంకారంతో ఆభూములను కబ్జా చేశారని,నన్ను బెదిరించారని జలీల్ ఆందోళన వ్యక్తం చేశారు.నాపై



అక్రమంగా 6సెక్షన్లు కింద కేసులు నమోదు చేసి రిమాండ్ ఇచ్చి 22రోజులపాటు జైల్లో ఉన్నానని ఆయన ఆవేదన వ్యక్తంచేశారు.నన్ను మోసం చేశారని ఆరోపిస్తూ నాపై చినకాకాని రైతులు పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయాలని కోరుతూ మీడియా సమావేశం అనంతరం మంగళగిరి రూరల్ పోలీస్టేషన్లో అక్రమంగా కేసులు పెట్టిన వారిపై కేసులు నమోదు చేసి ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని కోరుతూ పోలీస్టేషన్లో ఫిర్యాదు చేశారు.ఈ సంఘటనపై పూర్తిగా విచారణ జరిపి మాకు న్యాయం చేయాలని పోలీసు అధికారులను జలీల్ ప్రాధేయపడ్డారు.మార్చి 5వ తేదిన దేశవ్యాప్త బంద్‌కు రాజకీయ పార్టీ నాయకులు,వ్యాపారసంస్థలు,లారీ యజమానులు ప్రజలు సహకరించాలని షేక్ జలీల్ విజ్ఞప్తి చేశారు.కార్యక్రమంలో నవరంగ్ కాంగ్రెస్‌పార్టీ నాయకులు,కార్యకర్తలు,అభిమానులు,తదితరులు పాల్గొన్నారు.

# నగర పరిశుభ్రత పై రాజీ పడే ప్రసక్తి లేదు

## పారిశుద్ధ్య కార్మికులు ఇంటింటికి వెళ్లి ప్రతిరోజు నూరు శాతం చెత్త సేకరించాల్సిందే -నగర కమిషనర్ పులి శ్రీనివాసులు

**గుంటూరు కార్పొరేషన్, డిసెంబర్ 30 ప్రభాతవార్త:** నగరంలో పారిశుధ్య కార్మికులు ప్రతిరోజు ఇంటింటికి వెళ్లి చెత్త సేకరించాల్సిందేనని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశాలు జారీ చేశారు. మైక్రో పాకెట్స్ వారీగా నూరు శాతం



చెత్త సేకరించాలన్నారు. మంగళవారం నగర పర్యటనలో భాగంగా ఆర్టీసీ కాలనీ, రెడ్ల బజారు, బాలాజీ నగర్, యాదవుల బజార్ తదితర ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటించి పి జి ఆర్ ఎస్ లో వచ్చిన ఫిర్యాదులపై కమిషనర్ ప్రత్యేకంగా తనిఖీలు నిర్వహించారు. పారిశుధ్య పనులకు సంబంధించి సంబంధిత విభాగానికి చెందిన అధికారులు, సిబ్బందికి సలహాలు సూచనలు ఇచ్చారు. నగర పరిశుభ్రత విషయంలో ఇటువంటి రాజీ పడే ప్రసక్తి లేదని విధులలో నిర్లక్ష్యం వహించిన, ప్రజల నుంచి ఫిర్యాదులు వచ్చిన సంబంధిత అధికారులు సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరికలు జారీ చేశారు. ప్రతిరోజు చెత్త సేకరణ జరగకపోతే ఆ ఏరియా కి సంబంధించిన శానిటరీ అధికారులు, కార్యదర్శులు, సిబ్బంది బాధ్యత వహించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. ఎడ్ల బజార్లో శానిటేషన్ పై నిర్లక్ష్యం వహిస్తున్నారంటూ ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులపై స్పందించిన కమిషనర్ ఆ ఏరియా కి చెందిన అధికారులకు, సిబ్బందిపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని సంబంధిత విభాగ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ప్రధాన రహదారులలో స్లీపింగ్ విధానంపై నిరక్ష్యం చేస్తున్నారంటూ అసంతృప్తి వ్యక్తం చేసిన కమిషనర్ ప్రతి డివిజన్లో అధికారులు ప్రధాన రహదారుల పరిశుభ్రత విషయంలో ప్రత్యేక పర్యవేక్షణ తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. ప్రధాన రహదారులలో ఫ్లెక్సీలు, బ్యానర్లు అనుమతులు లేకుండా ఏర్పాటు చేస్తే అటువంటి వారిపై చర్యలు తీసుకోవాలని, తక్షణమే తొలగించాలని టౌన్ ప్లానింగ్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. నందివెలుగు రోడ్ నుంచి శుద్ధపల్లి డొంకకు వెళ్లే రహదారి విస్తరణ కు సంబంధించి రోడ్డు డెవలప్మెంట్ ప్లాన్ ( ఆర్ డి పి) సిద్ధం చేయాలని టౌన్ ప్లానింగ్ ఏసీపి ని ఆదేశించారు. ఈ పర్యటనలో ఎంహెచ్ఓ డాక్టర్ లక్ష్మీ నారాయణ, డి ఇ హనీప్, శానిటరీ సూపర్వైజర్లు అయుబ్ ఖాన్, సాంబయ్య, టౌన్ ప్లానింగ్ అధికారులు, సచివాలయాల కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

# అల్లూరు శ్రీ లక్ష్మీనరసింహ స్వామి ముక్కోటి వైకుంఠ ఏకాదశి ఉత్తర ద్వార దర్శనానికి పోటెత్తిన భక్తులు

**పిట్టలవానిపాలెం,డిసెంబర్30,ప్రభాతవార్త:** పిట్టల వాని పాలెం మండలం లోని అల్లూరు గ్రామంలో కొలువై ఉన్నశ్రీ లక్ష్మీనరసింహ స్వామి వారి దేవస్థానము లో ముక్కోటి (వైకుంఠ) ఏకాదశి ఉత్తర ద్వార దర్శనానికి




భక్తులు పోటెత్తారు. ఉదయం 4 గంటలు నుండే భక్తులు క్యూ లైన్ లో అత్యధిక సంఖ్యలో బారులు తీరారు. ఉదయం 5 గంటల నుండిఉత్తర ద్వార దర్శనంతో దక్షిణావృత శంఖు తీర్థాన్ని భక్తులకు ప్రత్యేకంగా అందజేసేలాఆలయ చైర్మన్ పెనుమత్స రవి వర్మ ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా ఆయల కమిటి చైర్మన్ రవివర్మ మాట్లాడుతూ ఈ ఉత్తర ద్వార దర్శనానికి దక్షిణావృత శంఖు తీర్థానికిభక్తులు రాష్ట్ర నలుమూలల నుండే కాకుండా వివిధ ప్రాంతాలనుండి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారన్నారు. భక్తుల కోసం ప్రత్యేక క్యూ లైన్ కౌంటర్లను ఆలయానికి ఇరువైపులా ఆలయ నిర్వహణ అధికారి ఎం వి ఎస్ వర్మ ఏర్పాట్లు చేశారన్నారు. ఆలయాన్ని విద్యుత్ దీపాలతో ప్రత్యేకంగా అలంకరించామని ఆయన తెలిపారు. ఆలయ ప్రాంగణం భక్తులతో కిక్కిరిసి పోయి పండుగ వాతావరణం నెలకొంది.ఈ కార్యక్రమంలోఆలయధర్మకర్తల మండలి తదితరులు ఉన్నారు.

# ఉల్లాస్ అక్షర ఆంధ్ర కార్యక్రమాలను సక్రమంగా నిర్వహించాలి

**గుంటూరు వెస్ట్, డిసెంబరు 30, ప్రభాతవార్త :** జిల్లాలోని నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు నిర్వహిస్తున్న ఉల్లాస్ అక్షర ఆంధ్ర కార్యక్రమంను నిర్దేశిత లక్ష్యాలకు మేరకు సక్రమంగా నిర్వహించాని జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా సూచించారు.మంగవారం కలెక్టర్ కార్యాలయం నుంచి జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా ఉల్లాస్ అక్షర ఆంధ్ర పై మండల ప్రత్యేక అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, సీఎంఎం లు, ఎంపీడీవోలు, ఏపీఎంలు, ఏపీఓస్ తో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సంధర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో గుర్తించిన నిరక్షరాస్యులకు ఉల్లాస్ అక్షర ఆంధ్ర ద్వారా అక్టోబరు నుంచి శిక్షణ కార్యక్రమంను ప్రారంభించారన్నారు. వంద గంటలు జరిగే ఈ శిక్షణ కార్యక్రమం మార్చి వరకు కొనసాగుతుందన్నారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ఉల్లాస్ అక్షర ఆంధ్ర శిక్షణ కార్యక్రమాలను ప్రత్యేక అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు నిరంతరం పర్యవేక్షించాలన్నారు. లెసన్ ప్లాన్ లు, శిక్షణ అందిస్తున్న విధానం పరిశీలించాలని తెలిపారు. శిక్షణ కాలం ముగిసేనాటికి పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో నిర్దేశించిన లక్ష్యాల మేరకు నిరక్షరాస్యులందరూ ప్రాథమికంగా చదవటం, వ్రాయటం నేర్చుకుని అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలన్నారు.వయోజన విద్యా డిప్యూటీ డైరక్టర్ ఆంజనేయులు మాట్లాడుతూ పట్టణ ప్రాంతాల్లో సీఎంఎంలు, గ్రామీణ ప్రాంతాల్లో ఏపీఎంలు, ఏపీఓస్ లు ప్రతిరోజు తరగతుల నిర్వహణ పై వివరాలను ఖచ్చితంగా అందించేలా ప్రత్యేక అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు పర్యవేక్షించాలన్నారు.ఈ వీడియో కాన్ఫరెన్స్ లో ప్రత్యేక అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు పాల్గొన్నారు.

# ఫైన్ ఆర్ట్స్ విభాగాన్ని సందర్శించిన ఏయు ప్రిన్సిపాల్

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం,డిసెంబర్30, ప్రభాతవార్త: ఏఎన్‌యులోని ఫైన్‌ఆర్ట్స్ విభాగాన్ని ఆంధ్రాయూనివర్సిటీ (విశాఖపట్నం) ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య జాలాది రవి మంగళవారం సందర్శించారు. ఇక్కడి విద్యార్థులు రూపొందిస్తున్న పెయింటింగ్స్, డ్రాయింగ్స్‌ను తిలకించి వాటి నాణ్యతను ప్రశంసించారు. విద్యార్థులతో స్నేహపూర్వకంగా మాట్లాడారు. కళా రంగంలో ఉన్న అవకాశాలపై పు సూచనలు చేశారు. రాజధాని అమరావతిలో ఉన్న ఏకైక లలిత కళల విభాగంగా ఏఎన్‌యు ఫైన్ ఆర్ట్స్ విభాగం మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. అనంతరం



అధ్యాపకులు దేవకాంత్, బి.జాన్ రత్నబాబు, వి.వీరయ్యలతో సమావేశమై ఆంధ్రా యూనివర్సిటీలోని ఫైన్ ఆర్ట్స్ విభాగంతో సంయుక్త కార్యక్రమాలు చేయాల్సిన ఆవశ్యకతను వివరించారు. ఈ దిశగా సదస్సులు, కార్యశాలలు, ఎగ్జిబిషన్, ఇంటర్న్‌షిప్స్ వంటి కళాప్రోత్సాహక కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు. ఈ సందర్భంలో ఏయూ పూర్వ విద్యార్థులు ప్రస్తుత ఏఎన్‌యు అధ్యాపకులు డాక్టర్ కృష్ణ, డాక్టర్ డి.కొండరావులు ఆచార్య జాలాది రవిని సన్మానించారు.

# వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని శ్రీవారి సేవలో దేగల ప్రభాకర్



**గుంటూరు వెస్ట్, డిసెంబర్ 30,ప్రభాతవార్త:** వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని కలియుగ దైవం శ్రీ వెంకటేశ్వర స్వామి వారిని ఉత్తర ద్వారా దర్శనం చేసుకునే అవకాశం కలగడం ఎంతో అదృష్టంగా భావించానని ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రియల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ దేగల ప్రభాకర్ అన్నారు. వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని శ్రీవారి సేవలో పాల్గొని ప్రత్యేక దర్శనం చేసుకున్నారు.ఈ పవిత్ర సందర్భంగా వైకుంఠ ఏకాదశి పవిత్రత ప్రతి ఒక్కరి జీవితంలో శాంతి, సద్గుణాలు, ఆధ్యాత్మిక ఉత్సాహాన్ని నింపాలని హృదయపూర్వకంగా ఆకాంక్షిస్తున్నాను.శ్రీ వెంకటేశ్వర స్వామి వారి ఆశీస్సులతో ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో, అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు.

# నూతన కార్యవర్గం ఎన్నిక

**గుంటూరు విద్య డిసెంబర్ 30 ప్రభాతవార్త:** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సర్వీసు అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గ రాష్ట్ర అధ్యక్షులు వినుకొండ రాజారావు తో ఏర్పాటు చేయడం జరిగింది . ఇందులో భాగంగా రాష్ట్ర ప్రధానకార్యదర్శి గా సయ్యద్. చాంద్ బాష ని ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతనంగా ఏర్పాటు చేసిన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సర్వీసు అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సయ్యద్ చాంద్ బాష మాట్లాడుతూ ఉద్యోగుల హక్కులే ప్రామాణికంగా పనిచేసి ఉద్యోగ, ఉపాధ్యాయ విశ్రాంతి ఉద్యోగుల సమస్యలపై ఎటువంటి రాజీలేని పోరాటం చేస్తానని చెప్పారు రాష్ట్ర ప్రధానకార్యదర్శి గా ఎన్నికైన చాంద్ బాష ను ఉద్యోగుల శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర అధ్యక్షులు శ్రీ వి.రాజారావు మాట్లాడుతూ ఉద్యోగ , ఉపాధ్యాయ, కోసం పనిచేసే రాష్ట్రంలో ఉద్యోగుల వ్యవస్థ లో ఎదురులేని శక్తి గా ఎదిగి ఉద్యోగ లోకాని తెలియ చేస్తామని తెలిపారు ఈకార్యక్రమంలో మున్సిపల్ కార్పొరేషన్ ఉద్యోగులు, పంచాయతీ రాజ్ ఉద్యోగుల, ఉపాధ్యాయులు ,కోఅపరేటి డిపార్ట్మెంట్ ఉద్యోగులు గ్రామ వార్డు సచివాలయం ఉద్యోగుల పాల్గొన్నారు

31-12pg 12 VJA_31-12pg10.qxd 30/Dec/25 10:55 PM Page 1





## వరల్డ్ బ్లిడ్జ్ ఛాంపియన్‌షిప్‌లో
# అర్జున్ చేతిలో కార్ల్‌సెన్ చిత్తు

**న్యూఢిల్లీ:** ప్రపంచ బ్లిట్జ్ ఛాంపియన్‌షిప్-2025లో భారత్ గ్రాండ్ మాస్టర్ ఎరిగైసి అర్జున్ చేతిలో రాపిడ్ ఛాంపియన్ మాగ్నస్ కార్ల్‌సెన్ చిత్తుగా ఓటమి చెందాడు. ఖతర్‌లో జరిగిన టోర్నమెంట్‌లో 13 రౌండ్ల తర్వాత దోహాలో మంచి ఫామ్‌ను కొనసాగించాడు. అతను 9వ రౌండ్‌లో ఛాంపియన్ కార్ల్‌సెన్‌ను కూడా మట్టికరిపించగా, ఇప్పుడు 10/13 పాయింట్లతో యుఎస్‌కు చెందిన ఫాబియానో కరువానా మరియు మాక్సిమ్ వాచియర్ లాగ్రేవ్ (ఎఫ్ఆర్ఎ) లతో సమంగా అగ్రస్థానంలో ఉన్నాడు. అర్జున్ అద్భుతంగా ప్రారంభించి మొదటి ఐదు వరుస గేమ్‌లను గెలుచుకున్నాడు. కానీ ఆ తర్వాత అతను రౌండ్ 6లో డచ్ గ్రాండ్ మాస్టర్ జోర్డెన్ వాన్ ఫారెస్ట్ చేతిలో తన తొలి ఓటమిని ఎదుర్కొన్నాడు. అతనికి ఎదురైన ఏకైక ఓటమి ఇదే, అయితే తర్వాత 7 ఆటలలో అర్జున్ అజేయంగా నిలిచాడు. 3 విజయాలు మరియు 4 డ్రాలతో రోజును మరో ఇద్దరు ఆటగాళ్లతో కలిసి అగ్రస్థానంలో ముగించాడు. ఇక మహిళల విభాగంలో టాప్ 30లో ఒక్క భారత్‌కు చెందినవారు కూడా లేరు. మహిళల విభాగంలో మొదటి రోజు మొదటి 10 ఆటల తర్వాత టాప్30లో ఎవరూ లేకపోవడంతో భారత్ చాలా పేలవంగా ఆడింది. రాపిడ్ విభాగంలో మూడు టాప్5 ఫినిషింగ్‌లను సాధించిన తర్వాత, భారత ఆటగాళ్ళు మొదటి రోజు బ్లిట్జ్ ప్రదర్శనతో నిరాశ చెందారు. ప్రస్తుతం మహిళల విభాగంలో అత్యుత్తమ ర్యాంక్‌లో ఉన్న భారత క్రీడాకారిణిల్లో దివ్య దేశ్‌ముఖ్ (34వ స్థానం), రక్షిత రవి (41), రాపిడ్ పతక విజేత కోనేరు హంపి 5 పాయింట్లు మాత్రమే గెలుచుకోని 61వ స్థానంలో ఉన్నారు.



## మహిళల షూటింగ్‌లో..
# నీరూ, ఆర్యవంశికి స్వర్ణాలు

**న్యూఢిల్లీ:** జాతీయ షూటింగ్ ఛాంపియన్‌షిప్ పోటీలలో (షాట్‌గన్) ఆసియా ఛాంపియన్‌షిప్ బంగారు పతక విజేత నీరు దండ అద్భుతమైన ప్రదర్శన ఇచ్చి మహిళల ట్రాప్ బంగారు పతకం సాధించింది. ఫైనల్లో నీరూ 41 హిట్స్ తో అగ్రస్థానంలో నిలిచింది. ఢిల్లీకి చెందిన కీర్తి గుప్తా 40 హిట్స్‌తో రజతం, ప్రగతి దూబే 32 హిట్స్‌తో కాంస్యన్ని గెలుచుకుంది. జూనియర్ పురుషుల ట్రాప్ ఫైనల్‌లో ఆర్యవంశ్ త్యాగి 42 పాయింట్లు సాధించి స్వర్ణాన్ని, పంజాబ్‌కు చెందిన కేశవ్ చౌహాన్ 37 పాయింట్లతో రజతం, ఉత్తరప్రదేశ్‌కు చెందిన జుహైర్ ఖాన్ 30 పాయింట్లతో కాంస్యం సాధించాడు. టీమ్ ఈవెంట్లలో, మహిళల ట్రాప్ టీమ్ ఈవెంట్‌లో మధ్యప్రదేశ్ ఆధిపత్యం చెలాయించింది. ప్రగతి దుబే, నీరు దండా మరియు మనీషా కీర్ మొత్తం 339 పాయింట్లతో స్వర్ణం గెలుచుకుంది. అద్యా కత్యాల్, కీర్తి గుప్తా, భవ్య త్రిపాఠి 333 పాయింట్లతో ఢిల్లీ రజత పతకాన్ని గెలుచుకోగా, పంజాబ్ 319 పాయింట్లతో (రాజేశ్వరి కుమారి, పుఖ్రాజ్ కౌర్ చాహల్, క్రిషికా జోషి) కాంస్య పతకాన్ని గెలుచుకుంది.అలాగే అర్జున్, లక్ష్య అత్రీ, ప్రిక్షిత్ ఆర్య సౌజన్యంతో 336 స్కోరుతో జూనియర్ పురుషుల ట్రాప్ టీమ్ స్వర్ణాన్ని హర్యానా కైవసం చేసుకుంది. గుజరాత్ 327 (ఆర్యన్ సింగ్, భఖ్త్యార్ ఉద్దీన్ మహ్మద్ముజాహిద్, మానవరాజ్‌సింగ్ రాజేంద్రసింగ్ చుడాసమా) రజతంతో రెండో స్థానంలో, ఉదవ్ సింగ్ రాథోడ్, పృథ్వీరాజ్ సింగ్ రాథోడ్, వినయ్ ప్రతాప్ సింగ్ సి ద్వారా రాజస్థాన్ 326తో కాంస్యం సాధించింది. జూనియర్ మహిళల ట్రాప్ టీమ్ ఈవెంట్‌లో ఢిల్లీ స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకుంది, ఆద్య కత్యాల్, భవ్య త్రిపాఠి మరియు అనన్య యదువంశి కలిసి 323 పాయింట్లతో విజయం సాధించారు. తమిళనాడు 295 పాయింట్లతో రెండవ స్థానంలో నిలవగా, రాజస్థాన్ 274 పాయింట్లతో కాంస్య పతకాన్ని సాధించింది.

## 2025 అన్ని ఫార్మాట్‌లలో..
# దుమ్మురేపిన హీరోస్
### టాప్ 5లో భారత్ యశస్వికి చోటు

**న్యూఢిల్లీ:** ప్రేక్షకులకు అత్యంత వినోదం అందిస్తున్న క్రికెట్‌లో వన్డే, టీ20, టెస్టు ఫార్మాట్లు మూడు ఉన్నాయి. ఈ మూడు ఫార్మాట్‌లలోనూ సత్తా చాటే ఆటగాళ్లు తగ్గిపోతున్నారు.ఈ ఏడాది 2025లో మరో 48 గంటల్లో ముగియనున్ననేపథ్యంలో అన్నీ ఫార్మాట్‌లలో సత్తాచాటిన ఆటగాళ్ల గుర్చి తెలుసుకోవాల్సిన అవసరం ఉంది. మూడు ఫార్మాట్‌లలో సత్తా చాటేవారిలో ఐదుగురు క్రికెటర్లు ముందంజలో ఉన్నారు. టెస్టు, వన్డే, టీ20 ఫార్మాట్‌కు సరిపోయే ఆటగాళ్లలో మన భారత్ నుంచి యశస్వి జైస్వాల్ చోటు దక్కించుకోగా, మార్కో యాన్సెన్, జేకబ్ డఫీ, కామెరాన్ గ్రీన్, హ్యారీ బ్రూక్ ఉన్నారు. భారత యువ కెరటం యశస్వి జైస్వాల్ అద్భుత ప్రదర్శనతో దూసుకెళ్తున్నాడు. రెండున్నరేళ్ల







కిందట భారత జట్టులోకి ఎంట్రీ ఇచ్చిన ముంబై పోరడు యశస్వి జైస్వాల్ ఫార్మాట్‌తో సంబంధం లేకుండా అదరగొడుతున్నాడు. టెస్టుల్లో సెంచరీలు, డబుల్ సెంచరీతో ఈ లెఫ్టాండర్ బ్యాటర్ ఓపెనర్‌గా రాణిస్తుండగా, వన్డే, టీ20లలో కూడా ఆడగల సత్తా ఉన్నాడు. 23 ఏళ్ల యశస్వి 28 టెస్టుల్లో ఏడు శతకాలు, రెండు డబుల్ సెంచరీలు బాదగా, 4 వన్డేల్లో 171, 23 టీ20 మ్యాచ్‌లు ఆడాడు. ఇంగ్లండ్ ఆటగాడు హ్యారీ బ్రూక్ వచ్చి జట్టుకు ఊపిరిలూదాడు. టెస్టు, వన్డే, టీ20లలో రాణిస్తున్న బ్రూక్ ఇంగ్లండ్ జట్టుకు మిడిలార్డర్ సమస్యను తీర్చాడు. 26 ఏళ్లకే బ్రూక్ ఆ దేశ జట్టుకు వన్డే, టీ20 జట్లకు కెప్టెన్ అయ్యాడు. ఇప్పటివరకు 34 టెస్టులు, 35 వన్డేలు, 52 టీ20లు ఆడిన బ్రూక్ అన్నీ ఫార్మాట్లలో అదరగొడుతున్నాడు. సౌతాఫ్రికా పేస్ బౌలింగ్ ఆల్‌రౌండర్ మార్కో యాన్సెన్ ఆల్ ఫార్మాట్ స్టార్‌గా మారాడు. అత్యంత పొడవైన ఈ క్రికెటర్ మూడు ఫార్మాట్లలో దుమ్మురేపుతున్నాడు. ఐపీఎల్‌లో అత్యధిక వేలానికి అమ్ముడుపోయిన ఆస్ట్రేలియా యువ ఆల్‌రౌండర్ కామెరాన్ గ్రీన్ అద్భుతంగా ఆడుతున్నాడు. 26 ఏళ్ల ఆల్‌రౌండర్ గ్రీన్ ఐపీఎల్‌లో రూ.25.20 కోట్ల వేలం పలికిన విషయం తెలిసిందే. 36 టెస్టులు, 31 వన్డేలు, 21 టీ20లు గ్రీన్ ఆడాడు. న్యూజిలాండ్‌కు చెందిన 31 ఏళ్ల జేకబ్ డఫీ అన్నీ ఫార్మాట్‌లలో సత్తా చాటుతున్నాడు. కుడిచేతి వాటం బౌలర్ ఇప్పటికీ 4 మ్యాచ్‌లు ఆడి 25 వికెట్లు తీయగా, 19 వన్డేలు, 38 టీ20 మ్యాచ్‌లు ఆకట్టుకున్నాడు.

## మహిళల టి20 ఆల్ రౌండర్ ర్యాంకింగ్స్‌లో
# వరల్డ్ నం.1 దీప్తి





**న్యూఢిల్లీ:** ఐసీసీ మహిళల టి20 ప్రపంచ ర్యాంకింగ్స్‌లో దీప్తి నంబర్ 1 స్థానంలో కొనసాగుతోంది. ఇటీవలే వన్డే వరల్డ్ కప్ ఫైనల్లో 87 పరుగులతో పాటు రెండు వికెట్లు తీసి భారత్‌కు కప్ అందించడంలో కీలక పాత్ర పోషించిన ఓపెనర్ షఫాలీ టీ20 ఫార్మాట్‌లోనూ అదే జోరు కొనసాగిస్తోంది. తాజాగా అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) మంగళవారం విడుదల చేసిన ర్యాంకింగ్స్‌లో భారత క్రికెటర్లు సత్తా చాటారు. ముఖ్యంగా శ్రీలంకతో జరుగుతున్న సిరీస్‌లో అద్భుత ప్రదర్శన కనబరుస్తున్న భారత క్రీడాకారిణుల ర్యాంకులు గణనీయంగా మెరుగుపడ్డాయి. బౌలింగ్ విభాగంలో టీమిండియా స్టార్ ఆల్ రౌండర్ దీప్తి శర్మ తన అగ్రస్థానాన్ని పదిలం చేసుకుంది. శ్రీలంక సిరీస్‌లో ఇప్పటికే మూడు అర్ధసెంచరీలు సాధించిన షఫాలీ, తాజా బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో నాలుగు స్థానాలు ఎగబాకి 6వ ర్యాంకుకు చేరుకుంది. ప్రస్తుతం ఆమె నెంబర్ వన్ ర్యాంకులో ఉన్న బెత్ మూనీకి కేవలం 60 పాయింట్ల దూరంలో ఉంది. అలాగే వికెట్ కీపర్ బ్యాటర్ రిచా ఘోష్ కూడా ఏడు స్థానాలు మెరుగుపరచుకుని 20వ స్థానంలో నిలిచింది. బౌలింగ్ విభాగంలో పేసర్ రేణుకా సింగ్ ఎనిమిది స్థానాలు ఎగబాకి టాప్6లో చోటు దక్కించుకుంది. మూడో టీ20లో నాలుగు వికెట్లు తీసి ఆమె ఈ ఘనత సాధించింది. ఇక యువ బౌలర్లు శ్రీ చరణి 52వ స్థానానికి చేరుకోగా, అరంగేట్రం సిరీస్‌తోనే వైష్ణవి శర్మ ఏకంగా 390 స్థానాలు దాటి 124వ ర్యాంకుకు చేరుకోవడం విశేషం. వెస్టిండీస్ కెప్టెన్ హేలీ మాథ్యూస్ ఆల్ రౌండర్ల విభాగంలో అగ్రస్థానంలో కొనసాగుతోంది. ప్రస్తుతం భారత్ శ్రీలంకపై 5 మ్యాచ్‌ల సిరీస్‌లో 40 ఆధిక్యంలో ఉంది.



## సౌతాఫ్రికా టి-20 లీగ్‌లో..
# సన్‌రైజర్స్ రెండో హ్యాట్రిక్
### క్యాపిటల్స్ 48 రన్స్‌తో ఓటమి

**న్యూఢిల్లీ:** సౌతాఫ్రికా టీ20 లీగ్ 2025-26లో సన్‌రైజర్స్ హైదరాబాద్ అనుబంధ సంస్థ సన్‌రైజర్స్ ఈస్టర్న్ కేప్ వరుసగా రెండో విజయాన్ని నమోదు చేసింది. ఈ లీగ్‌లో భాగంగా ప్రిటోరియా క్యాపిటల్స్‌తో జరిగిన మ్యాచ్‌లో 48 పరుగుల తేడాతో సన్‌రైజర్స్ గెలుపొందింది. ఈ విజయంతో సన్‌రైజర్స్‌కు అదనంగా ఒక బోనస్ పాయింట్ కూడా లభించింది. ఇక ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన సన్‌రైజర్స్ ఈస్టర్నన కేప్ నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్లు నష్టానికి 188 పరుగులు చేసింది. స్టార్ ఓపెనర్ క్వింటన్ డికాక్ మరోసారి చెలరేగాడు. 47 బంతులు ఎదుర్కొన్న డికాక్ 5 ఫోర్లు, 6 సిక్సర్లతో 77 పరుగులు చేశాడు. అతడితో పాటు, మాథ్యూ బ్రీట్జ్కే (33 బంతుల్లో 52 పరుగులు), జోర్డాన్ హెర్మాన్ (20 బంతుల్లో 37) మెరుపు ఇన్నింగ్స్ ఆడాడు. ప్రిటోరియా క్యాపిటల్స్ బౌలర్లలో టైమల్ మీల్స్ రెండు వికెట్లు పడగొట్టగా, లుంగి ఎంగిడీ, లుబ్బే తలా వికెట్ సాధించారు. అనంతరం 189 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన ట్రిటోరియా క్యాపిటల్స్ 18 ఓవర్లలో 140 పరుగులకే కుప్పకూలింది. సన్‌రైజర్స్ స్పీడ్ స్టార్ ఆడమ్ మిల్నే 4 వికెట్లు పడగొట్టగా, రత్నాయకే రెండు, మార్కో జాన్సెన్, ముత్తుసామి తలా వికెట్ సాధించారు. ప్రిటోరియా ఇన్నింగ్స్‌లో షాయ్ హోప్ (36) టాప్ స్కోరర్‌గా నిలవగా, స్మిడ్ (35), రూథర్ ఫర్డ్ (25) ఫర్వాలేదనిపించారు. కాగా ప్రిటోరియా క్యాపిటల్స్ హెడ్ కోచ్‌గా భారత్ మాజీ కెప్టెన్ సౌరవ్ గంగూలీ వ్యవహరిస్తున్నాడు.

# ముక్కోటి రోజున సెన్సెక్స్, నిఫ్టీలు వెనక్కి
### స్మాల్‌క్యాప్, మిడ్‌క్యాప్‌లదీ అదే దారి



వాణిజ్యం

**ముంబయి, డిసెంబరు 30:** ఈక్విటీ మార్కెట్లలో సెన్సెక్స్,నిఫ్టీలు దిగువ స్థాయిలోనే ట్రేడింగ్ ముగించాయి. విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్లు అమ్మకాలకు మొగ్గుచూపించడంతో షేర్లపై ఒత్తిడిపెరిగింది. దీనితో మార్కెట్లు దిగువ స్థాయికే దిగజారాయి. దీనికితోడు దేశీయంగా కూడా సంవత్సరాంతపు హాలిడే మూడ్ కనిపించింది. ఇన్వెస్టర్లు కార్పొరేట్ ఫలితాల సీజన్ వస్తుండటంతో కొంత ఆచితూచి పెట్టుబడులు పెట్టారు. నిఫ్టీ 25,950 మార్కు దిగువన ముగిసింది. బిఎస్ఇ సెన్సెక్స్ 20.46 పాయింట్లు క్షీణించి 84,675.08 పాయింట్లవద్దట్రేడింగ్ ముగిస్తే నిఫ్టీ 50 సూచీ 3.25 పాయింట్లు క్షీణించి 25,938.85 పాయింట్లవద్దట్రేడింగ్ నిలిపివేసింది. బిఎస్ఇలో మిడ్‌క్యాప్‌సూచీ 0.05శాతం, స్మాల్‌క్యాప్‌సూచీ 0.20శాతం క్షీణించాయి. మార్కెట్లపరంగా ప్రతికూలంగానే కనిపించింది. బిఎస్ఇలో 1936 కంపెనీలు పెరిగితే 2252 కంపెనీలు క్షీణించాయి. మొత్తంగా 171 కంపెనీలు షేర్లు మాత్రం స్థిరంగానే కనిపించాయి. కొత్త లిస్టింగ్‌లలో గుజరాత్ కిడ్నీసూపర్‌స్పెషాలిటీ ప్రస్తుతం 9.37శాతం డిస్కౌంట్‌కు 103.35 వద్ద కొనుగోళ్లుజరిగాయి. ఇక నిఫ్టీలో మెటల్‌సూచీ ఒక్కసారిగా జంప్‌చేసింది. 203శాతంపెరిగింది హిందూస్థాన్ కాపర్9.42, జిందాల్ స్టెయిన్‌లెస్ 6.52శాతం, నేషనల్ అల్యూమినియం కంపెనీ 5.18శాతం, స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా 5.15శాతం, ఎన్ఎండిసి 3.22శాతం, జిందాల్ స్టీల్ 3.14శాతం,హిందాల్కో ఇండస్ట్రీస్ 2.22 శాతం,వేదాంత 2.11శాతం, టాటాస్టీల్ 2.04శాతం, జెఎస్‌డబ్ల్యుస్టీల్ 1.75శాతంచొప్పున పెరిగాయి. ఓరియంట్ టెక్నాలజీస్ 20శాతం ఎగువ సర్క్యూట్‌కు వెళ్లింది. బిల్ 0.04శాతం పెరిగింది. కంపెనీ 569 కోట్ల అదనపు ఆర్డర్లు రాబట్టింది. ప్రైమ్ ఫోకస్ 2.07శాతం పెరిగింది. ఎన్టీపీసీ గ్రీన్ ఎనర్జీ 1.39 శాతం క్షీణించింది. గుజరాత్ నర్మదా వ్యాలీ ఫర్టిలైజర్స్ 1.82శాతం వారీ ఎనర్జీస్ 0.12శాతం క్షీణించాయి. లెమన్‌ట్రీ హోటల్స్ 0.87 శాతం పెరిగింది. నీరజ్ సిమెంట్స్ట్రక్చర్స్ 1.22శాతం పెరిగి 34.86 వద్ద ట్రేడ్ అయింది.ఫార్మాలో 0.07 శాతంతో లూపిన్‌షేర్లు ట్రేడ్ అయ్యాయి. యూరోపియన్ మార్కెట్లు లాభాల్లోనే ముగిస్తే ఆసియా మార్కెట్లు మిశ్రమంగా కనిపించాయి.వాల్‌స్ట్రీట్ మొత్తం కృత్రిమ మేధ భయాలతోనే ఊగిసలాడింది. రాత్రికి రాత్రే అమెరికాలో స్టాక్స్ క్షీణించాయి. ప్రత్యేకించి టెక్నాలజీరంగంలో భారీ పతనం చవిచూసాయి. ఎస్అండ్‌పి 500 0.35శాతం, నాస్‌డాక్ కాంపోజిట్ 0.50 శాతం, డౌజోన్స్ పారిశ్రామిక సగటు 249.04 పాయింట్లు చొప్పున క్షీణించాయి. ఇదిలా ఉంటే ఒక్కసారిగాపెరిగిన వెండి ఆరుశాతం క్షీణించింది. ఔన్స్ 80 డాలర్లకు పెరిగిన తర్వాత అనూహ్యంగా దిగి వచ్చింది.

# కృత్రిమ మేధ మిషన్‌కు రూ.10,300 కోట్లు

**న్యూఢిల్లీ,డిసెంబరు 30:**భారత్ కృత్రిమ మేధ మిషన్‌కు కేంద్రం రూ.10,300కోట్లు కేటా యించింది. ఐదేళ్లపాటు ఈనిధులు ఎఐని మరింత వృద్ధిలోకి తీసుకువచ్చేందుకు వినియో గిస్తుంది. భారత్ రానురాను కృత్రిమమేధ వినియోగం, అమలులో గ్లోబల్ లీడర్‌గా మారుతున్నది. ఇందుకోసమే కేంద్రం ఇండియా ఎఐ మిషన్ ఏర్పాటుచేసింది. 38వేలకుపైగా గ్రాఫిక్స్ ప్రాసెసింగ యూనిట్లు పర్యవేక్షిస్తున్న మిషన్ స్టార్టప్‌లు, పరిశోధకులకు అందుబాటులో కంప్యూటింగ్ వనరులు అందించడమే లక్ష్యంగా పనిచేస్తోంది. భారత్‌లో కృత్రిమ మేధ, భారత్‌కోసం కృత్రిమ మేధగా రూపాంతరం చేయాలన్నదే లక్ష్యమని ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ పరిధిలోని ఇండియా ఎఐ డివిజన్ ప్రకటించింది.




అత్యున్నతస్థాయి ఎఐ కంప్యూటింగ్ మౌలికవనరులు ఏర్పాటు చేయడంతోపాటు జిపియుల పర్యవేక్షణ, పరిశోధకులు, స్టార్టప్‌లకు రాయితీతో కూడిన ధరలతో అందుబాటులోకి తీసుకురావడం లక్ష్యం. ఇక ఇండియా ఎఐ ఇన్నొవేషన్ కేంద్రం స్వదేశీ ఎఐ మోడళ్లను కీలకరంగాలయిన హెల్త్‌కేర్, వ్యవసాయ రంగాల్లో అమలుచేస్తోంది. డేటాసెట్స్ ఫ్లాట్‌ఫామ్ ఎఐ ఖోష్ పరిధిలో ఎఐ మోడళ్లలోశిక్షణకు ఉన్నత ప్రమాణాలను అనుసరిం చడం, సామాజిక ఆర్థిక సవాళ్లను అధిగమిం చేందుకుగాను కొత్తకొత్త ఎఐ పరిష్కారాలు అన్వే షించడం ప్రభుత్వ మంత్రిత్వశాఖలకు అవసరమైన రీతిలో ఎఐని అందుబాటులోకి తీసుకు రావడం ప్రధాన బాధ్యతలుగా ఇండియా ఎఐ మిషన్‌చూస్తోంది. ఇక విద్యాబోధనలో కూడా ఎఐని తప్పనిసరి చేసేవిధంగా ఇండియా ఎఐ భవిష్యత్తు నైపుణ్య సామర్థ్యం పెంచుతోంది. అలాగే డీప్‌టెక్ ఎఐ స్టార్టప్‌లకు ఆర్థిక సాయం అందించడం కూడా చేస్తుంది. పూర్తి రక్షణా త్మకంగాను, భద్రతాపూర్వకమైన కృత్రిమమేధ టెక్నాలజీని అందించే లక్ష్యంతోనే కేంద్రం ఈ నిధులను కేటాయించినట్లు ఎంఇఐటివై చెపుతోంది.

# బ్యాంకింగ్ రంగంలో తగ్గుతున్న ఎటిఎంలు

**ముంబయి, డిసెంబరు 30:** దేశంలో డిజిటల్ చెల్లింపుల వినియోగం భారీగా పెరగడంతో ఏటీఎంల వాడకం క్రమంగా తగ్గుతోంది. 2025 ఆర్థిక సంవత్సరంలో దేశవ్యాప్తంగా ఏటీఎంల సంఖ్య భారీగా తగ్గిందని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా తాజాగా విడుదల చేసిన ట్రెండ్ అండ్ ప్రోగ్రెస్ ఆఫ్ బ్యాంకింగ్ నివేదికలో వెల్లడించింది. నిర్వహణ ఖర్చులు పెరగడం, ఆన్‌లైన్ లావాదేవీలకు ప్రజలు మొగ్గుచూపుతుండటంతో బ్యాంకులు ఏటీఎంల సంఖ్యను తగ్గించుకుంటున్నాయి. ఆర్‌బీఐ నివేదిక ప్రకారం 2024 మార్చి నాటికి 2,53,417గా ఉన్న ఏటీఎంల సంఖ్య 2025 మార్చి 31 నాటికి 2,51,057కు పడిపోయింది. ముఖ్యంగా ప్రైవేట్ రంగ బ్యాంకులు తమ ఏటీఎం నెట్‌వర్క్‌ను భారీగా కుదించుకున్నాయి. గత ఏడాది 79,884గా ఉన్న ప్రైవేట్ బ్యాంక్ ఏటీఎంలు, ఈ ఏడాది 77,117కు తగ్గాయి. ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో కూడా ఈ సంఖ్య 1,34,694 నుంచి 1,33,544కు స్వల్పంగా తగ్గింది. ఆఫ్ సైట్ ఏటీఎంల మూసివేత ఇందుకు ప్రధాన కారణమని తెలుస్తోంది. బ్యాంకేతర సంస్థలు నిర్వహించే వైట్ లేబుల్ ఏటీఎంల సంఖ్య మాత్రం 34,602 నుంచి 36,216కు పెరగడం విశేషం. ప్రభుత్వ బ్యాంకులు గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో సమానంగా సేవలు అందిస్తుండగా, ప్రైవేట్ బ్యాంకులు మాత్రం ఎక్కువగా మెట్రో నగరాలకే పరిమితమయ్యాయి. మరో ఆసక్తికరమైన విషయం ఏంటంటే ఏటీఎంలు తగ్గుతున్నప్పటికీ, బ్యాంక్ బ్రాంచుల సంఖ్య మాత్రం పెరుగుతూనే ఉంది. 2025 మార్చి నాటికి దేశంలో బ్యాంక్ శాఖల సంఖ్య 2.8 శాతం పెరిగి 1.64 లక్షలకు చేరింది. కొత్త బ్రాంచుల ఏర్పాటులో ప్రైవేట్ బ్యాంకుల కంటే ప్రభుత్వ రంగ బ్యాంకులే దూకుడుగా ఉన్నాయని ఆర్బీఐ నివేదిక స్పష్టం చేసింది.



# జిడిపిని దాటేసిన భారతీయ కుటుంబాల్లోని పసిడి నిల్వలు
### జిడిపి 4.1లక్షలకోట్ల డాలర్లు ఉంటే, బంగారం నిల్వల విలువ ఐదు లక్షలకోట్ల డాలర్లు

**న్యూఢిల్లీ,డిసెంబరు 30:** భారతీయుల కుటుంబాల్లో ఉన్న బంగారం దేశ ప్రస్తుత జిడిపి విలువలకు మించి ఉంటుందని నిపుణులు పేర్కొంటున్నారు. ప్రస్తుతం అంతర్జాతీయ మార్కెట్లో బంగారం ధరలు రికార్డు స్థాయిలో పెరగడంతో భారతీయ కుటుంబాల వద్ద ఉన్న బంగారం మొత్తం విలువ మన స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ) పరిమాణాన్ని మించిపోయింది. అంత ర్జాతీయంగా స్పాట్ మార్కెట్లో బంగారం ధర ఔన్సుకు 4,500 డాలర్లు దాటడంతో ఈ పరిస్థితి నెలకొంది. మోర్గాన్ స్టాన్లీ అంచనాల ప్రకారం భారతీయ ఇళ్లలో దాదాపు 34,600 టన్నుల బంగారం నిల్వ ఉంది. మార్కెట్ ధరల ప్రకారం లెక్కిస్తే భారతీయుల వద్ద ఉన్న ఈ బంగారం విలువ 5 లక్షల కోట్ల డాలర్ల కంటే ఎక్కువ. అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎంఎఫ్) అంచనాల ప్రకారం భారత జీడీపీ సుమారు 4.1 లక్షల కోట్ల డాలర్లుగా ఉంది. అంటే దేశం మొత్తం ఉత్పత్తి చేసే ఆదాయం కంటే ప్రజల ఇళ్లలో ఉన్న పసిడి విలువే ఎక్కువగా ఉండటం గమనార్హం. ఈ అంశంపై ఇన్ఫోమెరిక్స్ వాల్యుయేషన్ అండ్ రేటింగ్స్ చీఫ్ ఎకనామిస్ట్ డాక్టర్ మనోరంజన్ శర్మ మాట్లాడుతూ జీడీపీ అనేది ఒక ప్రవాహం లాంటిది, బంగారం అనేది నిల్వ ఉండే ఆస్తి. ఈ రెండింటిని నేరుగా పోల్చలేం. కానీ, భారత ఆర్థిక వ్యవస్థలో బంగారానికి ఉన్న సామాజిక, ఆర్థిక, మానసిక ప్రాధాన్యతను ఈ గణాంకాలు స్పష్టంగా చూపిస్తున్నాయన్నారు. బంగారం విలువ పెరగడం వల్ల గృహాల బ్యాలెన్స్ షీట్లు బలపడతాయని మోర్గాన్ స్టాన్లీ వంటి సంస్థలు చెబుతున్నప్పటికీ, భిన్నాభిప్రాయాలు ఉన్నాయి. ఎమ్కే గ్లోబల్ విశ్లేషణ ప్రకారం ఇళ్లలో ఉండే బంగారంలో దాదాపు 75 నుంచి 80 శాతం ఆభరణాల రూపంలోనే ఉంటుంది. భారతీయులు దీన్ని పొదుపుగా భావిస్తారు తప్ప, విక్రయించి సొమ్ము చేసుకునే ఆస్తిగా చూడరు. అందుకే ధరలు పెరిగినా వినియోగంపై పెద్దగా ప్రభావం ఉండదని నిపుణులు అంటున్నారు. కేవలం ప్రజలే కాదు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) కూడా తన బంగారం నిల్వలను పెంచుకుంటోంది. 2024 నుంచి ఇప్పటివరకు ఆర్బీఐ సుమారు 75 టన్నుల బంగారాన్ని కొనుగోలు చేయడంతో మొత్తం నిల్వలు 880 టన్నులకు చేరాయి. యుద్ధాలు, ఆర్థిక అనిశ్చితి సమయాల్లో బంగారం సురక్షితమైన పెట్టుబడి కావడంతో కేంద్ర బ్యాంకులు కూడా దీని వైపు మొగ్గు చూపుతున్నాయి. అయితే ఆర్థిక పరంగా చూస్తే బంగారం ఒక ఉత్పాదకత లేని ఆస్తి అని, ప్రజలు ఈటీఎఫ్ వంటి బాండ్ల వైపు మళ్లాలని నిపుణులు సూచిస్తున్నా, భౌతిక బంగారంపై మోజు మాత్రం తగ్గడం లేదు.



# రూ.32వేల కోట్ల బాండ్ల విక్రయానికి కేంద్రం సిద్ధం

**ముంబయి,డిసెంబరు 30:**దేశీయ మార్కెట్ నుంచి నిధులు సమీకరించేందుకు రూ.32,000కోట్ల విలువైన ప్రభుత్వసెక్యూరిటీలను విక్రయించనున్నట్లు కేంద్రంప్రకటించింది. 6.48శాతం ప్రభుత్వ సెక్యూరిటీ 2035 రీఇష్యూ కింద ఈ విక్రయాలు జరుగుతాయి. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) ముంబై కార్యాలయం ఆధ్వర్యంలో జనవరి2న ఈ వేలంజరగనుంది.మల్టిపుల్ ప్రైస్ విధానంలో ఈ వేలాన్ని నిర్వహిస్తారు. ఈ సెక్యూరిటీపై మరో రూ.2,000కోట్ల వరకు అదనపు సబ్‌స్క్రిప్షన్‌ను నిలుపుకునే వెసులు బాటు ప్రభుత్వానికి ఉంటుందని కేంద్ర ఆర్థిక మంత్రిత్వశాఖ స్పష్టంచేసింది. ఈ వేలంలో పాల్గొనేవారు ఆర్బీఐ కోర్ బ్యాంకింగ్ సొల్యూషన్ (ఈకుబేర్) ప్లాట్‌ఫామ్ ద్వారా ఎలక్ట్రానిక్ రూపంలో బిడ్లను దాఖలు చేయాలి. నాన్‌కాంపిటీటివ్ బిడ్లను ఉదయం 10:30నుంచి 11:00 గంటల మధ్య, కాంపిటీటివ్ బిడ్లను ఉదయం 10:30నుంచి 11:30గంటల మధ్య సమర్పించాల్సి ఉంటుంది. అర్హులైన వ్యక్తులు, సంస్థల కోసం మొత్తం నోటిఫైడ్ మొత్తంలో 5శాతం నాన్‌కాంపిటీటివ్ బిడ్డింగ్‌కింద కేటాయించారు. సాధారణంగా ప్రభుత్వాలు తమ బడ్జెట్‌లోటును భర్తీ చేసుకోవడానికి, మౌలిక సదుపాయాలు, సంక్షేమపథకాల వంటి ప్రజా ఖర్చులకునిధులు సమీకరించడానికే ఇలా బాండ్లను విక్రయిస్తాయి. వేలం ఫలితాలను జనవరి 2న ప్రకటిస్తారు. విజయవంతమైన బిడ్డర్లు జనవరి5న చెల్లింపులు చేయాల్సి ఉంటుంది. ప్రభుత్వ హామీ ఉండటం తో ఈబాండ్లను సురక్షితమైన, తక్కువ రిస్క్ ఉన్నగా పరిగణిస్తారు.




# ప్యూరిఫయర్లపై ఇక 5% మాత్రమే జిఎస్టీ

**న్యూఢిల్లీ, డిసెంబరు 30:** జిఎస్టీ మండలి సమావేశంలో ఈసారి వస్తుసేవల పన్ను మరోసారి సవరణలు తెస్తోంది. వాటర్ ప్యూరిఫయర్లు, ఎయిర్ ప్యూరిఫయర్లపై ఉన్న జిఎస్టీ 18శాతాన్ని ఐదుశాతానికి తీసుకువచ్చేందుకు నిర్ణయించిందని సమాచారం. దేశరాజధాని ఢిల్లీలోనుపరిసర రాష్ట్రాల్లోనే కాకుండా పర్యావరణ కాలుష్యం, జలకాలుష్యం ఎక్కువ కనిపిస్తుండటంతో జిఎస్టీని ప్రస్తుతం ఉన్న 18శాతం నుంచి ఐదుశాతానికి తగ్గించాలని నిర్ణయించింది. ఇప్పటికే ఢిల్లీహైకోర్టు, సుప్రీం కోర్టులు సైతం ఎయిర్‌ప్యూరిఫయర్లపై పన్నులు తగ్గించాలని కూడా సూచించింది. ఈ పరికరాలు మరింతగా ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చి కాలుష్యానికి గురికాకుండా చూడాలన్న లక్ష్యంతోనే జిఎస్టీని కుదిస్తున్నట్లు కేంద్రం చెపుతోంది. అలాగే సురక్షిత మంచినీరు లభించడం కూడా ఇపుడు దేశంలో అందని ద్రాక్షగా ఉంది. ప్రత్యేకించి ఈశాన్య ప్రాంతాల్లో సురక్షిత మంచినీరు లభించకపోవడం ఆపై వాటర్ ప్యూరిఫయర్లపైనా అధికపనులతో అందుబాటులోకి రాకపోవడంతోకేంద్రం దృష్టిసారించింది. అందువల్లనే ఇపుడు జలశుద్ధిసామగ్రి, వాయు శుద్ధిపరికరాలపై జిఎస్టీని 5శాతానికి తీసుకురావాలని నిర్ణయించింది. వచ్చే జిఎస్టీ సమావేశంలోనే ఈనిర్ణయం ప్రకటిస్తారని తెలుస్తోంది.

Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., and printed at Sy No.658/A , NH-5, Ankireddy Palem, Guntur Dist-522005. Ph:2355939, 2512322(0863), 9848812526. RNI No. 64861/96 , Editor : *Damerla Sai Baba, Postal Licence/AP/Vj/GTR/57/08-10 *Responsible for selection of News under the PRBAct. Regd.: No.H/SD/337/12-14